# ఏకోదరులు

## (వి. వి. సూర్యనారాయణ కథలు)

మొదటి సంపుటం



2024

# పరిచయ వాక్యాలు

ఈ పుస్తకంలోని కథలు మా పెద్దన్నయ్య కీ. శే. వేమూరి వేంకట సూర్యనారాయణ రాసినవి. కొన్ని కలం పేరు “సూర్యం” తోటీ, కొన్ని “వి. వి. సూర్యనారాయణ” అన్న అసలు పేరుతోటీ రాసినవి. ఈ కథలన్నీ 1944-1960 మధ్య కాలంలో రాసినవే. ఇవన్నీ అప్పట్లో పేరున్న ఆనందవాణి, స్వతంత్ర, వినోదిని, ఆంధ్రపత్రిక, చిత్రగుప్త, మొదలైన పత్రికలలో ప్రచురితం అయినవే.

అన్నయ్య విశాఖపట్నం జిల్లా, వడ్డాది గ్రామంలో, 14 మే 1924 రాత్రి 4 గం. 45 ని. లకు వేమూరి సోమేశ్వరరావు, (తెన్నేటి) సీతారామమ్మ దంపతులకి పుట్టిన ప్రథమ సంతానం. చోడవరంలో స్కూల్ ఫైనల్ వరకు చదివి మద్రాసులో, కీల్‌పాక్కంలో School of Indian Medicine లో 1940-41 గడిపి, నచ్చక, తిరిగి వచ్చి, కాకినాడ P. R. College లో 1941-43 మధ్య ఇంటరు పూర్తి చేసి, తరువాత విజయనగరం మహరాజ కళాశాలలో B. A. (chemistry) పట్టా పుచ్చుకుని, కాకినాడ, బెజవాడ, మచిలీపట్నంలలో ఉద్యోగం చేసి, శ్రీకాకుళంలో కోఆపరేటివ్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఉద్యోగ విరమణ చేసి - జూన్ 18, 1988 న స్వర్గధామం చేరుకున్నాడు.

అన్నయ్య 60 కథలకి మించే రాసేడు. ప్రచురణ పొందినవాటిలో కొన్నిటిని ఒక బౌండు పుస్తకంలో తిరగ రాసుకున్నాడు. మరికొన్నిటిని పత్రికలనుండి కత్తిరించి మరొక పుస్తకరూపంలో భద్రపరచేడు. ఈ రెండు పుస్తకాలలోనివి కాకుండా ఇంకా కథలు, జోకులు, సినిమాల మీద రాసిన రివ్యూలు ఉండడం ఉన్నాయి కానీ వాటి ప్రతులు నాకు దొరకలేదు. అన్నయ్య మరణించిన వారం రోజులలో నేను ఇండియా చేరుకున్నప్పుడు, అన్నయ్య భద్రపరచిన రెండు పుస్తకాలు, అన్నయ్య దస్తూరీతో ఉన్న నాలుగు ప్రచురణ పొందని కథలు, వదిన (తెన్నేటి జానకి, పెద్ద మామయ్య పెద్ద కూతురు) ని అడిగి నాతో అమెరికా తెచ్చుకున్నాను - వీటిని పుస్తకరూపంలో తిరిగి ప్రచురించాలనే ఆకాంక్షతో!

ఆ కథలని కంప్యూటర్లో ఎక్కించి ఒక కొలిక్కి తీసుకురాడానికి దశాబ్దాలు గడచిపోయాయి. ఇప్పటికి ఆ కథలలో సగం కంప్యూటర్లోకి ఎక్కించడం పూర్తి అయింది. ముందస్తుగా వీటినైనా పుస్తకరూపంలోకి తీసుకురావాలన్న కోరిక ఇటీవల ఇనుమడించింది. ప్రస్తుతానికి 26 కథలని పాఠకుల ముందు ఉంచుతున్నాను. మిగిలిన కథలని త్వరలోనే వేరొక విడతగా పుస్తకరూపంలో ప్రచురించాలనే అభిలాష ఉంది.

ఈ కథలని కంప్యూటరులోకి ఎక్కించేటప్పుడు నేను గమనించినది ఏమిటంటే - నేను వాడే భాషకి అన్నయ్య భాషకి మధ్య కొన్ని తేడాలు కనబడ్డాయి. వర్ణక్రమంలో అయితేనేమి, విరామ చిహ్నాలు వాడటంలో అయితేనేమి, మాట విరుపులో అయితేనేమి, ఇంకా చాలా చిన్న చిన్న తేడాలు కనిపించేయి. అయినా సరే, సాధ్యమైనంత వరకు అన్నయ్య ఎలా రాసేడో అలాగే కంప్యూటర్‌లోకి దింపేను. ఈ తేడా కాలగమనం వల్ల భాషలో వచ్చిన తేడావో, లేక దేశాంతరాలలో ఉండడం వల్ల నా భాషలో వచ్చిన తేడావో చెప్పలేను.

ఈ పుస్తకంలో ఈ కథల్ని అనుపూర్వికంగా అమర్చేను. ఆ రోజుల్లో కథలు ఎలా ఉండేవో, అవి ఏ విధంగా పరిణతి చెందేయో, అన్నయ్య రచనా శైలి కాలంతోపాటు ఏ విధంగా మార్పు చెందిందో ఈ కథలని ఈ క్రమంలో చదివితే కొంత అవగహనలోకి వస్తుందన్న ఆశతో చేసిన పని ఇది.

ఈ కథలని చదువుతూ ఉంటే కథలు రాయడం అనే ప్రక్రియని అన్నయ్య ఎలా నేర్చుకున్నాడో నాకు అర్థం అయింది. మొదట్లో పేజీ నిడివికి మించని చిన్న కథలు రాసేవాడు. అవి కూడా అన్నీ స్వకపోలకల్పితాలు కావు; వాటిల్లో దరిదాపు సగం కథలు ఇంగ్లీషులో లభ్యం అయే కథలని ఆధారంగా చేసుకుని రాసినవి అని తనే నిర్భయంగా చెప్పుకున్నాడు; గ్రంథచౌర్యం చెయ్యలేదు.

మరొక విశేషం ఏమిటంటే అన్నయ్య కథలకి ప్రేరణ కారణమైన వ్యక్తులు ఇద్దరు ఉన్నారు. అన్నయ్య కాలేజీలో సహాధ్యాయి, తుని వాస్తవ్యుడు అయిన శ్రీ ఈరంకి వెంకటరావు మొదట్లో కథలు రాయమని ప్రోత్సహించినట్లు ఒక కథలో అన్నయ్యే చెప్పుకున్నాడు. కొసమెరుపుతో కథలు రాయడంలో ఈరంకి సిద్ధహస్తుడు. ఈయన తునిలో వకీలుగా పని చేసేవాడు. నాకు బాగా తెలిసిన వ్యక్తే! అన్నయ్య శ్రీ మారేమండ రామారావు తో కలసి కొన్ని కథలు రాసినట్లు ఇంట్లో చెప్పుకోగా విన్నాను కాని వీరిద్దరు కలసి రాసిన కథలంటూ ఉంటే అవేవో నా దృష్టికి రాలేదు. రామారావు కథా వస్తువుని చెబితే అన్నయ్య కథలా రాసేవాడని కొందరు చెప్పగా విన్నాను. ఈయనని నేను ఎప్పుడూ కలవలేదు కానీ, ఈయన గురించి అన్నయ్య స్వయంగా చెప్పిన ఉదంతం ఒకటి చెబుతాను.

ఒక సారి అన్నయ్యా, రామారావూ కలసి ప్రయాణం చేస్తూ బెజవాడ స్టేషన్లో రైలు మారవలసి వచ్చిందిట. రావలసిన రైలు బండి 12 గంటలు లేటు. ప్లేట్ఫారం మీద ఎంతకని కూర్చుంటారు? అన్నయ్య, “రామారావ్! ఊళ్ళో నా స్నేహితుడు ఒకడు ఉన్నాడు, వాడిని ఒకసారి పలకరించి చిటికలో వచ్చేస్తాను. నువ్వు ఇక్కడే సామాను చూస్తూ ఉండు” అని చెప్పి అన్నయ్య ఊళ్ళోకి వెళ్ళేడుట. స్నేహితుడిని చూడగానే రామారావు సంగతి మరచిపోయి నేస్తాలిద్దరూ కలిసి హోటేల్ కి వెళ్ళి, భోజనం చేసి, కిళ్ళీలు నములుతూ కృష్ణ గట్టుని తిరుగుతూ ఉంటే అన్నయ్యకి గభీమని రామారావు సంగతి

గుర్తుకొచ్చి పరిగెట్టుకుని స్టేషన్ కి వచ్చేడుట. ఇంతసేపూ, విసుక్కోకుండా, కోపగించుకోకుండా రామారావు సామానుకి కాపలా కాస్తూనే ఉన్నాడుట!

నేను బందరులో అన్నయ్య దగ్గర ఉండి హిందూ కాలేజీలో ఇంటరు చదువుకున్నాను. అప్పటికే అన్నయ్య కథలు రాసే జోరు బాగా తగ్గిపోయింది. నేను 1961 లో అమెరికా వచ్చేనాటికి కథలు రాయడం పూర్తిగా మానేసేడనే చెప్పుకోవచ్చు. ఒక నవల రాయడానికి ప్రయత్నం చేసేడు కానీ అది అసంపూర్ణముగా ఆగిపోయింది.

వేమూరి వేంకటేశ్వరరావు
ప్లెజన్టన్, కేలిఫోర్నియా
26 డిసెంబర్ 2023

## వి. వి. సూర్యనారాయణ ఏకోదరులు

విశ్వేశ్వర  సోమయాజి (దువ్వూరి జయలక్ష్మి)
లక్ష్మీ నారాయణ శర్మ (చెరుకూరి లలిత)
నరసింహమూర్తి (కల్లూరి కల్పవల్లి)
లక్ష్మీ సుందరం  (గరిమెళ్ళ సూర్యనారాయణ)
సీతామహాలక్ష్మి (అవివాహిత)
వేంకటేశ్వరరావు (గొల్లపూడి ఉమాదేవి)
భానుమతి (టేకుమళ్ళ నరసింహం)
శేషగిరిరావు (వేపా మాధవి)
కమలావతి (కల్లూరి కోదండరామ దీక్షితులు)
శ్రీరామ్ (వేపా స్వర్ణలత)

## వి. వి. సూర్యనారాయణ సంతానం

లక్ష్మీ నరసు జగదాంబ (మర్రిపాటి నమశ్శివాయ శర్మ)
సీత (గరిమెళ్ళ వెంకటచలం)
అప్పల నరసింహం (ఎర్రగుంట్ల అనూరాధ)
రవి కుమార్ (పెండ్యాల బాల జ్ఞానాంబ)
సుందరరామ (తాతా  జ్ఞాన ప్రసూనాంబ)
సూర్య సోమేశ్

# కథాక్రమం

1. ఎవరిది? (ఆనందవాణి, 1945)
2. స్వయంవరం (ఆనందవాణి, 1946)
3. మరుపు (ఆనందవాణి, 1946)
4. వర్షంలో (ఆనందవాణి, 9 మార్చి 1947)
5. లోకంతో నాకేం పని? (ఆనందవాణి, 27 ఏప్రిల్ 1947)
6. రేషన్ పెళ్ళికొడుకు (ఆనందవాణి, జూన్ 1947)
7. నా గుండె నన్నే ద్రోహం చేసింది (ఆనందవాణి, 13 జూలై 1947)
8. రాలే ఆకులు (ఆనందవాణి, 30 నవంబర్ 1947)
9. ఒక్క చేప చాలదూ? (ఆనందవాణి, 28 డిసెంబర్ 1947)
10. విందు (ఆనందవాణి, 1 ఫిబ్రవరి 1948)
11. ఏర్చి కూర్చిన పూలు (ఆనందవాణి, 4 ఏప్రిల్ 1948)
12. పరిక్ష (ఆంధ్రపత్రిక, సెప్టెంబర్ 1948)
13. ఉరిత్రాడు (ఆంధ్రపత్రిక, అక్టోబర్ 1948)
14. పతివ్రత (సూర్యప్రభ, నవంబర్ 1948)
15. (అ)ప్రయోజకుడు, (స్వతంత్ర, నవంబర్ 1949)
16. తక్షశిల (ఆంధ్రపత్రిక, నవంబర్ 1949)
17. పిల్లనగ్రోవి (ఆంధ్రపత్రిక, నవంబర్ 1949)
18. పరధ్యానం (వినోదిని, జనవరి 1950)
19. పిచ్చినమ్మకాలు (వినోదిని, జూన్ 1950)
20. అన్యాపదేశం (వినోదిని, జనవరి 1951)
21. అంతరార్థం (చిత్రగుప్త, ??)
22. డబ్బు! డబ్బు!! డబ్బు!!! (ఆంధ్రపత్రిక, ఆగస్ట్ 1951)
23. క్లెప్టోమేనియా (చిత్రగుప్త, ? 1951)
24. కపాలమోక్షం (ఆంధ్రపత్రిక, జూలై 1951)
25. ఏకోదరులు (ఆంధ్రపత్రిక, 1958)
26. కార్యశూరుడు (ఆంధ్రపత్రిక, మార్చి 1959)

# ఎవరిది?
(ఆనందవాణి, 1945)

ట్రిప్లికేను మళుపు తిరిగేను. అల్లంత దూరంలో జనం బాగా మూగి ఉన్నారు. ఎందుకో తెలుసుకోవాలనిపించింది. దగ్గరకు వెళ్ళేను. గలాటా జరుగుతోందక్కడ. బిక్క మొహం వేసి నించున్నాడొక యువకుడు. వేషంలో కొంచెం ఆభిజాత్యం కనిపిస్తూంది. చేతిలో పది రూపాయల నోటుంది.

ఎదురుగా ఒక లతాంగి మాటలు మాత్రం మొగాడికన్న ధాటీగా మాట్లాడుతూంది. "ఏమయ్యా, నీకే చెప్పేది.ఆ నోటు నాదని చెప్తే అలా గుడ్లు మిటకరించి చూస్తావేం? ఇలా తే!"

"నీది కాదమ్మా. ఇది నాదేను."

"ఏడిసినట్లే ఉంది. నా సంచీ లోంచి కింద పడిపోతే కాజేసి పైపెచ్చు దబాయిస్తున్నావ్!"

"ఇదెక్కడి సరసం అమ్మోయ్. నా జేబు లోంచి కింద పడిపోతే మళ్ళా తీసుకున్నాను. నీదెలాగౌతుంది?"

"ఏయ్ ఏమిటా గలాటా?" అనుకుంటూ ఊడిపోతూన్న తోలు బెల్టు సర్దుకుంటూ, జనాన్ని తప్పించుకుని మధ్యకి వచ్చేడు, పోలీసు.

"చూశారా ఇతని దురంతం. నా సంచి లోంచి దువ్వెన తీసుకుంటూ ఉంటే, అందులోంచి పది రూపాయల నోటు కింద పడిపోయింది. అది మెల్లగా లాగేసి తనదే అని దబాయిస్తున్నాడీ పెద్ద మనిషి," అని అతని నేరాన్ని బయట పెట్టిందా లతాంగి.

"చాలు చాలు. ఎవరైనా నవ్వి పోయ్యారు. నా జేబు లోంచి కింద పడిపోతే తీసుకున్నాను. నడి రోడ్డెక్కి 'నాది, నాది' అని నువ్వు గొంతు చించుకుంటావేమిటి?" అని అతను తన నిర్దోషిత్వాన్ని కాపాడుకుంటున్నాడా యువకుడు.

“ఏయ్ ఆ నోటు ఇలా తే” అని పుచ్చుకుని దాన్ని ఇటూ, అటూ తిప్పి చూసేడా తోలుబెల్టు, గొప్ప హత్యా నేరాన్ని పట్టుకోబోయ్యే డిటెక్టివ్ పోజులో. “ఈ నోటు నీదంటున్నావ్. దీని నంబరు చెప్పు?”

“అదేమో, నేను నోటు నంబరు నోటు చెయ్యలేదు.”

“నువ్వు చెప్పు?” అని తిరిగేడా స్త్రీ వైపు.

“నెంబరు ఎలా తెలుస్తుందయ్యా? నీ జేబులో ఉన్న నోటు ఏ సంవత్సరందో నువ్వు చెప్పు? చూద్దాం,” అని అడ్డు ప్రశ్న వేసిందామె.

“ఏదీ నీ పర్సు ఇలా తే” అని పుచ్చుకున్నాడా పోలీసు ఆమె దగ్గరనుండి. “ఈ పర్సు సెంటు వాసన వేస్తూంది. ఈ నోటూ సెంటు వాసన వేస్తూంది. అందు చేత ఈ నోటు ఈ పర్సు లోనిదే. నోటు ఆమెదే. నువ్వే దొంగవి. పద స్టేషన్ కి!” అని ఉరిమేడు పోలీసు ఆ యువకుని వైపు చూస్తూ.

ఇంతలో మరొక ఆసామీ జనాన్ని ఒత్తిగించి మధ్యకొచ్చాడు, చేతిలో కొన్నిపది రూపాయల నోట్లు పట్టుకుని. “ఆ నోటు నాది. వీళ్ళిద్దరిదీ కాదు. నేను నా నోట్లు లెక్క పెట్టుకుంటూ పోతూంటే అందులో ఒకటి క్రింద జారిపోయింది. దాని కోసం దెబ్బలాడు కుంటున్నారు,” అని తనకా నోటు మీద ఉన్న సర్వ హక్కులనీ తెలియజేసేడు.

“అయితే సెంటు వాసన?” క్వొశ్చన్ మార్కు మొహం వేసేడు పోలీసు.

“అవును. నేను సెంటు వర్తకుడిని. రోజల్లా సెంట్లు అమ్మి సంపాదించిన డబ్బు ఖాళీ సెంటు పెట్లో పెట్టుకుంటాను. అంచేత ఆ వాసనంటుకుంది నోటుకి.”

తీర్పు జరుగుతూనే ఉంది. నేనింటికి వచ్చేసేను.

# స్వయంవరం
## (ఆనందవాణి, 1946)

“నేను పట్టిన కుందేలుకి మూడే కాళ్ళు” అనే రకం శ్యామల. తల్లీ, తండ్రీ ఎంత చెప్పినా వింది కాదు. తనకి పెళ్ళీడు వచ్చినట్లు మాత్రం ఆమె అంగీకరించింది.

ఆమెను వరించే మగాడు ఆమెని ఐదు ప్రశ్నలు అడగాలి.ఎల్లాటి ప్రశ్నేనా అడగొచ్చును. దాని విషయమై ఏమీ నిబంధనలు లేవు. తానందులో ఏ ప్రశ్నకి జవాబు ఇవ్వలేకపోయినా ఓడిపోయినట్లే. అట్లా ఆమెని బోల్తా కొట్టించిన వాణ్ణే పెళ్ళాడ్డం – ఇదీ పెళ్ళి విషయంలో ఆమె ఏర్పరచిన నిబంధన.

శ్యామల సామంతుల ఇంట్లో పుట్టింది. తన అందానికి తోడు ఆఖరు రకపు ఫేషన్ కూడ అలవాటు చేసుకుంది. నాగరికుల్లో నాగరికురాలు.

ఎక్కువ కట్నం దొరుకుతుందన్న ఆశతోనైతేనేమి, అంత అందమైనదాన్ని చేసుకోవచ్చనే కుతూహలంతో అయితేనేమి వందలకొద్దీ (ముఖ్యంగా నిరుద్యోగపు డిపార్టుమెంటు వాళ్ళు) శ్యామలని దర్శించడానికి వచ్చేరు. కాని ఒక్కడూ, ఒక్క మగాడూ, ఆమె జవాబియ్యలేని ప్రశ్నని అడగలేకపోయాడు. వింతైన ప్రశ్నలు, వికారమైన ప్రశ్నలు, ఇవేమిటి, అవేమిటి, అనుకోని ప్రశ్నలన్నీ అంతు లేకుండా అడిగేసేరు అందరూను. కాని ప్రతి ప్రశ్నకూ సరైన సమాధానం ఇచ్చి నోళ్ళు కట్టేసింది, శ్యామల. ఆమెని అడిగిన ప్రశ్నలూ, ఆమె చెప్పిన సమాధానాలూ అన్నీ ఇక్కడ చెప్పడం కష్టం.

శ్యామల తల్లి తన కుమార్తెకింక పెళ్ళి కాదనే బెంగ పెట్టుకుంది.

ఓనాడొక పెద్ద మనిషొచ్చాడు. పొట్టిగా, నల్లగా ఉంటాడు. ఓ కన్ను మెల్ల కూడాను. శ్యామలని ప్రశ్నలడగడానికి అనుమతి పొందేడు.

“నేనడిగిన ప్రశ్నలన్నింటికి సమాధానాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నావా?”

“ఆ, సిద్ధంగానే ఉన్నాను. మొదటి ప్రశ్న అయిపోయింది,” వెంటనే వచ్చింది జవాబు.

“నువ్వు జవాబు ఇవ్వ లేని ప్రశ్న అడిగినవాడిని తప్పకుండా పెళ్ళి చేసుకుంటావా?”

“తప్పకుండా”

“అన్న మాట తప్పవు కదా?”

శ్యామలకి చాలా అసహ్యం అనిపించింది, ఇతన్నీ, ఇతని వాలకాన్నీ చూస్తే. చాల మంది వచ్చేరు. చాల తెలివైన ప్రశ్నలు అడిగేరు. కాని ఇతను అలా కాదు. పిచ్చి ప్రశ్నలు అడుగుతున్నాడు. శ్యామల అతన్ని అక్కడనుండి వెళ్ళగొట్ట దలుచుకుని ఇలా చెప్పింది.

“ఏమయ్యోయ్. ఇక్కడికి వచ్చిన వాళ్ళు ఐదు ప్రశ్నల కంటె ఎక్కువ అడగడానికి వీల్లేదు. నీ మిగిలిన రెండు ప్రశ్నలూ అడిగేసి అవతలకి దయచెయ్యి.”

వెంటనేవచ్చింది నాల్గో ప్రశ్న.

“సరే, అమ్మాయీ, నువ్వు జవాబు చెప్పలేని ప్రశ్న ఏది?”

“…”

# మరుపు
(ఆనందవాణి, 1946)

బస్సు స్టేండు దగ్గర కేశవరావు కనిపించగానే ఒక్క సారి సంతోషం తరంగాల మాదిరి పొంగుకొచ్చింది. పాత విషయాలూ, పాత స్నేహమూ తలపుకొచ్చేయి. నేను కేశవరావుని చూసి అప్పుడే అయిదేళ్ళు కావస్తూంది. నా చెయ్యి ఒక్క ఊపుని వాడి వీపు మీద పడింది, నాకు వాడి దగ్గర ఉండే చనువు కొద్దీను. వీపు చుర్రు మందేమో వెనక్కి తిరిగి దృష్టి తిప్పకుండా చూసేడు, నా వైపు రెండు లిప్తల పాటు. నాకు నిజంగా ఆశ్చర్యమేసింది, వాడి ముక్కూ చెవులూ కోపం చేత జేవురించేసరికి.

"హల్లో, ఎప్పుడొచ్చేవురా? ఐదేళ్ళ తర్వాత మళ్ళా నిన్నిప్పుడు కలుసుకోవడం చాల సంతోషంగా ఉంది. అసలు నువ్వూళ్ళోకెప్పుడొచ్చావు? అరే! నువ్వు బయలుదేరే ముందు నాకొక ఉత్తరం ముక్క రాసి పారెయ్యక పోయావ్? స్టేషనుకి వచ్చుందునే." అని గుక్క మళ్ళించకుండా అడిగేసేను. కాని వాడు మొత్తిన రాయిలా మాట్లాడడు కద; తెల్లబోయి నా మొహం లోకి చూడ్డం తప్ప.

నన్ను పోల్చ లేనట్లుంది, వాడు. అసలు మనుష్యుల్ని పోల్చకపోవడం వాడికి అలవాటే. అయినా వాడు తెచ్చిపెట్టుకుని మాట్లాడినట్లు కనిపించింది. "ఓ!, నువ్వా? పరాగ్గా చూసేను. ఏం? కులాసాగా ఉన్నావా? మనవాళ్ళంతా ఎలా ఉన్నారు?"

ఇంత సేపటికేనా పోల్చేడు, నయమే. వాడంతట వాడే షేక్ హేండ్ ఇచ్చేడు. అయినా వాడి చేతే చెప్పించాలి, జ్ఞాపకం లేదని. "ఏమిరా? మరచి పోయేవా ఏమిటి?" అన్నా.

"బాగుందిరా. మరచిపోవడమేమిటి?" అన్నాడదోలా మొహం పెట్టి.

ఇదీ ఒకలవాటు కేశవరావుకి. వాడు మరిచి పోయినా మరిచిపోయినట్లు ఒప్పుకోడు. గబుక్కుని మాట్లాడే పంథా మార్చేసేడు. నేనింకా ప్రశ్న మీద ప్రశ్న కురిపిస్తానని భయం కాబోలు.

"అంతా కులాసాగా ఉన్నారా?" యోగక్షేమంలోకి దిగేడు.

“ఆ కులాసాగానే ఉన్నారులే. అన్నట్టు శ్యామలకి పెళ్ళయింది తెలుసా?” అన్నాను గమ్మత్తుకి. ఆసలు మా ఇద్దరికీ తెలిసిన శ్యామలనే పిల్లే లేదు. ఏమంటాడో చూద్దామని వేసిన ప్లేను అది.

“ఓ, అలాగట్రా." అన్నాడు, తొణుకూ, బెణుకూ లేకుండా మహా తెలిసినవాడికి మల్లే.

ఇంకెందుకు. తేలిపోయింది, వీడికి నేను జ్ఞాపకం లేనని, అప్పుడే వాడు బొటన వేళ్ళ మీద నిలబడి చూస్తున్నాడు, బస్సు వస్తోందేమోనని. వస్తోంది.

“ఒరేయ్ అబ్బాయీ, బస్సొస్తున్నాది. నేను పోవాలె. మళ్ళా కలుసుకుంటానులే” అని ఎంతో తొందర పడుతూన్న వాడికి మల్లే బస్సు వచ్చి రావడంతో ఒక్క గంతులో ఎక్కేసేడు. నేను నవ్వాపుకుంటూ నించున్నాను, అప్పుడే వాడు నన్ను మరిచిపోయినందుకు. బస్సు సాగి పోయింది.

వెనకనించి భుజం మీద బలంగా చెయ్యి పడేసరికి జబ్బ ఇరుకు పట్టినంత పనయింది. “హల్లో, సూర్యం ఎవర్రా నువ్వు ఇంతవరకూ మాట్లాడుతూన్న పెద్ద మనిషి?” పరిచిత కంఠం.

ఎవరా అని వెనక్కి తిరిగి చూసేసరికి నవ్వుతూ ప్రత్యక్షమయేడు, కేశవరావు! తెల్లబోయి నించోవడం తప్పితే మరేమీ చెయ్యలేకపోయాను. ఆతి కష్టం మీద ఎల్లాగైతేనేమి ‘హల్లో’ అని మాత్రం అనగలిగేనంతే.

“ఏం, సూర్యం మరిచిపోయావేమిటి?” అని రెట్టించి మరీ అడిగేడు మా కేశవరావు.

# వర్షంలో
## (ఆనందవాణి, 9 మార్చి 1947)
## (ఒక రూపాయి పారితోషికం వచ్చింది!)

నడుస్తున్నాను. వేగం లాడ్జికి పోవాలి. వర్షం కురుస్తున్నాది. పరుగెడితే? ఎవ్వరైనా నవ్వుతారేమో! ఆ, చూసేదెవరు? పరుగెడతాను, వేగం చేరవచ్చు లాడ్జికి. వర్షం ఎక్కువౌతున్నాది. తగ్గేటట్టు లేదు. పుస్తకాలు తడుస్తున్నాయి. సరే! కోటు కింద పట్టుకుంటాను. అరే! రిస్టు వాచీ కూడా తడిసిపోతున్నాది. స్ట్రాపు కేమిటి, కొత్తది కొనుక్కోవచ్చును. వాచీ లోపలికి నీరు పోవటం లేదు కద! ఇంకా నెల రోజులైనా కాలేదు, వాచీ తెప్పించి. కొత్త వాచీ, సరి కొత్తది. సెకెండస్ మోడల్. డెబ్బై రూపాయలయింది.

కేశవరావు దగ్గరకి వెళితే గొడుగు తీసుకోవచ్చు. పోనీ ఎవరి అరుగు మీదైనా ఒక్క అర గంట ఆగితేనో? అంతవరకూ ఎందుకు? నాలుగడుగులు వేశానంటే కేశవరావు గొడుగిస్తాడు. తడిసి పోకుండా వెళ్ళ వచ్చు. పరుగెట్టేను. తలుపు కొడుదునా? ఇంత దూరం వచ్చి పిలవక పోవడం ఏమిటి?

గొడుగడిగేను. మళ్ళా రేప్పొద్దున్నే తెచ్చేస్తానన్నాను. అంతగా అవసరమైతే ఎవరిచేతనైనా వెంటనే పంపేస్తానన్నాను. పాపం! ప్రస్తుతం వాడి దగ్గర లేదుట. అప్పుడే ప్రకాశరావు వాళ్ళింటికి తీసుకెళ్ళేట్ట. అంచేత వర్షం తగ్గేదాకా అక్కడ కూర్చుని తరువాత వెళ్ళచ్చునన్నాడు. “అబ్బే! అలా వీల్లేదు. ఇప్పుడే వెళ్ళి అడుగుతాను, ప్రకాశరావుని. చిన్న చీటీ రాసియ్యి” అన్నాను.

“సరే! వెళ్ళేవాడివి ఎలాగూ వెళుతున్నావు. ఈ పుస్తకం ఇచ్చేద్దూ, ప్రకాశరావుకి” అని బతిమాలుకున్నాడు. కాదనడానికి నోరు వచ్చింది కాదు. సరే ఇమ్మన్నాను.

వీధి చివర్నేగా ప్రకాశరావిల్లు. పరిగెడితే రెండు నిమిషాలు…. పరిగెట్టేను. ప్రకాశరావు సావిట్లో పచారులు చేస్తున్నాడు.పుస్తకమూ, కేశవరావు ఇచ్చిన చీటీ ఇచ్చేను. గొడుగిమ్మన్నాను.

“వెరీ సారీ. ఇప్పుడే నా స్నేహితుడు గోపాల్ స్టేషన్ కి తీసుకెళ్ళేడు. మళ్ళా మా బంట్రోత్తు చేత పంపించేస్తానన్నాడు. ఆ తీసుకునేది మీరే తీసుకోండి, మా వాడి దగ్గర” అన్నాడు. మీరెలాగూ స్టేషన్ వరకూ వెళుతున్నారు కనుక – మా వాడు సంచీ మరచిపోయేడిక్కడ – దయచేసి ఇది వాడికిచ్చేస్తే మీకెంతో పుణ్యం ఉంటుంది” అని సంచి చేతికి తగిలించేడు ప్రకాశరావు. ఇదొక తప్పని తద్దినమైంది.

సరే తెమ్మన్నాను. రోడ్డు మీదకు వచ్చేను. వర్షం తగ్గలేదు. రోడ్డంతా బురద బురద. పుస్తకాలు తడిసి పోయాయి. వాచీ తడిసి పోయింది. మెషీన్ లోకి నీరప్పుడే ఎక్కిపోతోంది. ఈ వాచీ ఎలాగా తగలడిపోతుంది. నాకు తెలుసు. ఇది మరెందుకూ పనికి రాదు. సరికొత్త వాచీ. ఏమయితే అయింది. స్టేషన్ కి పరుగెత్తేను.

అప్పుడే రైలు వెళ్ళిపోయిందిట. బెంచీ మీద కూలబడిపోయాను. వాచీ పాడయిపోయింది. పుస్తకాలు పూర్తిగా తడిసిపోయాయి.

వర్షం తగ్గే వరకూ ఇక్కడే కూర్చుంటాను. తగ్గిన తర్వాతే వెళతాను లాడ్జికి మరి.

# లోకంతో నాకేం పని?

## (ఆనందవాణి, 27 ఏప్రిల్ 1947)

అందరూ తెలిసిన వాళ్ళే. అందరితోటీ పరిచయమే. డబ్బున్నవాడూ, లేని వాడూ కూడ ఒకటే ఏడుపా?

మందులు ఊరికే ఇచ్చేస్తే పట్టుకు పోతారుట, వీళ్ళందరికీ నేనేదో అచ్చున్నట్లు. నా మందులన్నీ దారిపోతూ ఉంటే దొరికినవనుకుంటున్నారు కాబోలు.

వాళ్ళంతా డబ్బు చెల్లించలేని పేదవాళ్ళుట. అంచేత నా మందులు వీళ్ళ గొంతుకల్లో ఉచితంగా పొయ్యాలిట. నా మందులన్నీ వీళ్ళ కోసం ఖర్చు పెట్టేసి అడుక్కు తింటేనే గాని వీళ్ళ మెదళ్ళు చల్లబడవనుకుంటా.

వీళ్ళందరినీ రోజ రోజూ మరమ్మత్ చెయ్యడమే నా పననుకుంటున్నారు కాబోలు. అందుకే నేను డాక్టరు పరిక్ష పేసయేననీ, అందుకే దేవుడు నన్ను పుట్టించేడనీ వీళ్ళ ఉద్దేశం. కాని అది మట్టుకు శుద్ధ అబద్ధమని వీళ్ళకి తెలీదు.

వీళ్ళంతా ఎలా చస్తే నాకేం? కుళ్ళి, కుళ్ళి చావనీ. నాకు డబ్బు చెల్లిస్తే కాని వాళ్ళ మొహమేనా చూడను.

“నువ్వు కూడా సంఘంలో ఒక మనిషివే. నీ ఎదురుగా నేనిలా బాధ పడి చస్తూ ఉంటే చూస్తూ ఊరుకోవడం నీకేం ధర్మం? నా దగ్గర తంతే దమ్మిడీ లేదని నీకు తెలుసు కదా? అల్లాంటప్పుడు నీకేమి ఇవ్వగలను, చెప్పు; నువ్వే కనికరించి మందు ఇవ్వాలి గాని,” అన్నాడు చెట్టు కింద ప్లీడరు మొన్న రోడ్డు మీద కనిపించి.

వాడికి మహా బాగా జవాబు చెప్పేనులే. తను కూడా నాలాగే ఒక వ్యక్తే కనుక, నా మందులూరికే తాగేసి నన్ను కష్టపెట్టడం కంటె, ముష్టెత్తేనా సరే పది రూపాయలు సంపాదించి, నాకు చెల్లించి మందు పట్టుకుపొమన్నాను. దాంతో తెగులణిగి పోయిందనుకుంటా, మొహం ముణుచుకు వెళ్ళిపోయాడు.

ఏం? పది రూపాయలిచ్చి మందు పట్టుకు పోరాదూ? ఎందుకొచ్చిన లోభత్వం? వెధవ లోభత్వం. రోగం ముదిరి చావడానికేనా వెనకతియ్యరు కానీ డబ్బు ఖర్చంటే భయం. అలాగే రోగం ముదిరి చావనీ, నాకేం?

నేను ఫైనల్ ఇయర్ పరీక్షకి వెళ్ళినప్పుడు డబ్బు చాలక బదులడిగితే ఒక్కడేనా ఇచ్చేడా? "ఇంత డబ్బు ఖర్చు చేసి నీకీ చదువెందుకో?" అనొకడూ, "నువ్వు పరిక్ష పేసయి ఏమిటూడబొడిచెయ్యాల్లెద్దూ" అని మరొకడూ – ఇలాగే కదూ జవాబు చెప్పేరువీళ్ళంతా?

ఇప్పుడు నేను పనికొచ్చేనల్లే ఉంది, వీళ్ళందరికీ. ఇన్నాళ్ళూ కానిది ఇప్పుడు మంచివాణ్ణయేను. నేను మందిస్తే తొరగా తగ్గుతుందిట! నేను లోక కల్యాణం కోసం పాటు పడితే వాళ్ళు సంతోషిస్తారుట!!

ఇలా ఎన్ని కబుర్లేనా చెప్పవచ్చు. కాని ఆ పడేదేదో వాళ్ళే పడ కూడదూ?

నా మందులు తాక్క పోతే, పాపం, చచ్చి పోతారుట వీళ్ళంతా. పోనీ, చచ్చి పోతే మరీ మంచిది. బతికున్న వాళ్ళకి రేషన్లేనా సరిపోతాయి.

మాట్లాడితే లోకం, కల్యాణం అంటారు. లోకానికీ, వీళ్ళకీ కల్యాణమైతే నాకూ, డబ్బుకీ వియోగమే. నాకు పైసాతో పని కాని, ఈ దరిద్రపు పీనార్లు చస్తే నాకేం? బ్రతుకుతే నాకేం? చదువు మీద ఖర్చు పెట్టిన డబ్బంతా రాబట్టుకోవడం సంగతి అలా ఉంచండి. నేను మాత్రం చావకుండా బతకొద్దూ?

# రేషన్ పెళ్ళికొడుకు
## (ఆనందవాణి, 8 జూన్ 1947)

రేషన్లు –

రేషన్ అంటే తెలియని వాళ్ళు చాలా తక్కువ. యుద్ధం ఉన్నప్పటికంటె యుద్ధానంతరం మరీ ఎక్కువైపోయింది దీని కీర్తి. తిండికీ, బట్టకీ, కాగితానికీ, ఒకటేమిటి – ఎందుకూ పనికిరాని వస్తువుకి కూడా రేషనే.

రేషన్ తోటే వచ్చింది బ్లేక్ మార్కెట్ కూడా, రోగం తోటే రొచ్చు వచ్చినట్టు.

ప్రపంచంలో అన్ని వస్తువులకీ వచ్చినట్లే ఈ రేషనింగ్ పెళ్ళికొడుకులలో కూడ వచ్చింది. దీని తోటే బ్లేక్ మార్కెటింగు కూడా. అంచేత పెళ్ళికొడుకుల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోజొచ్చేయి.

పెళ్ళికొడుకంటే జ్ఞాపకానికొచ్చింది – ఈ మధ్య ఒక మిత్రుడితో పెళ్ళిచూపులకి వెళ్ళాల్సి వచ్చింది. మాతో పెళ్ళికొడుకు తండ్రి కూడా వచ్చేడు. జరగవలసిన తంతు అంతా జరిగిన తర్వాత పెళ్ళికొడుకు తండ్రి అడిగిన కట్నానికి కన్యాదాత తూగలేనన్నాడు.

"ఇదేమిటండోయ్! పెళ్ళికొడుకుకి కూడా బ్లేక్ మార్కెట్ ధరలు పెట్టేసేరు?" అన్నాడు ఛలోక్తిగా.

"కాకపోతే మరేమిటి? ఇప్పుడు పెళ్ళికొడుకులకి కూడా రేషనే కదండీ!" అన్నాడు మాతో వచ్చినాయన అంతకన్నా ఛలోక్తిగా.

"అలాగా. బ్లేక్ మార్కెట్ లో కొన్న రేషన్ వస్తువులు ఎలాగ ఎక్కువ కాలం మన్నవో అలాగే ఈ రేషన్ పెళ్ళికొడుకులు ఎక్కువ కాలం మన్నరు. మనకీ రేషన్ సంబంధం వద్దులే నాన్నా" అంది పెళ్ళికూతురు ముందుకు వచ్చి.

అంతే కాదు. పత్రికలకీ, పత్రికలలో ప్రచురించబడే వ్యాసాలకీ కూడ రేషనే కనిపిస్తున్నాదీ రేషనింగ్ రోజులలో. ఈ మధ్యనే చదివానొక పత్రికలో ఒక సినిమా మీద 'రేషన్డ్ రివ్యూ.'. ఆ రివ్యూలో చదవడానికేమీ లేకపోయినా, మనం అడగకూడదు, "ఇదేమిటయ్యా?" అని. అడిగితే రేషండ్ రివ్యూ

కనుక అంతకంటె మరేమీ ఉండదంటారు. అన్నీ ఇలాంటి వ్యాసాలే ప్రకటించి, అదీ ఒక రేషన్ పత్రిక అయిపోతే తక్కిన బ్లేక్ మార్కెట్ వస్తువులలా దానికీ బ్లేక్ మార్కెట్ ధరలే వస్తాయిగా.

సినిమా ఫిల్ము మీద రేషనింగు తీసేసినా ఆ సినిమాల మీద రాసే వ్యాసాల మీద రేషనింగు తీసేయలేదనుకుంటా.

ఇలా ఎంతైనా చెప్పవచ్చు ఈ రేషనింగు గురించి. కాని ఇంతకంటె దాన్ని గురించి మనం తర్కించడానికి వీలు లేదు. ఎంచేతనంటే దానికీ రేషనింగే.

# నా గుండె నన్నే ద్రోహం చేసింది
(ఆనందవాణి, 13 జూలై 1947)

ఆ ఉద్దేశం మొదట నా మెదడులో ఎట్లా వొచ్చిందో చెప్పడం అసాధ్యం – కనీసం చాలా కష్టం. అట్లాంటి తలపుకి స్వాధీనమైన తర్వాత, దాన్ని మెదడులోంచి అవతలికి తోసివెయ్యడానికి కూడ శక్తి లేకపోయింది. రాత్రింబవళ్ళు నా కదే ధ్యాస. అందుకు తగినంత కారణం కూడా లేదు. ఆ ముసలాడంటే నాకు చాలా ఇష్టంగానే ఉండేది. అతడు నాకెన్నడూ అపకారం చెయ్యలేదు సరికదా అవమానపరచిన పాపాన్న కూడా పోలేదు. అతడు జాగ్రత్త చేసిన ధనం కోసం ఆశించేనంటారేమో. నాకా ఉద్దేశం ఎప్పుడూ లేదు. ఆ నిర్భాగ్యుడి కళ్ళల్లో ఉంది ఆ దోషమంతా. ఆకాశంలో ఎగిరే రాబందు కళ్ళకీ, భూమ్మీద తిరిగే ఈ ముసలాడి కళ్ళకీ ఏమీ భేదం లేదు. నా మీద వాడి కళ్ళు ఎప్పుడు పడేవో అప్పుడు నా రక్తం అంతా కరడు కట్టిపోయినంతగా బాధ పడేవాడిని. గుండె తీవ్రంగా కొట్టుకొనేది. అందుచేత వాడిని ఎట్లాగైనా అంతమొందించాలనే ఉద్దేశం మెల్ల మెల్లగా నా మెదడులో ప్రవేశించింది.కొద్ది రోజుల్లో అది స్థిరపడింది కూడా.

నేనొక పిచ్చివాడిననుకోవచ్చు మీరంతా. కాని నేనెంత జాగ్రత్తగా, ఎంత దూరదృష్టితో, ఎంత తెలివితేటలతో వ్యవహరించేనో తెలిస్తే మీరలాగనుకోలేరు. ఆ రోజ రాత్రి ముసలాడు పడుక్కున్న గది తలుపు తియ్యగలిగేను. ఆ తియ్యడంలో కూడా చాలా జాగ్రత్తగానే ఉన్నా. లోపల గడియకు బిగించిన మరమేకుల్ని అతి జాగ్రత్తగా పైనుండే విప్పేశాను….అందులోనూ ఎంత మెల్లగా విప్పేనని! పడుకున్న మనిషికి నిద్రాభంగం కానంత నిశ్శబ్దంగా ముగించేను. నేనా పనికి నా చేతిలో ఉన్న దీపం కూడా కనిపించకుండా దాని నిండా మసి పూసేను. ఒక పక్కనుండి మాత్రం సన్నని వెలుగు రేఖని పైకి చిమ్ముతూందా దొంగ దీపం. నిజంగా వెర్రివాడినే అయితే ఇంత తెలివితేటలతో ప్రవర్తించి ఉండేవాడినా? ఆ సన్నని దీపపు వెలుగు ముసలాడి కంటి మీద పడేటట్లు దీపం పట్టుకున్నాను – మిగిలిన మనిషితో నాకవసరం లేదు కనుక. ఆ కన్ను మూసుకొనుంది. అందుచేత నా పని పూర్తి చెయ్యడం అసాధ్యం. ఎందుచేతనంటే నేను భయపడేదా ముసలాడి కళ్ళకి గాని ముసలాడికి కాదు. తలుపు దగ్గరగా వేసేసి పైనుండి ఎప్పట్లాగా బిగించేసేను.

ఇట్లాగే ఏడు రోజులు నా కష్టం ఫలించలేదు. ఆది ఎనిమిదో రోజు రాత్రి. ప్రతి రోజు కంటె జాగ్రత్తగా పని చేస్తున్నాను. గడియారపు పెద్ద ముల్లు కంటె మెల్లగా కదుల్తున్నాను. నా ముసలి విరోధి కలలోనైనా తెలుసుకోందుకు వీలు లేనంతగా మెల్లగా, నిశ్శబ్దంగా తలుపు తెరిచేను.ముసలాడు చేలేడు కాబోలు,

కొంచెం కదిలేడు. ఆ గదిలో అలముకొన్న రాక్షసి చీకటిలో, తలుపు తెరచి ఉండడం చూసి ఉండడు. తలుపు మెల్లగా – ఏమాత్రం చప్పుడు కానంత మెల్లగా చేరవేసాను.

ఆ చీకట్లో చేతులతో తడుముకుంటూ ముందుకి నడుస్తున్నాను. చేతికేదో తగిలి చప్పుడయింది. ముసలాడు త్రుళ్ళిపడి లేచి, మంచం మధ్యగా మఠం వేసుకొని కూర్చొని, "ఎవరక్కడ?" అని అరిచేడు. నేను కదలకుండా, నిశ్శబ్దంగా ఒక మూలకొదిగి నిల్చున్నాను. ఒక గంట సేపు ముసలాడు మంచం మధ్యలో అలా కూర్చునే ఉన్నాడు కాని పడుక్కోలేదు. వాడు పడుక్కొనే వరకూ నేనొక్క అవయవం కూడా కదపకుండా, ఆ స్థలంలోనే నిల్చున్నాను. వాడు పక్క మీద వాలిన కొద్ది సేపటికి ఒక విధమైన మూలుగు వినిపించింది. అది బాధ, విచారమూ వల్ల కలిగినది  కాదు; అధికమైన భయంతో కూడుకొని ఉన్నప్పుడు హృదయ కుహరంలో నుండి వచ్చే భయంకర శబ్దం అది. అనుభవించినవాడిని కనుక ఈ సంగతి నాకు బాగా తెలుసును. అప్పుడు నా దీపపు సన్నటి వెలుగు రేఖ - ఎంత సన్నటిదంటే సాలెపట్టులో సన్నటి దారం కంటె సన్నది – నన్ను బాధించే కంటి మీద పడేటట్లు పట్టుకున్నాను.

ఆ కన్ను తెరుచుకొనే ఉంది. – బాగాతెరుచుకొనుంది. ఆ దృశ్యం చూచేసరికి నాకు కోపం చేత ఒళ్ళంతా వేడెక్కిపోయింది. అకస్మాత్తుగా నాకొక శబ్దం వినిపించింది. గడియారాన్ని గుడ్డల్లో చుట్టబెట్టినప్పుడు వినిపించే శబ్దం లాగుందది. టక్, టక్, లబ్, డబ్. అదేమిటో నాకు తెలుసు. ఆది ముసలాడి గుండె కొట్టుకోవడం. మోగుతూన్న రణ దుందుభి సైనికుని ధైర్యాన్ని ఎక్కువ చేసినట్లు ముసలాడి గుండె చప్పుడు నా కోపాన్ని ఇనుమడింపచేసింది. అయినా కదలకుండా, చేతిలో దీపాన్ని కదపకుండా నిల్చున్నాను. ఈ లోగా ముసలాడి గుండె శబ్దం మరీ నరకప్రాయమైంది. ఆ విజన  ప్రదేశంలో, గాఢాంధకారంలో, అర్ధరాత్రి సమయాన ఆ శబ్దం విని నిజంగానే కొంతగా చలించేను. భయపడ్డాను కూడా. నాకు వినబడే శబ్దం పక్కింటి వారికి కూడా వినబడుతూందేమోనన్న కొత్త ఆదుర్దా నన్నావరించింది. వెంటనే దీపం పక్కకి పెట్టి ముసలాడి మీదకి ఒక్కసారి ఉరికేను. కన్ను మూసి తెరిచే అంతలో ముసలాడి గొంతు నా రెండు చేతుల మధ్యా చిక్కుకొంది. ఒక అరుపు అరిచేడు. ఒక్కటే సన్నని అరుపు. ముసలాణ్ణి మంచం మీదనుడి దొర్లించేసి నేల మీద పడేశాను. అప్పటికీ అతని గొంతులోంచి చిన్న గుర గుర శబ్దం వినిపిస్తూనే ఉంది. కాని అది గది దాటి వినబడే శబ్దం కాదు. కొద్ది నిమిషాలలో ఆ శబ్దం కూడా కట్టుబడింది. చివరికి ఆ వృద్ధుడు నా చేతుల్లో చచ్చిపోయేడు.

ఇప్పటికీ నేను పిచ్చివాడిననే అనుకుంటున్నారు కదూ. ఖూనీ జరిగిన సంగతి బయట పడకుండా శవాన్ని దాచడానికి అవలంబించిన పద్ధతులు వింటే మీరా ఉద్దేశాన్ని మార్చుకోవచ్చు. తెల్లారడానికి

ఎంతో వ్యవధి లేదు కనుక చాలా తొందరగా పనులు ముగించవలసి వచ్చింది. మొట్టమొదట తలని నరికి మొండెం నుండి వేరు చేశాను. తర్వాత ఏ అవయవానికా అవయవం తెగ్గొట్టి వేరుచేశాను. తర్వాత నేలకతికి ఉన్న మూడు బల్ల చెక్కలని ఊడదీసేను. శవం ముక్కలన్నిటినీ నేల మాళిగలాంటి గోతిలో పడేసి బల్ల చెక్కలెప్పటిలాగా సర్దేశాను. ఆ పనిని చెయ్యడంలో ఎంత నేర్పు చూపించానంటే ఈ నేరం మనుష్య మాత్రుడి కళ్ళకందనంత – ఆఖరికి ఆ ముసలాడి కళ్ళకి కూడా – బందోబస్తుగా చేశాను.

ఈ పనులన్నీ పూర్తి చేసుకొనే సరికి తెలతెల్లారుతోంది. సరిగ్గా అప్పుడే వీధి తలుపు ఎవ్వరో తట్టినట్లయింది. మెల్లగా వెళ్ళి తలుపు తెరచేను. పోలీసు ఉద్యోగులు ముగ్గురు లోపల ప్రవేశించేరు. రాత్రి ఎవ్వరో అరిచిన అరుపు పక్కింటి వాళ్ళు విని పోలిసులని పిలచేరుట. అయినా నేను భయపడడం ఎందుకు? చేయ వలసిన పనిని జయప్రదంగా చేసేను కదా. ముగ్గురికీ మూడు కుర్చీలు వేసి కూర్చోమని ఆహ్వానించేను. నా కుర్చీని ముసలాడి శవం ఉన్న చోటికి సరిగ్గా మీదనున్న బల్ల చెక్కల మీద వేసేను. ఇంట్లో నేనొక్కడినే ఉంటున్నానని చెప్పేను. వాళ్ళు ముసలాడి గురించి వాకబు చేస్తే, ఆ ముసలాడు చాలా రోజుల నుండి ఇక్కడ ఉండడమే లేదని వాళ్ళు నమ్మే విధంగా అబద్ధం ఆడేశాను. ఇంక నాకు భయం ఎందుకు? “మరయితే రాత్రి వినిపించిన అరుపెవ్వరిది?” అని వారు ప్రశ్నించగా, “నిద్రపోతూ నేనే కలలో అరచి ఉంటాను,” అని చెప్పేను.

వాళ్ళొచ్చి చాలా సేపైనా కదలలేదు. అప్పుడు భయపడ్డాను, రహశ్యం వాళ్ళకి తెలిసి పోయిందేమోనని. వాళ్ళు ఇంకా కదల లేదు… ఆ గదిని వదలనే లేదు. అకస్మాత్తుగా నాకలవాటైన శబ్దం – అదే శబ్దం మళ్ళా వినిపించింది; గుడ్డలో చుట్టబెట్టిన గడియారం లా టక్, టక్, దబ్, దబ్. అది నా గుండె కొట్టుకొనే శబ్దం! ఆ శబ్దం అంతకంతకు ఎక్కువైంది. గుండె గొంతుకలోకి వచ్చినట్లు ఆ శబ్దం గొంతుకలోంచి వస్తోంది. ఆ శబ్దం పోలీసు ఉద్యోగస్తులకి వినపడుతోందేమోనని భయపడి, అది వారికి వినపడకుండా ఉండేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నాను. నా గొంతు పెంచి గట్టిగా మాట్లాడడం మొదలు పెట్టేను. వారికి దూరంగా జరుగుదామనే కోరికతో గదిలో పచార్లు చెయ్యడం మొదలు పెట్టేను. కాని ఏమి లాభం? ఆ పోలీసులు అక్కడే కూర్చుని ఉన్నారు తప్ప కదల లేదు. నాకు భయం ఎక్కువైంది. గుండె చాతీలోంచి గొంతుకలోకెగబాకి అక్కడ కొట్టుకుంటోంది. నా మనోవైకల్యం ఎక్కువైంది.

“ఛీ, తెలివి తక్కువ దద్దమ్మల్లారా! రండి. ఈ బల్ల చెక్కలు పైకి లాగండి. రహశ్యం బయట పడుతుంది.” అన్నాను.

ఛీ! ఛీ! నా గుండె నన్నే ద్రోహం చేసింది.

(Edgar Ellen Poe రాసిన The Tell-Tale Heart ఆధారంగా.)

# రాలే ఆకులు

(ఆనందవాణి, 30 నవంబర్ 1947)

ఆ సౌధం దేశదేశాల నుండీ వచ్చే కళా జీవులకి నివాస స్థలం. రచయితలు, కళాకారులు, చిత్రకారులు, నటులు, గాయకులు – అంతా అక్కడికే చేరుతూ ఉంటారు, దేశ దేశాలనుండి వచ్చి. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ మేడ కళాకాంతకి ఆటపట్టు.

మేడ మీద ఒక గదిలో ఉంటున్నారు, పీటర్, మేరీ లిద్దరూ. వాళ్ళిద్దరూ వరసకి అన్నా చెల్లెళ్ళు. ఇద్దరూ చిత్రకారులు.

ఎక్కడినుండో వచ్చి కింద గదిలో మకాం చేసేడు మరొక చిత్రకారుడు. అరవై ఏళ్ళకు పైగానే ఉంటుందతని వయస్సు, కాని ఉక్కు పిడుగులా ఉన్నాడు. అతన్ని డేవిడ్ అని పిలుస్తారందరూ.

డేవిడ్ కూడ పై గదిలో ఉన్న అన్నా చెల్లెళ్ళకి మల్లే మంచి చిత్రకారుడే. కాని, తన అరవై సంవత్సరాల జీవితంలోనూ అతను పూర్తి చేసిన కళాఖండం ఒక్కటీ లేదు. అతడు గీసిన చిత్రాలన్నీ కూడ అసంపూర్తిగానే ఉండిపోయాయి. శాశ్వతంగా తన కీర్తిని నిలిపేది, ఈ ప్రపంచంలో ఏ ఒక్క జీవికైనా ఉపకారం చెయ్యగలిగేది అయిన ఒక్క కళా ఖండాన్ని సృష్టించ లేకపోయినందుకు మాత్రం డేవిడ్ మధన పడుతూ ఉండేవాడు.

డేవిడ్ ఆ మేడలోకి వచ్చిన అనతి కాలంలోనే పై గదిలో ఉన్న అన్నా చెల్లెళ్ళతో పరిచయమైంది. తరువాత కొద్ది కాలంలోనే వారి స్నేహం ఘనీభవించింది.

అది నవంబరు నెల. చలి విపరీతంగా వేస్తోంది. ఆకాశం ఎప్పుడూ మేఘావృతమై ఉంటోంది. అప్పుడప్పుడు పిండిమంచు జల్లులులా పడుతోంది. గుబులుగా ఉన్న ఈ వాతావరణానికి తోడు ఆ ఊరిలోనూ, మేడలోనూ శీతజ్వరం ఒకటి వ్యాపించి ప్రాణాంతకంగా తయారైంది. రోజుకొక శవాన్ని అయినా ఆ ఊళ్ళో ఖననం చేస్తున్నారు.

* * *

“దాదీ, ఆ కిటికీ తలుపులు బారుగా తీసి ఉంచు. ఎన్ని సార్లు చెప్పినా అవి మూసెస్తావేమిటి?” నీరసించిన కంఠంతో అడిగింది, మంచం మీద పడుక్కున్న మేరీ.

“మీరు శీత జ్వరంతో బాధ పడుతున్నారు. చలిగాలి తగలకూడదని ఆ తలుపు వేసే ఉంచమన్నారమ్మా అన్నయ్యగారు.”

“అల్లా పనికి రాదు. అన్నయ్యకేమి తెలుసే? వెళ్ళి ఆ తలుపు తీసి రావే!”

“అలానే అమ్మా.” వెళ్ళి తలుపు తీసి వచ్చింది, దాది.

“దాదీ! అల్లా చూడు. ఆ కిటికీ లోంచి అక్కడ ఏది కనిపిస్తోందో చూడు.”

“ఏముందమ్మా ఆ తెల్లటి గోడ తప్ప.”

“అదేమిటే అలా అంటావు? నాకు కనిపిస్తోంది. ఆ తెల్లటి గోడ.ఆ గోడ మీంచి పాకి వచ్చిన లత, దాన్ని అంటిపెట్టుకుని ఐదు ఆకులూను. పచ్చగా ఉన్న ఆ తీగ ఒక కొస నుండి ఎండి బంగారు రంగులోకి మారిపోతున్నాది కూడాను.”

“అవును. లతా, ఆకులూ ఉన్నాయి. కాని, మీరాయాసపడకుండా పడుక్కోండి అమ్మ గారూ. ఆన్నయ్య చూస్తే కోప్పడతారు.”

“అదిగో చూడు. ఆ ఐదాకులలో ఒక్కటి ఇప్పుడే రాలి పోయింది. ఆ ఐదాకులూ రాలిపోగానే నేనూ రాలి పోతానే.”

“తప్పమ్మా. అలా అనకూడదు. శీతా కాలం వచ్చేసింది కదా. పండి, ఎండి, వాడి  పోయిన ఆకులు ఎన్నాళ్ళుంటాయేమిటి? మీరాయాస పడకుండా పడుక్కోండి. నేను వెళ్ళి వస్తాను.”

+ + +

“వాడి  పోయిన ఆకులు తీగని అంటిపెట్టుకుని ఎన్నాళ్ళుంటాయమ్మా? నువ్వు పడుక్కో. ఆయాస పడకు”

“అది కాదన్నాయ్. ఆ శుష్కించే లతకూ, నాకూ ఏదో అవినాభావ సంబంధం ఉంది. కాని ఆ సంబంధం ఎటువంటిదో నీకూ, నాకూ కూడ తెలియదు.”

“మనస్సులో లేనిపోని ఆలోచనలు పెట్టుకుని బాధ పడకు, చెల్లాయ్. మనశ్శాంతి లేక పోతే జ్వరం ఎక్కువ అయే అవకాశాలు ఉన్నాయి.”

“అదిగో, అటు చూడన్నయా. మరొక ఆకు ఆ వాడిన తీగ నుండి పట్టు వదలి ఇప్పుడే పడిపోయింది. అబ్బా, బాధ… గుండెలో నొప్పి… దాహం అన్నయ్యా… నా రెండో ప్రాణం ఎగిరి పోయిందన్నయ్యా”

“ఇవిగోనమ్మా, మంచినీళ్ళు. … ఏం? బాధ కొంచెం సర్దుకుందా? ఇప్పుడే డాక్టర్ ని తీసుకొస్తా.”

“ఈ మందులేవీ నా బాధని ఉపశమింపచెయ్యలేవు. అన్నయ్యా,  నువ్వొచ్చేటప్పుడు కింద గదిలో ఉన్న డేవిడ్ ని ఒక సారి తీసుకు రావూ? చచ్చిపోయే ముందు అతన్ని కూడ చూసి మరీ చచ్చిపోతాను.”

“ఛ! ఛ. అవేమి మాటలు. దిగులు చెందకు, తల్లీ. ఆయనని ఇప్పుడే తీసుకొస్తాను.”

అరగంట గడిచేసరికి డాక్టరునీ, డేవిడ్ నీ వెంట బెట్టుకు వచ్చేడు, అన్నయ్య పీటర్. వైద్య పరీక్ష అయిన తర్వాత ముగ్గురూ బయటకి వచ్చేరు.

ఆ కీటికి లోనుండి కనబడే ఆ లతా, దాని ఆకులతో తన చెల్లెలు కల్పించుకున్న సంబంధం డాక్టర్ కి తెలియజేస్తున్నాడు, పీటర్. ఒకొక్క ఆకు ఆ లత నుండి రాలినప్పుడు తన చెల్లెలు పొందే మనో వైకల్యమూ, దాన్ని ఆధారం చేసుకుని ఆమె పడే బాధా వైద్యుడికి వ్యక్త పరుస్తున్నాడు బయట వరండాలో నిలబడ్డ పీటర్.

మేరీ పడుక్కున్న గది లోంచి బాధా సూచకమైన ఆర్తనాదం వినిపించేసరికి అందరూ లోపలికి ఒక్క పరుగున వెళ్ళేరు. ఆమె బాధతో, ఆయాసంతో, పరుపు మీద అటూ, ఇటూ దొర్లుతోంది. ఆమె పొందే

వ్యధకు కారణమేమిటన్నట్లు చూసేడు, డాక్టర్, అక్కడ పరిచర్యలు చేస్తూన్న దాది వైపు. దాది కిటికీ గుండా బయటకి చూసింది. మరో రెండాకులు లత నుండి వేరయి పడిపోయినట్లున్నాయి.

"ఆ ఆకులు రాలినప్పుడల్లా అమ్మగారు ఇలానే భయపడుతూ ఉంటారు."

డాక్టర్ మేరీ వైపు తిరిగి, "అమ్మా! మీరిలా మనోవైకల్యానికి గురి కావటం చాల ప్రమాదం. మనస్సునిలా శిధిలం చేసుకుంటే నేనిచ్చే మందుల గుణం పూర్తిగా కనబడదేమోనని నేను భయపడుతున్నాను" అన్నాడు.

"మీరు పొరపడుతున్నారు, డాక్టర్. ఆ అయిదాకులూ నా అయిదు ప్రాణాలూను. ఒకొక్క ఆకు రాలి పోయిందంటే ఒకొక్క  ప్రాణం పైకి ఎగిరి పోయిందన్నమాట. ఇప్పుడు ఆ లతకి అంటిపెట్టుకుని ఉన్నది ఒక్కటే ఆకు. ఇప్పుడు నా బొందెని అంటిపెట్టుకుని ఉన్నది ఒక్కటే ప్రాణం. కనుక మీ అమూల్యమైన మందులని నా  మీద ప్రయోగించి మీ పరపతిని మట్టి పాలు చేసుకోకండి. ఆ మిగిలిన ఆకు రాలిపోగానే నేనూ రాలిపోతాను. నా మీద దయ ఉంచి నాకేమీ మందులు ఇవ్వకండి."

"సరేలే అమ్మా. ఆ ఏసు ప్రభువే నిన్ను రక్షిస్తాడు," అంటూ డాక్టర్ వెనుతిరిగి వెళ్ళిపోయేడు. డేవిడ్ కూడ డాక్టర్ తో పాటే వెళ్ళి పోతూ, చెయ్యెత్తి "ప్రభువు నిన్ను తప్పక రక్షించగలడు," అని ఒణుకుతూన్న కంఠంతో దీవించేడు. "అయిదో ఆకు, మేరీ అయిదో ప్రాణం" అని స్వగతంగా గొణుక్కున్నాడు.

మరునాడు ఉదయం పీటర్ కిటికీ గుండా బయట ఉన్న గోడ వైపు చూసేడు. అయిదో ఆకు ఇంకా రాలిపోలేదు. అల్లాగే లతని అంటి పెట్టుకుని ఉంది. అదృష్టవంతులమే అనుకుంటూ తన ఆశీర్వచనాలు లెక్కెట్టుకున్నాడు, పీటర్. కాని ఆ రాలే ఆకులకీ, తన చెల్లెలు ప్రాణాలకీ ఉన్న సంబంధమేమిటో పీటర్ కి ససేమిరా అర్థం కాలేదు.

ఆ రోజే ముసలి డేవిడ్ కి చలి జ్వరం వచ్చింది. డేవిడ్ ని డాక్టర్ చూసి "రాత్రల్లా మంచు దెబ్బ తగలడం వల్ల జ్వరం తీవ్రంగా వచ్చింది" అంటూ మందిచ్చేడు. కాని ఆ జ్వరం రోజు రోజుకీ పెరగడం మొదలు పెట్టింది తప్ప తగ్గు ముఖం చూపించలేదు. "ఆఖరికి ఒక ఉత్కృష్టమైన కళా ఖండాన్ని రచించ గలిగేను. దాని వల్ల ఒక్క జీవికి మేలు జరిగినా నా జీవితం ధన్యమే," అంటూ జ్వరం తీవ్రతలో కలవరించడం మొదలు పెట్టేడు.

డేవిడ్ చేసే సంధి ప్రేలాపనల అర్థం ఏమిటో పీటర్ ఊహకి అంతుపట్టలేదు. ఒక కళాఖండాన్ని రచించాలనే తపన అతనిని ఆఖరు క్షణంలో కూడ వెన్నాడుతోందని సరిపెట్టుకున్నాడు.

మూడు రోజులు గడిచేయి. డేవిడ్ పరిస్థితి దిగజారిపోతోంది. మేరీ బొందిని ఆ అయిదో ప్రాణం అంటిపెట్టుకుని వేల్లాడుతోంది. మిగిలిన అయిదో ఆకు ఆ లతని అలా అంటిపెట్టుకుని ఉంది తప్ప ఇంకా రాలిపోలేదు; పచ్చని జీవకాంతులని అలా విరజిమ్ముతూనే ఉంది.

మేరీ పరిస్థితి మెరుగు పడజొచ్చింది. మేరీ మంచం మీంచి లేచి తిరుగుతోంది. మేరీలో వచ్చిన ఈ మార్పు పీటర్‌ని ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. ఇంకా ఆశ్చర్యం ఏమిటంటే ఈ మూడు రోజులూ ఆ లతని ఆ ఆకు అంటిపెట్టుకునే ఉండి తప్ప రాలిపోలేదు. ఈ దృగ్విషయాన్ని పరిశోధించడానికి పీటర్ ఆ లత దగ్గరగా వెళ్ళేడు. ఏముంది! అక్కడ వాడిన లతా లేదు. దాన్నంటిపెట్టుకుని ఎండిన ఆకూ లేదు. ఆ స్థానంలో తెల్లటి గోడ మీద ఒక లత, దాన్నంటిపెట్టుకుని ఒక పచ్చటి ఆకూ చిత్రించబడి ఉన్నాయి. అప్పుడు పీటర్ కి అర్థం అయింది.

“రాత్రల్లా మంచు దెబ్బ తగలడం వల్ల జ్వరం తీవ్రంగా వచ్చింది” అన్న డాక్టర్ మాటలు గింగురు మన్నాయి పీటర్ చెవుల్లో. ఆ వెంటనే డేవిడ్ జ్వర తీవ్రతలో కలవరించిన మాటలు ప్రతిధ్వనించేయి.

జ్వరం తగిలిన నాటి ముందు రోజ రాత్రి డేవిడ్ ఆ లతని వేల్లాడుతూన్న అయిదవ ఆకుని త్రుంచి, రాత్రంతా మంచులో నిలబడి దాని స్థానంలో జీవకాంతులీనే మరొక పచ్చటి ఆకుని తన కుంచెతో సృష్టించేడన్న ఆలోచన పీటర్ మస్తిష్కంలో తళుక్కున మెరిసింది.అతని కళ్ళు కృతజ్ఞతాశ్రువులతో నిండిపోయేయి. తన కృతజ్ఞత ని తెలుపుకుందామని ఒక్క ఉదుటులో డేవిడ్ పడుక్కున్న గదిలోకి వెళ్ళేడు. అప్పుడే డేవిడ్ ఆఖరి శ్వాస వదిలేడు. నిర్విణ్ణుడైన పీటర్ దుప్పటిని డేవిడ్ ముఖం మీదకి లాగేసేడు. ఆ రోజ ఆ సౌధం నుండి స్మశానానికి వెళ్ళినది డేవిడ్ భౌతిక కాయం.

* * *

మరునాడే పీటర్ తన చెల్లెలు మేరీని  తీసుకుని మరొక బస లోకి మారిపోయాడు. చావుకి సిద్ధంగా ఉన్న మేరీ మంచం మీంచి లేచి మళ్ళా ఇలా భూమి మీద తిరగడం, అప్పటివరకూ గుండ్రాయిలా ఉన్న డేవిడ్ మంచం ఎక్కి మూణ్ణాళ్ళల్లో మట్టిలో కలసిపోవడంలో ఉన్న నిగూఢ రహశ్యం అప్పటికీ, ఇప్పటికీ మేరీకి తెలియదు.
(ఒక ఇంగ్లీషు కథ ఆధారంగా)

# ఒక్క చేప చాలదా?

## (ఆనందవాణి, 28 డిసెంబర్ 1947)

జాన్‌సన్ చాలా మాటకారి. ఎప్పుడూ స్నేహితులలో ఎవరినో ఒకణ్ణి ఉడికిస్తూ, మిగిలిన స్నేహితులంతా కేరింతాలు  కొడుతూ ఉంటే కులుకుతూ ఉండేవాడు.

ఆవి వెన్నెల రాత్రులు. పిండారబోసినట్లుంది పండు వెన్నెల.  అల్లాంటప్పుడు జాన్‌సన్ స్నేహబృందానికి చల్లగాలి మేసి వద్దామని బుద్ధి పుట్టింది. అందులో ఒకడన్నాడు.

“ఊరికనేపోకూడదు. ఎవ్వరినైనాతీసుకుపోయి వాడికి కమ్మ కట్టి ఆనందిస్తే హుషారుగా ఉంటుంది.”

గోల్డ్‌స్మిత్ ని తీసుకుపోతే బాగుంటుందని సలహా జారీ చేసేడు, మరొకడు.

“అవును. అతన్ని ఐతే సులభంగా బుట్టలో వెయ్యొచ్చు,” అని భుజం ఎగరేసేడు, జాన్‌సన్.

రాత్రి చెరువు ఒడ్డున కూర్చున్నారంతా. బాతాఖానీ చెంగల్రావు పేట చేంతాడులా సాగుతోంది. ఆకాశం మీద నక్షత్రాలన్నీ చెరువులో ప్రతిబింబిస్తున్నాయి. మిలమిల మెరుస్తూ అప్పుడప్పుడు చెరువులోనుంచి మీదకి ఎగసే చేపలు స్పష్టంగా కనబడుతున్నాయి.

ఉన్నట్లుండి జాన్‌సన్ గోల్డ్ స్మిత్ వైపు తిరిగి, “ఒక చిన్న ప్రశ్న అడుగుతాను, నిన్ను. ఈ చెరువునీ, ఆ నక్షత్రాలనీ కలపడానికి ఎన్ని చేపలుండాలో చెప్పు నీ తెలివితేటలు ఉపయోగించి.”

“మంచి ప్రశ్నే!” అన్నాడు బృందంలో ఒకడు.

“దీనితో తేలిపోతుంది, మనవాడు ఎంత తెలివైనవాడో” అని వంత పలికేడు మరొకడు.

“చెప్పు, మరి” అని తొందర చేసేడు మూడోవాడు.

గోల్డ్‌స్మిత్ ఒక సారి చెరువులోకీ, మరొక సారి ఆకాశం వైపూ చూసేడు.

“ఏం? లెక్క కడుతున్నావా?” అన్నాడు జాన్‌సన్, తన ప్రశ్నకి జవాబు చెప్పలేడనే ధీమాతో.

“లేదు. ఏమంత గడ్డు ప్రశ్న ఇది, ఆలోచించి లెక్క వెయ్యడానికి?”

“అలా అయితే చెప్పు.”

“చాలినంత పొడవైన చేప ఒక్కటైతే చాలదూ?”

# విందు

(ఆనందవాణి, 1 ఫిబ్రవరి 1948)

“ఏమోయ్; సూర్యం! యీ ఊళ్ళో ఏం చేస్తున్నావు?” అన్నాడు వెనకనుంచే వచ్చి భుజం తట్టిన వెంకట్రావు. విజయనగరంలో బి. ఏ. చదువుకునే రోజుల్లో నేనూ వెంకట్రావూ రెండు సంవత్సరాలపాటు సహాధ్యాయులం. ఇద్దరిదీ స్వగ్రామం ఒకే ఊరు కావడం, తద్వారా మాలో ఒకరంటే ఒకరికి అత్యధికమైన ఆప్యాయత కలగడం సంభవించినాయి. తలవని తలంపుగా వెంకట్రావు కనబడేసరికి చాలా ఉత్సాహం కలిగింది నాకు.

“ఇక్కడ బి. ఏ. చదువుతున్నాను. అవున్ ఉగాని నువ్వెప్పుడొచ్చావు? ఎక్కడుంటున్నావు?” అనడిగేను, అతనికి మంచి బస దొరకని పక్షంలో మా హాస్టల్‌కి ఆహ్వానిద్దామనే ఉద్దేశ్యంతో.

“ఇక్కడ మా అక్కయ్యా, బావా ఉన్నారు. వస్తూనే వాళ్ళింట దిగేను,” అన్నాడు.

మేమిద్దరమూ మాట్లాడుకుంటూ, నవ్వుకుంటూ ఆ పూటల్లా తిరిగేము. సాయత్రం మా రూముకి కూడా తీసుకొని వచ్చా. కాకినాడలో చదువుకునే రోజుల్లో మేమిద్దరమూ కలసి చేసిన అల్లరి, కాలేజీ నాటకాల్లో మేమభినయించిన పాత్రలూ – వీటి గురించి చాలా సేపు ముచ్చటించి ముచ్చట పడ్డాం. ఇంతలో మా హాస్టల్ గంట గణగణ మ్రోగి మా బాతాఖానీకి అడ్డు తగిలింది.

“అదిగో వంటైంది. లే. నువ్వు ఈ రోజ నాకు అతిధివి. ఇక్కడుండిపో. సరదాగా భోజనం చేసి సినిమాకు పోదాం” అన్నాను.

“కాదోయ్! క్షమించాలి సూర్యం. ఇంటి దగ్గర చెప్పలేదు. మరో పర్యాయం వస్తాలే. నేనీ ఊరునుండి కదిలే లోపున ఒక్కసారైనా నీకు అతిధినౌతాలే.”

“పోనీ ఆల్లాగే చెయ్యవోయ్! ఎప్పుడో నీకు అవకాశం ఉన్నప్పుడే రా. సరదాగా భోజనం చేద్దాం.”

“సరేలే!” అని వెళ్ళిపోవడానికి లేచేడు, వెంకట్రావు. నేనూ లేచి అతనిని హాస్టల్ గేటు వరకూ సాగనంపి, తిరిగి వచ్చేశాను.

తర్వాత నేనతని సంగతి మరిచిపోయే వరకూ వెంకట్రావు మా హాస్టల్ కి భోజనానికిరానూ లేదు, నాకు ఎక్కడా కనబడనూ లేదు….ఇదంతా రెండేళ్ళ క్రితం సంగతి.

ఈ మధ్య తునిలో నేనూ వెంకట్రావూ కలుసుకోవడం జరిగింది. కుశల ప్రశ్నానంతరం ప్రశ్నించేడు వెంకట్రావు: "సూర్యం! నువ్వు విజయనగరంలో ఉండేప్పుడు నన్ను మీ హాస్టల్ కి విందుకి ఆహ్వానించేవు జ్ఞాపకం ఉందా?"

"అవును. నువ్వు రాలేదేం?" అన్నా అటించిటు.

"బాగుంది! ఇదొకటా? ఒక స్నేహితుడు తనతో కలసి భోజనం చెయ్యడానికి పిల్చేడనీ, అంచేత యింట్లో ఈ రోజు భోజనానికి రాననీ , నా కోసం మా బావ కనిపెట్టుకుండవలసిన అవసరం లేదనీ చెప్పి మరీ వచ్చాను, నీ రూముకి. తీరా నేనొచ్చేసరికి నువ్వు లేవు. చాలా సేపు కనిపెట్టుకుని ఉన్నానోయ్ మీ రామదాసు గదిలోను. కాని నువ్వింతకీ రావు, అంతకీ రావు. అందరూ భోజనాలకి పోతున్నారు. నాకు కడుపు కాల్తూంది. చివరికి విసుపేసి వచ్చిన త్రోవ పట్టేను. మళ్ళా ఇంట్లో భోజనానికి ఏ మొహం పెట్టుకుని వెళ్ళనూ? ఇంటి దగ్గర ముందే చెప్పి వచ్చేనాయె, ఆ రోజు భోజనానికి రానని. నా పరువు నిలబెట్టుకుందుకి విందారగించిన వాడి కన్నా ఎక్కువగా రెండు కిళ్ళీలు కొనుక్కుని, బుగ్గనెట్టుకుని, ఇంటికి పోయి కడుపు కాల్తూ పడుకున్నా. ఆ రోజు ఏదో పండగ కూడాను…అన్నట్లు వినాయక చవితి అనుకుంటా. అన్నట్లు చెప్పడం మరచి పోయా. దార్లో మీ రూం మేటు కనబడితే అడిగేను, నువ్వెక్కడికి దయచేసేవని. మహానుహావుడివి, నువ్వెక్కడికో విందారగించడానికి వెళ్ళేవుట కదూ, ఆ రోజు?"

ఈ ధోరణి చూసి నాకు నవ్వాగడం లేదు. పాపం! నిష్కారణంగా కడుపు మాడ్చుకున్నాడు.

"అవునోయ్! నాకూ జ్ఞాపకం వచ్చింది. మంచి కురిడీయే తిన్నావన్నమాట. ఆ రోజున… నాకా ఊళ్ళో రాజేశ్వరరావనే స్నేహితుడు ఉన్నాడులే. ఇన్కం టేక్స్ ఇన్స్పెక్టరు. నేనంటే చాలా ఇష్టం అతనికి. అతనారోజు బజార్లో కనబడి బలవంతాన తీసుకుపోయాడు, వాళ్ళింట భోజనానికి. పిండివంటలతో విందు జరిగింది నాకు. కడుపు కాలిన విందు జరిగింది నీకు. ఇదీ వ్యత్యాసం!......"

ఇంకా ఏదో చెబుతూనే ఉన్నాను. "అయితే మా ఇంటికి వెళ్ళి భోజనం చేసి వచ్చావన్నమాట. రాజేశ్వర్రావు మా బావేనోయ్!" అన్నాడు, వెంకట్రావు.

# ఏర్చి కూర్చిన పూలు

1.

(ఆనందవాణి, 4 ఏప్రిల్ 1948)

స్టేషన్‌లో అప్పుడే ట్రైన్ మిలటరీ వాళ్ళని దింపేసి వెళ్ళిపోయింది. ఎవరిమట్టుకు వారు స్టేషన్ దాటి వెళ్ళిపోయారు. కాని ఇద్దర్ని మాత్రం రైల్వే ఉద్యోగి గేటు దగ్గర ఆపేశాడు – ప్యాసుల్లేవని. ఇంతలోకే మిలటరీ ఆఫీసరు ఒకడక్కడికి వచ్చేడు. అతని దుస్తులు అతనొక మేజరని తెలియజేస్తున్నాయి. అతడు తిన్నగా ఆ రైల్వే ఉద్యోగి దగ్గరకి వచ్చి, పక్కనున్న మిలటరీ వాళ్ళని చూపి, “వీళ్ళిద్దరూ ఇక్కడ ఉండి పోయారేమిటి?” అని అధికార స్వరంతో అడిగేడు.

“వీళ్ళిద్దరికీ టిక్కెట్లు లేవు సార్!”

“వీళ్ళిద్దరూ నా హయాంలో పని చేసేవాళ్ళు. వీళ్ళ సంగతి నేను చూస్తాను. వీళ్ళని నాతో పంపండి…. మార్చ్…రైట్…లెఫ్ట్… రైట్…లెఫ్ట్…క్విక్…”

ముగ్గురూ గేటు దాటి వెళ్ళిపోయారు. మేజరు – ఆ ఇద్దరిలోనూ ఒకడు మరొకడితో చెఉతూ ఉండడం విన్నాడు, “మంచి ఉపాయమే! మనకి ప్యాసులు లేక పోయినా తెలివిగా తప్పించేడు.”

మేజరన్నాడు, త్వరగా నడుస్తూ, “…ఛప్ నోరు ముయ్. నాకు మాత్రం ప్యాసు ఎక్కడేడిసింది!… కమాన్ …రైట్…లెఫ్ట్…

2.

(ఆనందవాణి, 4 ఏప్రిల్ 1948)

భర్తకి లక్ష రూపాయలు లాటరీ వచ్చిందని తెలిసేసరికి, భార్య చాలా భయపడింది - ఆ వార్త భర్తకి ఎలా తెలియజేయడమా అని. అంత సొమ్ము ఒక్క సారి వచ్చిందంటే సంతోషాన్ని తట్టుకోలేక గుండె పగిలి చస్తాడేమోనని ఆమె భయం. అంచేత ఈ వార్త భర్తకి చెప్పడానికి ఒక డాక్టర్ ని నియమించింది.

డాక్టరు: ఏమండీ! మీకు వంద రూపాయలు లాటరీ వచ్చిందనుకొండి. అప్పుడు నాకెంత ఇస్తారు?

అతడు: అందులో సగం మీదే. ఏభై మీకు, ఏభై నాకు. సరేనా!

డాక్టరు: వెయ్యి రూపాయలు వస్తే?

అతడు: అందులో సగం అయిదొందలిస్తా!!

డాక్టరు: పది వేల రూపాయలొస్తే?

అతడు: అందులో సగం అయిదువేలిస్తా.

డాక్టరు: లక్ష రూపాయలు వచ్చిందనుకొండి!

అతడు: వచ్చిందాంట్లో సగం అన్నాను కదా. అందులో సగం ఏభై వేలూ మీవి, ఏభై వేలు నావి. సరేనా?

డాక్టరు: అయ్య బాబోయ్! ఏభై వేల రూపాయలే!! నిఝంగా? ఏభై వేలు!!

(సంతోషం పట్టలేక డాక్టరు గుండె పగిలి చస్తాడు)

3.

(ఆనందవాణి, 10 ఆగస్ట్ 1947)

ఒక ఆంగ్లేయుడు పడవలో ప్రయాణం చేస్తూ, పడవ లోంచి లండన్ పట్టణంలో పేరెన్నిక గన్న భవనాలని తన అమెరికన్ స్నేహితుడికి చూపిస్తూ అన్నాడు:

“ఇది చాలా గొప్ప కట్టడం. దీన్నే హవుస్ అఫ్ కామన్స్ అంటారు.” అన్నాడు, గర్వంగా.

“ఓస్ ఇంతేనా! మా అమెరికాలో ఇంతకంటే గొప్ప కట్టడాలు చాలా ఉన్నాయి.” చప్పరించేసేడు, అమెరికన్

“అదిగో చూడు. అది సెయింట్ పాల్స్ కెథీడ్రల్. సర్ క్రిస్టఫర్ రెన్ దాని స్థపతి!!” అంటూ దూరంగా కనబడుతూన్న గోళాకారపు విమానాన్ని చూపించేడు – ఈ సారైనా ఈ అమెరికన్ తన దేశపు గొప్పని గుర్తించకపోతాడా అన్న ఆశతో.

“ఇదేమంత గొప్ప చర్చి కాదు. మా నూ యార్క్ వచ్చేవంటే ఇంతకంటె గొప్ప అందమైన కట్టడాలు నీకు చూపిస్తాను.”

ఆ మాటలకి ఆంగ్లేయుడు కొంచెం నొచ్చుకున్నాడు. నొచ్చుకోవడమేమిటి? మన ఆంగ్లేయుడికి ఒళ్ళు మండింది. “పోనీ! అదిగో అక్కడున్న ఆ కట్టడాన్ని చూడు…..”

“అదొక గొప్పేమీ కాదు. మా టెక్సస్ రాష్ట్రంలోనే అటువంటివి వేలకొద్దీ ఉన్నాయి.”

“కావచ్చు. కాదనను. ఆదొక పిచ్చాసుపత్రి!” అన్నాడు ఆంగ్లేయుడు, గర్వంగా ఊపిరి పీల్చుకుంటూ.

4.

(ఆనందవాణి, తేదీ అలుక్కుపోయింది)

ఒక ఇంగ్లీషు దేశస్తుడూ, అమెరికా దేశస్తుడూ ఎవరిమట్టుకు వారు గొప్పలు వారు చెప్పుకుంటున్నారు – వాళ్ళనుభవించిన చలిని, శీతల ప్రదేశాలనీ గురించి.

మరుగుతూన్న నీరు ఒక పాత్ర లోంచి మరొక పాత్రలోకి పోస్తూ ఉంటే, అలా చూస్తూ ఉండగానే ఘనీభవించి మంచు గడ్డ అయిపోవడం తనకు తెలుసన్నాడు, మన ఆంగ్లేయుడు.

“ప్చ్! అదేపాటి! నాకు తెలిసింది చెబుతా విను. ఒక మేకపిల్ల కొండ శిఖరం నుండి కిందకి గెంతుతూ, చలికి గడ్డ కట్టుకుపోయి అలా గాలిలో స్తంభించి పోయింది!” అన్నాడు అమెరికన్.

“కాని…” ఆంగ్లేయుడు నసుగుతూ అన్నాడు, “…శాస్త్రం? భూమ్యాకర్షణ శక్తి అంటారే! ఆది ఒప్పుకోదు, నువ్వు చెప్పినదానికి.”

“ఓస్ అదా నీ అనుమానం? ఆకర్షణ శక్తి, దానితో పాటు శాస్త్రం కూడా గడ్డ కట్టుకు పోయాయి, అంత చలిగా ఉంది అక్కడ!” అన్నాడు అప్రయత్నంగా అమెరికన్.

# పరీక్ష
## (ఆంధ్రపత్రిక, 22 సెప్టెంబరు 1948)

జగన్నాధరావుకి అతని భార్య విషయం ఒక సమస్య అయిపోయింది. కాత్యాయిని ప్రవర్తన అతనికి రెండేళ్ళబట్టీ అనుమానంగానే ఉంది. అయితే నోరు తెరచి నిలదీసే సామర్ధ్యం అతనికి ఏ కోశానా లేదు. పోతే తన కళ్ళతో తను స్వయంగా చూడకుండా తానట్లా అనుమానించకూడదని అతను అప్పుడప్పుడు అనుకోకపోలేదు.

కాని ఆఫీసులో తనతో పని చేసే గుమస్తాలకి బాతాకానీ వెయ్యడానికి తన భార్య విషయమే కావలసివచ్చిందని తెలిసేసరికి అతనికి వికారమెత్తినట్లే అనిపించింది. ఆ రోజు రామ్మూర్తి, శేషయ్యా చేసే వెధవ సంభాషణంతా అతని చెవినే పడాలా?

"జగన్నాధరావు అలుసు చూసుకుని అతని భార్య రోజు రోజుకీ రంగేళీలా తయారవుతోంది" అన్న శేషయ్య మాటలూ, "మూడో పెళ్ళి పెళ్ళాం అంతకంటె మరేం చేస్తుందిలే" అని రామ్మూర్తి ఇచ్చిన సమాధానం తన చెవిని పడకపోలేదు. అసలే అనుమానంతో కుళ్ళి చస్తూన్న అతనికి ఈ సంభాషణ ఒరిసిన పుండు మీద కారం జల్లినట్లు పని చేసింది. ఆ రోజు రోజల్లా జగన్నాధరావుకి పని మీద దృష్టే లేదు. తనకి మూడవ వివాహం అయిననాటి నుండి అప్పటి వరకూ గడచిన కాలాన్నంతా ఒకసారి సింహావలోకనం చేసుకున్నాడు.... కాత్యాయిని వంటి అప్సరసకి తన వంటి వయసు మళ్ళిన వాడు భర్తేమిటని అతనికి మొదట్లో అనుమానం కలగక పోలేదు. కాని తన అవసరం ఆ అమ్మాయి కష్ట సుఖాలని గూర్చి ఆట్టే ఆలోచించడానికి అవకాశాన్నిచ్చింది కాదు. తనని ఆమె వివాహం చేసుకోకనేపోవాలి. చేసుకుంటే మాత్రం అడుగులకి మడుగులొత్తుతూ ఉండవలసిందే. తననే దైవంగా చూసుకుంటూ పర పురుషుణ్ణి కన్నెత్తి చూడకూడదు. పన్నెత్తి పలకరించకూడదు.... ఈ అంతులేని ఆలోచనా ప్రవాహంలో పడి పెద్ద గుమస్తా రెండు మూడు సార్లు పిలచినా వినిపించుకోక చివాట్లు తిన్నాడు.

సాయంత్రం ఇంటికెళ్ళేటప్పుడు బజారంతా తన్ను చూసి నవ్వుతున్నట్లే అనిపించింది. కనపడ్డవాళ్ళంతా తన్ను చూసి వెక్కిరిస్తూన్నట్లే తోచింది. గుమ్మంలో అడుగు పెడుతూనే – "ఏమిటి నీ సంగతి? నన్నెందుకిలా అల్లరి పెడతావు?" అని అడిగేద్దామనే అనుకున్నాడు. కాని ఆలోచించగా అదట్టే మంచి పనిలా తోచలేదు. అడిగినా తన భార్య తనకి నిజం చెప్పదన్న బెదురు మనస్సులో బాగా మెదుల్తోంది. పరీక్షించి తన భార్య ప్రవర్తనలోని లోపాన్ని తానే కనుక్కుని, ఆవిడ సుశీలే అయితే

మన్నించడానికి, దుశ్శీలే అయితే తగిన బుద్ధి చెప్పడానికీ ముందే నిశ్చయించుకున్నాడు. కాని ఈ పరీక్షా సమయంలో మాత్రం తాను అజ్ఞాతంగానే ఉండాలి. ఎన్ని పర్యాయాలాలోచించినా ఈ పద్ధతే బాగా నచ్చిందతని మనస్సుకి.

గుమ్మం మెట్లెక్కుతూనే భార్యతో, "ఏమేవ్! తొందరపని మీద నేనూరికి వెళుతున్నాను. రెండు, మూడు రోజులవరకూ రానేమో! ఇల్లు మాత్రం జాగ్రత్త! తలుపేసుకో!" అని చెప్పేసి, బట్టలు మార్చుకుని వెళ్ళిపోయాడు, వీధిలోకి.

జగన్నాధరావు ఆడబోయే నాటకానికి సుబ్బారావు సహాయం ఇంతో కొంతో లేకపోలేదు.  జగన్నాధరావు ఆ నాడు మార్చిన వేషానికి కావలసిన హంగులన్నీ సుబ్బారావే జతపరచేడని చెప్పాలి. వేషధారణ పూర్తయిన తరువాత సుబ్బారావిలా ధైర్యం చెప్పేడు: "నీ భార్య కాదు కదా, ఆమెని పుట్టించిన బ్రహ్మ కూడా నిన్ను గుర్తు పట్టలేడు. నీ కొత్త పేరు మరచి పోయేవు సుమా. మోహనరావు. పరాకుపడి పొరపాటు పడవద్దు" అని వీధిలోకి సాగనంపేడు.

జగన్నాధరావు నటించవలసిన పాత్ర ఇక్కడనుండి కొంచెం కష్టమైనదే. తను మారు వేషంలో ఉన్నట్లు తన భార్య ఏమాత్రం ఆచూకీ తీసినా, తను భార్య దొంగతనం పట్టలేడు. ఒకసారి తన జేబులోని అద్దాన్ని తీసి వీధి దీపపు వెలుగులో తన స్వరూపాన్ని చూసుకున్నాడు. నాలుగైదు నిమిషాలట్లా చూసుకున్న తర్వాత, తన పూర్వ రూపానికీ, ప్రస్తుత రూపానికీ బోలెడంత తేడా ఉందని నిర్ణయించుకొని తృప్తి పడ్డాడు. తను భార్య ముందు నటించవలసిన రీతిని దారిలో పదే పదే స్మరణ చేసి బాగుందనుకున్నాడు.

మొట్టమొదట తన పేరు మోహనరావనీ, తన కొరకు, అనగా జగన్నాధరావు కొరకు వచ్చాననీ చెప్పాలి. తరువాత చెయ్య వలసిన కార్యక్రమాన్ని గురించి పదేపదే ఆలోచించాడు. కాని అతని చంచల బుద్ధికి నిమిషానికో మార్గం తట్టడం మొదలెట్టింది. ఈ విషయంలో అతనొక నిర్ణయానికి రాలేక పోవడం వల్ల సమయానుకూలంగా అక్కడ ప్రవర్తించడానికే నిశ్చయించుకున్నాడు.

గుమ్మమెక్కుతూనే తలుపు తట్టాడు. కాత్యాయిని తలుపు తెరిచేసరికి అతని కాళ్ళు కొద్దిగా ఒణికిన మాట మాత్రం నిజం. తానా సమయంలో ఆచరించవలసిన విధానాన్ని జ్ఞాపకం తెచ్చుకుని, "జగన్నాధరావు గారు ఉన్నారా? మాది నెల్లూరు లెండి. నా పేరు మోహరావంటారు. ఆయనతో కొద్దిగా

మాట్లాడవలసిన పని…” అని కంఠస్థం చేసిన డైలాగుని వప్పచెప్పేశాడు. అంతవరకూ తన పాత్రాభినయనంలో పొరపాటేమీ జరగలేదని తృప్తి పడ్డాడు.

“ఇంట్లో లేరండీ. సాయంత్రం బండికి ఊరెళ్ళారు” అని చెప్పింది కాత్యాయిని.

“అట్లాగా! ఆయనని కలుసుకోకుండా తిరిగి వెళ్ళడమే? పెద్ద చిక్కే వచ్చిందే! ఈ ఊళ్ళో నాకు తెలిసున్న మరొకరెవరూ లేరు. పోనీ ఈ రాత్రికి మీ పంచని పడుక్కోనిస్తే జగన్నాథరావు గారొచ్చే వరకూ తల దాచుకొని ఆయనని కలుసుకుని మరీ వెళతాను.” అన్నాడు – రాత్రంతా తను అక్కడే పడుక్కుందుకి కాత్యాయిని ఇష్టపడితే భార్య ప్రవర్తన కొంతవరకూ అర్థం చేసుకుందుకి అవకాశముంటుందనే ఆశతో.

ఈ సారి కాత్యాయిని అతని ముఖంలోకి తీక్షణంగా చూసింది. అతనికి తెలియకుండా పక్కకి తిరిగి పైట చెంగు చాటు నుండి ఒక సారి పక్కున నవ్వుకుంది. తన భర్తకో గుణపాఠం నేర్పాలనే కొంటె ఆలోచన అప్పుడే ఆమె మస్తిష్కంలో మొలకెత్తింది. అతని వైపు తిరిగి ఇలా అంది. “మీరెవరో నాకు తెలియదు కాని, మీ వాలకం చూస్తే నాకు చాలా అనుమానంగా ఉంది. మీరు పెద్ద మనుషుల్లా నడుచుకోవడం లేదు. అర్ధరాత్రి వేళ తలుపు తట్టి, నా భర్త ఇంట్లో లేరని చెబుతూన్నా వినక, మొండితనంగా ‘లోపల పడుక్కుంటాను, చోటివ్వండి’ అనడం లో మీ ఉద్దేశం ఏమిటి? ఇదేం సాని కొంపనుకున్నారా? సంసార్లుండే ఇల్లనుకున్నారా? తక్షణం గుమ్మం దిగితే దిగేరు. లేకపోతే ఇరుగు, పొరుగు వాళ్ళని పిలచి తగిన బుద్ధి చెప్పిస్తాను, జాగ్రత్త! దిగండి ముందు, గుమ్మం!” అని దులిపేసి ధాబాల్న తలుపేసేసి లోపల గడియ పెట్టేసింది.

జగన్నాథరావు గుండె రెండు నిమిషాలు కొట్టుకోవడం మానేసి తర్వాత మళ్ళా తన పనిని యధాప్రకారం టక్కూ, టక్కూ మని మొదలెట్టింది. అతనొక్క గంతులో వీధిలో పడ్డాడు కాని, తను చెందిన దిగ్భ్రమ అంత వేగం సడలిపోలేదు. తాను విన్నదానికీ, ప్రత్యక్షంగా కన్న దానికీ ఏమాత్రం సంబంధముందో అప్పుడతనికి అర్థం అయింది. తన భార్యని ఎంత అపార్థం చేసుకున్నాడు! ఆమె నిర్దోషిత్వం తనకిన్నాళ్ళూ తెలిసిరాలేదు. అదైనా ప్రత్యక్ష పరీక్ష వల్లనే. తానిన్నాళ్ళూ చూస్తూన్న భార్య బాహ్య ప్రవర్తనను బట్టి తాననవసరంగా అపోహ పడ్డాడు. తానింక మోహనరావుగా చరించవలసిన అవసరం అయిపోయింది. తనిప్పుడు జగన్నాథరావై తనింటి గుమ్మం ధైర్యంగా తొక్కొచ్చు. ఈ సంఘటన వల్ల తన భార్యకు నిజంగానే తన మీద ప్రేమ ఉందనీ, ఆమెకు పరపురుషుని వాసనైనా కిట్టదనీ అతనికర్థమైంది. ఈ ఆలోచనలన్నీ అంతం అయ్యేసరికి సుబ్బారావు బస దగ్గరకి వచ్చేశాడు. మెల్లగా లోపలికి వెళ్ళి ఎరువు దుస్తులు తీసేసి ఎప్పటి జగన్నాథరావైపోయాడు. సుబ్బారావుని పిలచి,

జరిగిన విషయం చెప్పి, “ఈ సారి నా భార్య నన్ను రెండు చేతులాతోటీ  ఆహ్వానించ వచ్చునోయ్” అన్నాడు, గర్వంగా. కాని అదెట్లానో సుబ్బారావుకి అర్థం కాలా.

జగన్నాధరావారాత్రి తన భార్యని చూడ్డానికి రెండో సారి బయలుదేరేడు. అతనికి దారికడాకూ ఉన్న నిండు ధైర్యం  తన ఇంటి మెట్లెక్కి తలుపు తట్టి పిలచేటప్పుడు లేకపోయింది. సగం ధైర్యంతోనే తలుపు తట్టేడు. “ఏమేవ్! తలుపు తియ్యి!”

“ఎవరూ?” అని ప్రశ్నించింది భార్య, కళ్ళు నులుపుకుంటూ కిటికీ దగ్గరకి వచ్చి.

“నేనూ, తలుపు తియ్యి” అన్నాడు, జగన్నాధరావదే కిటికీ దగ్గరకి వచ్చి.

“అంటే? మీ పేరు?”

“నేనే! జగన్నాధరావుని!!”

“ఇందాకా ‘నా పేరు మోహన్రావనుకుంటూ వచ్చిన వాడివే కదూ? ఇప్పుడు నా భర్త పేరు పెట్టుకుని, నీ మొగుణ్ణంటూ మళ్ళా వచ్చావా? మర్యాదగా ఇక్కణ్ణుంచి వెంటనే వెళ్ళిపో!”

“నిద్దట్లో మాట్లాడుతూన్నట్లున్నావ్. బాగా చూడు. నేనే. నీ మొగుణ్ణి.”

“నాకు తెలియకపోతే ఇంకా చెబుదువు కాబోలు! గంట క్రితం వచ్చినవాడివి ఎంత వేషం మార్చినా నీ రూపు పోలిక పట్ట లేనా? నీ గొంతుక గుర్తు పట్టలేనా? నేను నా భర్త ఎవ్వరో తెలుసుకోలేనంత మూర్ఖురాలిని కాదు. ఆయన రాత్రికి రానని చెప్పి మరీ వెళ్ళేరు. ఆయన లేరని తెలిసి నువ్వెవరివో దొంగ వేషం వేసుకొచ్చినట్లున్నావు. వెంటనే ఇక్కడ నుండి కదులు. నువ్వెంత గొంతుక చించుకున్నా, మోసం జరుగుతుందని తెలిసి కూడా తలుపు తెరిచేపాటి వెర్రి దాన్ని కాదు. ఇంకా మొండికెత్తి ఇక్కడే నిల్చుంటివా, నలుగుర్నీ పిలుస్తాను. నగుబాటు కావలసి వస్తుంది.”

జగన్నాధానికి ఇప్పుడు తద్దినం కొని తెచ్చుకున్నట్లయింది. దూరంగా ఆలోచించిన మీదట తానా అర్ధరాత్రి వేళ అట్లా నడి వీధిలో గొంతు చించుకుంటూన్నప్పుడు నలుగురూ వింటే తనకే నగుబాటన్న జ్ఞానం వచ్చింది.  ఈ రోజ ధిక్కరించిన భార్య మరునాటికి మారుతుందా? ఆమెకు తనంతట తాను

నచ్చచెబితే లాభం లేదు. సుబ్బారావుని కూడా తీసుకొచ్చి, తనే ఆమెని అగ్నిహోత్రం సాక్షిగా వివాహం చేసుకున్న భర్త అని నచ్చజెప్పించదల్చుకున్నాడు.

ఆమె పాతివ్రత్యం మీద అప్పటికి అతనికి బాగా గురి కుదిరింది. వెంటనే తిరిగి వెళ్ళి సుబ్బారావుతో రెండో సారి జరిగిన ఉదంతం అంతా పూసగుచ్చినట్లు చెప్పేడు. సుబ్బారావు అంతా విన్నాడు. తన స్నేహితునికి వచ్చిన ఆపదలో ఆదుకో దలిచాడు. అతనితో కూడా వెళ్ళి కాత్యాయిని ముందు ఆ రాత్రి ఆమె దగ్గరకు రెండోసారి వచ్చిన వాడే ఆమె భర్త అయిన జగన్నాధరావని సాక్ష్యం చెప్పడానికి సిద్ధపడ్డాడు..

సుబ్బారావు తోడు రాగా జగన్నాధరావా రాత్రి మూడవ పర్యాయం తలుపు తట్టి భార్యను లేపేడు. ఈ సారి లోపలి నుండే వచ్చింది, జవాబు.

“ఎవరది? ఇప్పుడు తలుపు తియ్యడానికి వీల్లేదు. మా ఆయన అలిసిపోయి వచ్చి ఇప్పుడే నడ్డి వాల్చేరు. గోల చేస్తే లేచిపోతారు. ఆయనతో మాట్లాడే పని ఉంటే పొద్దుటే మాట్లాడవచ్చు. ఇప్పటికి వెళ్ళండి.”

“డామిట్! కథ అడ్డం తిరిగింది!” అన్నాడు సుబ్బారావు.

“భార్యా రూపవతీ శత్రుః” అనుకున్నాడు జగన్నాధం స్వగతంగా.

# ఉరిత్రాడు

(కథాంజలి, దీపావళి సంచిక, 1948)

ఖైదీ తన గదిలో కూర్చున్నాడు, మెల్లగా నడిచే కాలాన్ని గుణిస్తూ. అతనికి ఉరిశిక్ష విధింపబడింది. మరొక వారం రోజుల్లో అతనిలోని ప్రాణవాయువులీ అనంతాకాశంలో లీనమైపోవలసిందే. హత్య జరిగిన సమయాన్నీ, అప్పటి తననూ తల్చుకుంటే తన చేతుల్ని తనే నమ్మలేకపోయాడు. బుద్ధిపూర్వకంగా ఆ క్రూర కార్యాన్ని తను చెయ్యలేదని అతనికి తెలుసు. కాని కోపావేశంలో ఆ పని జరిగి పోయింది. అతన్నొక హంతకుడి క్రింద జమకట్టి జైలులో త్రోశారు. అతడిప్పుడు చెయ్యగలిగిందంతా జైల్లో కొట్టే గంటల్ని లెక్కపెడుతూ విచారంగా కూర్చోవడమే. రాత్రి, పగలు అనే భేదమే తెలియడం లేదతనికిప్పుడు. హఠాత్తుగా పక్కలో పోటొచ్చేసరికతను గిలగిల్లాడిపోయేడు. ఆ బాధకతని కన్నులలో నీరు తిరిగింది. అది మొదలా బాధ తగ్గలేదు సరిగదా, నిముషనిముషానికీ, గంటగంటకూ ఎక్కువ కావడం మొదలు పెట్టింది. తన జీవితాంతపు ఘడియల్లోనైనా తనకు మనశ్శాంతి ఇవ్వలేని దైవాన్ని, సుఖంగా తనను చావనీయని దైవాన్ని తిట్టుకున్నాడు.

తన ఆత్మని చుట్టివేసుకొని ఉన్న కారుచీకట్లో ఒక్క మెరుపు తళుక్కున మెరిసినట్లయింది. తనూ చిన్నతనంలో వైద్యం చదివేడు. అందుచేతనే తన బాధకి కారణం యిట్టే గ్రహించగలిగేడు. అతనిలో ఏదో ఆశాలత చిగిర్చినట్లు అతని ముఖభావాల్లో ద్యోతకమయింది. మరొక నాలుగు రోజులపాటు తను బాధానివారణకి ఏ చికిత్సా పొందకుండా ఉంటే? ప్రకృతి కనికరిస్తే?? తన ముద్దొచ్చే నున్నని కంఠం ఉరిత్రాడులో పడి నలిగిపోకుండా ఉండడానికి అవకాశం ఉంటుందేమో! తన కంఠం ఉరిత్రాడులో తగుల్కొనే లోపునే, ప్రకృతి అతన్ని తనలో లీనం చేసుకొంటే తాను విడుదలైనంతగా సంతోషిస్తాడు.

జైలు వార్డెన్ తన వైపు వచ్చినప్పుడల్లా తన బాధ పై వారికి తెలియకుండేలా పళ్ళు బిగించేవాడు. భరించలేనప్పుడైనా తన బాధనతను ఇతరులకి తెలియనీయదలుచుకోలేదు. ఆ రోజ వార్డెన్ తన గది దాటి వెళ్ళగానే ఉండి ఉండి వచ్చిన ప్రక్కలో నొప్పికి గాలిలో అల్లాడే లేత ఆకులాగే అయిపోయాడు. అతని బిగించిన పెదవుల్లోంచి రెండు రక్తపు చుక్కలు నేల మీద పడ్డాయి.

అతనికి ఎంత బాధైనా తట్టుకోవాలనే ఉద్దేశమైతే బలీయంగానే ఉంది, కానీ అతని ఒంట్లో శక్తి ఏదీ?.... తెల్లవారేసరికి, బాధకు తట్టుకోలేక తన కొట్టులోనే పడిపోయాడు, వంటి మీద తెలివి లేకుండా. అతనికి మళ్ళా తెలివి వచ్చేసరికి ఆ జైలుకి సంబంధించిన ఆసుపత్రిలో ఉండడం గమనించేడు. అతడు తీవ్ర రోగంతో బాధ పడుతున్నాడన్న సంగతి ఆ నోటా, ఈ నోటా ప్రాకి జైల్లో

అందరికీ తెలిసిపోయింది. అతడెట్లాగైనా చస్తే ఉరిత్రాడుని ధిక్కరించి జయం పొందినవాడౌతాడనుకున్నారు మిగిలిన ఖైదీలంతా.

ఆ వైద్య శాలలో ఇద్దరు డాక్టర్లు – ఒకడు బాగా అనుభవం సంపాదించిన ముసలి వాడు. రెండవ వాడు క్రొత్తగా ఉద్యోగానికి ప్రవేశించిన కుర్రాడూ, ప్రపంచానుభవం లేనివాడూను. ఆపరేషన్‌కి కత్తులూ, కట్టర్లూ సిద్ధంగా ఉన్నాయి. డాక్టర్లు శుభ్రం కొరకు చేతులు కడుక్కుంటున్నారు. వారూ, వీరూ చెప్పుకునే మాటలవల్ల రోగి వారం తిరక్కుండా ఉరి తీయబడవలసినవాడని వాళ్ళకు అర్థం అయింది. పెద్ద డాక్టరు ఒకసారి వెటకారంగా, వెగటుగా నవ్వేడు. జూనియర్ కు మాత్రం యిది చాలా క్రూరంగా కనిపించింది. వారం రోజుల్లో బలవంతంగా చంపడానికి నియోగింపబడ్డ మానవుని ప్రాణాలు యిప్పుడు తాము రక్షించడానికి పూనుకోవడం చాలా అమానుషంగా తోచిందతనికి.

ఆపరేషన్ చెయ్యడానికి అంతా సిద్ధమయింది. ఇద్దరు డాక్టర్లూ ఆ రోగిని బతికించడానికి కంకణం కట్టుకున్నట్లు తదేక దీక్షతో పని చేస్తున్నారు. వాళ్ళ దృష్టికతడు శిక్షితుడైన నేరస్తుడు కాదు. మామూలు రోగి మాత్రమే. ఈ శస్త్ర చికిత్సలో వారు గెలుపొందేరంటే శాస్త్రాన్ని ఒకడుగు ముందుకి తీసుకెళ్ళేరన్నమాట!

ఇద్దరు డాక్టర్లూ ఏక దీక్షతో చికిత్స చేస్తున్నారు. నిమిషనిముషానికీ వారి ముఖ భావాలు మారుతున్నాయి. గదిలో నిశ్శబ్దం మూర్తీభవించింది. పెద్ద డాక్టరు ముఖంలో ఒక హాస రేఖ అంకురించింది! చేతులు కడిగేసుకున్నాడు. చివరకు శాస్త్రమే జయించింది. నేరస్థుడు మరొక సారి దారుణంగా చంపాడడానికి ఇప్పుడు చావు నుండి తప్పింపబడ్డాడు! !

పెద్ద డాక్టరు అన్నాడు, "చాలా కఠినమైన కేసు. రోగి బ్రతికేడంటే చాలా గొప్ప మాటే." చిన్న డాక్టరు మనస్సులో పూర్వపు విషయాలన్నీ గిర్రున తిరిగేయి. రోగి కొద్ది రోజులలో  చనిపోవడానికి నియమింపబడ్డవాడన్న సంగతి జ్ఞప్తికి వచ్చింది. చికిత్స చేసినప్పుడు ధైర్యంగా ఉన్న అతని చేతులు ఇప్పుడు కొద్దిగా వణికేయి! చిన్న డాక్టరు తనలో గొణుక్కున్నాడు.  "అతడు తరువాత దారుణంగా చంపబడడానికిప్పుడు ప్రాణాలిచ్చి కాపాడేము. ఆ బాధతోనే అతడు చచ్చి ఉంటే ఎంత బాగుండేది. ఒక కుక్క గాని, గుర్రం కాని గాయంతో బాధ పడుతూ ఉంటే దాన్ని వెంటనే చంపి బాధనుండి శాశ్వతంగా విముక్తి పొందేలాగ చేయడానికి మనస్సు తొందర పడుతుందే. ఈ దోషి ఒక కుక్క పాటి చేయలేదూ?"

"న్యాయం ఎటుంటే అటు జయిస్తుంది నాయనా! నువ్వింకా చిన్నవాడివి. ఇక్కడ కొన్నాళ్ళు పని చేసి అనుభవం గడిస్తే, నీకే తెలుస్తాయి, ఇటువంటి విషయాలు," అని భుజం తట్టి వెళ్ళిపోయాడు ముసలి డాక్టరు.

ఏది ఎట్లాగున్నా నేరస్తుడికి మాత్రం ఉరిశిక్ష తప్పని సరి.  నాలుగు రోజులు గడిచాయి. అది  అతన్ని ఉరికంబానికి ఎక్కించవలసిన రోజు.  అంటే అతడు బలవన్మరణం పొందవలసిన రోజు. అతడానాడు చెప్పలేని బాధతో కన్నీరు కార్చేడు. తాను చేసిన తప్పులు క్షమించమని పశ్చాత్తాపుడై దేవుణ్ణి ప్రార్థించేడు. భయంకరమైన ఉరిత్రాడు తన మీద పడుతున్నాట్లే భయపడ్డాడు. కొంచెం వెనక్కి తగ్గి కళ్ళు మూసుకున్నాడు.

చివరకు రానే వచ్చింది, ఫర్మానా, అతన్ని ఉరికంబం దగ్గరకి తీసికొని వెళ్ళడానికి. ధైర్యం చేర దీసుకొని, నడవలేక నడవలేక నడచి వెళ్ళేడు, ఫర్మానా తీసికొని వచ్చిన ఉద్యోగితో, వంచిన బుర్ర వంచినట్లుగానే ఉంచి.  గమ్యస్థానానికి కొద్ది దూరంలో ఉండగా బుర్ర ఎత్తి ఎదురుగా ఆహ్వానిస్తూన్న ఉరిత్రాడుని చూసేసరికతని కళ్ళు తిరిగేయి!

కొద్ది రోజుల క్రితమే డాక్టర్ల తెలివితేటల వల్ల మృత్యువు నుండి తప్పించబడ్డ ఖైదీ యిప్పుడు ఉరిత్రాడులో బుర్ర తగిలించి, మూర్తీభవించిన నిరాశలాగే కనబడ్డాడు. జైలు గడియారం ఆరు గంటలు కొట్టింది. నిర్జీవమైన శరీరం కిందపడ్డట్లు జైలు గోడలు ఒక్కసారి మొద్దుగా ప్రతిధ్వనించేయి. అక్కడే ఉన్న చిన్న డాక్టరు అప్రయత్నంగా చేతి రుమాలుతో కళ్ళు తుడుచుకున్నాడు. తరువాత – అంతా నిశ్శబ్దమే!

# పతివ్రత

## (సూర్యప్రభ, నవంబరు 1948)

1

కొన్నాళ్ళయి నిద్రపోతున్న పాతపాళెంలో నలుగురు మనుష్యులొకసారి గట్టుమీద పడ్డ చేపల్లా బయట పడ్డారు. వాళ్ళ సంగతి ఆ రోజే తెలిసింది కొత్తపాళెం ప్రజలకి. ఆ నలుగురూ ఎవరంటే – మొగుడూ, అతగాడి భార్యా, మరో ఆడమనిషీ, సాధారణంగా 'నల్లకోటు' అని పిలవబడే ఒక అయ్యగారూను.

ఈ మొగుడుకి దయా దాక్షిణ్యాలు ఎక్కువే. పిల్లలంటే మక్కువాను. ఇతగాడు పెళ్ళాం పేరు చెబితే గాడిదలా కదం త్రొక్కే ఘటం. ఇతని భార్య రూప, శీలాలని కలిపి చేసిన పోత బొమ్మ! మహా పతివ్రతాను!! పోతే పైన చెప్పిన ఆడమనిషికి నోటి దురుసుతనం మహా యెక్కువ. ఆవిడొక విషప్పురుగు. ఇక మన అయ్యగారు, ఉరఫ్ నల్లకోటు, సంగతి – చదవండి.

ఒక మంగళవారం ఉదయం మన మొగుడు తన భార్యని, చంటి పిల్లవాణ్ణీ, పాతపాళెం రైల్వే స్టేషన్‌లో, రైల్లో, ఆడవాళ్ళ పెట్టెలో, కూర్చోబెట్టేడు. జేబులోంచి టెలిగ్రాము తీసి మరొకసారి చదువుకున్నాడు. "మీ అక్కయ్యకి జబ్బుగా ఉంది. వెంటనే బయలుదేరి రావలెను." అంతకన్న మరేమీ లేదు అందులో.

భార్య వైపు తిరిగి అన్నాడు మొగుడు. "నువ్వక్కడికి చేరేసరికి సాయంకాలం నాలుగవుతుంది. వెళ్ళగానే మీ అక్కయ్యకి ఎలా ఉందో జాబు వ్రాయి. మీ బావతో చెప్పు, నేను రాడానికి తీరిక లేకపోయిందని."

"అట్లాగేలెండి!" అందా పతివ్రత.

అదే రైల్లో ఒక మగాళ్ళ పెట్టెలో ఎక్కింది మన "ఆడమనిషి." ఆమె ఒక విషప్పురుగని అప్పుడే చెప్పేను కదా. ఆమె ఎక్కడికి వెళుతున్నాదో తెలుసుకోవలసిన అవసరం మనకి లేదు. ఈ భార్యా భర్తలు మాట్లాడుకోవడమూ, భర్త భార్య దగ్గర శెలవు తీసుకుని వెళ్ళడమూ చూసిందని మాత్రం తెలుస్తే చాలు.

అక్కడ కొత్తపాళెంలో 'నల్లకోటు' ఏం తంటాలు పడుతున్నాడో చూద్దాం. అతనక్కడొక రెవెన్యూ ఇనస్పెక్టరు. బదిలీ మీద ఆ ఊరు రావడాన్న, పాపం, ఎవరినీ అంతగా తెలీదు. ఈ సందర్భంలో అతని భార్య అకస్మాత్తుగా మంచం ఎక్కింది. కాళ్ళూ, చేతులూ ఆడక మరదల్ని ఉన్న పళంగా రమ్మనమని పాతపాళెం టెలిగ్రాము కొట్టేడు. పోస్టాఫీసు నుండి తిరిగి వచ్చి భార్య పక్కలో కూర్చున్నాడు.

అతనేముహూర్తాన్న టెలిగ్రాము కొట్టేడో కాని, ఆ ఉత్తర క్షణం నుండీ భార్య జబ్బు ఎక్కువ కావడం మొదలైంది. 'ఈ ఊళ్ళో వైద్యం లాభం లేదు, పట్నం తీసికెళ్ళండి' అని నలుగురూ చెప్పిన సలహా మీద అతను 'సరే' అన్నాడు. మరో అరగంటకల్లా పట్నం పోయే రైల్లో భార్యతో సహా ఉన్నాడు.

సరిగ్గా పదకొండు గంటలకి రెండు రైళ్ళూ మధ్యనొక స్టేషన్ దగ్గర ఆగేయి. అక్కా, బావా ఉన్న పెట్టె మన పతివ్రత ఉన్న ఆడవాళ్ళ పెట్టెకెదురుగా ఆగడం కేవలం కాకతాళీయం. తలుపు దగ్గర ఉన్న నల్లకోటు రెవెన్యూ ఇనస్పెక్టరు గభాల్న బండి దిగి, మరదల్తో రెండు మాటలాడిన తర్వాత, పాతపాళెం వాడి భార్య పిల్లణ్ణెత్తుకుని, నల్లకోటు ఆసామీతో కలసి ఎదట ఉన్న రైల్లో ఎక్కడం మగాళ్ళ పెట్టెలో కూర్చున్న మన ఆడమనిషి చూసింది. అంతలోనే నల్లకోటు ఆసామీ ఉన్న రైలు కదలిపోయింది.

తనకి బాగా తెలిసిన ఆడది మరొక మగాడితో 'లేచిపోవడం' చూసి ఎలా ఉరుకోగలదు? ఆమె బుర్ర రైలు బండి కంటె జోరుగా పని చేసిన మీదట, మన ఆడమనిషి బుర్రలో ఒక ఆలోచన మెరిసింది. అప్పటికికాని వేడెక్కిన ఆ మెదడు చల్లబడలా! తర్వాతి స్టేషన్‌లో దిగిపోయి, ఆమె ఈ విధంగా తంతివార్త పంపింది పాతపాళెం పెద్దమనిషికి: "నీ భార్య ఎక్కడ? నల్లకోటు స్నేహితుడెవరు?"

ఈ టెలిగ్రామునొకగంటపోయిన తర్వాత అందుకున్న మొగుడికి మొదలూ, కొసా తెలియలా! మనసంతా ఒక సారి పతివ్రత అయిన పెళ్ళాం వైపు పోయింది. ఆ కాగితం పట్టుకుని అతను ఇంటింటికీ పరిగెత్తేడు. ఎవ్వరైనా కర్తవ్యం బోధించలేకపోతారా అని. సలహా మాట దేవుడెరుగు, అతని భార్య మరెవ్వరితోనో లేచిపోయిందన్న వార్త ఊరంతా ప్రాకిపోయింది – ఎండిన తాటాకులమంటల్లే!

అయితే 'ఆ నల్లకోటు స్నేహితుడెవరూ?' అన్నది సమాధానం లేని ప్రశ్నలా మిగిలిపోయింది పాతపాళెం ప్రజలకి. అందరూ తలొక సలహా ఇచ్చేరు. చివరకు ఒక బుద్ధిమంతుడి సలహా మేరకి,

తోడల్లుడికి యీ విధంగా టెలిగ్రాము ఇచ్చేడు, జవాబుకి కూడ తనే డబ్బు కట్టేసి – “నా భార్య ఏమైంది?”

టెలిగ్రాము అందేసరికి కొత్తపాళెం రెవెన్యూ ఇనస్పెక్టరు గారింటి దగ్గర ఒక బంట్రోతు మాత్రం ఉన్నాడు. వాడు పైని చెప్పిన నలుగురికీ తీసిపోని గాడిద! చదవడం వచ్చినవాడూ కాదు, అలాగని పూర్తిగా రాని వాడూ కాదు. వాడు ఆ టెలిగ్రాముని అందుకుని, కవరు విప్పకుండానే మడిచి జేబులో పెట్టుకున్నాడు. ఒక గంట పోయిన తర్వాత పోస్టు మేన్ ఇచ్చినది మాములు ఉత్తరం కాదనీ, అదొక టెలిగ్రాము అన్న విషయం వాడి బుర్రకి ఎక్కి, అప్పుడు ఆ కవరు విప్పి చూశాడు. అందులో ఏముందో వాడికి తెలియదు. ఒకరిని అడుగుదామనే జ్ఞానం లేదు. దానిలో ‘భార్య’ అనే మాట మాత్రం వాడు చదివి అర్థం చేసుకోగలిగేడు. వాడొక భైభ్రాజిమానమే కాకుండా ఒక బ్రహ్మచారి ముండాకొడుకు కూడాను. వెంటనే సర్దుకుని, ‘భార్య లేదు’ అని జవాబు రాయించి, రెవెన్యూ ఇనస్పెక్టరు పేరు మీదుగా తిరుగు టెలిగ్రాము పంపించేసి, యధా స్థానంలో అరుగు మీద నడ్డి వాల్చి నిద్రపోయేడు.

ఒక గంట పోయిన తర్వాత అందిన ఆ జవాబు చూసి పాతపాళెం ప్రజ అట్టుడికి పోయింది.  భార్యా వియోగాన్ని భరించలేని భర్తకి ఆ టెలిగ్రాము గుండెల్లో బాకులా గ్రుచ్చుకొంది. ఆ కాగితం పట్టుకుని వీధిలో కదం తొక్కడం మొదలుపెట్టేడు. ఈ భాగోతం అంతా చూస్తోన్న సహచరులంతా తలో సలహా ఇవ్వకుండా ఉండలేకపోయారు.

వెంటనే పోలీసు రిపోర్టు ఇమ్మన్నాడొకాయన.

"తిరిగి తిరిగి సరదా తీరిన తర్వాత తనే ఇంటికి వస్తుంది, మీరు కిమ్మనకుండ కూర్చోండి" అని మరొక శాల్తీ సలహా ఇచ్చింది.

"పతివ్రత లాంటి భార్యని ఒదిలిపెట్టలేనండీ!” అంటూ ఆక్రోశించేడు మన భర్త.

అంతలో అందరిలోకి తెలివైనవాడినని అనుకొంటూన్న ఒక శాల్తీ ముందుకొచ్చి, “అయితే మీరు మీ తోడల్లుడు దగ్గరకి వెళ్ళి విషయం తేల్చుకోవడం ఉత్తమం” అని పడి రాయి లాంటి సలహా ఒకటి పారేశాడు.

ఈ ఆఖరు తీర్మానాన్ని యేకగ్రీవంగా ఆమోదించేరు అక్కడకి చేరిన పెద్దలంతా! అతడు ప్యాసింజరులో తన తోడల్లుడు ఉన్నఊరు వెళ్ళడానికి కావలసిన సన్నాహాలన్నీ జరిగేయి. పురప్రముఖులంతా అతన్ని రైల్లో కుదెయ్యడానికి తీసుకొస్తూ ఉండగా, కిటికీ సందుల్లోంచి అమ్మలక్కలంతా ముక్కుల మీద వేళ్ళేసుకుని ఆశ్చ్రయంగా చూస్తున్నారు. కొందరు ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

అతనికి టికెట్టు కొని, చేతికిచ్చి అంతా సకాలంలో ప్లేట్‌ఫారం మీదకి వచ్చేరు. అతను వెళ్ళవలసిన బండికి ఇంకా వేళ కాలేదు. ఈ లోగా రెండో వైపు నుంచి పొగలు చిమ్ముకుంటూ మరో రైలు వచ్చి ఆగింది. భర్తను ఎక్కడనుండి చూసిందో కాని, రైలు దిగి, చంకలోని పిల్లాడితో సహా, నడుస్తూ వచ్చి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ భర్త చేతుల్లో వాలిపోయిందా ఇంతి. ఆ వెనకనే వచ్చిన రెవెన్యూ ఇనస్పెక్టరు, "నా భార్యకి మందిప్పించడానికి పట్నం తీసుకెళుతున్నాను," అని చెప్పేడు, తోడల్లుడితో.

భార్యని కళ్ళారా చూసేసరికి అంతవరకు జరిగిన భాగోతాన్ని మరిచిపోయాడు, భర్త. "ఒహో! ఇతనా 'నల్లకోటు' అంటే అని అనుకున్నారు అక్కడ ఉన్నవాళ్ళంతా, రెవెన్యూ ఇనస్పెక్టర్ వైపు చూస్తూ.

"అంతమంది జనాల మధ్య మిమ్మల్ని సరిగ్గా గుర్తుపట్టి మీ చేతుల్లోకొచ్చి వాలిపోయానంటే నేనెంతగొప్ప పతివ్రతనో ఆలోచించుకొండి," అంది భార్య వయ్యారంగా.

"అవునవును. అనసూయ కన్నా, అరుంధతి కన్నా, అహల్య కన్నా నువ్వే ఎక్కువ ఘాటైన పతివ్రతవి" అన్నాడు భర్త, అక్కున చేరిన ఆమె వాలకం చూసి ఎవ్వరైనా ఏమైనా అనుకుంటారేమోనన్న జంకుతో.

"మనం ఏ ప్లట్‌ఫారం మీద, ఎక్కడైతే  విడిపోయేమో మళ్ళా అదే ప్లేట్‌ఫారం మీద, అక్కడే కలుసుకోవడం విచిత్రంగా లేదూ!" అంటూ పతివ్రత కన్ను గీటుతూ గేటు దాటి బయటకి వచ్చింది.

# (అ)ప్రయోజకుడు

## (స్వతంత్ర, నవంబరు 25, 1949)

ఆనందోత్మత్తతకు ఆఖరి మెట్టు మీద ఉండే ధనిక వర్గం మొదటాట సినిమా చూసి ఇంటికి పొయ్యే సమయం అదే. రోజంతా అమ్మకం వల్ల వచ్చిన ధనాన్ని లెక్క చూచుకొని, లాభ నష్టాలు బేరీజ వేసుకొనే షాహుకార్లు ధనాన్నినప్పెట్టెలలో బిగించి దుకాణాలు మూసే సమయమూ అదే. పగలంతా ఆఫీసులో చేసిన పని చాలక  ఇంటివద్ద కూడా వ్రాయడానికి గాడిద బరువు కాగితాలను మోసుకొని, అరిగి పోయిన ఆకు చెప్పులు ఈడ్చుకొంటూ హృదయ భారంతో ప్రకాశరావు రోజూ బసకు చేరుకునే సమయమూ అదే. ఆఫీసులో పని చెయ్య వలసిన నియమిత కాలం పదకొండు గంటలనుండి ఐదు గంటల వరకే. కానీ తెల్లవారేసరికి, అతను అలా నోట్లో కాఫీ నీళ్ళు పోసుకొని ఇలా ఆఫీసుకి చేరుకోవాలి. వెళ్ళిన తర్వాత రాత్రి తొమ్మిదయ్యే వరకు కదలడానికి అవకాశం లేదు. ఇది యజమాని చేసిన ప్రతిసృష్టి. తను గుమస్తా జీవనాన్ని సాగించదలుచుకున్నన్నాళ్ళూ అధికారాంధుల అధీనంలో బానిసగా ఉండక తప్పదు.

ప్రకాశరావు జీవితం ఒక విధంగా ఈ రకమైన బానిసత్వానికి అంకితమైపోయిందంటే, దానికి తనెంత బాధ్యుడో తనకే తెలియదు. తనూ చదువుకొనే సమయంలో ఆశయాలూ, ఆవేశాలూ కలవాడే. తన తండ్రి గుమస్తాగా ఎంతవరకు సుఖపడ్డాడో తనకి తెలుసును. అధికార్ల నిరంకుశత్వానికి తన తండ్రి ఆత్మ ఎంతగా క్షోభించిందో తనకి ప్రత్యక్ష నిదర్శనమే.

వేరే తెరువు లేనప్పుడు వ్యక్తిత్వాన్ని చంపుకుని గుమస్తాగా బానిసత్వం అనుభవించేకన్నా ఆత్మహత్య మేలని తనెన్నోసార్లు అనుకున్నాడు. తను పట్టభద్రుడై కాలేజీ ఆవరణ దాటి వచ్చిన తర్వాత మానవ సేవతో ఏమాత్రమైనా సంబంధం గల జీవితాన్ని గడుపుదామని మనసారా కాంక్షించేడు.  కాని ఈనాడు తన వాంఛలన్నీ స్వాప్నికములే అయిపోయాయి. తానేరకమైన జీవితాన్ని హేయంగా పరిగణించేడో, ఎటువంటి వృత్తికి సాధ్యమైనంత దూరంగా ఉండాలనుకొన్నాడో దాని గుప్పిడిలోనే చివరకి ఇరుక్కుపోవలసిన అగత్యం కలిగింది. ఈ పరిణామానికి కారణం అతని అసమర్థత కాకపోయినా, తన తండ్రి మాటకి ఎదురాడలేని మనోదౌర్బల్యం అని మాత్రం చెప్పాలి.

తను బి. ఎ. పరీక్ష రెండవ తరగతిలో ఉత్తీర్ణుడైనట్లు తెలిసిన రోజున తండ్రి అన్నాడు, “అబ్బాయీ, ఇంతవరకూ ఎల్లాగో రెక్కల కష్టం మీద నిన్ను చదివించేమన్న సంగతి నీకు తెలుసును కదా? ఇక పైన

చదివించగలిగే శక్తి కూడా నాకు లేదు. అందుచేత వెంటనే నువ్వేదైనా ఉద్యోగంలో ప్రవేశిస్తే మంచిది. అట్లా చేస్తే కుటుంబానికి కొంత భారం తగ్గినట్లూ ఉంటుంది. ఏమంటావ్?"

"అలాగేలెండి నాన్నగారూ. ఏదైనా అనువైన ఉద్యోగం దొరికితే  తప్పకుండా మీరు చెప్పినట్లే చేస్తాను."

ఆ మాట మీద తండ్రి చేసిన కృషి ఫలితంగా ప్రకాశరావుకి త్వరలోనే ఉద్యోగం లభించింది. బెజవాడలో ఒక ఆఫీసులో గుమస్తా పని ఖాళీగా ఉందని తెలిసి, తనకి తెలిసిన ఒక స్నేహితుని ద్వారా అది ప్రకాశరావుకి వచ్చేటట్లు చేయగలిగేడు అతని తండ్రి. కాని తాను చేయబోయేది గుమస్తా పని అని తెలియగానే ప్రకాశరావు నిర్మించుకొన్న ఆశాసౌధాలు ఒక్కసారి కూలిపోయాయి. "ఇంతకాలమూ పెద్ద కబుర్లు చెప్పి ఇప్పుడు బానిసత్వానికి దాసోహం చేస్తావా?" అని అతని బుద్ధి హేళన చేసింది. "అప్రమత్తులైన అధికారాంధుల అడుగుల కిందనలిగిపోతావు సుమా!" అని అతని ఆత్మ పరితపించింది."ఏ వృత్తినైనా స్వీకరించు కాని, గుమస్తాగా మాత్రం జీవితాన్ని స్థిరపరచుకోవద్దు" అని అతని యువహృదయం ప్రతిఘటించింది.

ఆ ఉద్రేకంలోనే తండ్రి దగ్గరకి వెళ్ళి చెప్పేడు, తానా ఉద్యోగం చేయడానికి అంగీకరించలేనని.

"ఏమోయ్! ఏమొచ్చిందా ఉద్యోగానికి? పిలిచి పిల్లనిస్తే ఏదో అన్నాట్ట, నీలాంటివాడే!"

"ఈ పదవి స్వీకరించడం నా ఆశయాలకి విరుద్ధం నాన్నగారూ!"

"ఆశయాలు, ఆశయాలు! ఏమిటి నీ ఆశయాలు? మ్రింగ మెతుకు లేదు కానీ మీసాలకి సంపెంగ నూనెట! ఈ చేతకాని కబుర్లు కట్టిపెట్టి ప్రయాణానికి సిద్ధం కా. ఎల్లుండే ప్రవేశించాలి పనిలో."

"అది కాదు…."

"అది అవునో కాదో నాకు తెలుసులే. ఉద్యోగం చెయ్యక పోతే అడుక్కు తింటావా, ఏం? దారి చూపించినప్పుడైనా నీ పొట్ట నువ్వు పట్టుకు పోవాలి కాని, ఎన్నాళ్ళిలా వాళ్ళ మీదా వీళ్ళ మీదా ఆధారపడి ఉంటావు?"

ఈ మాట ప్రకాశరావుకి హృదయం లోంచి  దూసుకుపోయినట్లయింది. ఆ మాటలు తన తండ్రి – కన్న తండ్రి – నోటి నుండి వచ్చినందుకు ఆశ్చర్యపోయేడు. ఆ మాట మరొకడంటే అంతగా బాధపడి ఉండేవాడు కాదేమో! తనను భరించడం ఎంత కష్టం కాకపోతే అలా అనగలడు తన తండ్రి. తన వ్యక్తిత్వం ఇక ముందు అలాంటి దూషణలకు తల ఒగ్గడానికి నిరాకరించింది.  తత్ఫలితంగా తనిప్పుడు ఆత్మాభిమానాన్ని చంపుకొన్న గుమస్తా! తన అధికారి చేతుల్లో ఒక కీలుబొమ్మ.

ఆ రోజు ప్రకాశరావు బసకు చేరుకొని తలుపు తియ్యగానే తలుపు సందులోంచి పోస్టు బంట్రోత్తు పడేసిన ఉత్తరం కనిపించింది. కవరు మీద వ్రాత అక్షరాలు చూడగానే  తన తండ్రి దగ్గరనుండి అని తెలిసింది. కవరు చించకుండానే ఊహించుకున్నాడు, ఆ ఉత్తరంలో ఏముంటుందో. ఉత్తరంలో పంక్తులకూ, తన ఊహలకు, తు. చ. తప్పకుండా సరిపోయింది. అందులో తన తండ్రి రాసిందంతా నిజమే. తనను ప్రతి నెలా ముప్ఫై రూపాయలకు తక్కువ కాకుండా ఇంటికి పంపమన్నాడంటే  అట్లా అడగడానికి తన తండ్రికి సంపూర్ణమైన హక్కుంది.  తమ రక్త మాంసాలోడ్చి బి. ఎ. వరకూ చదువు చెప్పించారే తన తల్లిదండ్రులు.  ఆ కాలంలో వారు రెండు పూటలా భోజనమైనా చేసేరో లేదో భగవంతునికెరుక. అటువంటప్పుడు అడిగించుకోకుండానే తనకై వాళ్ళు ఖర్చు పెట్టిన మొత్తాన్ని వడ్డీతో సహా తీర్చవలసిన బాధ్యత తనయందుంది. తను కూడా ఉద్యోగంలో చేరినది మొదలు శక్త్యానుసారం ప్రతి నెలా కొంత డబ్బు వెనకేసి ఇంటికి పంపుదామనే అనుకొంటున్నాడు; కాని, ఎప్పటికప్పుడే విఫలుడౌతున్నాడు. బెజవాడ లాంటి బస్తీలో తనకు వచ్చే జీతం ఇంటద్దెకూ, భోజనానికే సరిగా చాలదు. అందులోనే మిగిల్చి ఇంటికి పంపడమనేది సాధించలేని సమస్యగా తోచింది ప్రకాశరావుకి.

“ఉద్యోగం అన్న తర్వాత అంతో, ఇంతో పైగా దొరుకుతుంది. అదీ, నీ జీతమూ కలిపి అంతా నీ షోకులకే వెచ్చించెస్తే, ఇంకా ప్రయోజకులు కావలసిన నీ తమ్ముళ్ళూ, పెళ్ళిళ్ళు కావలసిన నీ చెల్లెళ్ళూ ఉన్నారు. వాళ్ళ గతేం కావాలి. నిన్ను చదివించి ప్రయోజకుణ్ణి చేసినందుకు కుటుంబానికి చేదోడుగా ఉంటావనుకున్నాము. కాని ఇలా పెడ మొహం పెడతావనుకోలేదు.”

ప్రకాశరావాపైని చదవలేక పోయాడు. కరిగిన నేత్రాల్లో కన్నీరు నిండింది. రాతంతా అలుక్కుపోయినట్లు కనిపించింది. చదువుతూన్న లేఖ అప్రయత్నంగా చేతి లోంచి జారి పోయింది.

తనని గురించి తండ్రి అర్థం లేని అపోహ పడుతున్నాడు. ఆయన చెప్పినట్లు, అవసరాన్ని వినియోగించుకొనే ప్రజలను పీడించి ధనం వసూలు చేయడం అట్టే కష్టమైన పని కాదు. తన తోడి

గుమస్తాలు అట్లా సంపాదించడం తను రోజూ చూస్తూనే ఉన్నాడు. కాని ఆ విధమైన ధనార్జనకు ప్రకాశరావు మనస్సెంతమాత్రమూ మొగ్గలేదు. అందుచేతనే తన తోడి గుమస్తాలు అతన్ని 'అప్రయోజకుడు' అన్నారు. అదే మాట ఇప్పుడు తన తండ్రి కూడా అన్నాడు. కాని అతని హృదయం 'అప్రయోజకుడు' అనిపించుకొన్నందుకు క్షోభించ లేదు. చిన్నతనం నుండీ తన నడవడికను గుర్తెరిగిన తన తండ్రి ఈనాడు కారణరహితంగా తన్ను గూర్చి అపోహ పడ్డందుకతని మనస్సు అపరిమితంగా పరితపించింది. ఈ సంక్షోభానికి కారణం తండ్రి అడిగిన మొత్తాన్ని నెలనెలా తను పంపడానికి అశక్తుడు కావడమే. ఇక ముందైనా ఆయన కోర్కెను సాధ్యమైనంతవరకూ నెరవేర్చాలి. అయితే అది ఎట్లా కొనసాగుతుంది? అన్యాయార్జితం పేరు చెబితేనే భయపడి ఆమడ దూరం పారిపోయే ప్రకాశరావుకి అదొక పెద్ద సమస్య అయిపోయింది.

ఈ పరిస్థితిలో కాలేజీలో తన సహాధ్యాయుడిగా ఉండే వెంకట్రావు సలహా తనకు కొంతవరకూ ఉపయోగపడిందనేచెప్పాలి. బందర్లో బి. ఎల్. పాసయి బార్ కౌన్సిల్ పరీక్షకి మద్రాసు వెళుతున్న వెంకట్రావుని యధాలాపంగా కలుసుకున్నాడు ప్రకాశరావు. రెండు సంవత్సరాలుగా మిత్రులిద్దరూ ఒకర్ని ఒకరు చూసుకోలేదు. గడచిన ఈ రెండు సంవత్సరాల్లోనూ పత్రికాలోకంలో రచయితగా పేరు సంపాదించేడు వెంకట్రావు. ఆ రచనలలోని కొస మెరుపులని చదివి తన్మయత్వం చెందినవారిలో ప్రకాశరావు ఒకడు. మిత్రుని రచనా నైపుణ్యాన్ని చూచి, అవగాహన చేసికొని వినోదించిన వారిలో అతడు ప్రథముడు. బహుకాలానికి స్నేహితుని చూసినందతని హృదయం చంద్రదర్శిత సాగరంలా ఉప్పొంగింది. మాటల సందర్భంలో ప్రకాశరావు పరిస్థితిని అర్థం చేసుకొన్నాడు వెంకట్రావు. తనకి తోచిన సలహా కూడా ఇవ్వకుండా ఉండలేక పోయాడు.

"ప్రకాశరావ్! నువ్వేమీ తెలివి మాలిన వాడివి కావు. మన మిత్ర బృందం అందరిలోనూ ఎక్కువ సాహిత్య జ్ఞానం కలవాడవు. ప్రయత్నిస్తే నువ్వు సాధించలేని పని ఉండదేమో. నీలో అజ్ఞాతంగా ఉన్న భావాల్నీ, శక్తుల్నీ పైకి తీసుకుని వస్తే నీవు కూడ పత్రికా ప్రపంచంలో ఒకనాడు ఉన్నత స్థానాన్ని ఆక్రమించగలవని నా దృఢ నమ్మకం. తద్వారా రచనా వ్యాసంగంలో పడి కొంతవరకూ నీ మనస్సు కలత పెట్టే ఆలోచనలకు దూరం కావచ్చు. ఇవి నేననుభవం మీద చెబుతూన్న మాటలు."

మిత్రుని వచనాల్లో ప్రకాశరావుకి కొంత సత్యం గోచరించింది. ఆతను చెప్పినట్లుగా తనెందుకు చెయ్యకూడదూ?... తన మస్తిష్కంలో మారు మూల అణిగియున్న భావాలకి ఒక రూపాన్నిచ్చి వెలుగులోకి తీసుకొని వస్తే హృదయం తేలిక పడుతుందేమో! "ఉన్నట్లుండి కలం పట్టుకుంటే రచయితవు కాగలవా?" అని అతని అంతరాత్మ అడ్డు తగిలింది. "అందరూ పుట్టగానే పేరు

మోస్తున్నారా?" అని సమాధానం చెప్పుకున్నాడు. తన తొలి ప్రయత్నాలు విఫలమైనా తనకు ఖాతరు లేదు. విఫల యత్నాలే తనకు అనుభవాన్ని కల్గిస్తాయి. కృషి చెయ్యడం తన వంతు. ఆ పైన అదృష్టాన్ని తీర్చి దిద్దేవాడు వేరే ఉన్నాడు.

ఆ రోజే తన నూత్న ప్రయత్నానికి నాందీ వాక్యం చదివేడు. రాత్రి ఆఫీసు నుండి రాగానే భోజనం వగైరాలు ముగించుకొని, కునుకుతూన్న కిరసనాయిలు దీపాన్ని పెద్దది చేసి, కలం చేత పట్టుకొని కాగితాల ముందు కూర్చున్నాడు. రాత్రి రెండు ఝాముల వరకూ మేల్కొని పూర్తి చేసిన తన తొలి రచనను చదువుకొనేసరికి అది తనకే వెగటనిపించింది. తన రచనలలో పటుత్వం లేక చించి పోగు చేసిన నిష్ఫలయత్నాల చిహ్నాలు తన్ను చూచి పళ్ళికిలిస్తున్నట్లు గోచరించింది. దానితో అతడు విసుగు చెందేవాడే కాని సాయంత్రం తాను "నిష్ఫల యత్నాలే అనుభవానికాధారం" అని ధైర్యం చెప్పుకొన్న మాటలు జ్ఞాపకానికొచ్చేయి.

ప్రతిరోజూ రాత్రి తొమ్మిది మొదలు, సగం రాత్రి గడిచేవరకూ కథా రచన చెయ్యడం  అతని కాలకృత్యం అయిపోయింది. కొన్నాళ్ళ వరకూ అతని అన్ని రచనలకూ పత్రికలు స్వాగతం ఇవ్వ లేకపోయినా కొన్ని రచనలనైనా మెచ్చుకొని ప్రకటించేవి. ప్రకటింపబడిన రచనలతనికి ప్రోత్సాహాన్నిచ్చేవి. ఆ ప్రోత్సాహం కొత్తరచనలకు దోహదమిచ్చేది. ఇలా కొద్ది రోజుల్లోనే అతడు పత్రికాలోకానికి పరిచితుడైపోయాడు.

ఇప్పుడతని రచనలు ప్రకటింపబడకపోవడం లేదనే కంటె ప్రకటనార్హం కానిది లేదనడం సమంజసంగా ఉంటుంది. ఇది ఇప్పుడతనికి మరొక విధంగా కూడా ఉపకరిస్తోంది. ఆతని రచనలకు తగిన విలువ కాకపోయినా, పత్రికాధిపతులు అప్పుడప్పుడు కృతజ్ఞతా పూర్వకంగా పంపే చిన్న చిన్న మొత్తాలు చేతికొచ్చేవి. తన్మూలకంగా ఇప్పుడు తండ్రికి కొద్దిగానో, గొప్పగానో డబ్బు పంపగల్గుతున్నాడు.

తన రచనా వైచిత్రిని చూసి ప్రజలు ముగ్ధులై హర్షించిన కొద్దీ అతనిలో మేధోవాంచ సారస్వతంలో ఇతోధిక కృషికి ప్రోత్సహించడం మొదలుపెట్టింది. తనకు కూడా శ్రమకు తగ్గ ఫలితం ఉన్నందున అతడా ప్రోత్సాహాన్ని నిరాకరించలేదు.

ఈ కొద్ది కాలంలోనూ అతడు ఉత్తమ శ్రేణికి చెందిన రచనలను వ్రాయడానికి మేల్కొని శ్రమించిన రాత్రులు వేళ్ళమీద లెక్కింప తగినవి కావు. పగలు తీరిక లేక, రాత్రులు నిద్ర లేక అతని ఆరోగ్యం బాగా దెబ్బ తింది. ఆతన్ని పరీక్షించిన డాక్టరు నిద్రలేమి వల్ల కలిగిన 'నూరాగ్లియా' అని రోగనిర్ణయం

చేసాడు. తగినంత నిద్ర, విశ్రాంతి రోగికి ముఖ్యావసరాలుగా పాటించాలనీ, లేకపోతే చాలా ప్రమాదమనీ హెచ్చరించేడు. ఇప్పుడతనికి మరొక సమస్య ఎదురైంది.

తనీ మాసంలో జాగ్రత్త చెయ్యగల్గిన కొద్ది మొత్తాన్నీ డాక్టరు ఫీజు కింద ఇవ్వడానికే సరిపోతుంది. అయితే తండ్రికి పంపడమెలా? మళ్ళా నిష్టురోక్తులతో నిండిన లేఖ రాక కోసం ఎదురు చూస్తూ ఉండవలసిందేనా? ఈ ఆలోచనలతని మనస్సును కొంతవరకు కలవరపరచాయనే చెప్పాలి.  ఆ సమయంలో మిత్రుడు వెంకటరావు వద్దనుండి వచ్చిన ప్రోత్సాహకరమైన ఉత్తరం అతనికి కొంత ఉత్సాహాన్ని కలిగించింది. వెంకట్రావు తన రచనలని చదివినట్లూ, అవి చాలా ఉత్తమంగా ఉన్నట్లూ మెచ్చుకున్నాడు. ఆలిండియా రేడియో శ్రవ్యనాటకముల పోటీలో తనను పాల్గొనమనే సూచన కూడా ఉందా ఉత్తరంలో. ఆ సూచనని అర్థం చేసుకున్నాడు ప్రకాశరావు.

రేడియో నాటకాల పోటీకి భావ సామగ్రిని కూర్చుకొనేసరికి కొన్ని దినాలు పట్టింది. డాక్టరు చెప్పిన మాటలు మరచి, ఒకే దీక్షతో నడిరాత్రి వరకూ తన రచనలలో మునిగి ఉండడం వలన అతనికి నరాల్లో పూర్తిగా బలహీనత వచ్చేసింది. నిల్చుంటే కాళ్ళు వణికి కూలబడిపొయ్యే పరిస్థితికి దిగజారింది ఆరోగ్యం. నాటికలను పంపవలసిన నిర్ణీత దినం దగ్గరకొస్తున్నాది. కాని అతడు కలం పట్టే స్థితిలో లేడు. అంతవరకూ అద్భుతంగా తయారైన తన రచనను ఆ స్థితిలో అసంపూర్ణంగా వదలి పెట్టడానికి అతని మనస్సు అంగీకరించలేదు. ఇక నొక్క రాత్రి కూర్చుంటే దానిని పూర్తి చెయ్యవచ్చు.  ఎట్లాగైనా ఆ రాత్రి రచనను పరిపూర్తి చేయ నిశ్చయించుకున్నాడు. అనుకున్నట్లే పూర్తి చెయ్యగలిగేడు కూడా.

తాను వ్రాసిన దాన్ని ముందతడు చదువుకొని తృప్తి పడితేనే గాని ప్రచురణార్థం పంపడం అలవాటు లేని అతను ఆ నాటికని మొట్టమొదటిసారిగా చదువుతూన్నప్పుడు తనే ముగ్ధుడు కాకుండా ఉండలేక పోయాడు. అతని రచన భావ వైచిత్రిలో లోపం కనబర్చలేదు. పాత్ర పోషణలో పటుత్వం తప్ప లేదు. కల్పనాశక్తిలో కల్ల  కనబడలేదు….. ఇక తుది రంగం చదవడం పూర్తి చెయ్యాలి. అంత రాత్రి వరకూ మేల్కొనడం వల్ల అప్పటికే అతని కళ్ళు జ్యోతుల్లా తయారయేయి. నరాల్లో శక్తి పూర్తిగా నశించింది. పటుత్వం తప్పిన చేతుల్లోంచి చదువుతూన్న కాగితాలు జారి కింద పడి గాలికి రెపరెపకొట్టుకుంటున్నాయి. కిరసనాయిలు అయిపోయిన దీపం ఒక్కసారి విజృంభించి ఆరిపోయింది.

ఉదయాన్నే లేచిన తర్వాత నాటికని పోస్టు చేసి, చికిత్స కోసం ఆ దారినే ఆసుపత్రికి వెళ్ళి అక్కడే చతికిల పడ్డాడు. డాక్టరు ఆసుపత్రిలో చేర్చుకున్నాడు కాని పెదవి విరవక తప్పలేదు.

+ + +

“ఆలిండియా రేడియో శ్రవ్యనాటకముల పోటీలో ప్రథమ బహుమతి పొందిన శ్రీ ప్రకాశరావు గారు కీర్తిశేషులు కావడం వలన, ఆ బహుమతిని ఆయన తండ్రి గారైన మీకు పంపడమైనది. దీనితో జత చేసిన ఐదువందల రూపాయల బ్యాంకు చెక్కు మీకందిన వయినం తెలియజేయగలరు – కార్యదర్శి”

స్టేషన్ డైరక్టర్ కార్యాలయం నుండి వచ్చిన ఉత్తరం ప్రకాశరావు తండ్రికి తమ కుమారుని మృతిని జ్ఞాపకం తెచ్చింది. తన కన్నీటి బిందువులలో కరిగిపోతూన్న చెక్కు మీద అలుక్కు పోయిన అంకెలు తన భావి జీవితాన్ని సూచించినట్లు తోచింది. చేతిలోంచి జారి కింద పడిపోయిన చెక్కు ముందడుగు వేసిన అతని పాదాల కిందపడి నలిగి పోయింది – ప్రకాశరావు జీవితానికి మల్లే.

తక్షశిలా నగర చారిత్రక పరిణామం (ప్రాచీన భారతపు ఏథెన్సు)
(ఆంధ్రపత్రిక, 27 నవంబరు 1949.)
(రూ 10/= పారితోషికం ఇచ్చేరు)

శతాబ్దాలనాటి మాట. మధురమైన చరిత్రాంశాలని మననం చేసికొంటే జ్ఞప్తికి వస్తుంది. రెండు అపార సేనా వాహినులు ముఖా ముఖీ నిల్చున్నాయి పోరాటానికి. రెండు పక్షాల చతురంగ బలాలూ ఢీకొనడానికి సిద్ధంగా ముందడుగు వేస్తున్నాయి. ఎక్కడ చూసినా నిశ్చల గంభీరత్వం తాండవిస్తూంది. ఇరు కక్షలలోని సైనికులూ తమ తమ యజమానుల అనుమతిని సూచించే శంఖ నాదానికి చెవులు రిక్కించి నిరీక్షిస్తున్నారు.

అటువంటి సమయంలో వీక్షించినంతనే పూజ్యుడని తెలుసుకోదగిన యోగి పుంగవుడొకడు ఢీకొంటూన్న రెండు సేనల మధ్యనూ అవతరించి, సుదీర్ఘమైన తన బాహు ద్వయాన్ని విస్తరించి, ఆజ్ఞాపూర్వకమైన గంభీర స్వరంతో, “ఆగండి” అంటూ అడ్డు పడ్డాడు.

“భారత్ కి జై!”, “బహుబలికి జై!” అని కర్ణ పుటాలని బ్రద్దలు చేసే జయ నినాదాలు రెండు సేనా వాహినులనుండీ ఒక్క సారి విజృంభించి ఆగిపోయినయ్! లక్షలాది వీరుల నేత్రాలన్నీ ఆ క్షణాన ఇరు సైన్యాలకూ మధ్య నున్న నూతన వ్యక్తిపై కేంద్రీకరింపబడ్డాయి. భరతుడూ, బలీ తమ తమ ఉన్నతాశ్వాలనుంచి నేల కురికి ఋషీశ్వరుని ధూళి దూసరిత పాదాలని స్పృజించి పూజించే వరకూ సేనలలో నలుదిశలా ఆవరించిన విస్మయం సడల లేదు.

“అయితే మీరుభయులూ హేయమైన యుద్ధాన్ని ప్రారంభించి రక్త పాతం కలుగజెయ్యడానికి సర్వసన్నద్ధులై ఉన్నారన్నమాట. మిమ్మల్ని ఈ పనికి ప్రేరేపించిన కారణాలని దయచేసి విశదీకరించగలరా?” నమ్రతగానే ప్రశ్నించేడు యోగి.

“నా గౌరవాన్ని కాపాడుకొనే నిమిత్తం స్వామీ!” అంజలి ఘటించి అతి వినయంగా జవాబిచ్చేడు భరతుడు. “బలి నా ఆజ్ఞ ఉల్లంఘించి రాచ మర్యాదకే భంగం కల్గించేడు.”

“నీ తుచ్ఛమైన ఆజ్ఞకి నేనెందుకు బద్ధుణ్ణి కావాలి? నీవు గీసిన గీటు దాటకపోవడానికి నేను నీ చేతులలో కీలుబొమ్మను కాను. నీవు నాకగ్రజుడవే కావచ్చు. కాని నాకు కూడ మాన మర్యాదలూ, మానవ సహజమైన వాంఛలూ ఉన్నాయి.” పౌరుషంగానే జవాబిచ్చేడు, బలి.

“అయితే మిమ్మల్ని ఇద్దరినీ రచ్చ కీడ్చినది వ్యక్తిగత భేదాభిప్రాయాలే కాని రాజ్యానికి సంబంధించిన విషయమేదీ  కాదన్నమాట. ఇది మీ ఉభయుల వ్యక్తిత్వాలకి సంబంధించిన సమస్య కనుక, అమాయకులైన ప్రజలకు సంబంధం లేకుండా, మీరిద్దరే మీమీ బాహుబలాలలతో ఎందుకు పరిష్కరించుకోకూడదు?”

భరతుడూ, బలీ ఒకరి మొహాలొకరు చూసుకొని ముని ప్రస్తావించిన సూచనకి ఆమోదించేరు. వెంటనే ద్వంద యుద్ధానికి సర్వ సన్నాహాలూ చెయ్యబడ్డాయి. ఈ సంఘటనకు సంభ్రమాశ్చర్యాలు సమ పాళ్ళల్లో మిళితం చేసుకొని కలవర పడుతూన్న సైనికులు తాము దూసిన ఖడ్గాలని ఒరల్లో భద్రపరచి పరిధ్యాకార యుద్ధభూమిని పరివేష్టించి విస్తుపోయి చూడసాగారు.

రణ దుందుభులు మ్రోగాయి. ద్వంద్వ యుద్ధానికి తలపడి వాలి సుగ్రీవులలా పోరాడుతున్న సోదరులలో జయలక్ష్మి ఎవర్ని వరిస్తుందో మొదట్లో చెప్ప వశం కాలేదు. ఒక సారి భరతుడు విజృంభిస్తున్నాడు. మరొక సారి బలిది పై చేయి అవుతూంది. చివరకి బలి తొడ చరిచి, భరతుణ్ణి రెండు చేతులా మీదికెత్తి నేలకి విసిరికొట్టేడు. సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయిన బలి పక్షీయుల తల పాగలు ఒక్క క్షణం మీది కెగిరి గాలిలో నాట్యం చేశాయి! జేత దురహంకారం విచిత్రంగా మారిపోయింది. ప్రేక్షకులు గమనించే లోగా బలి, వీగిపోయిన భరతుణ్ణి లేవనెత్తి భ్రాతృ వాత్సల్యంతో అక్కున చేర్చుకున్నాడు. ప్రజల హర్ష ధ్వనుల మధ్య రాజధానీ నగర సింహాసనాన్ని అగ్రజనికి అంకితం చేసేడు. ఆ రాజధానే చారిత్రాత్మకమైన తక్షశిల!

అపూర్వమైన తమ ప్రభువుల ఈ సఖ్యతని చూసిన ప్రజలు సంతోషంతో ఊగిసలాడి సంబరాలు చేసుకొన్నారు. రధ, గజ, తురగ, పదాతి వర్గాలతో కూడిన ఊరేగింపు కన్నులపండువైంది. దంతావళం మీద అమర్చిన ఉన్నతాసనం మీద ఆసీనులై బలి, భరతులిరువురూ, వందిమాగధులు కైవారాలు చేయగా, పురోహితుల ఆశీర్వాదాలు పొందుతూ, శంఖారావాలతో, మంగళ ధ్వనుల మధ్య రాజధాని తక్షశిలకు పయనమయేరు. ఆ కారణాన్ని పురస్కరించుకొని, తక్షశిలలో ఒక వారం రోజులు ఉత్సవాలు జరిగేయి.

**విద్యానిలయము:**

ఈ సంఘటన జరిగిన చాల కాలం తర్వాత, అనగా క్రీ. పూ. నాల్గవ శతాబ్దంలో, బుద్ధ దేవుని సూక్తులు మెల్లగా మన్ననలందుకొని ఆచరింపబడుతూన్న సమయంలో, ఒకనాడు ప్రాతఃకాలాన్నే లొట్టియ ఒకటి తక్షశిల పశ్చిమ ద్వారాన్న నిలచింది. ద్వార పాలకులు ద్వారం తెరచి ఆ జంతువుని లోనికి ప్రవేశపెట్టేరు. హిందూ మత ధర్మాలనూ, వైద్య విద్యనూ అభ్యసించడానికి ఆ ఒంటె పైనున్న చీనా దేశపు బాటసారిని ఆ నగరవాసులు మొదట ఉద్వేగంతో చూశారు. తరువాత ఉత్సాహంతో ఆహ్వానించేరు.

ఆ కాలంలో తక్షశిల విశ్వవిద్యాలయము వివిధ ప్రదేశాల నుండి వచ్చిన యావన్మంది విద్యార్థులకూ ఆహ్వానమిచ్చేది. ఆ విశ్వవిద్యాలయంలో అప్పటి విద్యార్థుల సంఖ్య రమారమి పది వేలు! విద్యార్థులకు ఉచితమైన వసతి గృహములూ, ఆహారాది విషయాలన్నింటిలోనూ అధికారులు అమితమైన శ్రద్ధ చూపేవారు.

అంతకు పూర్వమెన్నడూ హిందూదేశపు విద్యా సంస్థను చూడని చైనా దేశపు విద్యార్థి అయిన సూన్ సాన్ నిత్యకల్యాణం, పచ్చతోరణంగా ఉండే ఆ విద్యాలయాన్ని చూసి విస్తుపోయాడంటే అది అతిశయోక్తి కాదు.  పట్టణము లోని కట్టడముల రమణీయత, కథలుగా చెప్పుకోడానికి సరిపొయ్యే భాగ్య సంపద, అపారమైన జనసంఖ్యతో అలరారే పట్టణం ఎవర్ని చకితుల్ని చెయ్యదు? పాడి పంటలకు కరువు లేదు. నగరవాసులు విలువైన దుస్తులు ధరించి తిరిగేవారు. వాణిజ్యం అతి చురుకుగా సాగేది…. కాని మెరిసే విద్యుల్లత వెనుక దాగున్న కారు మేఘంలా …వివాహము కాని బీద పిల్లలని బహిరంగానే వేలం వేసే సన్నివేశములు అతన్ని కలచివైచాయి. మృత కళేబరాలు గద్దల పాలు కావడం చూచి కటకట పడ్డాడు.

**కొన్ని సంవత్సరముల అనంతరం ….**

గుర్రపు డెక్కల చప్పుళ్ళ చేత, రథ చక్రాల శబ్దాల వలన తక్షశిల నగరవాసులొకనాడు ప్రాతఃకాలాన్నే మేల్కొలుపబడ్డారు. నగరం ముట్టడింపబడిన సూచనలు కనుపించేయి. ఆ కాలంలో తక్షశిల పాలకుడగు అంభికి తూర్పు దిశను పురుషోత్తముడు, పశ్చిమాన అభిసారుడూ ప్రక్కలోని బల్లెములై ఉండేవారు. వారిరువురిలో ఎవరో ఒకరు పట్టణముపై దండు విడిసి ఉండవచ్చును.

కాని, చక్రవర్తి అంభి నాయకత్వము క్రిందనే నగరమునాక్రమించిన యవన సేనలను చూచినప్పుడు ప్రజల భయము ఆశ్చర్యము క్రింద మారింది. పురుషోత్తముని జయించుటకు అంభి యవన చక్రవర్తి అయిన అలెగ్జాండరుకు అమ్ముడు పోయాడనే వార్త అంటురోగంలా వ్యాపించింది. సోదర రాజనకు ప్రతికూలంగా పరదేశీయునితో కలసిన అంభి చర్యని ధీమంతులు బహిరంగంగా ఖండించేరు. కాని ప్రబలిన అశాంతిని యవన సేనలు వేగంగానే అణచి వేశాయి.

పురుషోత్తముని ఎదుర్కొన్నప్పుడు మాత్రం అలగ్జాండరుకి  అంభి యొక్క విభీషణ సహాయం లభించింది.  చరిత్రకారులు ఈ విషయంలో కళ్ళు మూసుకుంటే మూసుకొనవచ్చును. కాని పురుషోత్తముని ఓటమి ముఖ్యంగా అతని చేతకానితనం వల్ల అయినా కాకపోయినా, సోదర రాజగు అంభి ద్రోహం మాత్రం ఖచ్చితంగా దోహదం చేసింది.

కాని లొంగిపోయిన శత్రువుతో అలగ్జాండరు చాల దూరదృష్టితో మైత్రి చేసుకొన్నాడు. అంభి తన ద్రోహ బుద్ధికి బహుమతిగా తక్షశిలని పొందేడు.

**బుద్బుదప్రాయపు శోభ:**

అలగ్జాండరు సముపార్జించుకొన్న ప్రఖ్యాతి అతనితోనే అంతమైపోయింది. బాబిలోనియాలో అలగ్జాండరు చనిపోగానే యవన సేనలు సింధునదీ పరిసరాల్లోంచి చంద్రగుప్తుని సేనలచే తరిమివేయబడ్డాయి. తక్షశిల కోట బురుజులపై మౌర్య పతాకం రెక్కలు విప్పింది. హిందూ రాజుల శక్తి సామర్థ్యాలు మరొక సారి పడగలు విప్పేయి. చంద్రగుప్తునికి కాకతాళీయంగా రాజ్యాంగ తంత్ర నిపుణుడైన చాణక్యుని మంత్రిత్వం లభించడం అతని అదృష్టమనే చెప్పాలి. చాణక్యుడు తక్షశిల పర రాజులచే ముట్టడింపబడనున్నదని పసిగట్టేడు. స్వరాజ్య రక్షణకు నిరంకుశత్వం చాల ముఖ్యమని దాని కొరకు సర్వ విధాలా పాటు పడి ఒక్క అజేయ శక్తిని నిలప దల్చుకొన్నాడు. చాణక్యుని ధీ శక్తి వల్ల చంద్రగుప్తునికి రాజ్య విస్తరణము చాల సులువైంది. రెండు సంవత్సరాలలోనే మౌర్య రాజ్యపు సరిహద్దు హిందూకుష్ పర్వతాల వరకూ పెరిగింది. యవనులు రాజ్యం చేసిన చిహ్నాలు దేశం నుండి శాశ్వతంగా తుడిచివేయబడ్డాయి. ఒక దశాబ్దం గడచిన అనంతరం సెల్యూకస్ నికేటర్ అనే యవన నాయకుడు అలగ్జాండరు చేత జయింపబడ్డ  భాగాన్నంతా మరల తన చేతిలోనికి తెచ్చుకుందామని ప్రయత్నించేడు. కాని గర్వభంగమై, చంద్రగుప్తునితో సంధి చేసికొనవలసి వచ్చింది. వ్యవధి లేకుండా మారే ఈ పరిపాలనా పద్ధతులకు ప్రజలు తట్టుకోలేక బిందుసారుడు సింహాసనాన్ని ఆక్రమించిన తక్షణం తిరుగుబాటు చేసేరు.

రాజ్యంలో అరాజకం ప్రబలింది.  ఇళ్ళు తగులబెట్టిన నేరాల సంఖ్య రోజరోజుకూ పెరిగింది. రాజ ప్రాసాదాలూ, కచేరీలూ నేలమట్టం చెయ్యబడ్డాయి.  నిష్కారణ హత్యలు అంతు లేకుండా జరిగేయి. విప్లవ జ్వాలలను చల్లార్చడానికి మహా సైన్యంతో వెళ్ళిన బిందుసారుని జ్యేష్టపుత్రుడు సుషీం భంగపడి తిరిగి వచ్చేడు. చివరకు తక్షశిలలో రాజ ప్రతినిధిగా ఉన్న అశోకుడు విప్లవకారులను లోబరుచుకొని మౌర్య రాజ్య సింహాసనాన్ని విప్లవ జ్వాలలకి గురి కాకుండా కాపాడగలిగేడు.  ఇతడే హిందూ దేశంలో బౌద్ధ మత ప్రచారానికి పునాది వేసిన మొదటి రాజు. మగధ రాజ్యంలో తక్షశిల కూడ ఒక ముఖ్య నగరమైంది. రాజవంశం లోనివారు ఇక్కడనే ప్రధాన భూమికలను నిర్వహించేవారు. అశోకుడు స్థాపించిన బౌద్ధ స్థూపాలలో చాలా తక్షశిలలోనే వెలసేయి. పేరెక్కిన కుణాలుని స్థూపం ఇక్కడిదే!

**కుణాల స్థూపము:**

కుణాలుడు సౌందర్య మూర్తి. ఇతడు అశోక చక్రవర్తి కుమారుడు. గంధర్వులను సహితము సమ్మోహితులను చెయ్యగలిగే సంగీతము, దానికి తగిన కంఠ మాధుర్యమూ ఈతనిలోని ప్రత్యేకాకర్షణలు. అశోకుని చిన్న రాణి తిష్యరక్షిత ఈతని సౌందర్యానికి మురిసి ముగ్ధ అయింది. అతనిని వలచి వలపించుకొందామని అనుకొంది.  యుక్తాయుక్తాలను మరచింది. పుత్రుడైన కుణాలుని చేత మరపింప ప్రయత్నించింది. కాని కుణాలుడీ తుచ్ఛపు పనికి తల ఒగ్గ లేదు. దెబ్బ తిన్న పాములా పగ పట్టింది, రాణి. ఆమెలో కుణాలుని నాశనం చూడాలనే నీచపు కాంక్ష అంకురించింది. ఆ కోపమే అతనిని తక్షశిలకు రాజ ప్రతినిధిగా పంపించి వేయడానికి దోహదం చేసింది.

తరువాత తక్షశిలలో ఉండే సేనాధిపతికి చక్రవర్తి పేరున రాజముద్ర వేసి తిష్యరక్షిత ఆజ్ఞాపత్రం పంపించింది. కుణాలుని కను గుడ్లు తక్షణం పీకివేయవలసిందనీ, లేని యెడల అతని క్రూర దృక్కులు ఏ స్త్రీ వైపైనా పడవచ్చునీ ఆ ఆజ్ఞా పత్రపు పాఠం. యువరాజు కనుగుడ్లను బలవంతాన పెరికివైచి అతని అరచేతులలో ఉంచినపుడు తక్షశిల ఒక అపూర్వ దుఃఖానుభూతిని పొందింది.

యువరాజు కొన్ని సంవత్సరాలు దిక్కులేని పక్షిలా తిరిగి తిరిగి చివరకు మగధ చేరుకొన్నాడు. జరిగిన ఘోర కృత్యం చక్రవర్తికి తెలిసి మండిపడ్డాడే కాని, క్రూరురాలైన భార్యని శిక్షించలేకపోయేడు.  క్రూర కృత్యం జరిగిన చోట కుణాలుని పేరు చిరకాలం నిలిచేలా బ్రహ్మాండమైన స్థూపాన్నొకటి మాత్రం నిర్మించగలిగేడు. ఒకని పేరున స్థూపాన్ని ప్రతిష్ట చెయ్యడంలో  ఆ వ్యక్తిని అపరిమితంగా గౌరవించినట్లు భావించేవారు బౌద్ధులు. కుణాలుని స్థూపాన్ని నిర్మించడానికి వేలకొలది నేర్పరులైన పనివారు రాత్రింబవళ్ళు పని చేశారు. ఈ స్థలానికి విచ్చేసి, ఈ స్థూపానికి మొక్కిన అంధులకు బుద్ధ దేవుని కృప వలన దృష్టి కలిగినట్లు అనుశ్రుతంగా చెప్పుకు వచ్చే కథలనిప్పటికీ మనం వింటున్నాం.

**ఇతర ఆక్రమణలు:**

అశోకుని మరణానంతరం ఆకలిగొన్న నక్కలలా ముఠాలు ముఠాలుగా వచ్చి పరదేశీయులు తక్షశిలనాక్రమించుకొన్నారు. ఈ విశాల సామ్రాజ్యానికి ఏనాడో యవనుల దృష్టిదోషం తగిలింది. సెల్యూకస్ కాలంలో తాము పొందిన అవమానాన్ని పురస్కరించుకొని వారిలో రగులుకొన్న విద్వేషాగ్ని ఇంకా ఆరిపోలేదు. దినదినమూ శక్తి తగ్గి క్షీణిస్తూన్న తక్షశిలనూ, పరిసర సామంతరాజ్యాలనూ యవనులు డిమీట్రియస్  నాయకత్వం కింద సుళువుగానే లోబరచుకొన్నారు. ప్రసిద్ధమైన హారో లోయ కళాపిపాసులైన వీరినాకర్షించింది. తన్మూలకంగా ఈ లోయలో వీరి చేతి పనితనానికి చిహ్నాలు ఎన్నో వెలిశాయి. వీరి కాలంలోనే రాజనగరు తక్షశిల నుండి సిర్కప్ కు మార్చబడింది. ఈ యవనులు ఒక శతాబ్దం కంటె ఎక్కువ కాలం రాజ్యం చెయ్యలేదు. వీరి తరువాత సిదియనులు, కుషానులూ రాజ్యాన్ని ఆక్రమించుకొన్నారు.

**సామ్రాజ్య పతనము:**

క్రీస్తు వెనుక అయిదవ శతాబ్దపు మొదటి సంవత్సరాలలో తక్షశిల పూర్తిగా నాశనం చెయ్యబడింది. గుంపులు గుంపులుగా వచ్చి దేశాన్ని ఆక్రమించుకొన్న హూణులు పశువుల కంటె నీచంగా ప్రవర్తించేరు. మారణాయుధాలతో విజృంభించేరు.  ఇళ్ళు తగులబెట్టేరు. స్థూపాలనూ, రాజ ప్రాసాదాలనూ నేల మట్టం చేశారు. గుప్తుల కాలంలో నెలకొల్పబడ్డ శోభ వీరి పశుత్వానికి బలి అయింది. సామ్రాజ్య శోభ పతనమైంది. ఒకనాడు ఉత్కృష్టమైన కళా సంపదతో వెలసిన హారో లోయ దయ్యాల కొంపలా మారి పోయింది. హూణుల పిశాచ కృత్యాలకు బలియై శిధిలాలుగా మిగిలిన పట్టణాలను చూసి హిందూ దేశానికి వచ్చిన చీనా దేశపు బాటసారి, హుయాన్ త్సాంగ్ చెప్పలేని వ్యాకులత చెందేడు. శిధిలాలలోంచి తొంగి చూసే పూర్వపు ఔన్నత్యాలని ఊహించుకొని కంట నీరు పెట్టుకొన్నాడు. భయంకర భూకంపాలకు కూడా పట్టణం అంతలా శిధిలం కాదేమో. పూర్వం చక్రవర్తులు నివశించిన భవనాలలో ఇప్పుడు గబ్బిలాలు నివాసమేర్పరచుకొన్నాయి.

మగధ రాజ్యపు ఔన్నత్యము ఒక స్వప్న కథయై మాత్రం నిలబడింది. పాకిస్తాన్ ముఖ్యపట్టణమైన ఇస్లామాబాదుకి దగ్గరలో ఉన్న ఈ తక్షశిలలో ఇప్పుడు శిలలు మాత్రమే మిగిలాయి!

(Based on Taxila by “Devadatta”)

# పిల్లనగ్రోవి

(ఆంధ్ర పత్రిక, ఆదివారం సంచిక, నవంబరు 27, 1949)

ఊరి కొసనుండే రహమాన్ దుకాణం చాల మందికి తెలియదు. రహమాన్ చచ్చిపోయిన తర్వాత ఆ దుకాణం ఎప్పుడూ తెరవబడ లేదు. అతను నాతో చాలా చనువుగా ఉండేవాడు. అతని చారల పైజమా, ఊలు టోపీ, కాళ్ళకి రెండంగుళాల దళసరి చెప్పులూ, పెదాల మీద ఎప్పుడూ ఒక చిరునవ్వూ – ఇప్పటికీ కళ్ళకి కట్టినట్లు కనిపిస్తాడు.

ఏదో ప్రాముఖ్యత గల పురాతన వస్తు సామగ్రిని సేకరించి జాగ్రత్త చేసే అలవాటుండేది నాకు అప్పట్లో. అప్పుటప్పట నేను కొని, సేకరించి, భద్ర పరచిన వస్తు జాలాన్ని చూసి గర్వ పడుతూ ఉండేవాణ్ణి కూడా. రహమాన్ కి ఒకటి రెండు సార్లు వాటిని చూపించే. అతను కూడ చాల కుతూహలంగా కొన్ని వస్తువుల తాలూకు పాత చరిత్రలు అడిగి తెలుసుకొనేవాడు. అతనికి ఇటువంటి కథలు వినడం అంటే బహు ప్రీతి. నా కథలెంత ప్రీతిగా వినేవాడో, కొత్త కొత్త వింత కథలని చెప్పడంలో అంత నేర్పుండేదతనికి. అందుచేత ఉబుసుపోకకి అతని దుకాణం అరుగు మీద కూర్చుని అతడు చెప్పే కథలనాలకించేవాడిని.

ఒకనాడు రహమాన్ దుకాణంలో సామానులు ఒకటీ, ఒకటీ తీసి దుమ్ము దులుపుకొంటున్నాడు. అక్కడే కూర్చుని ఇటూ, అటూ పరికిస్తూన్న నా దృష్టి ఓ పిల్లనగ్రోవి మీద పడింది. అది చేత పుచ్చుకుని పరకాయించి చూశా. ఎందుకూ పనికిరాని స్థితిలో, నిలువుగా పగులేసి ఉంది. అక్కడక్కడ చిన్న చిన్న ముక్కలు ఊడిపోయాయి కూడా. దాని మీద విస్తారంగా నీటి మరకలు, బురద మరకలూ కూడ ఉన్నాయి.

రహమాన్ నా వైపు చూసి, "భాయీ! చూడు, దాన్ని తప్పకుండా నువ్వు సేకరించే వస్తు సముదాయంలో చేర్చాలి," అన్నాడు.

"ఏం? ఎందుకని? దానిలో ఏం గొప్పతనముందని దాన్ని జాగ్రత్త చేయాలంటావు? ఇది ఎందుకూ కొరగాకుండా పగిలిపోయి పాడయిపోయింది."

రహమాన్ ఒక్క సారి కళ్ళు చిట్లించేడు. కాని, వెంటనే అతని ముఖం మీద చిరునవ్వు నాట్యం చెయ్యడం మొదలు పెట్టింది. "అట్లా అడుగు. చెబుతాను. ఆ వేణువులో ఉన్న గొప్పతనం ఏమిటో

తెలుసా? దాని చరిత్రలో ప్రేమ, నిరాశ, ప్రతీకారం, దుఃఖం ఇమిడి ఉన్నాయి. దాని మీద ఏమని రాసుందో చూడలేదా?"

కళ్ళింతలేసి చేసి దాని మీద ఉన్న ఉర్దూ అక్షరాలని తడబడుతూ, కూడబలుక్కుంటూ చదువుతూ ఉంటే, రహమాన్ అడ్డొచ్చి, "పారశీకం నీకు అర్థం కాదా?" అన్నాడు.

చదువుతూన్నది ఉర్దూ కాదని తెలియగానే పరిశ్రమని విరమించుకుని, "దానికేం గానీ, ఈ మాటల అర్థం ఏమిటో చెబుదూ" అన్నా.

నా చేతిలోని పిల్లనగ్రోవిని తీసుకొని, దాని మీద ఉన్న అక్షరాలని చదివి అర్థం చెప్పేడు....

"ప్రియమైన సలీం కు సమర్పించుకొన్న ప్రేమ కానుక. ఈ పిల్లనగ్రోవి మనిద్దరినీ, ఈ లోకం లోనూ, పరలోకం లోనూ కూడా ప్రేమ పాశంతో బంధించి ఉంచాలని కో...నీ ప్రియురాలు ఫారనాక్," అని అతడు రుద్ధ కంఠంతో చదువుతూ ఉంటే అతని కళ్ళల్లో నీరు చిమ్మడం స్పష్టంగా కనిపించింది.

"రహమాన్! ఏమిటి సంగతి?" అని మాత్రం అనగలిగాను, రుద్ధ కంఠంతో.

ఇప్పుడతని ముఖం కొంచెం తేటబడింది. "సలీం నా ఏకైక పుత్రుడు," అని నా వైపు చూశాడు, బరువుగా ఊపిరి విడుస్తూ.

"అట్లాగా" అన్నాను, పిల్లనగ్రోవిని పక్కని పెడుతూ.

"అవును. ఆ సంగతి పూర్తిగా చెప్పనీ. నా గుండె బరువు కొంతైనా తగ్గుతుంది," అంటూ చెయ్యి పట్టుకుని ఆ పక్కనే ఉన్న చిన్న గదిలోకి తీసుకెళ్ళేడు.

+ + +

"అప్పుడు మేము పారశీక దేశంలో ఒక చిన్న కుగ్రామంలో ఉండేవాళ్ళం. మా జీవితం అక్కడ చాల సాఫీగానే గడచిపోయేది – దొంగల గుంపులు అప్పుడప్పుడు మా పల్లెల మీద దండెత్తే సమయాల్లో తప్ప. అప్పటికి సలీం ఇంకా చాలా చిన్న కుర్రాడు. పక్కింటి అల్లీఖాన్ కూతురు ఫారనాక్ తో కలిసి రోజూ బడికి పోతూండేవాడు. కాని వాడికి చదువు కంటె సంగీతం మీద మోజెక్కువ అని గ్రహించిన నా భార్య, సలీంని సంగీత శాస్త్రంలో ప్రావీణ్యుడిని చెయ్యాలని తహతహలాడేది. తల్లిని అండగా చేసుకొని,

అసలు చదువులో పూర్తిగా శ్రద్ధని తగ్గించేసి, వాడు సంగీతంలోనే ఎక్కువ కృషి చెయ్యడం ప్రారంభించేడు.

“అల్లీఖాన్ వడ్రంగి పని చేసి జీవించేవాడు. పిల్లనగ్రోవులు చెయ్యడంలో మాత్రం అతనిది అందె వేసిన చెయ్యి."

“ ‘సలీం! నేనీరోజున నీకొక చిన్న బహుమానం చెయ్యబోతున్నా’ సిగ్గు పడుతూ అంది, ఫారనాక్ బేగం," ఒకనాడు వాళ్ళిద్దరూ సెలయేటి ఒడ్డుకి వ్యాహ్యాళికి వెళ్ళినప్పుడు.

"నాకా, ఫారనాక్! ఏమిటది?"

"సలీం! అది నువ్వు ఎక్కువగా ప్రేమించే వస్తువే. నువ్వు సంగీత ప్రియుడివి కావడం చేత మా తండ్రిని బ్రతిమాలి ప్రత్యేకంగా నీ కొరకే చేయించేనీ వేణువుని. ఇదిగో! నా ప్రేమ కానుకగా తీసుకో!" అని చేతికిచ్చింది. ఆ ప్రేమ కానుకని అతడు కృతజ్ఞతతో అందుకొని ఆమెని దగ్గరగా తీసుకొని గుండెలకి హత్తుకొన్నాడు. ఆ క్షణం నుండీ వాళ్ళిద్దరూ ఒకరినొకరు విడచి ఉండలేక పోయేవారు. ఆ పిల్లనగ్రోవి నుండి వచ్చే సంగీతం ఒక ప్రేమ పాశమై వారిద్దరినీ బంధించింది. తర్వాత కొద్ది రోజులలోనే వారికి వివాహం కూడా స్థిరపడింది.

“వాళ్ళా సుఖమయ జీవితాన్ని ఎన్నాళ్ళో అనుభవించలేదు; ఆ ప్రేమికులిద్దర్నీ విడదీసే సంఘటన వివాహమైన కొద్ది రోజుల్లోనే సంభవించింది. ఒక రాత్రి దొంగల గుంపు అకస్మాత్తుగా ఆ పల్లె మీద పడి చేతికి దొరికిన డబ్బు దోచుకొన్నారు; కంటికి అందిన ప్రతి మనిషినీ చంపేసేరు. కలకల్లాడుతూ ఉండే ఊరు తెల్లారేసరికి స్మశానంలా మారిపోయింది. ఈ దొమ్ములాటలో అల్లీఖానూ, ఫారనాక్, నా భార్యా – ముగ్గురూ అసువులు బాసేరు.” ఈ మాట ముగియగానే రహమాన్ పక్కకి తిరిగి చెమ్మగిల్లిన కళ్ళని ఒత్తుకోవడం చూసి చలించేను.

“వెర్రి వాడా! ఎప్పుడో జరిగినదానికి ఇప్పుడు ఎంత విచారించి ఏమి లాభం?.... తరవాత ఏం జరిగిందో చెప్పు.”

నా ఆత్రుతని గమనించి రహమాన్ మళ్ళా చెప్పడం మొదలు పెట్టేడు.

“ఏదో పని మీద పక్క ఊరికి పోయి మర్నాడు ఉదయాన్నే తిరిగి వస్తూన్న సలీంకు, దారిలో చెప్పారెవ్వరో, ముందు రోజు రాత్రి జరిగిన దారుణాన్ని గురించి. ఆత్రుతగా అతడింటికి పరిగెత్తుకు రాగానే మొట్టమొదట అతని కంట పడ్డ దృశ్యం – తన తల్లి శవం! తర్వాత పక్కింటికి పోయి తలుపు తోసేసరికి గుమ్మంలోనే కనబడింది అల్లీఖాన్ శవం! దాన్ని కూడా దాటుకుని లోపలి గది తలుపు తెరిచేసరికల్లా ఎదట ఫారనాక్ తలా, మొండెం వేర్వేరుగా కనిపించేయి!! ఆవేశంతో ఒణికిపోతూ అక్కడ ఉండలేక సలీం పెరటి దారి వెంబడి బయటకి వచ్చేశాడు. నడిరోడ్డు మీద దొంగలు గుంపు చేసిన దురాగతాలు వికటాట్టహాసం చేస్తూ కనిపించేసరికి అతని దుఃఖం ద్విగుణీకృతం అయింది.

“సలీం హృదయంలో పొంగే వ్యధ జేవురించిన అతని ముఖం మీద ప్రతిబింబించింది. తనవారిని చంపిన కిరాతకులని చంపనిదే తనకి నిద్ర పట్టదు.  కొంత మంది గ్రామస్తుల సహాయం వల్ల అల్లీఖాన్ ఇంట్లో జొరబడిన దొంగ ఆచూకీ కొంతవరకూ రాబట్టగలిగేడు. ఆ దొంగల నాయకుడు మహాబలి. ఆ దొంగల ముఠాని పట్టే ఉద్దేశంతో ప్రభుత్వపు సైన్యం ఎన్నాళ్ళగానో ప్రయత్నిస్తోందిట.

“సలీం అట్టే బలవంతుడు కాడు. మిలటరీలో చేరే మనిషికి  కావలసిన అవయవ సౌష్టవం కూడ అతనిలో లేదు. చాల సన్నగా, బలహీనంగా కనపడే వాడు. అయితేనేం? ప్రయత్నం మీద, కార్య దీక్ష ప్రోత్సహించగా, తనూ సైన్యంలో ఒక సిపాయి కాగలిగేడు.

“యుద్ధ భటుడిగా తనకుండవలసిన కొద్ది సామానులకు తోడు, చనిపోయిన తన ప్రియురాలు బహూకరించిన పిల్లనగ్రోవి ఎప్పుడు అతని దగ్గరే ఉండేది. తోడి సైనికులని రంజింప చెయ్యడానికి దాని మీద మృదువుగా మధుర గీతికలు ఆలాపించేవాడు. ఇలా తన జీవితాన్ని ఒక విధంగా కులాసాగా గడుపుతూన్నా తన శక్తికి మించి కష్టపడి పని చేయ్యవలసిన అవసరం అప్పుడప్పుడు కలగకపోలేదు. సైన్యంలో ఉద్యోగం చెయ్యడం ఎంత కష్టంగా ఉన్నా, శత్రువునెట్లాగైనా రూపుమాపాలనే ఆశతో, కష్టాలని భరించి సమయం రాకపోతుందా అని ఎదురు చూస్తూ ఉండేవాడు.

“చివరికి అతని ఆశలు ఫలించేయి. దొంగల గుంపుని పట్టుకునేందుకు నియమింపబడిన సేనా వాహినిలో సలీం పేరు కూడ ఉంది! అప్పుడతనికి కలిగిన మనశ్శాంతి మరెప్పుడూ కలగలేదేమో. పిచ్చివాడి ఆవేశంతో బయలుదేరేడు - దొంగలతో పోరాడడానికి…

“పోరు జరిగిన స్థలాన్ని చూసిన వాళ్ళు మరునాడు చెప్పిన మాటలు. -- అక్కడ శవాలు కుప్పలుగా కూలి ఉన్నాయిట. వాటికి దూరంగా మరో రెండు మృత కళేబరాలు … ఒకటి సుకుమారుడైన

కుర్రాడిది... కుర్రాడు శరీరం మీద బలమైన గాయాలేమీ లేవు కానీ ప్రాణం మాత్రం పోయింది ... రెండవది కండలు తిరిగి, రాక్షసుడిలా ఉన్న బలవంతుడైన ఒక ముష్కరుడిది ..."

అంతవరకూ ఉద్రేకంగా ఉన్న రహమాన్ ముఖంలో రకరకాలైన భావాలు కనిపించినయ్. కొంచెం గొంతు తగ్గించి అన్నాడు, "నువ్వు నమ్ము, నమ్మకపో! సలీం తన దగ్గర ఉన్న పిల్లనగ్రోవిని ఆ దొంగ గొంతుకలో అతి నేర్పుగా గుచ్చేశాడుట! దెబ్బతో ఊపిరాడక చచ్చేడా వెధవ!!"

ఇల్లు ప్రతిధ్వనించేలా నవ్వేడు రహమాన్. నవ్వడం ఆపిన తర్వాత ఇలా అన్నాడు, "నిజంగా ఈ మురళి వాళ్ళిద్దరినీ బ్రతికుండగానూ, చచ్చిపోయిన తర్వాతా కలిపింది. తర్వాత ఎవ్వరో పుణ్యాత్ములు వివరాలు తెలుసుకొని ఈ పిల్లనగ్రోవిని నాకు పంపించేరు," అంటూ కథనం ముగించేడు, తిరిగి ఆ పిల్లనగ్రోవిని నా చేతికిస్తూ.

దాన్ని పుచ్చుకొని అటూ, ఇటూ తిప్పి చూస్తూ, "అయితే ఈ పిల్లనగ్రోవి వెనుక ఇంత చరిత్ర ఇమిడి ఉందని నేననుకోలేదు. దీన్ని నా వస్తు సంకలనంలో చేర్చి ప్రదర్శించడానికి నాకు ఎటువంటి అభ్యంతరమూ లేదు. సంతోషంగా స్వీకరిస్తాను. కాని, దీన్ని నా కిచ్చెయ్యడానికి నువ్వు మనస్ఫూర్తిగా సమ్మతిస్తున్నావు కదా?"

"సమ్మతమే. నీ మ్యూజియం చూడవచ్చిన వాళ్ళందరికీ దీని వెనక ఉన్న కథని  నువ్వు తెలియజేస్తూ ఉండు. నాకంతే చాలు. దాని వల్ల సలీం కూ, ఫారనాక్ కూ మధ్య ఉండే మహత్తర ప్రేమ గాథ నలుగురికీ తెలుస్తుంది. అందుచేత నా దగ్గరుండే కంటె నీ దగ్గరుంటేనే రాణిస్తుంది."

ఆ వేణువుకి విలువ కట్టే తాహతు నాకు లేక పోయినప్పటికీ, నా ఆత్మ సంతృప్తి కోసం నా అంచనాకి మించిన సొమ్ము రహమాన్ కి ఇచ్చి, ఆ వేణువుని తీసుకొని, దాని చరిత్రని టుకీగా ఒక ఫలకం మీద రాసి, దానిని నా ప్రదర్శన శాలలో ఉంచా.

+ + +

ఈ మధ్య షేక్ హజరత్ అనే ఓ స్నేహితుడికి నా ప్రదర్శనశాల చూపించడం జరిగింది. పిల్లనగ్రోవి కథనాన్ని అతనికి సమగ్రంగా వినిపించా. అతడా కథనాన్ని చాల కుతూహలంగా విని, నా అనుమతి పొంది, పిల్లనగ్రోవిని తీసి చేత్తో పట్టుకొని ఇటూ, అటూ తిప్పి చూసేడు. చూసి, గది ప్రతిధ్వనించేలా నవ్వడం మొదలు పెట్టేడు. నవ్వడం ముగించిన తర్వాత, "క్షమించండి. దీని మీద ఉన్న మాటలు చూస్తే నవ్వొచ్చింది. నాకు తెలిసిన పారశీక భాష సరియైనదే అయితే, ఈ వేణువు మీద ఉన్న

మాటలివి: 'పారశీక దేశంలో తయారు చెయ్యబడ్డది. దీనిలో లోటు పాట్లు ఉంటే వాపసు చేసిన మీ డబ్బు తిరిగి ఇవ్వబడును.'"

నాకు కోపంతో పాటు నవ్వు కూడ వచ్చింది. ఇంత మోసమా! రహమాన్ కి అస్సలు వివాహమే కాలేదని షేక్ హజరత్ చెబుతూ ఉంటే నాకు ఏడుపు కూడా వచ్చింది.

"హజరత్, అయితే ఇదంతా రహమాన్ వర్తక రహశ్యం అనుకుంటా."

"రహమాన్ కుమ్మరి వీధిలో కుండలు అమ్మే రకమని మీకింతవరకూ తెలియలేదంటే నాకు ఆశ్చర్యంగా ఉంది." అన్నాడు హజరత్ నవ్వుతూ.

(Source: Chunlin's Flute by L. T.  Sardone)

# పరధ్యానం
## (వినోదిని, జనవరి 1950)

పరధ్యానం –

సాధారణంగా మనుష్యుల్లో ఉండే చిన్న చిన్న దోషాలలో ఇదొకటి. గొప్ప గొప్ప వ్యక్తులే దీనికి లోబడిపోయినప్పుడు సామాన్యుల మాట వేరే చెప్పడమెందుకు? కొన్ని కొన్ని ఘట్టాలు సున్నితమైన హాస్యాన్ని కూడకలుగజేస్తాయి. మచ్చుకి –

ప్రఖ్యాత శాస్త్రజ్ఞుడు సర్ ఇజాక్ నూటన్ మహా మేధావి అయినా ఎప్పుడూ పరధ్యానంగా ఉండేవాడట. ఆయన ఒక పిల్లిని చాల ముద్దుగా పెంచేవాడు. చదువుకొనేటప్పుడూ, తీవ్రమైన విషయాలని గురించి ఆలోచించేటప్పుడు కూడ పిల్లి తన దగ్గర ఉండవలసిందే! అందుచేత ఆ పిల్లి రాకపోకలకనుకూలంగా తను చదువుకొనే గది గోడకి పిల్లి పట్టేంత పెద్ద కన్నం ఒకటి పెట్టించేడట. కొన్నాళ్ళకి ఆ పిల్లి పిల్లల్ని పెట్టగా, పిల్లి పిల్లలు కూడ తన దగ్గరకి రాడానికి వీలవుతుందని, ఆ పెద్ద కన్నం పక్కనే మరొక చిన్న కన్నం తవ్వించేడట. పెద్ద కన్నంలోంచే పిల్లిపిల్లలు కూడా వెళ్ళగలవన్న విషయం ఆయనకు తెలియదూ? ఇది పరధ్యానం కాక మరేమిటి?

మహా కవి శామ్యూల్ టేలర్ కోలరిడ్జి కి కూడ మతి మరుపు ఎక్కువగానే ఉండేదని వినికిడి. అతడొకనాడు రోడ్డు మీద చార్ల్స్ లేంబ్ ని కలుసుకున్నాడు. లేంబ్ ని అలా నిలబెట్టి తనొక వేదాంతోపన్యాసం ఇవ్వడం మొదలు పెట్టేడు. తన అలవాటు ప్రకారం ఎదురుగా తున్న లేంబ్ కోటు బొత్తాం పట్టుకొని ఇటూ, అటూ తిప్పుతూనే ఉన్నాడు. లేంబ్ కి ఆఫీసుకి  వెళ్ళే వేళయింది కాని కోలరిడ్జి వదలిపెట్టలేదు. అతన్ని తప్పించుకుపోయే ఉపాయం లేక లేంబ్ కోటు గుండీని చాకుతో కోసేసి, తన మానాన్న తను ఆఫీసుకి వెళ్ళిపోయేడుట. ఇంతకీ ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటంటే… ఆఫీసు నుండి లేంబ్ తిరిగి ఇంటికి పోయే టప్పుడు కూడా కోలరిడ్జి ఆ కోటు గుండీని ఇంకా అలాగే పట్టుకుని ఉపన్యాసం దంచేస్తున్నాట్ట!

ఈ పరధ్యానం సామన్యుల్లో కూడ చాల మందిలో కనిపించడం కద్దు. ఈ విషయంలో ఒక మిత్రుడు జ్ఞ్నాపకం వస్తూ ఉంటాడు. ఒకనాడు నేను కాలేజీకి పోతూంటే, దారిలో ఎదురై నన్ను నిలబెట్టేడు. ఏవో కొనడానికి బజారుకి వెళుతున్నాడు కాబోలు, చేతిలో పది రూపాయల నోటుంది. నన్నలా నిలబెట్టి లోకాభిరామాయణంలోకి దిగేడు. మా బాతాఖానీ ఆఖరయేసరికి ఆ నోటుని చిన్న చిన్న ముక్కలుగా

త్రుంచి క్రింద పోసేడు. ఆఖరు వరకూ నేను చూడనే లేదు. “అదేమిరా! పది రూపాయల నోటు చించి క్రింద పాశావు?” అన్నా. “అరె! మరిచి పోయాను. ఏదో కాగితం ముక్కనుకున్నా,” అని వెర్రి మొహం వేసేడు.

అసలు వీణ్ణి నాకు చిన్నతనం నుండి తెలుసు. మేమిద్దరమూ కాలేజీలో చదివేటప్పుడు ఒకే హాస్టల్లో ఉండేవాళ్ళం. ఒక నాడు భోజనానికి డైనింగు హాల్లో కూర్చున్నాం. ఇంకా వడ్డన పూర్తి కాలేదు. మా వాడు మాతో మాట్లాడుతూనే పక్క వాడి విస్తట్లో ఉన్న కూర ఖాళీ చేసేసేడు. ఆ పక్క వాడు మతిమరుపులో వీడిని మించిన ఘనుడు. వాడి విస్తరి వైపు చూసుకొని, “అరెరె! నా భోజనం అయిపోయిందా. మరిచే పోయాను,” అనుకుంటూ లేచి చెయ్యి కడిగేసుకున్నాడు. ఇట్లాగే ఉంటాయి పరధ్యానంలో రకాలు.

ఈ మధ్య దొరగారొకరు ఊరికెళ్తూంటే, భార్య కూడా వీడ్కోలివ్వడానికి స్టేషన్‌కి వెళ్ళిందిట. రైలు కదలడానికి కూసింది. దొరగారు హడావిడిగా కూలి డబ్బులు పెళ్ళాం చేతిలో పెట్టి, వెళ్ళొస్తానని చెబుతూ సామాను తెచ్చిన రైల్వే పోర్టరుని ముద్దెట్టేసుకున్నాట్ట!!

# పిచ్చి నమ్మకాలు
## (వినోదిని, జూన్ 1950)

తెల్లవారి పక్క మీంచి లేస్తూండగానే అపశకునమైతే ఎవరికేనా కష్టంగానే ఉంటుంది.

సరిగ్గా అల్లాగే సీతారామయ్య ఒళ్ళు విరుచుకొని, బద్ధకం తీర్చుకొని, కళ్ళు తెరిచేసరికి ఎదురుగా గూట్లో పిల్లిపిల్ల ప్రత్యక్షం కావడమా? రోజూ ఇదే వరసా? అందులోనూ తను ఇటువంటి విషయాల్లో ఎక్కువ పట్టింపు తీసుకొనే మనిషాయిరి. పోనీ, ఒక సారి బెదిరిద్దామన్నా, ఒక రాయి దాని మీదకి విసురుదామన్నా, అల్లాంటి పని చేసేందుకు వీల్లేకుండా వచ్చింది. ఆ పిల్లికి వీసమెత్తు అపకారం జరిగినా, ఆ అపకారం తనే చేసినా, మరెవరేనా చేసినా ఇంట్లో భార్య పోరు పడొద్దూ? తనకు భార్య అంటే ఎంతో, తన భార్యకి ఆ పిల్లి అంటే అంతా! ఆవిడకి ఆ పిల్లి మీద మహా ప్రేమ. ఆ పిల్లి తను పుట్టింటి నుంచి తెచ్చుకొని సొంత చేతులతో పెంచుకుంటూన్న ప్రాణి. అందు చేతనే సీతారామయ్య ఇంట్లో దాన్ని ముట్టుకుందుకి కూడ భయపడతారు.

ఆ పిల్లా, పిల్లీ కూడ ఒక్క సారే సీతారామయ్య ఇంట్లో అడుగు పెట్టేరు. ఆ మరునాడే సీతారామయ్య పెద్ద తమ్ముడు చేస్తూన్న ఎలిమెంటరీ స్కూలు ఉద్యోగం కాస్తా ఠపీ మని ఊడి పోయింది. ఉద్యోగం పోవడానికి గల కారణాలన్నిటిని ఒక జాబితా వేసి, ఆ రోజుదయాన్నే ఆ పిల్లి పిల్లను చూడ్డమే ఈ ఆపదకు ముఖ్య కారణమని తీర్మానించేరా ఇంటి పెద్దలంతా పోగయి. దాంతో సరా? వారం తిరిగే లోగానే అప్పటి వరకూ ఏ రోగం, రొచ్చూ లేని సీతారామయ్య తండ్రి పటాష్ కాయలా 'ఢాం' మనిపోయేడు. ఇదే టైములో - ఏ పాపం చేసినా పిల్లి మెడకు చుట్టేయవచ్చునుకొని కాబోలు - సీతారామయ్య చిన్న తమ్ముడు చదువుతూన్న స్కూలు ఫైనల్ పరిక్షని మూడో సారి ఢింకీ కొట్టించేడు. ఇక అడగాలా?

సీతారామయ్య తల్లి మాత్రం పిల్లిది తప్పంటే ఒప్పుకోలేదు. "అమాయకపు పిల్లి. దాని మెడకెందుకర్రా ఈ పాపం అంతా చుట్టబెడతారు? నే చెబుతా విను. అసలు నీ పెళ్ళాం పాదం అలాంటిదిరా, సీతారామయ్యా. అది మనింట్లో అడుగు పెట్టిన వేళా విశేషం." మొగుడు చచ్చిపోయేడని రాగాలెట్టేటప్పుడు కూడా, "పార్వతమ్మా, నీ పాదమెట్టగానే బొబ్బిలి సంస్థానం బుగ్గయి పోయిందీ" అనే పల్లవి చేర్చడం అలవాటు చేసుకొంది.

ఇది ఇలా ఉంటూండగా ఒకానొక ముహూర్తాన – సుముహూర్తమో! దుర్ముహూర్తమో! – పక్కింటి వాళ్ళ కాలభైరవుడు ఆ పిల్లి కంఠాన్ని కటుక్కున కొరికేయడం జరిగింది.

ఇంకేముంది. ఆ పిల్లి యజమానురాలైన సీతారామయ్య భార్య మంచం ఎక్కింది. తొలిరోజ తల నొప్పి. మలి రోజ జ్వరం. మూడో రోజ మగత. నాలుగో రోజ పేలాపన. అయిదో రోజతో ఆఖరు – సోలమన్ గ్రండీ జీవితంలా.

పది రోజులైనా కాకుండానే పోయిన మేష్టరీ ఉద్యోగాన్ని మించినది మరో ఉద్యోగం దొరికింది సీతారామయ్య పెద్ద తమ్ముడికి. చాలా కాలమై తిలోదకాలు ఇచ్చుకుందామనుకుంటూన్న దావా గెలుచుకున్నట్లు సీతారామయ్య ప్లీడరు ఒక కార్డు ముక్క గొలికి పారేశాడు.  “ఈ వెధవ స్కూలుఫైనలు పరీక్షని ఈ మాటు నెగ్గి తీరుతాను” అని శపథం చెసేడు, సీతారామయ్య చిన్న తమ్ముడు. ఎటు చూసినా శుభమే  కనిపిస్తూంది ఇప్పుడు సీతారామయ్య ఇంట్లో.

“నే చెప్పలేదురా. నీ పెళ్ళాందేరా దోషమంతా. అది చచ్చిపోయిన తర్వాత పరిస్థితులు కొంచెం బాగుపడ్డాయంటావా, లేదా? అనవసరంగా పిల్లినాడి పోసుకున్నారంతాను,” అని దీర్ఘాలు తీసింది సీతారామయ్య తల్లి.

అలా అన్నప్పుడల్లా, “కాదు. నా పెళ్ళాం తెచ్చిన పిల్లి పిల్లదర్రా ఈ దోషమంతాను” అని జవాబు చెబుతూనే ఉన్నాడు, సీతారామయ్య.

+ + +

# అన్యాపదేశం
(వినోదిని, జనవరి 1951)

"శిష్యా...?"

"గురూజీ...!"

"చూడూ! చిన్న విశేషమోయ్"

"చిత్తం. శలవియ్యండి."

"మాలతీ, చంపకం, పారిజాతం... ఈ రకమంతా మనం చూసిందేగా...?"

"చిత్తం. చిత్తం. తమ బోటి వారిక్కాకపోతే, మాకాండి శక్యం? ఈ రకమంతా తవఁరు ఆఘ్రాణించి వదలి పెట్టినదే కదండీ!"

"ఏమిటోయ్ కవిత్వం లోకి దిగుతున్నావేమిటీమధ్య!"

"మీ దయుండాలి కాని కవిత్వానికేమి లోటండి. అయితే అసలు సంగతి మరచి పోయారు, గురూజీ!"

"చూడూ, పొద్దున్న చూశాను. సూర్యాకాంతంటోయ్! సూర్యాకాంతంట!! ఆహా, ఏమి మృదుత్వం. ఏమి లాలిత్యం. ఏమి అందమోయ్. నేను వర్ణించలేను."

తవఁ కళ్ళకలా కనబడ్డది కాబోలు."

"నీ మొహం. కనబడ్డవేఁవిటి? అదంతే!"

"అంతే?"

“అంతే, అంతే, అంతే. ముమ్మాటికీ అంతే. నేను స్వయంగా చూస్తే కాదంటావేమిటి?”

“కాదు గురువుగారూ! నేను కూడా చూశానుగా.”

“హోరి పిడుగా. నువ్వూ ఉన్నావూ అక్కడ?”

“నేను లేని చోటూ, నాకు తెలియని విషయమూ లేవని మనవి చేసుకుంటున్నాను.”

“అయితే అది మనకి ఎలా లభ్యమౌతుందంటావు?”

ఆఁ! అదెంత పనండి. తీసుకు వచ్చే ఏర్పాటు నేను చేస్తాను కదా.

భేష్ సుబ్బయ్యా! శిష్యుడవంటే నువ్వేరా!”

“చిత్తం. చిత్తం. తవఁ దయుండాలి కాని.”

“అయితే, ఎప్పుడూ….?”

“సాయంత్రం అయే వేళకి తిన్నగా తవఁ లోగిట్లోకి తీసుకురానుటండీ!”

“కొంప ముంచేవ్! కొంప ముంచేవ్!! అల్లాగ్గాని చెయ్యకేం? అమ్మగారు చూసేరంటే ఇంకేమన్నా ఉందా!”

“అమ్మగోరికి ఇష్టం లేదాండీ. అయినా ఇందులో తప్పేటి?”

“నీకు తెలియదులే. అందులోనే అంతా ఉంది.”

“అయితే సరాసరి తోట్లోకి తీసుకెళతాను. అలా చెయ్యమంటారా?”

“అదీ, తెలివైన వాడి లక్షణం. ఆ వేళకి అక్కడికి నేను వచ్చేస్తాలే”

“తమ(కెందుకు గురువు గారూ, లేని పోని శ్రమ. నేనున్నాను కదండీ.”

“నువ్వుంటే నువ్వేమి చేస్తావురా! నీకు మతి పోతోందేమిటి?”

“మీరాగ్రహిస్తే నేనేమీ చెయ్యలేనండి. అయినా మనవి చేసుకుంటున్నాను. తోటలో గులాబీ అంట్లు వేశాము చూశారూ?... అక్కడ… అక్కడయితే…”

“అక్కడయితే ఏమిట్రా నీ బుర్ర…?”

“ఎంత మాటా! అక్కడయితే నీరు కూడ బాగా అందుద్ది కదండీ. అంచేత అక్కడే పాతెస్తా.”

“……………………”

+ + +

# అంతరార్థం

(చిత్రగుప్త, ??)

సినిమా నుంచి అప్పుడే వచ్చిన చిరంజీవి హుషారుగా ఈల వేసుకుంటూ చీకటిగా ఉన్న తన గదిలో ప్రవేశించాడు. క్రిందటి రోజు గుర్రప్పందాలలో గట్టిగా డబ్బు గెలవడం వల్ల కులాసాగా ఉన్నాడు చిరంజీవి. అందులో కొంతడబ్బుతో సేట్ పావనలాల్ షాపులో చాలా విలువైన వజ్రపుటుంగరం ఆ ఉదయమే తీసుకున్నాడు, పుట్టింట ఉన్న భార్యకు పండగకి బహుమానంగా తీసుకెళదామని. సాయంత్రం స్నేహితుడైన అనంతంతో కలసి సినిమాకి వెళ్ళి ఇద్దరూ జల్సాగా మరి కొంత డబ్బు ఖర్చు పెట్టుకున్నారు. తిరుగుదారిలో అనంతాన్ని ఇంటిదగ్గర వదలిపెట్టి అక్కడ నుండి నేరుగా తను ఇంటికి వచ్చేశాడు. గదిలో అడుగు పెడుతూనే స్విచ్చి వేసి లైటు వెలిగించేడు.

కొంచెం పని చేసుకుని తర్వాత పడుక్కో వచ్చునుకుంటూ కుర్చీని టేబుల్ దగ్గరగా లాగబోయేడు. తలెత్తి చూసేసరికి తనకి మొదటిసారిగా కనిపించిన దృశ్యం అతన్ని ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. తన మేజా మీద కాగితాలన్నీ చిందర వందరగా వెదజల్లి ఉన్నాయి. డ్రాయరు సొరుగులు రెండూ పైకి లాగబడి ఉన్నాయి. కొన్ని పుస్తకాలు నేల మీద పడి దొర్లుతున్నాయి.

“ఈ దయ్యపు చేష్టలన్నీ ఎవ్వరు....”

వెనక వైపు నుండి మెడ మీద చల్లగా తగిలింది. తన మెడ మీద పిస్తోలు ఆనించబడి ఉందని గ్రహించడానికి చిరంజీవికి ఆట్టే సేపు పట్టలేదు. వెంటనే ఒక అపరిచత కంఠం నుండి ముక్కు మాటలు కటువుగా వినిపించేయి. “చేతులెత్తు! .. ఒక్క అడుగు కదిలేవా, నీ తల లోంచి తుపాకీ గుండు దూసుకు పోతుంది.

చిరంజీవి చేతులెత్తేడు. మెల్లగా మెడ తిప్పి వెనక్కి తిరిగి చూసేడు. నల్లటి ముసుగులతో ముఖాలని ఆఛ్ఛాదించుకుని ముగ్గురు ముష్కరులు తుపాకులు తనవైపు గురి పెట్టి నిలుచున్నారు. ముసుగులకున్న కంతల్లోంచి వాళ్ల కళ్ళు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

“కదలకుండా చేతులెత్తి నించో!” ఆజ్ఞాపూర్వకంగా హుంకరించేడు, వాళ్ళల్లో పుష్టిగానూ, పొడుగ్గానూ ఉన్న దొంగ, రివాల్వరుని ఆడిస్తూ. వేషాన్నీ, మాట తీరునీ బట్టి వాడు మిగిలిన వాళ్ళకి నాయకుడని ఊహించేడు, చిరంజీవి.

ఈ దొంగ వెధవల బెదిరింపులు చూస్తే చిరంజీవికి పట్టరానంత కోపం వచ్చి వాళ్లతో కలబడదామనుకున్నాడు. కాని కాలానికి కట్టుబడిపోయిన పాండవాగ్రజుడిలా  ఏమీ చెయ్యలేక ఊరుకున్నాడు. ఇంతలో దొంగల ముఠాలో ఒకడు ముందుకి వచ్చి చిరంజీవి దుస్తులన్నీ జాగ్రత్తగా తనిఖీ చేసి, జేబులన్నీ పైకి లాగి సోదా చేసేడు.

వాడు వెతకడం పూర్తి అయిన తరువాత చిరంజీవి అక్కడ ఉన్న కుర్చీలో కూలబడి జేబు రుమాలుతో ముఖం తుడుచుకున్నాడు.

“ఏయ్! పెద్దమనుషులూ, మీ తనిఖీ పూర్తి అయింది కనుక ఇంక ఇటు వినండి,” సావకాశంగా కుర్చీలో చేరబడి చెప్పడం మొదలు పెట్టేడు, చిరంజీవి. కాని తన దృష్టిని మాత్రం ఆ లావాటి, పొడుగాటి మనిషి చేతులో ఉన్న రివాల్వరు  మీద నుండి మరల్చ లేదు. “మీకు ఒక్క నిమిషం టైము ఇస్తున్నాను. ఈ అత్యాచారం దేనికోసమో సంజాయిషీ చెప్పుకోక పోతే…”

“అవునవును. నోరు మూసుకుని కుదురుగా కూర్చో!” అతని మాటలని మధ్యలోనే త్రుంచేశాడు ఆ లావాటి, పొడుగాటి దొంగల నాయకుడు. “ఇక్కడ కాలాన్ని వృధా చెయ్యడానికి మేము రాలేదు. నువ్వు చెప్పబోయేది మాకు తెలుసు. మేమొచ్చిన పనిని త్వరగా, సాఫీగా చెసుకుని పోని.”

చిరంజీవి ఒక్క క్షణం ఆలోచించాడు. “ఓ! దానికేం? తప్పకుండా పూర్తి చేసుకోవచ్చు. గుర్రప్పందాలలో తిరిగి తిరిగి అలిసిపోయి వచ్చాను. కాస్త కాఫీ చేసుకుని తాగనివ్వండి. ఏమంటారు?”

ముసుగు మనుషులు ముగ్గురూ ఒక్క నిమిషం కళ్ళతో మాట్లాడుకున్నారు. ఒకరికొకరు ఏవో సంజ్ఞలు చేసుకున్నారు. కొంతసేపయిన తర్వాత వాళ్ళలో లావాటి, పొడుగాటి నాయకుడు ముందుకొచ్చి నిష్కర్షగా చెప్పేడు.

“వీల్లేదు. ..ఎంతమాత్రం వీల్లేదు. ఆ వజ్రపుటుంగరం ఎక్కడ దాచేవో నిజం చెప్పెయ్! తర్వాత కాఫీ కాచుకు తాగినా, అన్నం వండుకు తిన్నా మాకేమీ అభ్యంతరం లేదు.”

ఈ మాట వినేసరికి చిరంజీవి ఒక్క సారి చలించేడు. అయితే ఈ ముష్కరులంతా ఆ ఉంగరం కోసం దయచేసేరన్నమాట! అది తన దగ్గరే ఉన్నట్లు వీరికెలా తెలిసిందో! వాళ్ళకప్పుడే ఈ వార్త...లేదు. టైము లేదు. తనకింకా ఆలోచించడానికి వ్యవధి కావాలి.!

చిరంజీవిలో ఉన్న విశేషం ఇటువంటి సమయాల్లో ధైర్యంగా ప్రవర్తించడమే. తను ఆలోచించుకోడానికి అవకాశం సృష్టించుకొనేందుకు వాళ్ళని ఏదో ఒక విధంగా మోసం చెయ్యాలి. సమయానుకూలంగా చిరంజీవి ముఖ భంగిమలని మార్చేశాడు. ఏదో కొత్త విషయాన్ని వినే వాడి ముఖంలో కనిపించే ఆశ్చర్యం, ఆ విషయాన్ని సాంతంగా వినాలన్న ఉబలాటం కనిపించాయి, అతని ముఖంలో. కొంత సేపాగి వాళ్ళ వైపు తిరిగి తను చెప్పవలసిన జవాబు చెప్పకుండానే తిరిగి ప్రశ్నించాడు.
"ఏమన్నారూ?... ఉంగరమా?....ఏ ఉంగరం?

"ఓహో...! మిస్టర్ చిరంజీవిరావ్! మమ్మల్ని మోసగించడానికి ప్రయత్నించ వద్దు. ఈ సందర్భంలో నీ రక్తాన్ని చూడడానికి కూడ వెనుకాడం. ఈ భూమ్మీంచి నీలాటి వ్యక్తి ఒకడు తగ్గిపోయినా మాకు ఖాతరు లేదు. కాని మా చేతుల్లో మాత్రం వజ్రపుటుంగరం పడి తీరాలి." ఆఖరి వాక్యం అశనిపాతంలా వెలువడిందతని కంఠంలోనుండి.

అంతా విన్న తర్వాత చిరంజీవి కుర్చీలో సావకాశంగా సాగిల పడ్డాడు. ఈ దొంగల ముఠా ఉంగరాన్ని జేబులో వేసుకునే వరకూ ఒక అడుగు వెనక్కి కదపరనే మాట నిశ్చయం. ఆలోచిస్తూనే అతను తను నిద్రించే పరుపు వైపు క్రీగంట ఒక సారి చూసేడు. లాభం లేదు. తన తలగడ కింద ఉన్న రివాల్వరు తన చేతుల్లోకి రావడం అసంభవం. ఒక వేళ తనా రివాల్వరుని అందుకోగలిగినా, తనొక్కడు, వాళ్ళు ముగ్గురు! తనకు పరాజయం తప్పదు. నిమిష నిమిషానికీ దొంగల నాయకుడిలో సహనం తగ్గి కోపం పెరుగుతోంది. మరొక అపాయం లేని ఉపాయం ఏదైనా ఆలోచించాలి....ఈ ఆలోచనికి ఇంకా టైము కావాలి.

చిరంజీవి ముఠా నాయకుడి వైపు తిరిగి మళ్ళా పాత పాఠం వల్లె వేశాడు. "నేను కాఫీ చేసుకు తాగడానికి మీరేమీ అభ్యంతరం పెట్టకుండా ఉంటే చాలా మంచిదని మరో సారి మనవి చేసుకుంటున్నాను. ఎంచేతంటే బయట చలిగా ఉంది కనుక. మీరంతా కూడా వేడి వేడి కాఫీ పుచ్చుకోవచ్చు. ..." మాట్లాడుతూన్నంత సేపూ వాళ్ళ ముఖా కళవళికలని పరిశీలిస్తూనే ఉన్నాడు చిరంజీవి.

ముఠా నాయకుడు తోక తొక్కిన తాచులా లేచాడు. “మిస్టర్ చిరంజీవి!  ఈ దొంగ వేషాలు మా దగ్గర పనికి రావు.  సానికి టక్కులు నేర్పాలని చూస్తున్నావల్లే ఉంది. వజ్రపుటుంగరాన్ని వెంటనే మా స్వాధీనం చేస్తావా, సరేసరి. లేకపోతే, ఇదిగో – ఈ రివాల్వరుకి పని కల్పించమంటావా?”

“మిస్టర్! మీ పేరేమిటో నాకు తెలియదు… నేను చెబుతున్నా వినండి. తొందర పడడం వల్ల ప్రయోజనం లేదు. నేను కాఫీగత ప్రాణిని. కొంచెం వేడి కాఫీ తాగే వరకూ మీరు గీ పెట్టినా సమాధానం చెప్పగలిగే పరిస్థితిలో లేను.” కుండ బద్దలుకొట్టినట్లు చెప్పేడు, ఈ ముష్కరులు మాటల్లోనే  కాని చేతల్లో ధైర్యం చూపించడం లేదని తెలుసుకున్నాడు చిరంజీవి.

ముసుగు మనుష్యులు మళ్ళా ఒకరి వైపు మరొకరు చూసుకున్నారు. కొంత సేపు మళ్ళా వాళ్ళ కళ్ళు నిశ్శబ్దంగా మాట్లాడుకున్నాయి. అంతా ఒక నిశ్చయానికి వచ్చిన తర్వాత దొంగల నాయకుడు తన అంగీకారాన్ని సూచిస్తూ చెప్పేడు చిరంజీవిని ఉద్దేసించి:

“సరే! కాఫీ చేసుకుని త్రాగొచ్చు. కాని, ఏమైనా కోతి చేష్టలు చెయ్యడం జరిగిందా…”  తుపాకీని ఆడిస్తూ … “తర్వాత వచ్చే ఫలితం నేను చెప్పక్కర లేదు. త్వరగా కానియ్.

చిరంజీవి కుర్చీలోంచి లేచేడు. అపరిచితుల్లో ఇద్దరు అతనిపై రివాల్వరు గురి పెట్టి వంటగదిలోకి తీసుకెళ్ళారు. చిరంజీవి స్టౌ వెలిగించి నాలుగు కప్పుల కాఫీ తయారు చేసి గదిలో టేబుల్ మీద పెట్టేడు. కాఫీ కోరిక తీరింది కనుక ఇహ ఉంగరం బయట పెడతాడనుకున్నారు దొంగల ముఠా.

చిరంజీవి తన కప్పు ఖాళీ చేస్తూ, “మీ చేతుల్లో తుపాకులు చూస్తూ ఉంటే నాకు కడుపులో తిప్పుతున్నాది,” అన్నాడు అసహ్యించుకుంటూన్నట్లు చూస్తూ. “నా దగ్గర ఆయుధాలేమీ లేవుగా. మీకెందుకంత భయం?”

“నాయకుడి కనుసన్నలని చూసి మిగిలిన ఇద్దరూ రివాల్వర్లని కిందకి దించేరు.

చిరంజీవి వాళ్ళని దాటి కుర్చీలో కూర్చున్నాడు. “అయితే ఇప్పుడు నన్నేమి చెయ్యమంటారు?” మళ్ళా మొదటికొచ్చాడు.

“ఆ వజ్రపు ఉంగరం మరేమీ తగాదా లేకుండా మాకిచ్చేయమంటున్నాం” సూటిగా సమాధానం వచ్చింది.

“వజ్రపుటుంగరమా? ఆహ్హా…హ్హా…హ్హా! మనలో ఎవ్వరికో ఒకరికి మతి పోయుండాలి. నేనూ దాని గురించి ఎక్కడో విన్నట్లే జ్ఞాపకం. ఆఁ!...సేట్ పావనలాల్ షాపులో ఉన్నదేనా?..దాని సంగతేనా మీరడిగేది? అయితే నేను దానిని మీకోసం దొంగిలించాననా మీ సిద్ధాంతం? చాలా బాగుంది. ఈ మాత్రం దానికి నా టేబుల్ మీదున్న కాగితాలన్నిటినీ చిందరవందర చెయ్యడమెందుకూ అంట? డ్రాయింగు రూములో సొరుగులన్నీ పీకడమెందుకూ అంట?”

“చాలు! అక్కడికి ఆపవచ్చు.” గది ప్రతిధ్వనించేలా ఉరిమేడు దొంగల నాయకుడు. ఈ పిచ్చి ధోరణి మాకనవసరం. సవ్యంగా ఉంగరాన్ని ఇస్తావా? లేదా?”

“ఏమిటి మీ ఉద్దేశం?” కోపాన్నంతా కళ్ళల్లోకి తెచ్చిపెట్టుకున్నట్లు నటిస్తూ చిరంజీవి గభీమని లేచి నిలబడ్డాడు. “సేట్ షాపులో నగలన్నీ నాదగ్గర దాచిపెట్టుకు కూర్చున్నాననుకుంటున్నారా?”

“నగలన్నిటి సంగతీ కాదు, ఇప్పటి ప్రస్తావన. ఒక్క ఉంగరం గురించే మేం మాట్లాడుతున్నాం. ఈ రోజ ఉదయం అనంతం దగ్గర నుండి నీ స్వాధీనం లోకి వచ్చిందే! ఆ ఉంగరం ఒక్కటే మాకు కావాలి.”

“అనంతం?!...” చిరంజీవి మళ్ళా కూర్చుని గెడ్డాన్ని చేతి వేళ్ళతో నిమరడం మొదలెట్టేడు సాలోచనగా. “అందుకే మీ బుద్ధి పెడతల పట్టిందంటున్నాను. ఆ ఉంగరం అతని దగ్గరే ఉంది.”

“చిరంజీవీ! ఇహ లాభం లేదు. ఊరుకుంటూన్న కొద్దీ హద్దు మీరి పోతున్నావు.” రివాల్వరు మళ్ళా పైకి తీసి బెదిరించేడు, నాయకుడు.

“ప్రమాణం చేసి చెబుతున్నాను. ఆ ఉంగరం మాత్రం నా దగ్గర లేదు,” చిరంజీవి బల్ల మీద ఉన్న వెండి పేపర్ వెయిట్ ని చేత్తో పట్టుకుని , దాన్ని గాలిలోకి ఎగరేసి పట్టుకుంటూ, నిర్లక్ష్యంగా జవాబు చెప్పేడు.

“చిరంజీవి రావ్! నాకు కోపం రెచ్చి పోతూంది. ఈ చచ్చు సంభాషణంతా…”

చిరంజీవి పళ్ళు బిగించేడు. కోపంతో అతని ముఖం జేవురించింది.

"నా దగ్గరున్న విలువైన వస్తువు ఇదొక్కటే. కావలిస్తే ఇది తీసుకుపోండి, బుద్ధిహీనుల్లారా!" అంటూ చేతిలో ఉన్న వెండి పేపర్ వెయిట్ ని వాళ్ళ వైపు బంతిని విసిరినట్లు విసిరేడు.

గిరాటేసిన పేపర్ వెయిట్ ని పట్టుకుని, నాయకుడు బిగ్గరగా నవ్వి, తిరిగి చిరంజీవి వైపు విసిరాడు. "కోపం వద్దు. చిరంజీవి గారూ. కోపగించుకుని ప్రయోజనం లేదు. మేం మంచిగా అడుగుతున్నాం. మీరు మంచిగా చెప్పండి."

చిరంజీవి అల్లా కుర్చీలో వెనక్కి చేరబడ్డాడు. అలసిపోయిన వాడిలా బుర్ర వెనక్కి వాల్చి కళ్ళు మూసుకున్నాడు. తన ఆలోచనలింకా ఒక దరికి రాలేదు. ఆలోచించడానికి తనకి ఇంకా టైము కావాలి. వీళ్ళు ఉంగరం పుచ్చుకోందే కదిలే ఘటాలలా  లేరు. పైగా దాని కోసం ఎటువంటి పనైనా చెయ్యడానికి సాహసించే రకమేనేమో అనిపిస్తున్నాది. ఏం చెయ్యడం? ఏం చెయ్యడమో ఆలోచనకందడం లేదు, చిరంజీవికి.

"బాగుంది!" ముందుకి ఒంగి చెప్పడం మొదలెట్టేడు, చిరంజీవి. "అయితే నేను చెప్పే జవాబు ముందు వినండి. – నేనా ఉంగరాన్ని ప్రాణం పోయినా సరే మీకు ఇవ్వను. ఇవ్వలేను. ఎందుకంటారా? ఆ ఉంగరం నా దగ్గర లేదు కనుక!" కుదురుగా కూర్చుని, టిన్ను లోంచి సిగరెట్టు తీసి, వెలిగించి, ఒక దమ్ము లాగి, పొగని బయటికి చక్రాల్లా ఒదులుతూ చెప్పడం కొనసాగించాడు. "మీ ఇష్టం. నన్ను చంపుతారో! చీలుస్తారో!! మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండి. ఇంట్లో వెతుక్కుంటారా? వెతుక్కోండి! నాకేమీ అభ్యంతరం లేదు."

దొంగల నాయకుడు లోపల ఏదో గొణుక్కున్నాడు. ఆ తరువాత ముగ్గురూ ఒక మూలకి వెళ్ళి గుసగుసలాడుకోవడం మొదలెట్టేరు. ఈ వ్యవధిలో చిరంజీవి మెదడు అతి వేగంగా, యంత్రంలా పనిచెయ్యడం మొదలెట్టింది. కాని అతని మనోగత భావాలు బయటకి ఏమాత్రం తెలియనివ్వడం లేదు.

పెద్ద దొంగ నిశ్శబ్దాన్ని భంగం చేస్తూ, "అయితే ఆ ఉంగరం ఎవరి దగ్గర ఉంది?"

వాళ్ళే ప్రశ్న అడుగుతారని చిరంజీవి ముందుగానే ఊహించాడు. అందుచేత తయారుగా ఉన్న సమాధానాన్ని తడుముకోకుండా చెప్పేడు.

“నేను ముందే చెప్పానుగా! అది అనంతం దగ్గరే ఉంది. అతనింకా బ్యాంకులో దాచకుండా ఉంటే, అది అతని దగ్గరే ఉండాలి మరి....అన్నట్టు, ఇంకా బ్యాంకులో దాచలేదు.  కనుక అది ఇప్పుడు అతని దగ్గరే ఉంది...రేపు ఉదయం వెళ్ళి బ్యాంకులో దాస్తానని నాతో చెప్పడం చెప్పేడు.

కాస్సేపు మళ్ళా గది అంతా నిశ్శబ్దం ఆవరించింది. ముగ్గురూ మంతనాలయాక ఒక నిశ్చయానికి వచ్చినట్లున్నారు. చిరంజీవి నిశ్చింతగా మెలికలు తిరుగుతూ గాలిలోకి పోతూన్న సిగరెట్టు పొగని పరిక్షిస్తూ  కూర్చున్నాడు కుర్చీలో. ఇంతలో దొంగల నాయకుడు ముందుకొచ్చి చిరంజీవికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూలబడ్డాడు.

“చిరంజీవి గారూ!” అంటూ మర్యాద ఉట్టిపడేలా సంబోధించి చెప్పడం మొదలెట్టేడు. నూరు ఆరైనా, ఆరు నూరైనా ఆ ఉంగరం మేము తీసుకెళ్ళి తీరతాం. అందుకు మీ సహాయం కూడా కొంత ఉంటే....”

“వీల్లేదు. మూడు తుపాకులు నా వైపు గురిపెట్టి ఉన్నంత సేపూ నేను రవంత సహాయం కూడా చెయ్యను.” వెటకారంగా నవ్వడం మొదలెట్టేడు చిరంజీవి.

“లేదు లెండి. ఇహ తుపాకులతో పనేముంది,” అని నాయకుడు అనడం తోటే మిగిలిన ఇద్దరూ గురి పెట్టి పట్టుకున్న తుపాకులని కిందకి దించేశారు.

“ఆ ఉంగరం ఎలాగైనా మా చేతుల్లో పడేలా చెయ్యాలి. అందుకుగాను మీరు అనంతం గారికి ఒక చిన్న ఉత్తరం ముక్క రాసివ్వండి.”

“ఉత్తరమా?....ఇంత అర్ధరాత్రప్పుడు ఉత్తరం రాసివ్వడమా? క్షమించాలి. ఆ విషయం కలలో కూడ తలపెట్టవద్దు.”  చిరంజీవి అద్భుతంగా నటిస్తున్నాడు.

దొంగల నాయకుడి ముఖంలో కోపం ప్రజ్వరిల్లింది. అతని కళ్ళు చింత నిప్పుల్లా తయారయాయి.

“తెలివి తక్కువ పెద్దమ్మా! మమ్మల్ని నిరాకరిస్తే నువ్వు రేప్పొద్దుట సూర్యోదయం చూడవు! జాగ్రత్త!!
“ఒరేయ్! వీడి నోట్లో గుడ్డలు కుక్కి కాళ్ళూ చేతులూ కట్టేసి ఆ మూల పడేయండిరా!” ఒళ్ళంతా కుళ్ళబొడుస్తే దార్లోకి వస్తాడేమో చూద్దాం.”

వెంటనే అనుచరులిద్దరూ ముందుకు దూసుకు వచ్చి చిరంజీవి చేతులు రెండూ గట్టిగా పట్టుకున్నారు. చిరంజీవి కోపంతో విడిపించుకునే వాడిలా కొంత సేపు ప్రయత్నించి చివరికి ఉత్తరం రాయడానికి అంగీకరించేడు.

“ఆఁ! అలా దారిలోకి రండి చిరంజీవి గారూ! మూర్ఖత్వం ఆరోగ్యానికి మంచిది కాదు.”

“అయితే ఉంగరం మీ చేతికొస్తే నన్ను త్వరగా విడచి పెడతారా?”

“నిస్సందేహంగా! అసలు మా పథకం కూడ అదే. ఉంగరాన్ని సంపాదించడం వరకే మా లక్ష్యం. అంత వరకూ మిమ్మల్ని మాత్రం వదలిపెట్టం.”

ఉత్తరం రాయడానికి చిరంజీవి కాగితం, కలం తీసుకున్నాడు. చిరాగ్గా కనుబొమలు ముడిచేడు. తర్జన భర్జనలు సలిపి తప్పదన్నట్లు ఉత్తరం  రాయడం మొదలుపెట్టేడు.

“అనంతం! – పాత సంగతులన్నీ మరచిపో
పావన్‌లాల్ వద్ద ఉదయం తెచ్చిన అంగులీ
యకాన్ని ఈ మిత్రుల ద్వారా పంపించు. సు
ముఖుడవవుతావని నమ్ముతున్నా. వందనాలు.

మొ. చి.”

దొంగలనాయకుడా ఉత్తరాన్ని అందుకుని రెండు, మూడు సార్లు జాగ్రత్తగా చదువుకున్నాడు. సంతృప్తిగా ఊపిరి పీల్చి ఆ ఉత్తరాన్ని తన అనుచరులకి ఇచ్చి అనంతం దగ్గరకి అది తీసికెళ్ళి ఉంగరం పట్టుకురమ్మని పురమాయించేడు.

వార్తాహరులు గడప దాటి, బయటకి వెళ్ళి, తలుపు ముయ్యగానే చిరంజీవి పిచ్చెత్తినట్లు నవ్వడం మొదలెట్టేడు.

"పిచ్చెత్తుతూందా! ఏమిటా నవ్వు?

"అర్ధరాత్రి వేళ ఆగంతకుల్ని చూసి అనంతం ఆవేశపడతాడో, ఏమో! ఏమైతేనేమి. ఆ ఉత్తరం బాగా పనిచేస్తుంది."

నీ ఉద్దేశం ఏమిటన్నట్లు చూసేడు నాయకుడు.

"అవును. బాగా పనిచేస్తుంది. వెళ్ళిన వాళ్ళు తిరిగి రావాలిగా. ఈ లోగా నేనో కునుకు తీస్తాను."

"అప్పుడే కాదు. ఉంగరం మా చేతికి రావాలి, అప్పుడు మీకు విశ్రాంతి దొరుకుతుంది."

ఆ:! ఆ:! అంతే… మిస్టర్ మీ పేరే చెప్పేరు కాదు!"

"గజదొంగ!"

ఏమండీ గజదొంగ గారూ! అనంతం డిటెక్టివ్ కథలు వెర్రిగా చదువుతాడని మీకు చెప్పానా?"

"ఊ:! మంచి పనే!"

"ఎక్కడ లేని డబ్బూ ఈ పుస్తకాలకే తగలేస్తాడు."

"……...."

అక్కడున్న కాఫీ ని చెరో గ్లాసు లోనూ పోసుకుని ఇద్దరూ తాగడం మొదలు పెట్టేరు.

“గజదొంగ గారూ! నా సంగతి మీకు తెలియక పోవచ్చు. ఇలాంటి ఉంగరాలు మీరు పది తీసుకెళ్ళినా నాకు ఖాతరు లేదు. ఎందుకంటారా? దానికి పది రెట్లు నేను గుర్రప్పందాల్లో గెలుచుకో గలను.

“……..”

చిరంజీవి తన రిస్టు వాచీ ఒక సారి చూసుకున్నాడు. మరో అయిదు నిమిషాలు. తప్పితే పది నిమిషాలు. ఈ లోగా చిన్న నాటకం ఆడొచ్చు.

“మిస్టర్ దొంగ గరూ! అంగులీయకం వర్ణక్రమం ఏమిటో చెప్పగలరా?”

దొంగ విసుగ్గా చూసేడు.

ఈ మెడ్రాసు వచ్చిన తర్వాత తెలుగు అక్షరాలు సరిగ్గా రాయడమే మరచి పోయాను. అందుకని అడుగుతున్నా. … చూశారూ? మునుపు మొగుళూరి చిరంజీవి అని పూర్తి పేరు సంతకం చెసేవాణ్ణి. ఈ చెన్నపట్నం వచ్చి తెలుగు మరిచిపోతున్నా. అందుకని పొడక్షరాలతో సంతకం చెయ్యడం మొదలెట్టా!”

“నీ సోది కట్టిపెట్టవయ్యా.”

“ఆఁ! ఇంక రెండు నిమిషాలు ఉంది.

“ఏమిటి రెండు నిమిషాలు? నీకు పిచ్చెక్కిందా? లేక నీ జీవితం రెండు నిమిషాలలో మూడుతుందని లెక్కెట్టుకుంటున్నావా?” షట్ అప్!”

“నేను చెప్పానుగా! అనంతం డిటెక్టివ్ కథలంటే పడి ఛస్తాడనీ, మర్మార్థాన్ని ధ్వనించే ఉత్తరాలలో అర్థాన్ని ఇట్టే గ్రహించెస్తాడనిన్నీ. నా ఉత్తరంలో ముఖ్యమైన విషయం ఈ పాటికి కనిపెట్టి ఉంటాడు… ఏమంటావ్! ఆ ఉత్తరంలో ఉన్న మొదటి అక్షరాలూ, చివరి అక్షరాలూ కలిపి చదివేరా, గజదొంగ గారూ? భలే అర్థం రావడం లేదూ? ‘అపాయము – పోలీసులు’. అంచేత అనంతం ఇక్కడికి ఇప్పట్లోనో, ఇహలోనో పోలీసులని వెంట పెట్టుకు వస్తాడు. … ఓఁ! అప్పుడే వచ్చేశాడు! గజదొంగ గారూ, వెనక్కి తిరిగి చూడండి.”

గదంతా అప్పటికే పోలీసులతో నిండి పోయింది. వాళ్ళు తుపాకులు బయటకి తీసి, ముసుగు మనుష్యులకి బేడీలు తగిలించేరు.

"ఒరే, అనంతం! ఈ పెద్దమనుష్యులని ఎలా ఒదిలించుకోవడమా అని ఇందాకట్నించి సతమతమవుతున్నానురా! ఉంగరం పంపమని వ్రాసే సరికే ఇందులో ఏదో కిటుకు ఉందని గ్రహిస్తావనే నమ్మకంతో మనిద్దరం పోట్లాడుకొన్నట్లు కథ కల్పించి చెప్పేను, వీళ్ళతో. వీళ్ళకి అనవసరంగా రెండు సార్లు కాఫీ కూడా పొయ్యవలసి వచ్చింది."

చిరంజీవి నవ్వుతూ దొంగలనాయకుడి వైపు తిరిగేడు.

"చిరంజీవి గారూ! భలే తెలివితేటలుగా తప్పించుకున్నారే! మాకే టోపీ వేశారు!" అభినందిస్తూ పోలీసుల వెనకాల నిలబడ్డాడు దొంగల నాయకుడు.

"తెలివితేటలా? ఆఁ!...నన్ను పూర్తిగా చెప్పనివ్వండి. కొన్ని అక్షరాలు వ్రాయడం ఎలాగో మరచి పోయానని చెప్పాను కదూ? మొ. చి. అనే పొడి అక్షరాలు కదూ సంతకం చేసేను? ఉత్తరంలో ఉన్న నాలుగు పంక్తులలోనూ మొదటి అక్షరాలూ, చివరి అక్షరాలూ చదవమని అనంతానికి అదీ సూచన. అది చూసుకునే అతను తెలుసుకున్నాడు ఉత్తరంలోని అంతరార్థం. ఇంకో విషయం. మీరడిగిన వజ్రపుటుంగరం అనంతం దగ్గర లేదని ఇప్పటికైనా మీకు అవగతమైందనుకుంటా. మీలో ఒక్కడికైనా బుద్ధి ఉంటే అది మీకు దక్కేదే! నా చేతులారా ఇస్తే వెనక్కి విసిరేశావు, వెండి పేపర్‌వెయిట్ ని. ఇదిగో చూడు." అంటూ పేపర్‌వెయిట్ కి అడుగున ఉన్న రంధ్రం గుండా వేళ్ళు పోనిచ్చి ధగ ధగ మెరుస్తూన్న వజ్రపుటుంగరాన్ని బయటకి లాగి బల్ల మీద పెట్టేడు, చిరంజీవి.

దొంగలు తెల్ల మొహాలేసుకుని పోలీసుల వెంబడి బయటకి నడిచేరు.

(M. V. Mathew  రాసిన Palladium Paperweight ఆధారంగా)

# డబ్బు! డబ్బు!! డబ్బు!!!
(ఆంధ్రపత్రిక, 8 ఆగస్టు 51)

ఫేక్టరీ కూసి అరగంట అయింది. కూలీలు, గుమస్తాలు ఇళ్ళకి వెళ్ళిపోయారు. ఆ రోజు లెక్కలన్నీ సరిచూసుకోవడంలో ఆలశ్యమయిన వీరాస్వామి కూడ కాగితాలన్నీ జాగ్రత్త చేసుకుని ఇంటికి వెళ్ళడానికి లేచేడు. ఫేక్టరీ నుంచి వీరాస్వామి ఇంటికి రమారమి రెండు మైళ్ళు ఉంది.

వీరాస్వామి ఆరు సంవత్సరాల నుండి ఫేక్టరీలో గుమస్తాగా పని చేస్తున్నాడు, అరవై రూపాయల జీతం మీద. ఆ జీతంతోనే భార్యనీ ఇద్దరు పిల్లలనీ పోషించాలి. పైగా రెండో పిల్ల పుట్టిన దగ్గరనుండీ దాని రోగాలకీ మందులకీ ఎంత డబ్బైనా చాలడం లేదు.  అయినా గుట్టుగా సంసారాన్ని ఈదుకు వస్తున్నాడు వీరాస్వామి.

వీరాస్వామి ఫేక్టరీ ఆవరణ దాటి కొంత దూరం వచ్చేసరికి ఆకాశం మెల్లమెల్లగా నల్లబడుతూంది. ఉండి ఉండి నీటి మీదనుండి వచ్చే గాలి శరీరం మీంచి చల్లగా జారి మనస్సుకి ఆహ్లాదాన్ని కలుగజేస్తూంది. వీరాస్వామి నడకలో కొంచెం వేగం హెచ్చించాడు. పేసింజరు స్టేషన్ వదలి వెళ్ళిపోతూంది. అప్పుడే తొమ్మిది గంటలు అయిందన్న మాట! రైలు కట్ట అక్కడికి ఇంకా అరమైలు దూరం ఉంది. అక్కడ నుండి ఇంటికి మరొక మైలు. నల్ల మబ్బులు అంతకంతకు ఎక్కువ అవుతున్నాయి. వీరాస్వామి మరింత వేగం హెచ్చించాడు. రైలు కట్ట మీదకి వచ్చి ఒకసారి స్టేషన్ వైపు చేశాడు. స్టేషన్‌లో మనుషులున్న అలికిడి లేదు. అంతా వెళ్ళిపోయి ఉంటారనుకున్నాడు. స్టేషన్ నుండి ఊళ్ళోకి పోయే రోడ్డు మీద కూడా జనసంచారమేమీ లేదు. మెలికలు తిరిగిన రోడ్డు మబ్బుల నీడని నల్ల త్రాచులా కనిపిస్తోంది.

ఆకాశంలో నల్ల మబ్బులు చాల దట్టంగా అల్లుకున్నాయి. గాఢాంధకారంలో అప్పుడప్పుడు మెరిసే మెరుపుల వల్ల దారి మాత్రం కనబడుతూంది. వర్షం ఉప్పెనగా వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. వీరాస్వామి చేతిలో గొడుగు కూడా లేదు. వీరాస్వామి పరుగెత్తడం మొదలెట్టేడు. అతని పరుగుకి వాలు గాలి కూడా కొంచెం సహాయం చేస్తూంది. ఇంకొక అరమైలు శ్రమ తీసుకుంటే ఇల్లు చేరుకోవచ్చు.

చినుకులు ప్రారంభం అయాయి. పగలల్లా కాలిన నేల మీద చినుకులు పడుతూ ఉంటే భూమి లోంచి ఒక రకమైన వింత సౌరభం వస్తూంది. పరిగెడుతూన్న వీరాస్వామి మరింత వేగం హెచ్చించాడు. కాస్త

దూరం ముందుకు పోయి, “అబ్బా!' అని ఛట్టున ఆగిపోయేడు. ఎదురు దెబ్బ తగిలింది. వీరాస్వామి ఒంగుని కాలు తడుముకున్నాడు. బొటన వేలు బ్రద్దలయి రక్తం కారుతూంది. “ఎంత గట్టిగా తగిలింది!” అనుకున్నాడు.

వీరాస్వామి మళ్ళా పరుగెత్తడం మొదలుపెట్టేడు. పది గజాలు పరిగెత్తేడో లేదో మళ్ళా కాలికేదో తగిలి జరజరా ముందుకి వెళ్ళి ఆగిపోయింది. ఈ సారి తగిలిన వస్తువు గట్టిగా లేదు; మెత్తగా ఉంది. వేగంలో వీరాస్వామి రెండడుగులు ముందుకి వేసి ఆగిపోయాడు. ఆకాశం మెరిసింది. ఆ వెలుగులో వీరాస్వామి రక్తంతో తడిసిన తన చెయ్యి చూసుకున్నాడు. ఆ వెలుగులోనే తన కాలికి తగిలిన వస్తువు కూడా అస్పష్టంగా కనిపించింది - నల్లగా, మిలమిలా మెరుస్తూ! అదేమిటో అతనికి సరిగ్గా కనపడలేదు. పామేమో అనుకున్నాడు. కాని పాములా లేదే! పామైతే ఇంకా అక్కడ పడుంటుందా అని అనుమాన పడుతూ ఉండగానే ఆకాశం మళ్ళా మెరిసింది. ఈ సారి జాగ్రత్తగా గమనించేడు వీరాస్వామి. పర్సు!...ఎక్కడో పిడుగు పడ్డట్లుంది. వీరాస్వామి గుండె దడదడలాడింది. అరచేతి వెడల్పైన నల్లటి పర్సు ... వెలుగులో మెరిసి చీకట్లో మాయం అయిపోయింది. వీరాస్వామి కళ్ళు చీకట్లు కమ్మేయి. సంభ్రమాశ్చర్యాలతో మళ్ళా మెరుపు మెరిసే వేళకి కిందికి ఒంగి పర్సు అందుకున్నాడు. ఆ చీకట్లోనే నాలుగు పక్కలా ఒకసారి కలయ జూశాడు. దూరంలో నక్కలు అరుస్తూన్న చప్పుడు తప్ప మరొక అలికిడి లేదు. ఆ చుట్టుపట్ల మరొక మనిషి కనపడ లేదు. వీరాస్వామి ఆ చీకట్లోనే పర్సుని విప్పి లోపల తడిమి చూశాడు. నోట్లు!..కాగితాలన్నిటినీ పర్సు లోంచి తీసి జేబులో పెట్టుకున్నాడు. ఖాళీ పర్సు ఆ చీకట్లో పొలాలలోకి గిరాటేశాడు. వీరాస్వామి జాగ్రత్త మనిషి. చాలా చిన్న విషయంలోనూ బహు జాగ్రత్త పడతాడు.

చినుకులు అంతకంతకు ఎక్కువవుతున్నాయి. ఈ సారి వీరాస్వామి పందెపు గుర్రంలా పరుగెత్తినా, అతనికి ఆయాసం అనిపించలేదు. వీరాస్వామి ఇంటికి వచ్చేసరికి వర్షం బాగా పెద్దదయింది. తొడుక్కున్న కోటు తడిసినా, లోపలి జేబులో ఉన్న డబ్బు తడవకుండా జాగ్రత్త పడగలిగేడు. ఇంట్లోకి వెళుతూనే వీరాస్వామి సరాసరి తన గదిలోకి వెళ్ళిపోయాడు. డబ్బంతా కాగితంలో చుట్టబెట్టి, జాగ్రత్తగా డ్రాయరులో దాచి అప్పుడు నడవలోకి వచ్చేడు.

“అయ్యో! తడిసిపోయినట్లుంది. ఆ కోటు విప్పెయ్యరాదూ?” అంది అతని భార్య ఎదురుగా వచ్చి.

వీరాస్వామి కోటు తీసి భార్యకి ఇస్తూ “దండెం మీద వెయ్యి, ఆరుతుంది” అన్నాడు.

కోటు అందుకుంటూ అతని భార్య యధాలాపంగా అతని కాలివైపు చూసింది. “అంత దెబ్బ తగుల్చుకున్నారేమిటండీ? ఎంత రక్తం కారుతూందో!” అంది. వీరాస్వామికి ఈ మాటలు వినబడనే లేదు. అతనేదో పరాగ్గా ఆలోచిస్తున్నాడు. గాలిలో మేడలు కడుతున్నాడల్లే ఉంది. శాంతమ్మ మళ్ళా అడిగింది.

“చీకట్లో కాలికి రాయి తగులుకుంది.”

శాంతమ్మ కోటుని దండెం మీద ఆరేసి, గాయం మీద మందు రాసి కట్టు కట్టింది. “ఏం పాడు రోజమ్మా! ఈ వేళ ఎంత దెబ్బ తగుల్చుకున్నారో! కాస్త జాగ్రత్తగా చూసుకుని నడవకూడదుటండీ?...ఇక భోజనానికి లేవండి. చాలా రాత్రయిపోయింది,” అంటూ వంట ఇంట్లోకి వెళ్ళిపోయింది, భర్తకు వడ్డించడానికి. వీరాస్వామి చాలా జాగ్రత్త మనిషి. ఎంత జాగ్రత్తగా ఉన్నా దెబ్బ తగిలింది.

మంచం ఎక్కిన దగ్గరనుండి వీరాస్వామి భవిష్యత్తు గురించి కలలు కనడం మొదలు పెట్టేడు. అతనికి నిద్ర పట్టడం లేదు. అసలతను నిద్రపోడానికి ప్రయత్నం చెయ్యడం లేదేమో! మసిబారిన దీపం మసక మసగ్గా వెలుగుతూంది. భార్యా, ఇద్దరు పిల్లలూ నిశ్చింతగా నిద్ర పోతున్నారు, క్రింద పరచిన చాప మీద, దీపం క్రీనీడలో. కిర్రు మంచం మీంచి వీరాస్వామి చప్పుడు చెయ్యకుండా దిగి డ్రాయరు దగ్గరకి వెళ్ళేడు. సొరుగులో దాచిన డబ్బు పైకి తీసేడు. సంభ్రమంలో నైనా సరిగ్గానే లెక్క పెట్టేడు. సరిగ్గా రెండు వందల నోట్లు! అన్నీ వందరూపాయల నోట్లే!! డబ్బంతా మళ్ళా యధాప్రకారంగా కాగితంలో మడిచి డ్రాయర్లో, కాగితాల అడుగున దాచి, తన మంచం మీదికొచ్చి  పడుక్కున్నాడు.

ఈ సారి వీరాస్వామి నిద్రని కావాలనే పారద్రోలాడు.  అతనిప్పుడు పెద్ద సమస్యలో పడ్డాడు. దొరికిన ధనాన్ని ఎలా వినియోగించుకోవాలా అని అతని ఆలోచన. తన భార్యా బిడ్డలకి ఇక ఒంటి నిండా బట్టా, కడుపు నిండా తిండీ దొరుకుతాయి…. తన ఊహ ఎంతవరకూ వెళ్ళగలదో అంతవరకూ ఆలోచిస్తున్నాడు వీరాస్వామి…. ముందు పాత బాకీలన్నీ తీర్చెయ్యాలి. చక్కగా ఓ ఇల్లు కట్టించుకోవచ్చు. లేకపోతే ఓ పొలం కొనుక్కోవచ్చు. భారీ ఎత్తున ఏదైనా వ్యాపారం చేసినా చెయ్యొచ్చు. కాసేపు ఆలోచించేసరికి ఇవేమీ మంచి పనులలా కనబడలేదు. ఎందుకంటే తనకింత డబ్బు ఒక్కసారి ఎలా వచ్చిందోనని లోకులు అనుమానించక మానరు. తనకి డబ్బు దొరికిందన్న విషయం నలుగురికీ తెలిస్తే ఎప్పటికయినా ప్రమాదమే. మరో విధంగా ఏమైనా చెయ్యవచ్చేమోనని బాగా ఆలోచించాడు వీరాస్వామి. డబ్బు బంగారం కింద మార్చి భార్యకూ, పిల్లలకూ నగలు చేయించిపెడితే బాగుంటుంది… అసలు తనకి ఇరవై వేల రూపాయలు దొరికాయన్న సంగతి భార్యకి చెప్పాలా? వద్దా? అబ్బే! ఎంత

దగ్గర వాళ్ళైనా ఆడవాళ్ళకి మాత్రం రహస్యాలు చెప్పకూడదు. వాళ్ళ నోట్లో నువ్వు గింజ నానదు. వాళ్ళు సుఖ పడడమే ముఖ్యం కాని, ఈ విషయం భార్యకి చెప్పకపోయినంతలో నష్టమేమొచ్చింది? – అంతు తెగని ఆలోచనిలా ముసురుకుంటూ ఉండగానే అతనికెప్పుడో నిద్ర పట్టేసింది.

మర్నాడు వీరాస్వామి లేచే సరికి బారెడు పొద్దెక్కింది. అతను లేచే సరికి శాంతమ్మ  కాఫీ తయారు చేసి, తీసుకొచ్చి ఎదురుగా నించుంది. ఆతను గ్లాసు పుచ్చుకున్నాడు.

"ఏమండీ! అంత డబ్బెక్కడిదీ?" దీర్ఘం తీస్తూ అంది శాంతమ్మ, భర్త ముఖంలోకి ఆశ్చర్యంగా చూస్తూ.

హఠాత్తుగా ఈ ప్రశ్న వినేసరికి తాగుతూన్న కాఫీ కాస్తా తొణికి బట్టల మీద పడింది. "డబ్బేమిటి?" అన్నాడు తమాయించుకుని.

"డ్రాయర్లో పెట్టారే…"

"ఓ! అదా? ఆది మనది కాదులే!"

"ఎవరిదండీ?"

ఊఁ. చాలు కానీ, అధిక ప్రసంగం చెయ్యకు. నోరు మూసుకుని నీ పని చూసుకో!

శాంతమ్మ అక్కడ నుండి వెళ్ళిపోయింది. ఈ ఆడవాళ్ళ కళ్ళు కప్పడం కష్టం. తన భార్య 'డబ్బు విషయం అప్పుడే పసిగట్టిందే,' అనుకున్నాడు. అప్పటికప్పుడు తాళం చెవి తెచ్చి, డ్రాయరు బిగించి, తాళం చెవి జేబులో వేసుకుని, భోజనం చెయ్యకుండానే ఫేక్టరీకి వెళ్ళిపోయేడు, వీరాస్వామి.

వీరాస్వామి ఆనంద వాహినిలో తేలిపోతున్నాడు. దొరికిన పెన్నిధిని సద్వినియోగ పరచే ఉపాయాలను ఆలోచించడంలో అతనికి ఊపిరాడ్డం లేదు. ఆ వేళ సాయంత్రం వరకూ ఉన్న ఉల్లాసం సాయంత్రం పేపరు చూడగానే  హారతి కర్పూరంలా హరించి పోయింది. దిన పత్రికలో అతను చూసిన విషయం అతన్ని బాగా కలవర పెట్టింది. ఆత్రంగా అదే విషయాన్ని అతను పదే పదే చదివేడు.

“పీపుల్స్ బ్యాంకు తాలూకు ఇరవై వేల రూపాయలు నిన్న సాయంత్రం పోయినట్లు మా కార్యాలయానికి వార్త వచ్చింది. పోయినవన్నీ వంద రూపాయల నోట్లు. ఈ సందర్భంలో పోలీసు దర్యాప్తు జరుగుతూంది. పోలిసు వారి చేత పట్టుబడే లోగా ఆ సొమ్ముని స్థానిక సబ్ ఇనస్పెక్టర్ గారికి అందజేసిన వారికి వెయ్యి రూపాయలు బహుమానం ఇవ్వబడుతుంది. – రంగారావు, పోలీస్ సబ్ ఇనస్పెక్టర్”

ఆ ప్రకటన క్రింద పోయిన నోట్ల తాలూకు నంబర్లు అన్నీ వరసగా ఉన్నాయి.

ఫేక్టరీ ఇంకా వదిలే వేళ కాలేదన్న సంగతి మరచి పోయి, వీరాస్వామి ఉన్న పళాన ఇంటికి పరిగెత్తేడు. వెళుతూనే సొరుగు తెరచి నోట్ల మీద ఉన్న నంబర్లు చూసాడు. దినపత్రికలో ప్రచురించబడ్డ నెంబర్లూ, ఇవీ – అన్నీ సరిగ్గా సరిపోయాయి! వీరాస్వామికి మిన్ను విరిగి మీద పడ్డట్లయింది. ఇంక ఆ డబ్బు మార్చుకోవడం కష్టతరం, కష్టతమం! అంత పెద్ద నోట్లు మార్చడానికి ఎక్కడికి తీసుకెళ్ళినా తను పట్టుబడి పోతాడు. ఈ పోలీసు వాళ్ళున్నారే! ఆవలిస్తే పేగులు లెక్కపెడతారు. అనుమానం మీద తన ఇల్లు సోదా చేసినా చెయ్యొచ్చు. ఇటువంటి పరిస్థితులలో ఆ డబ్బు ఇంట్లో పెట్టుకుని ఉండడం అట్టే శ్రేయస్కరం కాదు.

వీరాస్వామికి మతి చలిస్తూంది. లేచి సరాసరి నరసయ్య నాయుడి దగ్గరకి పరిగెత్తేడు. నరసయ్య నాయుడు వీరాస్వామికి చాల దూరపు బంధువు. ఆ ఊళ్ళో ఒక మూలగా నరసయ్య నాయుడికో ఇల్లుంది. ప్రస్తుతం అది ఖాళీగా ఉంటూంది. తీరుబడిగా ఉన్నప్పుడు వీరాస్వామీ, నరసయ్యా చదరంగం ఆడుకుంటూ ఉంటారు. అందుచేత ఇద్దరికీ పరిచయం జాస్తీ.

నరసయ్యతో కాస్సేపు పిచ్చాపాటీ మాట్లాడి, మాటల సందర్భంలో అడిగేడు వీరాస్వామి.

“ఏమోయ్ నరసయ్యా! నీ ఇల్లు ఖాళీగా ఉన్నట్లుందే.”

“అవునయ్యా, ఊరికి ఓ మూల అయిపోవడం వల్ల  ఎవ్వరూ అద్దెకి రావడం లేదు. నీ ఎరికని ఎవరైనా ఉంటే చూద్దూ, అద్దెకి ఇచ్చెద్దాం. ఖాళీగా ఉండడం వల్ల అద్దె దండగ అయిపోతూంది.”

“ఎవరికో ఎందుకు, నాకే ఇయ్యి.”

“ఆఁ! నీకేం సరిపోతుందిలే. అయినా నువ్వక్కడెక్కడో ఉంటున్నావుగా.”

“అంటే, కుటుంబం అంతకీ కాదులే. నాకే కావాలి. ఇంటి దగ్గర పిల్లల అల్లరి ఎక్కువ అవుతూంది. ఏదైనా చదువుకుందుకూ, రాసుకుందుకూ ప్రశాంతంగా ఉండే ఇల్లు ఎక్కడైనా దొరికితే తీసుకుందామని చాలా రోజుల నుంచి అనుకుంటున్నాను.”

“నువ్వే వస్తే మరీ మంచిది. తప్పకుండా దిగు. ఏదో నీకు తోచిన అద్దె ఇవ్వ వచ్చులే.” అన్నాడు నరసయ్య. వీరాస్వామి మారు మాట్లాడకుండా తాళం తీసుకున్నాడు. అప్పటికి అతనికి కొంత శాంతి చిక్కింది.

వీరాస్వామి ఆ రాత్రే ఆ ఇంట్లో ప్రవేశించాడు, రెండు కుర్చీలు, ఒక టేబిలూ, కొన్ని పుస్తకాలతోటి. వస్తూనే గది తలుపులన్నీ మూసేసి, ఒక మూలని మోచెయ్యి లోతు గొయ్యి తీశాడు. ఇరవై వేల రూపాయలూ ఒక గట్టి రేకు పెట్టెలో పెట్టి, ఆ పెట్టెను జాగ్రత్తగా ఆ గోతిలో పాతి, గోతిని పూడ్చేసి పైన ఎప్పటిలా మట్టితో అలికేసేడు. అప్పటికి అతని మనస్సు బాగా కుదుట పడింది. తను డబ్బు ఎక్కడ దాచిందీ పోలీసులు మరి ఛస్తే కనుక్కోలేరు. ప్రతీ విషయంలోనూ వీరాస్వామి తీసుకునే జాగ్రత్త అటువంటిది!

వీరాస్వామి ఇంటి కొచ్చిన దగ్గర నుండీ మళ్ళా అతనికి ఆందోళన ఎక్కువైంది. తను డబ్బు దాస్తూన్నప్పుడు ఎవ్వరైనా చూశారేమో అనే అనుమానం ఒక పక్క పీకుతోంది.  కాని తను లోపల ఉన్నంత సేపూ తలుపులన్నీ బాగా బిగించి మరీ డబ్బు దాచిన సంగతి గుర్తుకి తెచ్చుకుని కుదుట పడ్డాడు. గోడలకి చెవులుంటాయని విన్నాడు కానీ కళ్ళుంటాయని ఎవ్వరూ అనలేదు కదా అని సంతృప్తి పడ్డాడు. ఇప్పుడతను ఆ నోట్లని మార్చుకోవడం కోసం ఉపాయాలు ఆలోచించడం మొదలు పెట్టేడు. అప్పటికే ఈ విషయం ప్రజలందరిలోకీ పాకి ఉంటుంది కనుక ఎక్కడ మార్చడానికి ప్రయత్నించినా సుళువుగా పట్టుబడి పోతాడు.  ఫేక్టరీలో ఉద్యోగులందరికీ జీతాలు బట్వాడా చేసేది తనే. జీతాలిచ్చేటప్పుడు ఈ నోట్లని అక్కడ బదలాయించి చిల్లర నోట్లని తెచ్చుకో వచ్చు. బాగా ఆలోచించిన మీదట వీరాస్వామికి ఈ పద్ధతి కూడా సమంజసంగా తోచలేదు. ఇది అన్నిటి కంటె అపాయకరమైన పద్ధతేమో అని అనుకున్నాడు. ఈ ఆలోచనలతో బుర్ర బాగా వేడెక్కిన తర్వాత ఒక నిర్ణయానికి వచ్చేడు. ప్రజల్లోనూ, పోలీసుల్లోనూ చైతన్యం సద్దు మణిగి వాళ్ళీ విషయాన్ని పూర్తిగా మరచి పోయే వరకూ డబ్బు మార్చడానికి ఎటువంటి ప్రయత్నమూ చెయ్యకూడదని నిశ్చయించుకున్నాడు.

"భోజనానికి లేవండీ. మధ్యాన్నం కూడ తిండి తినలేదు…."  ఈ మాటలతో అతని ఆలోచనలకి అంతరాయం కలిగింది.

వీరాస్వామి తలెత్తి చూశాడు. ఎదురుగా శాంతమ్మ నించుంది. "పద, వస్తున్నా!" అన్నాడు. శాంతమ్మ వంట గదిలోకి వెళ్ళిపోయింది.

భోజనం దగ్గర కూర్చున్న భర్త పరధ్యాన్నం కనిపెట్టింది, శాంతమ్మ. కూర కలుపుకోగానే, "మజ్జిగెయ్యి" అన్నాడు.

"అదేం భోజనమండీ! చారు కలుపుకోరూ?"

"అయితే పొయ్యి!"

"ఈ వేళ ఇంత పరధ్యాన్నంగా భోజనం చేస్తున్నారేమిటి?"

"ఏం లేదు. చారు పొయ్యి."

చారు పోస్తూ శాంతమ్మ అడిగింది, "డ్రాయర్లో డబ్బు ఏమైందండీ?"

"ఇచ్చేశాను. మనది కాదని చెప్పేను కదా!"

"ఇందాకా కుర్చీలూ, బల్లలూ తీసుకెళుతున్నారెక్కడికి?"

"నీకెందుకదంతా?"

"చెప్పకూడదా ఏమిటి?"

"నోరు మూసుకుని వడ్డించు."

“అయ్యో! నేనేమన్నానండీ? అంత కోపం?”

“అబ్బ! నన్ను విసిగించకు.” వీరాస్వామి తింటూన్న కంచం భార్య మీదకు విసిరేసి లేచి పోయాడు. కొద్దిలో తప్పి పోయింది కాని, శాంతమ్మకి దెబ్బ తగల వలసిందే.

“ఇంక నేనేమీ మాట్లాడను కాని వచ్చి భోజనం చెయ్యండి.”

వీరాస్వామి శాంతమ్మ బ్రతిమిలాటని లక్ష్య పెట్టకుండా గదిలోకి వెళ్ళి పడుక్కున్నాడు. డబ్బు విషయం రెండో మనిషికి తెలిసిపోయినందుకతని మనస్సు కలచినట్లయింది.

డబ్బు దొరికిన దగ్గరనుండీ వీరాస్వామి రోజరోజుకీ మారిపోతున్నాడు. ఏదో అనిర్వచనీయమైన బెంగ అతన్ని కృంగదీస్తూంది.  చీటికీ మాటికీ చిరాకు పడి భార్యని కొట్టడం మొదలు పెట్టేడు. ఆ అమాయకురాలు భర్తలో కలిగిన పరిణామాన్ని అర్థం చేసుకోలేకపోతూంది.

ఒకనాడు వీరాస్వామి ఇంటికి చాలా ఆలశ్యంగా వచ్చి తలుపు తట్టాడు. నిద్దట్లో ఉన్న శాంతమ్మకి వినిపించకపోవడం వల్ల తలుపు తియ్యలేదు. అతను తలుపు గట్టిగా బాదడం వల్ల శాంతమ్మకి మెలుకువ వచ్చింది. కళ్ళు నులుపుకుంటూ వచ్చి తలుపు తీసింది.

“రాస్కెల్! ఇంత సేపా తలుపు తియ్యడానికి?” శాంతమ్మ చెంప ఛెళ్ళు మంది. శాంతమ్మకి నిద్రమత్తు వదిలింది.

వీరాస్వామి తూలిపోతున్నాడు. అతని నోటి నుండి ముక్కు పుటాలని బద్దలు కొట్టేంత దుర్గంధం వెలువడుతూంది. భర్త బాగా తాగేడని అర్థం చేసుకుంది శాంతమ్మ. తను కాపరానికి వచ్చేసరికి సద్గుణ సంపన్నుడుగా ఉన్న వీరాస్వామి ఈనాడు ఇన్ని విధాలుగా మారిపోవాడానికి కారణం ఏమిటో ఊహించుకోలేక ఊరికే మధన పడింది. తూలిపోతూన్న భర్తకి చెయ్యి ఆసరా ఇచ్చి మంచం మీదకి చేరవేసింది.

ఉదయం లేచేసరికి వీరాస్వామి మత్తు బాగా దిగజారి పోయింది. రాత్రి జరిగిన సంఘటనలన్నీ ఒకటి ఒకటే జ్ఞాపకం వచ్చేయి. రాత్రి తను కొట్టినా తన యెడల ఎంతో సహనం చూపించిన భార్య ఎదురుగా

సాక్షాత్కరించింది. తన నీచ ప్రవర్తన తనకే వెగటనిపించింది. వీరాస్వామి రెండు చేతులలోనూ ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చేడు.

దాలిగుంటలో కుక్కలా వీరాస్వామి తాగుడు మాత్రం మానలేదు. తాగుడు మత్తులో ఉద్యోగ ధర్మం నిర్వర్తించ లేకపోయేవాడు. దాంతో ఆ ఉద్యోగం కూడ ఊడింది.

వీరాస్వామి ఉద్యోగం పోయినందుకు విచారించ లేదు. అతని దగ్గర కావలసినంత ధనముంది. అయితే అది తనకీ తన కుటుంబానికీ ఉపయోగపడేలా చెయ్యడానికి కొంత కాలం పడుతుంది. ఈ లోగా కొన్ని అవస్థలు పడక తప్పదు. వీరాస్వామి ఇంట్లో ఉన్న సామాన్లు ఒకటీ ఒకటీ అమ్మడం మొదలు పెట్టేడు.  కొంచెం ఓపిక పడితే కావలసినన్ని మళ్ళా కొనుక్కోవచ్చని అతని ధైర్యం.  అతని దగ్గర చాలా డబ్బు ఉంది!!

ఇల్లు రోజరోజుకీ శ్రీరామరక్ష అవుతూంది. దినం గడవడం కష్టంగా ఉంది. శాంతమ్మ ఎంత గుట్టుగా సంసారాన్ని ఈడ్చుకొస్తూన్నా క్రమంగా పరిస్థితులు చెయ్యి దాటి పోతున్నాయి. అయితే మాత్రం? వీరాస్వామికేం భయం? అతను ఇరవై వేల రూపాయలకి అధికారి!!

ఈ సమయంలోనే దేవుడు వీరాస్వామికి మరొక పరీక్ష పెట్టేడు. వారం రోజుల బట్టి రెండో పిల్ల చిట్టికి విపరీతంగా జ్వరం కాస్తూంది. సన్నిపాత లక్షణాలు పొడచూపేయి. పిల్లని కింద పెట్టడం, మీద పెట్టడం వరకూ వచ్చింది పరిస్థితి. కూతురు బ్రతకాలని శాంతమ్మ వెయ్యి దేవుళ్ళకి మొక్కుకుంటూంది. వైద్యం చేయించడానికి ఇంట్లో చిల్లి కానీ లేదు. శాంతమ్మ ఒంటి మీద బంగారం ఏనాడో కరిగిపోయి వాళ్ళ పొట్టల్లో ఇమిడి పోయింది. ఇంక అమ్మడానికి ఇంట్లో ముంతా, తప్పేలా కూడా లేవు. పిల్లకి ఎలాగో ఒకలాగ మందు ఇప్పించమని భర్త కాళ్ళ మీద పడిపోయింది. పెనుగాలికి కంపించే లేత కొమ్మలా ఆ మాతృ హృదయం తల్లడిల్లి పోయింది.

వీరాస్వామి వెర్రి ఆవేశంతో లేచేడు. అవసరానికి అక్కరకు రాని ధనం ఉంటేనేం? లేకపోతేనేం? ఏమైతే అయింది, దాచిన డబ్బు తీసి పిల్లకి వైద్యం చేయించాలనుకున్నాడు.

తను డబ్బు  దాచిన ఇంటి వైపు తొందరగా నడుస్తున్నాడు, వీరాస్వామి.ఆకాశంలో మబ్బు తునకలు చెలరేగుతున్నై. అతను గమ్యస్థానం చేరుకునే సరికి ఆకాశం బాగా నల్లబడింది. మెరుపులు కూడ మొదలయాయి. ఇప్పుడతను ఒక స్థిరనిశ్చయంతో ఉన్నాడు. ఏమీ చలించ లేదు. ఒక్క ఉదుట్లో

తలుపులు తెరచి లోపల ప్రవేశించాడు. గునపంతో గది మూలని మోచెయ్యి లోతు గొయ్యి తవ్వి డబ్బు దాచిన సీనారేకు పెట్టెని పైకి తీశాడు. ఒకొక్క కాగితాన్నీ పరీక్షించి లెక్క చూస్తున్నాడు. ఆ డబ్బు చూసేసరికి అతని ఊహలు మరో ప్రపంచంలో విహరించడం మొదలెట్టేయి.

“ఏం? వీరాస్వామీ! దొంగ సొమ్మేమిటి, ఇక్కడ పాతిపెట్టేవు?” వెనక నుంచి నరసయ్య వికటంగా నవ్వేడు. వీరాస్వామికి గతించిన విషయాలు – చీకట్లో సొమ్ము దొరకడం, దిన పత్రికలలో ప్రకటనలూ, సొమ్ము దొరికిన దగ్గరనుండి తన అవస్థా – మస్తిష్కంలో మారు మూల దాగిన జ్ఞాపకాలన్నీ విజృంభించి అతని బుర్రలో ఒక్క సారి గిర్రున తిరిగేయి. వీరాస్వామి వాస్తవిక ప్రపంచంలోకి వచ్చేడు. మళ్ళా అతని బుద్ధి నిశితంగా పని చెయ్యడం మొదలు పెట్టింది. గదిలోకి వచ్చిన సంభ్రమంలో తలుపు వెయ్యడం మరిచి పోయేడు. తను ఇప్పుడు నరసయ్య కళ్ళ పడిపోయాడు. డబ్బు చూసి నరసయ్య అప్పుడే విషం కక్కుతున్నాడు కూడ! వాడేదో ప్రమాదం తీసుకొస్తాడనడంలో సందేహం లేదు. వీరాస్వామి మెదడు చాలా తొందరగా పని చేస్తూంది. ఏనుగు మీదకి లంఘించే కొదమ సింగంలా నరసయ్య మీదకి వీరాస్వామి ఉరికేడు. చేతిలో ఉన్న గునపంతో నరసయ్య బుర్ర మీద ఒక్క వేటు వేసాడు. “అబ్బా!” అంటూ నరసయ్య నేలకొరిగిపోయేడు.  బయట దూరన్నెక్కడో పిడుగు పడ్డట్టుంది – ఆకాశం భీకరంగా గర్జించింది.

వీరాస్వామి ఆలోచనలు ఇంటివైపు పరుగులు తీశాయి. తనింటికి వెళ్ళేసరికి చిట్టి ఎలా ఉంటుందో? ఏమైతే అయింది. డాక్టరు ముఖాన్న డబ్బు వెదజల్లి చిన్నారికి మంచి వైద్యం చేయించాలి. ఆ తర్వాత తను పట్టుబడ్డా బాధ లేదు. ఆ డబ్బు చిట్టినైనా కాపాడగలిగితే చాలు. సొమ్ము చేత్తో పట్టుకుని వీరాస్వామి వెనక్కి చూడకుండా ఇంటికి పరిగెత్తేడు.

“ఇదిగో! డబ్బు తెచ్చేను, చిట్టీ! డాక్టర్ని తీసుకొస్తానమ్మా!” అంటూ ఇంట్లో జొరబడ్డాడు. ఇంకెక్కడి చిట్టి? అప్పటికే చిట్టి ప్రాణాలు నీలాకాశంలో లీనమై పోయాయి. శాంతమ్మ స్మృతి లేకుండా కూతురు శవం పక్కన బోర్లా పడి ఉంది. ఆమె శుష్కించిన చెక్కిళ్ళ మీద ఎండిన కన్నీరు చారికలు కట్టింది. పెద్దమ్మాయి ఒక మూలని కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తూంది.

ఈ దృశ్యం చూసేసరికి పితృ హృదయం లో దుఃఖం వెల్లువలై పారింది. వీరాస్వామి చేతిలో ఇరవై వేల రూపాయిలూ గాలికి రెపరెపలాడేయి.

వీరాస్వామికి మతి పోయింది; ఈ సారి పూర్తిగా పోయింది. చేజేతులా తన పిల్లని చంపుకున్నానే అనే బాధ ఎక్కువై అతని మనస్సుని కలచి వేస్తూంది. జుట్టు పీక్కుంటూ వీధిన పడ్డాడు – పిచ్చి వాగుడుతో! వర్షం జోరు తగ్గ లేదు. బురదని చిందించుకుంటూ వీరాస్వామి ఊరికి దక్షిణంగా బయలుదేరేడు. వర్షం వల్ల నిర్మానుష్యంగా ఉన్న వీధుల వెంబడి ఎక్కడికి వెళుతున్నాడో అతనికే తెలియదు. అయినా అతని కాళ్ళు ఎక్కడికో లాక్కుపోతున్నాయి.

ఊరి బయట వంతెన మీదుగా నడుస్తున్నాడు, వీరాస్వామి. వంతెన కింద గట్లు తెంపుకుని ప్రవహిస్తూంది ఏరు. పిచ్చెక్కిన మెదడు పాత విషయాలని జ్ఞాపకం చేసుకుంటూంది. వంతెన మీద నడుస్తూన్న వీరాస్వామి కాలు జారి ఏట్లో పడ్డాడు.

గుప్పిట్లో ఉన్న రెండు వందల కాగితాలూ కాగితపు పడవల్లా తేలుతూ ప్రవాహపు వాలున సాగిపోయాయి.

అసలు వీరాస్వామి చాలా జాగ్రత్తగా నడుస్తాడు. అయినా కాలు జారింది!

* * * *  *

## క్లెప్టోమేనియా
(చిత్రగుప్త, 1951?)

ఆ అమ్మాయి గదిలో ఇటూ అటూ ఒక సారి తిరిగింది. తొడుక్కున్న దుస్తులన్నీ తీసేసింది. నైట్ డ్రెస్ ధరించి మంచం దగ్గరకి వచ్చింది. పరుపు మీద పడుక్కుంది. కనురెప్పలు బరువుగా వాలిపోయాయి. ఎర్రని పెదిమలు నవ్వినట్లు తెరుచుకున్నాయి. గది నిండా ఒక్కసారి వెయ్యి దీపాలు పెట్టినట్లు కాంతి వచ్చింది. ఆమెకి నిద్రాభంగమయింది. లేస్తూనే తలగడ కిందనున్న రివాల్వరు తీసింది. ఒకసారి గదిలో నలువైపులా చూసింది. తనలో తనే నవ్వుకుంది.

"మంచం కింద నుండి లేచి రావోయ్ నేస్తం," అంది రివాల్వరు చూపెడుతూ.

"ఓహో! కోయిల కంఠం," అనుకున్నాడు మంచం కింది మనిషి. మెల్లగా కదలి వచ్చి ఎదురుగా నించున్నాడు, ఆమె ముఖం కేసి చూసి నవ్వుతూ. కాని రివాల్వరు చూసి లోపల కొద్దిగా భయపడుతూనే ఉన్నాడు.

* * *

మనిషిని చూస్తే దొంగతనం వల్ల బ్రతకవలసిన వాడుగా కనబడ్డం లేదు. కాని అతను తన గదిలోకి జొరబడ్డ దొంగ. పైగా గజదొంగేమో కూడ. మధ్య తరగతి కుటుంబాలకి చెందినవాడులా ఉన్నాడు. ముఖం చూస్తే బాగా చదువుకున్నవాడని తెలుస్తూంది. పెద్ద పెద్ద ఉద్యోగాల్లో ఉన్న బంధువులు అతనికి చాలామంది ఉండుండచ్చు. అతనాట్టే వయస్సు చెల్లిన వాడు కూడా కాదు. పాతిక సంవత్సరాలకి పైనుండుంటుందతని వయస్సు. మంచి ఆజాను బాహుడు. స్ఫురద్రూపి.

అతని నొక్కుల నొక్కుల జుట్టు, విశాల వక్షస్థలం, ఎప్పుడూ చిరునవ్వుతో ఉండే ముఖం స్త్రీలను సుళువుగా ఆకర్షిస్తాయంటే అది అతిశయోక్తి కాదు. అతను ఇళ్ళల్లోకి చొరబడడం, దొంగతనం చెయ్యడం ఒక వృత్తిగా అలవాటు చేసుకున్నాడు.

ఈవేళ అతనలా వీధిలో ఊసుపోకకి తిరుగుతూ ఉంటే మేడమీది కిటికీలోని వెలుతురు అతన్నాహ్వానించింది. కిటికీ తలుపు బారుగా తెరచి ఉంది. "బాగుంది. మనం ఇక్కడ ఎందుకు ప్రయత్నించకూడదూ?" అనుకున్నాడు. వెంటనే నీటిగొట్టం మీదుగా మీదికెక్కి, పిట్టగోడ దాటి, కిటికీలోంచి లోపలికి ప్రవేశించాడు. బెడ్ రూం బల్బు కాంతిలో నవ్వినట్లు తెరుచుకున్న ఆమె పెదవులు అతనిని ఆహ్వానించేయి. అంత దూరం నుండే ఆమె లావణ్యాన్ని అర్థం చేసుకో లేక దగ్గరగా వెళ్ళి

నిద్రిస్తూన్న ముఖం మీద టార్చి లైటు వేశాడు. గదినిండా వెయ్యి దీపాలు పెట్టినంత కాంతి వచ్చింది. దిగ్భ్రమ చెందిన అతనికి అది తన టార్చి లైటు విరజిమ్మిన వెలుతురో లేక ఆమె వదన బింబం నుండి వెలువడిన వింత వెన్నెలో అర్థం కాలేదు. అప్పటికీ తృప్తి పొందని ఆ సౌదర్య పిపాసి వెన్నెలని విరియిస్తూన్న ఆ ముఖాన్ని సాధ్యమైనంత దగ్గరలో చూడాలని ఆశ పడ్డాడు. కళ్ళింత చేసుకొని అతి జాగ్రత్తగా తన ముఖాన్ని ఆమె ముఖం మీదికి - ప్రమాదం లేదని తనకి ధైర్యం ఉన్నంత వరకూ - వంచేడు. ఉద్రేకంలో వశం తప్పి స్పందిస్తూన్న అతని పెదవులు ఆమె పెదవులని తాకేయి. నిద్రిస్తూన్న సుందరి ఉలిక్కిపడి లేచింది. ఆమెకి నిద్రా భంగం అయింది. వెంటనే తలగడ కింద రివాల్వరుని తీసింది. అంతవరకూ స్వర్గ సైకతాలలో విహరిస్తున్న అతని పిరికి మనస్సు మంచం కిందకి దూరమని హితబోధ చేసింది. వెంటనే ఆత్మ సందేశాన్ని మన్నించేడు. మంచం మీది సుందరాంగి ఒక సారి నలు మూలలా చూసింది. తనలో తను నవ్వుకుంది.

“మంచం కిందనుండి రావోయ్ నేస్తం!” అంది రివాల్వరు చూపెడుతూ.

“ఓహో! కోయిల కంఠం.” అనుకున్నాడు, మంచం కింది మనిషి. మెల్లగా కదిలి ముందుకు వచ్చి నించున్నాడు, ఆమె ముఖం కేసి చూసి నవ్వుతూ. కాని తన వైపు గురిపెట్టబడి ఉన్న రివాల్వరు చూసి లోపల కొద్దిగా భయపడుతూనే ఉన్నాడు.

* * *

“ఎందుకొచ్చినట్లు?” శూన్యంలోకి చూస్తూ ఎవ్వరినో ప్రశ్నించినట్లు అడిగింది, మంచం మీది మగువ.

పారిపోవడానికి దారి వెతికేవాడికి మల్లే దిక్కులు చూస్తూ మాట్లాడలేదు ముందున్న మనిషి.

“దొంగతనానికా?”

“అవును,” అన్నట్లు తల ఆడించేడు మౌనంగా.

“అయితే మంచం కింద దూరావేం? అయినా ఇంత పిరికివాడివి దొంగతనమేం చేస్తావ్?” ఆమె కొంటెగా చూసి చిరునవ్వు నవ్వింది.

అతనికి ఆ నవ్వు చూశాక కాస్త ధైర్యం కలిగింది. “నిన్ను చూడగానే దొంగతనానికొచ్చిన సంగతి మరచిపోయాను,” అంటూ అతనామె కళ్ళల్లోకి సూటిగా చూశాడు. ఇద్దరి చూపులూ ఒక్క క్షణం కలుసుకున్నాయి. అతని చూపుల్లో ఉన్న ఏదో మహత్తర శక్తి ఆమెని వివశను చేసింది. అతని చూపుల తాకిడికి ఆమె శరీరం అంతా విద్యుత్ ప్రసారం కలిగినట్లు ఒక్కసారి జలదరించింది. కొంచెం తమాయించుకుని, ముఖం కాస్త ఓరగా పెట్టి, “అయితే ఇప్పుడేమీ దొంగిలించదలుచుకోలేదన్న మాట! అంతేనా?” ఆమె విరగబడి నవ్వింది.

“నా కన్న ముందే నువ్వా పని చేశావు,” అన్నాడు అతను, బాగా ధైర్యం తెచ్చుకొని.

“గట్టివాడివే! నాకే అంటగడుతున్నావన్నమాట!”

“కాకపోతే మరేమిటి? నా మనస్సును, నా వివేచనా శక్తిని దొంగిలించావు."

“సరి! సరి! మాటలు నేర్చిన మగాడివే!”

“బి. ఎ. పేసయ్యాక ఆ మాత్రం మాట్లాడ్డం చేతకాకపోతే ఎందుకు పనికొస్తాను?”

“బి. ఎ. పేసయ్యావా? మరయితే దొంగలా ఇలా తిరగడం ఏమి కర్మ?”

“దొంగలాగా ఏమిటి? నేను దొంగనే. మూడు సార్లు నన్ను జైల్లో కూర్చోబెట్టి దొంగననే సర్టిఫికేటు కూడ ఇచ్చేరు. నాలుగోసారి ఖైదు ప్రాప్తించే యోగం నీ చేతుల్లోనే ఉందనుకుంటున్నాను.”

“నా చేతుల్లో ఖైదీవి కావడం నీకు ఇష్టం లేదన్నమాట.”

“నీ దయ.”

“నీ పేరు?”

“ప్రకాశం అంటారు.”

“ఆ అనేవాళ్ళని, ‘ప్రకాశం, బి. ఎ.’ అనమను.”

“అయినా నా పేరు తెలుసుకుని నీ పేరు చెప్పకపోవడం అధర్మం.”

“అంత అధర్మానికి ఒడిగట్టుకోవడం ఎందుకులే.  నా పేరు సావిత్రి. పేరుకేం గాని, నేనెవరినో నీకు తెలుసా?”

“నువ్వేం గవర్నరువా? నీ పేరు తెలియడానికి?”

“ఆ మాటకొస్తే గవర్నరుని తెలియని వాళ్ళే ఎక్కువ.”

“అయితే కావచ్చు.”

“నేనొక సినిమా తారనోయ్ వెర్రివాడా. నన్నెప్పుడూ  సినిమాలలో చూడలేదూ?”

“నేనసలు సినిమాలే చూడను కదా!”

“పోనీ, పత్రికల్లో ఎక్కడైనా నా బొమ్మ చూసి ఉండొచ్చు. జ్ఞాపకం తెచ్చుకో.”

“అసలు పత్రికలంటే నాకు ఒళ్ళు మంట. వాటిని నేను చదవను.”

“అయితే నువ్వీ యుగంలో పుట్టవలసినవాడివి కావు.”

“కాని, పుట్టేను.”

“ఎందుకూ? దండగ.”

“ఎప్పటికీ కాదు. నీ రూపాన్ని – నిన్ను, ప్రాణంతో నిండి ఉన్న నిన్ను ముఖాముఖీగా బారెడు దూరంలో నించుని చూస్తున్నాను. నీ బొమ్మను సినిమాల్లోనూ, పత్రికలలోనూ చూసేవారికంటె నేనే మెరుగు. ఇంకా దగ్గరగా నించుని చూడ్డానికి కూడా నాకేమీ అభ్యంతరం లేదు.”

“నీతో మాట్లాడ్డం కూడ కష్టమే. పాపం! వచ్చిన దగ్గరనుండి నించునే ఉన్నావు. కూర్చోరాదూ?”

“బాగానే ఉంది మర్యాద. ఇప్పటికైనా నా బాధ తెలుసుకుని కూర్చోమన్నావు. సంతోషమే. ఈ గదిలో ఒక్క కుర్చీ కూడా లేదు. ఉన్న ఒక్క మంచం నీ స్వాధీనంలో ఉంది. ఎక్కడ కూర్చునేది?”

“ఎక్కడో ఏమిటి. నా సరసనే.” రివాల్వరు పక్కకి విసిరేసింది, సావిత్రి, కొంటెగా ప్రకాశం వైపు క్రీగంట చూస్తూ.

* * *

మర్నాడుదయం సావిత్రి లేచేసరికి గడియారం తొమ్మిది గంటలు కొడుతూంది. ప్రకాశం ఇంకా నిద్ర పోతూనే ఉన్నాడు. “దొంగతనం చేసేవాళ్ళకి కూడా ఇంత నిద్ర మత్తు అయితే ఎలాగబ్బా?” అంటూ ఆమె అతన్ని లేపింది. ఆ తరువాత కాఫీ, ఫలహారం ఇద్దరికీ తెమ్మని వంటమనిషికి పురమాయించి మేడ మీదకొచ్చింది.

కాఫీ, ఫలహారం మేడ మీదకి వచ్చే సరికి సావిత్రి, ప్రకాశం ముఖాలు కడుక్కుని, టేబుల్ ముందు కూర్చున్నారు. వంటమనిషి కిందకి వెళ్ళిపోయింది.

కాఫీ పూర్తి చేసి, టేబుల్ మీద కప్పులు పెడుతూ సావిత్రి అడిగింది, “నీకు పెళ్ళయిందా?”

“ఆ సందేహం ఇప్పుడెందుకు కలిగింది?” అన్నాడు ప్రకాశం వక్క పొడి నోట్లో వేసుకుంటూ.

“ఎప్పుడు కలగాలేమిటి?”

“రాత్రే కలిగుండాల్సింది. అయినా, ఎందుకేమిటి?”

“ఎందుకేమిటేమిటి? నాకు కాలేదు కనుక!”

“ఓ, అదా! నాక్కూడా కాలేదులే.”

“అంటే నిన్నటి వరకూనా?”

ఇద్దరూ నవ్వుకున్నారు.

* * *

రోజులు గడచిన కొద్దీ సావిత్రికీ, ప్రకాశానికీ మధ్య పరిచయం దృఢతరమౌతూంది. ఈ నెల రోజుల్లోనూ, వాళ్ళు ఒకళ్ళని విడచి మరొకరు ఉండలేనంత పరిస్థితికి వచ్చేసేరు. కాల్ షీట్ ఉన్నప్పుడు షూటింగుకి పోవడం తప్పితే ఇతర సమయాల్లో సావిత్రి ఎప్పుడూ ప్రకాశాన్ని అంటిపెట్టుకునే ఉండేది. ఇద్దరూ లాంఛనంగా వివాహం చేసుకోకపోయినా, వివాహితులంత సన్నిహితులుగా సంచరించడం నేర్చుకున్నారు. సావిత్రి ఒకరిద్దరితో తాను ప్రకాశాన్ని చేసుకోబోతూన్నట్లు సూచించింది కూడా.

సంపాదన లేదన్న దిగులు ప్రకాశానికి ఎప్పుడూ లేదు. తను సంపాదించినదే తమకు ఎక్కువగా ఉన్నప్పుడు ప్రకాశం కూడా కష్టపడి సంపాదించుకోవడం ఎందుకనే ధోరణిలో ఉంది సావిత్రి. మొత్తానికి ఎవరి ఉద్దేశాలెలా ఉన్నా ప్రకాశం మాత్రం సావిత్రి ఇంట్లోనే కాలం గడుపుతున్నాడు. అలాగే రోజులు దొర్లుకు పోతున్నాయి.

ఎక్కడికి వెళ్ళినా సాయంత్రం అయిదు లోపున తిరిగొచ్చే సావిత్రి ఆ నాడు ఇంకా ఇంటికి చేరలేదు. అప్పుడే పొద్దు గ్రుంకుతూంది. మేడ మీది వరండాలో ఒంటరిగా కుర్చీలో చేరబడి కూర్చున్నాడు ప్రకాశం. సావిత్రి ఇంకా ఇంటికి రానందువల్ల అతనికి ఏమీ తోచడం లేదు. శూన్యాకాశంలోకి దృష్టి నిగిడ్చి ఏదో ఆలోచిస్తున్నాడు. బహుశా అతనికి గత జీవితం స్ఫురణకి వచ్చి ఉంటుంది. అతని దృష్టి హఠాత్తుగా ఎదుటి ఇంటి మీద పడింది. ఆ ఇంటి తలుపులు బాగా తెరచి ఉన్నాయి. గుమ్మానికెదురుగా ఉన్న టేబుల్ మీద ఎవ్వరో నిర్లక్ష్యంగా పడేసిన బంగారు గొలుసు మెర్కురీ దీపాల కాంతిలో తళతళ మెరుస్తూంది. ఆ ఇంటి చుట్టు పక్కల గాని, ఇంట్లో గాని మనుష్యుల అలికిడి ఏమీ లేదు. ప్రకాశానికి ఆ గొలుసు దొంగిలిద్దామన్న బుద్ధి పుట్టింది. నిజానికి ప్రకాశం ఇప్పుడున్న స్థితిలో దొంగతనం చెయ్యవలసిన అవసరం ఏమీ లేదు. ఆ ఇంట్లో తనకేది కావలసి వచ్చినా స్వేచ్ఛగా తీసి

వాడికోవచ్చు. కాని అతనిలో అణిగి మణిగి ఉన్న అజ్ఞాత శక్తుల ప్రేరణ అతనిపై బలంగా పని చేస్తూంది. మెల్లగా కూర్చున్న కుర్చీలోంచి లేచి మెట్లు దిగి గుమ్మంలోకి వెళ్ళాడు. తలుపు తీసేసరికి అప్పుడే ఇంటికి వచ్చిన సావిత్రి ఎదురుగా ప్రత్యక్షమైంది.

“ఎక్కడికో బయలుదేరుతూన్నట్లుందే? షికారుకా?”

“అబ్బే! కాదు. కాదు.” ప్రకాశం మాటలో తడబడుతూ వెనక్కి తిరిగేడు.

సావిత్రి అతని తడబాటుని గుర్తించ లేదు కాని, “నేనూ వస్తాను. అలా మెరీనాకి పోయొద్దాం,” అంది.

సావిత్రి కొత్తగా కొన్న కారు ఇద్దరినీ మెరీనాలో దింపింది. చెయ్యీ, చెయ్యీ కలిపి సముద్రపుటలల అంచుల మీద నడుస్తూ కొంత దూరం పోయి ఇసకలో  ఒక చోట కూర్చున్నారు.

ప్రకృతి సౌందర్యాన్ని ఒకరికొకరు అన్వయించి చూసుకుంటూ మూడో మనిషికి అర్థం కాని మూగ భాషలో మనసులు విప్పి కబుర్లు చెప్పుకుంటూ ఎంత కాలం గడిపేరో కాని వాళ్ళకి స్మృతి వచ్చే సరికి సముద్ర తీరం అంతా, కను చూపు మేర వరకూ, నిర్మానుష్యంగా ఉంది. అప్పటికి ఆకాశం మీద బారెడు మీదకి వచ్చిన చంద్రుణ్ణి అందుకోవాడానికి కాబోలు సముద్ర తరంగాలు ఉవ్వెత్తున మీదకి లేచి, విరిగి  కిందపడుతున్నాయి.

సావిత్రి ప్రకాశం ఒడిలోకి తల దూర్చి గోముగా పలకరిస్తూ, “ఒక మంచి విషయం చెప్పనా?” అంది.

“ఏమిటది?” అన్నాడు ప్రకాశం, గాలికి ఆమె ఫాల భాగం మీద నాట్యం చేసే ముంగురులని తన మునివేళ్ళతో సవరిస్తూ.

“కీల్పాక్ లో ఒక మంచి మేడ కొన్నాను. రిజిస్ట్రేషన్ కూడ అయిపోయిందీవేళ. అందుకే ఇంటికి రావడం ఆలశ్యమయింది.

“మరి ప్రస్తుతం ఉంటూన్న ఇల్లో?”

“ఆఁ! అది అద్దె ఇల్లు. వాళ్ళు కూడా ఎప్పటినుండో ఖాళీ చెయ్యమని అడుగుతున్నారు. మరొక పది రోజుల్లో ఇల్లు ఖాళీ చేసేద్దాం.”

కొంతసేపు  మళ్ళా ఇద్దరూ మౌనంగా ఊరుకున్నారు, చిరుమబ్బుల మాటున పరిగెత్తే చంద్రుణ్ణి చూస్తూ.

“సాయంత్రం నువ్వు రావడం ఒక్క గంట ఆలశ్యమయితే ఆ ఒక్క గంటా ఒక యుగంలా గడచింది సావిత్రీ!”

“అవును, ప్రకాశం! నాకూ అలాగే ఉంటుంది.  ఏ ముహూర్తాన నీతో పరిచయం అయిందో కాని నిన్ను చూడని ఒక క్షణం ఒక యుగంలా గోచరిస్తుంది నాకు కూడా.  అనిర్వచనీయమైన శక్తులేవో మనిద్దరి హృదయాలనీ కలిపి బంధించాయనుకుంటాను….. కాని, ఇప్పుడొక పెద్ద చిక్కు వచ్చింది.”

“ఏమిటది సావిత్రీ?”

“రేపు నేను అవుట్ డోర్ షూటింగుకి మైసూరు వెళ్ళాలి. తిరిగి వచ్చేసరికి వారం రోజులు అవుతుందేమో! ఈ వారం రోజులూ ఎట్లా గడుస్తాయా అని చూస్తున్నాను.”

“వారం రోజులే!”

“నిన్ను విడచి వెళ్ళడం అంటే నీకంటె ఎక్కువ బాధగా ఉంది నాకు. కాని తప్పదు. నేను తిరిగి రాగానే కొత్త ఇంట్లోకి వెళ్ళిపోదాం.”

“షూటింగుకి వెళ్ళడం మానివెయ్యరాదూ?”

“బాగుండదు, ప్రకాశం! నన్ను నమ్ముకుని వాళ్ళన్నీ సిద్ధం చేసుకున్నాక నేను వెళ్ళక పోవడం అమర్యాదగా ఉంటుంది. ఒప్పందాలైన తర్వాత చట్టబద్ధం కూడా కాదు.”

“సరే!” అన్నాడు ప్రకాశం.

*            *            *

అనుకున్న గడువు కంటె ఒక రోజు ముందే తిరిగి వచ్చింది సావిత్రి, మైసూరు నుంచి. ఆమె వచ్చే సరికి ప్రకాశం కనబడలేదు. వెంటనే బంట్రోతుని పిలచి, "ఏంరా! ప్రకాశం ఎక్కడ?" అని అడిగింది.

వాడు చేతులు నలుపుకుంటూ నిలుచుని జవాబు ఇచ్చేడు. "అయ్యగార్ని జైల్లో పెట్టేరండమ్మా."

"ఏంరా! అసలు ఏమి జరిగింది?" ఆదుర్దాగా ప్రశ్నించింది, సావిత్రి.

"అయ్యగారెక్కడో దొంగతనం చేసేరని ఆళ్ళంటుండారమ్మా. అయ్యగారేంటి, దొంగతనం సెయ్యడమేంటి? నాకేం నమ్మకంగా లేదమ్మగోరూ. అంతా ఏదో మాయలాగుంది."

సావిత్రి ఏదో దీర్ఘంగా ఆలోచించి కుర్చీలో కూలబడిపోయింది. ప్రకాశం గురించి ఆమె ఏవేవో తియ్యటి కలలు కంది. కాని ఇప్పుడవి కల్లలు కాబోతున్నాయన్న భయం ఆమె హృదయాన్ని ఆవహించింది. ఇంతకు ముందెవ్వరికీ అంకితం కాని తన హృదయం  మొట్టమొదటిసారిగా ప్రకాశానికి అంకితం చెయ్యబడింది. ఇప్పుడు ప్రకాశం తనకి దూరం కాబోతున్నాడు. ఆతను లేకపోవడం వల్ల ఇల్లంతా బావురు మంటూంది. ఈ మధ్య తనూ, ప్రకాశం కలసి తీయించుకున్న ఫొటో గోడ మీద నుండి తనను వెక్కిరిస్తూన్నట్లు కనబడింది. ఆ ఇంట్లో ఒక్క క్షణమైనా ఉండడానికి ఆమెకి మనస్కరించలేదు.

బంట్రోతు ని పిలచి చెప్పింది, సావిత్రి. "కొత్త ఇంట్లోకి సామానంతా మార్పించెయ్యాలి. వాహనాలని పురమాయించు."

"అంత తొందరెందుకమ్మగారూ. మంచి చూసుకుని వెళితే బాగుంటుందేమో!"

"మంచీ లేదు. చెడ్డా లేదు. చెప్పినట్లు చెయ్యడమే నీ పని.

ఎప్పుడూ కోపించి ఎరుగని యజమానురాలు కోపంగా మాట్లాడ్డంతో వాడు జంకేడు. సామాను కొత్త ఇంటికి తరలించడానికి ఏర్పాట్లు చెయ్యడానికి వాడు మేడ దిగి వెళ్ళిపోయేడు. విచార భారంతో సావిత్రి తలముందున్న టేబుల్ మీదకి ఒంగిపోయింది.

కొత్త ఇంట్లో ప్రవేశం జరిగింది.

మర్నాడు తెల్లవారేసరికి సావిత్రికి విపరీతంగా జ్వరం వచ్చింది. డాక్టర్ వచ్చి పరీక్ష చేసి మందు ఇచ్చాడు. తన పని చూసుకుని వెళ్ళిపోతూన్నవాడు నాలుగడుగులు ముందుకేసి సావిత్రీ, ప్రకాశం కలసి తీయించుకున్న ఫొటో చూసి చటుక్కున ఆగిపోయాడు. గోడ దగ్గరగా వెళ్ళి ఆ ఫొటోని తదేక దీక్షతో చూసి, మళ్ళా వెనక్కి వచ్చి సావిత్రికి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ఇదంతా గమనిస్తూన్న సావిత్రికి అంతవరకు అదుపులో ఉన్న దుఃఖం కట్టలు తెంపుకుని బయట పడింది. ఆమె తలగడలోకి ముఖం దూర్చి వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టింది.

డాక్టరుకి సావిత్రి చర్య అయోమయంగా ఉంది. “ఏమమ్మా! అతన్ని…..”

వాక్యం పూర్తి చెయ్యకుండానే సావిత్రి డాక్టరు వైపు తిరిగి కళ్ళు అల్లార్చింది.

“అతని పేరు ప్రకాశం కదూ?”

ఈ సారి సావిత్రి ఆశ్చర్యంగా డాక్టరు ముఖంలోకి చూసింది.

“అవునమ్మా! అతన్ని నాకు తెలుసు. నాకున్న కొద్ది మంది స్నేహితులలోనూ అతనొకడు. అతనిది కోనసీమ. అతని తండ్రి రామస్వామిగారు అక్కడ చెప్పుకోదగ్గ భాగ్యవంతులలో ఒకడు. ఆయనకి మొదటి భార్య వల్ల కలిగేడు ప్రకాశం.

“ఆరు సంవత్సరాల నాటి మాట. అప్పుడు నేను మెడికల్ కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నాను. ప్రకాశం కాకినాడలో బి. ఎ. పాసయి మెడిసిన్ చదవడానికి మా కాలేజీలో చేరేడు. హాస్టల్ లో మేమిద్దరం ఒకే గదిలో ఉండేవాళ్ళం. బి. ఎ. పాసవగానే చదువు మానిపించెయ్యడానికి అతని సవితి తల్లి ఎంతో ప్రయత్నించిందిట. కాని అతను తండ్రి దగ్గర ఎంతో ప్రాధేయపడి తను మెడిసిన్ చదవడానికి ఆయనని ఒప్పించగలిగేడు. మానవ సేవ చెయ్యడానికి ఉపయోగపడే వృత్తిని స్వీకరించాలనీ, అందుకు తను ఒక డాక్టరు కావాలనీ అతని సంకల్పం. ఎన్ని అడ్డంకులు వచ్చినా తన ఇష్టానుసారం మెడికల్ కాలేజీలో జేరగలిగినందుకు తనను తానే అభినందించుకుంటూన్నట్లు నాతో

ఎన్నో సార్లు చెప్పేడు. భార్య మాట విని తన చదువుని బి. ఎ. తో ఆపనందుకు తన తండ్రిని కూడా ఎంతగానో అభినందించేడు.

“అయితే ఒక రోజు ఇంటి దగ్గర నుండి వచ్చిన ఉత్తరం ప్రకాశం జీవితాన్ని తారుమారు చేసింది. ఆ ఉత్తరం చూసుకుని అతను నీర్గై పోయాడు. అందులో ప్రకాశం చదువు మానేసి వెంటనే ఇంటికి రావాలనీ, ఉన్న డబ్బంతా అతని చదువుకే వెచ్చిస్తే ఇంకా చదువుకోవలసిన అతని సవితి తమ్ముళ్ళూ, పెళ్ళిళ్ళు కావలసిన చెల్లెళ్ళూ వారి భవిష్యత్తు పాడుచేసుకోవలసి వస్తుందని ఆ ఉత్తరంలో ఉంది. అధవా ఆ డబ్బు ఖర్చు పెట్టి చదువు చెప్పించినా అతను తమ్ముళ్ళనీ, చెల్లెళ్ళనీ సుహృద్భావంతో వాళ్ళవసరాలకి ఆదుకుంటూ ఉంటాడనే నమ్మకం తనకి లేదని ఆ ఉత్తరంలోనే తన తండ్రి ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేసేడు.

“ప్రకాశం ఎదురుగా ఉన్న నా వైపు తిరిగి ‘ఇదంతా నా మారుటి తల్లి ప్రోద్బలం వల్లనే జరిగి ఉంటుంది." అన్నాడు. తర్వాత ప్రకాశం ఎంతో ప్రాధేయపడుతూ తండ్రికి రెండు మూడు ఉత్తరాలు రాసేడు, తన చదువు పూర్తి చేయించమని. కాని తండ్రి దగ్గరనుండి జవాబైనా రాలేదు. మరొకనాడు ప్రకాశం నా దగ్గరకొచ్చి చెప్పేడు, 'నేను సైకిలూ, రిస్టు వాచీ, మరికొన్ని ఖరీదైన వస్తువులు అమ్మేయ దలుచుకున్నాను’ అని.

“అంత అవసరం ఏమి వచ్చింది?” అన్నా.

“డబ్బుకి ఇబ్బందిగా ఉంది. కొన్నాళ్ళయినా గడుస్తుందని,” అని సమాధానం చెప్పేడు.

“ఆ తరువాత?”

“ఈ లోపున మా నాన్నగారి బుద్ధి మళ్ళక పోదు.”

“నేనింకేమీ మాట్లాడలేదు. ఆ తరువాత అతను కొన్ని వస్తువులు అమ్మివేయడం, కొన్ని రోజులు గడచిపోవడం  జరిగిపోయింది. ఆ డబ్బు అయిపోయిన తర్వాత నేను నాలుగైదు సార్లు కావాలంటే చిన్న చిన్న మొత్తాలు చేబదులుగా ఇచ్చేను. వారం వారం తన పరిస్థితిని తెలియజేస్తూ ప్రకాశం తన తండ్రికి ఉత్తరాలు రాస్తూనే ఉన్నాడు. జవాబు కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు.

“ఒకనాడు నేను కాలేజీ నుండి హాస్టలుకి వచ్చేసరికి ప్రకాశం ఒంటరిగా కూర్చుని ఉన్నాడు. ఆతని ముఖం చూస్తే దేనికో విచారిస్తూన్నట్లు కనిపించేడు. నన్ను చూసి వెక్కి వెక్కి ఏడుస్తూ, ‘నా జీవితంలో ఎన్నడూ చెయ్యని తుచ్ఛమైన పనిని చేశానీవేళ’ అన్నాడు. కొంతసేపు ఊరుకుని మళ్ళా చెప్పాడు. ‘నేను వరండాలో తిరుగుతూ ఉంటే మూడో నంబరు గదిలో టేబుల్ మీద పర్సు కనిపించింది. గదిలో ఎవ్వరూ లేరు సరికదా గదికి తాళం కూడ వేసి లేదు. ఆ పర్సుని నేను దొంగిలించేను’ అంటూ మళ్ళా వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టేడు ప్రకాశం.  నేనామాట విని ఆశ్చర్య పోయాను. ‘ఎంతపని చేశావు ప్రకాశం. ఎవ్వరికైనా తెలిస్తే ఎంత నగుబాటు? డబ్బు ఇలా తే. నేను తీసికెళ్ళి నచ్చజెప్పి తిరిగి ఇచ్చేస్తా’ అన్నాను.

“ ‘ఈ వేళ కాలేజీకి జీతం కట్టడానికి ఆఖరి రోజు కదా. అందుకని ఆ డబ్బు తీసికెళ్ళి జీతం కట్టేశా’ అన్నాడు. నాకేమనాలో అర్థం కాలేదు.  తర్వాత కూడా మా హాస్టల్ లో డబ్బు పోవడం జరుగుతూ ఉండేది. హాస్టల్ లో ఎవ్వరి డబ్బు పోయినా నేను ప్రకాశాన్ని పిలచి మందలిస్తూ ఉండేవాడిని. చివరకి ప్రకాశం హాస్టల్ విద్యార్థుల డబ్బు దొంగిలిస్తున్నాడనే విషయం అధికారులకు తెలియడానికి ఎంతో కాలం పట్టలేదు. పర్యవసానంగా అతగాడు హాస్తల్ నుండి వెళ్ళగొట్టబడ్డాడు. మరో నెల్లాళ్ళకల్లా అతను కాలేజీ మానేశాడు.”

అంతవరకూ విన్న సావిత్రి, “పాపం! అతను స్వతహాగా మంచివాడే!” అని అనకుండా ఉండలేక పోయింది.

“అవును. అతను స్వతహాగా మంచివాడే” మళ్ళా అందుకున్నాడు డాక్టరు. “పరిస్థితుల ప్రాబల్యం వల్ల అతను దొంగతనం చెయ్యడానికి అలవాటు పడవలసి వచ్చింది. ఆ అలవాటే ‘క్లెప్టోమేనియా’ అనే మానసిక రుగ్మతకి దారి తీసింది. తాగుడుకి అలవాటు పడ్డవాడు తాగకుండా ఎలా ఉండలేడో, ఈ జబ్బు గలవాళ్ళు ఏదో ఒక దొంగతనం చెయ్యకుండా ఉండలేరు.”

అంతవరకూ స్థిమితంగా వింటూన్న సావిత్రి డాక్టరు మాటకి అడ్డు వచ్చింది. “అయితే డాక్టరు గారూ! అతను మళ్ళా మామూలు మనిషిగా మారడానికి అవకాశం లేదా?” అతనితో ఏ ముహూర్తంలో నాకు పరిచయం అయిందో కాని నా మనస్సంతా అతనికి అర్పించబడింది. మీతో సిగ్గు విడచి చెబుతున్నాను. మా ఇద్దరి హృదయాలూ సన్నిహితమైనాయి. కొద్ది రోజుల్లో నేనతనిని వివాహం చేసుకోబోతున్నాను. ఇంతలోనే ఈ అవాంతరం వచ్చి పడింది. ఏదో దొంగతనం చేశాడనే నేరారోపణతో అతన్ని జైల్లో పెట్టేరు. విడుదల కాగానే అతనిక్కడికే రావచ్చు. రావచ్చేమిటి? నాకు తెలుసు. ఇక్కడికే

వస్తాడు. నా కంటె మీరతని మనస్తత్వాన్ని బాగా అర్థం చేసుకున్నట్లు కనిపిస్తోంది. దొంగతనం చెయ్యాలనే బుద్ధి నుండి అతనిని విముఖుణ్ణి చెయ్యడానికి ఏదైనా మార్గాన్ని సూచించగలరా?"

"అవకాశముంది. ఎంతటి విషమ పరిస్థితుల మధ్య అతనా జబ్బుకి గురిచెయ్యబడ్డాడో, అటువంటి అనుల్లంఘనీయమైన కట్టుబాట్లలో అతన్ని కొంతకాలం ఉంచగలిగితే మళ్ళా అతను మామూలు మనిషి కావడానికి అవకాశముంది.... ఈ రోజు పూర్తిగా విశ్రాంతి తీసుకో అమ్మా! నేను మళ్ళా రేపు వచ్చి చూస్తాను." డాక్టరు వెళ్ళిపోవడానికి లేచేడు. సావిత్రి గోడ మీద ఉన్న ఫొటోలోని ప్రకాశం వైపు చూస్తూ ఏదో దీర్ఘంగా ఆలోచించడం మొదలు పెట్టింది.

రోజులు గడుస్తున్నాయి. రోజూ డాక్టరు వచ్చి సావిత్రిని చూసి పోతున్నాడు. ఆనాడర్ధరాత్రి దాటింది. ప్రకాశం గూర్చి వచ్చే అంతులేని ఆలోచనలతో సావిత్రి బుర్ర వేడెక్కిపోతూంది. ఎంత ప్రయత్నించినా ఆమెకి నిద్ర పట్టడం లేదు. మంచం మీద నుంచి లేచి వరండా మీద కుర్చీ వేసుకుని కూర్చుంది. ఇంతలో గదిలో ఏదో చప్పుడు అయితే మెల్లగా లేచి స్విచ్చి వేసింది. గదంతా విద్యుద్దీపపు కాంతి అలుముకుంది. ప్రకాశం గది మధ్య బుర్ర వంచుకుని నించున్నాడు. అతన్ని చూడగానే సావిత్రికి ఆశ్చర్యం, సంతోషం ఒక్కసారే కలిగాయి. చేయి పట్టుకుని ప్రకాశాన్ని మంచం దగ్గరకి తీసుకెళ్ళింది. ప్రకాశం ఆమెను మౌనంగా అనుసరించాడు. సావిత్రి అతని హృదయం మీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్వడం మొదలుపెట్టింది.

"సావిత్రీ! నేను నీచుణ్ణి. నీ సాన్నిధ్యంలో ఉండడానికి కూడ అర్హుణ్ణికాను. నాలో ఏవో శక్తుల విజృంభణ వల్ల దొంగతనం చెయ్యాలనే బుద్ధి అప్పుడప్పుడు పుడుతూ ఉంటుంది. నేనా శక్తులకి తప్పని సరిగా లోబడిపోవలసి వస్తూంది. లోకం నన్నొక దొంగ గానూ, నీచుడిగానూ పరిగణిస్తూంది. నన్ను దరి జేర్చుకుని నువ్వు కూడా నీ పేరు ప్రతిష్టలకి భంగం తెచ్చుకోకు. వచ్చిన దారినే నన్ను వెళ్ళనీ. అసలు నీవిక్కడ ఉన్నావని తెలిస్తే నేను వచ్చేవాడినే కాదు."

"కాదు, ప్రకాశం. లోకంతో నాకేమీ సంబంధం లేదు. నాకు కావలసినదంతా నువ్వే. నాకు తెలుసు. నువ్వు స్వతహాగా మంచివాడివే. కాని పరిస్థితులకి లొంగి దొంగతనం చెయ్యడం నేర్చుకున్నావు. గట్టిగా తల్చుకుంటే నువ్వు దొంగతనం చెయ్యాలనే అలవాటుని మార్చుకోగలవు. ఆ ఉద్దేశం నీలో కలగడానికి కూడా వ్యవధి ఇవ్వని ఒక బాధ్యతాయుతమైన వృత్తిని నీవు స్వీకరిస్తే బాగుపడతావు. దానికి తగిన ప్రయత్నాలన్నీ నేను చేశాను. ఇంత కాలం సినిమాల్లో నటించి కొన్ని లక్షలు గణించేను. ఆ

డబ్బుతో మనమే స్వంతంగా ఒక కంపెనీ పెట్టి చిత్రాలు తీద్దాం. ఆ బాధ్యత అంతా నీ మీద ఉంచుతున్నా. రేపటి నుండే పని మొదలు పెట్టాల్సి ఉంటుంది."

"సావిత్రీ! నువ్వు దేవతవు. నాకప్పగించిన పనిని సక్రమంగా నిర్వర్తిస్తూ ఈ నాటి నుండి దొంగతనం చెయ్యను. నీ మీద ఒట్టు వేసి చెబుతున్నాను."

సావిత్రి ఆనందంతో మైమరచి అతని శిరస్సుని తన హృదయానికి హత్తుకుంది.

# కపాలమోక్షం
(ఆంధ్రపత్రిక, 4 జూలై 1951)

1

నిర్విరామానంద స్వాములవారు మర్నాడు వస్తున్నారని ముందురోజే తెలిసింది, చెన్నూరు గ్రామంలో. గ్రామాన్ని ముస్తాబు చెయ్యడం, స్వామివారికి కావలసిన హంగులన్నీ సమకూర్చడం వగైరా పనులలో గ్రామస్తులందరికీ ఊపిరాడ్డం లేదు. నాలుగు నెలలబట్టీ బూజు పడుతూన్న ఆలయం తలుపులు తెరిపించి శుభ్ర పరిచారు. స్వామివారు చెప్పబోయే సుధా మధురోక్తులను భక్తులు సావధానంగా కూర్చుని వినడానికి ఆలయం ముందు ఖాళీ జాగాలో చక్కగా పందిరి వెయ్యబడింది. స్వామివారు ఆ ఊళ్ళో తొమ్మిది రోజులకంటె ఎక్కువ ఉండడానికి అవకాశం లేదని ముందే శలవిచ్చేరు. ఊళ్ళో ఉన్న మోతుబర్లూ, పలుకుబడి ఉన్న పెద్దలూ వాటాలు వేసుకుని దినానికొకళ్ళు చొప్పున ఆయన్ను భిక్షకు పిలచే ఏర్పాట్లు చేసుకున్నారు. నిజానికి ఒక్కొక్కళ్ళూ స్వామివారిని వరుసగా తొమ్మిది రోజులూ సేవించగల తాహతు ఉన్నవాళ్ళు. కాని ఆయన అక్కడ ఉండ దల్చుకున్న కాలం చాలా స్వల్పం కావడం చేతా, ఆయన్ని సేవించే భాగ్యం  అంతా సమంగా పంచుకోవాలనే సుహృద్భావం కలవాళ్ళు కావడం చేతా ఆ ఊరి పెద్దలు ఇలా వంతులు వేసుకోవలసి వచ్చింది.

నిర్విరామానంద స్వామి అంటే సామాన్యుడు కాదు. వేదం ఎనభై రెండు పన్నాలూ ముందు నుండి వెనక్కీ, వెనక నుండి ముందుకీ నిరాఘాటంగా అప్పచెప్పగల సమర్థుడు. చతుష్షష్టికళలూ ఆయనకు కరతలామలకం అంటారు. ఆయనకి దివ్యదృష్టి కూడా ఉందని ప్రతీతి.

స్వామివారి ముఖంలో భక్తులకి బ్రహ్మ తేజస్సు గోచరిస్తుంది; ఆయన పలుకులో మధురమైన సంగీతం వినిపిస్తుంది. ఆయన అనుగ్రహం వల్ల చాలా మంది భక్తులు ఐశ్వర్యవంతులు అయారుట! ఆయన ఆశీర్వాదాన్ని పొందిన రోగులు ఆరోగ్యవంతులయారుట!! పిల్లలు లేని స్త్రీలు ఆయన అనుగ్రహం పొందిన సంవత్సరం లోనే గుమ్మిడి పళ్ళల్లాంటి పిల్లల్ని ఎత్తుకున్నారుట!!! అటువంటి మహత్తరమైన శక్తులు ఉన్నవాడు కావడం చేతనే ఆయన వస్తున్నాడంటే ఊళ్ళో ఇంత హంగామా; ఇంత హడావిడీను.

నిర్వికారానంద స్వామి తమ ముప్ఫైయ్యవ పడిలో సన్యాసం స్వీకరించేరు. ఆయన సన్యాసాన్ని స్వీకరించడాన్ని కిట్టని వాళ్ళు ఏవేవో కట్టుకథలు చెబుతూ ఉంటారు. మోక్ష కాముకులైన భక్తులకవి చర్చనీయాంశాలు కావు.

ఇప్పుడాయనకి నలభై అయిదు వసంతాలు నిండినా ముప్ఫై అయిదేళ్ళ యువకుడిలా కనబడతారు. అలా కనబడ్డం ఆయన ఆహార విహారాదులలోని నియమాల వల్ల కావచ్చు; లేక, కాయకల్ప చికిత్స వల్లనైనా కావచ్చు.

స్వామివారు అపర వీరభోగ వసంతరాయుడంటే అతిశయోక్తికాదు. ఆడా, మగా కలిపి దరిదాపు వంద మంది దాకా ఉన్నారు ఆయన శిష్య గణం. అంతే కాకుండా, ఏనుగులూ, గుర్రాలూ, బళ్ళూ, ఎద్దులూ – ఒకటేమిటి, సర్వమూ ఉన్నాయి ఆ సర్వసంగ పరిత్యాగులైన నిర్వికారానంద స్వాములవారికి. ఆయన పాద పూజకే నూట పదహార్లు పుచ్చుకుంటారుట! భిక్షకైతే వెయ్యి నూట పదహార్లు అక్కడ పెట్టవలసిందే!!

సర్వసంగ పరిత్యాగులకూ, మహనీయులకూ ధనంతో పనేమిటని  ఎవడైనా తెలివిమాలిన కుంక ప్రశ్నించ వచ్చు. కాని, ఈ కట్నాలూ, కానుకలలో ఆయనకి ఒక్క దమ్మిడీ అవసరం లేదు. అవన్నీ తమ పరివారాన్ని పోషించడానికి మాత్రమే స్వీకరిస్తున్నారు. ఆయన అనుచరులు ఒకరిద్దరు కనుకనా? వందమంది పైగా ఉన్నారాయె – జంతుజాలాన్ని మినహాయించుకుని.

మరునాడు ఉదయాన్నే ఏనుగులూ, గుర్రాలూ, బళ్ళూ, ఎడ్లూ, లొటిపిటలూ ఆ ఊరి పొలి మీద కాళ్ళు పెట్టేయి. వాటిని చూడ్డం తోటే ఆ ఊరి కుర్రకుంకలంతా ఊళ్ళోకి సర్కస్ కంపెనీ వచ్చిందనుకొని సంతోషంతో గెంతడం మొదలెట్టేరు. “సర్కస్ ఏమిటర్రా! తప్పు, తప్పు!! స్వాములారొస్తున్నారు” అని చెప్పి వారిని మందలించేరు అక్కడున్న పెద్దలంతా. ఆ మాట విన్న తర్వాత కుర్రాళ్ళల్లో సగం ఉత్సాహం దిగజారిపోయింది.

మరో గంటకి స్వాములవారు ఎక్కిన పల్లకీని నలుగురు సద్బ్రాహ్మణులు వేద ఘోషతో మోసుకొచ్చి, ఆలయం ముందు దించి, ఎవ్వరూ చూడకుండా బుజాలు తడుముకుని, చేతులు ఝాడించుకున్నారు!

కరణం సీతారామయ్యా, మునసబు బుచ్చిరెడ్డీ, వెంకటేశ్వర్లూ, వీరాస్వామీ, మొదలైన ముఖ్యులంతా స్వామివారి సన్నిధికి వచ్చి నమ్రతతో నించున్నారు.

“ఉదయాన్నే స్వాములవారు ఏమీ తినరు. కల్తీ లేని గోక్షీరం తెప్పించండి, ఒక అర్ధ సేరు. పుచ్చుకుంటారు.” అన్నాడు, స్వామివారి శిష్యగణంలో ముఖ్యుడు ముందుకొచ్చి.

అక్కడున్నవారిలో బుచ్చి రెడ్డి, ‘చిత్తం!’ అని చెప్పి ఇంటికి బయలు దేరాడు, పాలు తీసుకురాడానికి.

వెళుతూన్న బుచ్చిరెడ్డిని వెనక్కి పిలచి హెచ్చరించేడు స్వామివారి శిష్యుడు. “పంచదార వెయ్యకండేం, పాలల్లో. అటువంటి అపవిత్రమైన వస్తువులు గురువుగారికి పనికిరావు” అన్నాడు.

పంచదారని తెలుపు చెయ్యడానికి ఎముకల పొడి ఉపయోగిస్తారని ఎక్కడో విన్నాడు బుచ్చిరెడ్డి. బహుశా అందువల్లే అది అపవిత్రమయిన వస్తువు అయుండాలి. “అయితే బెల్లం వేయించమంటారా?” అని అడిగేడు బుచ్చి రెడ్డి, అమాయకంగా.

“ఆఁ ఎందుకూ? పటిక బెల్లం సరిపోతుంది.” అన్నాడు శిష్యుడు.

“అల్లాగే” అని బుచ్చిరెడ్డి కదిలాడు.

గుర్రాలకీ, ఏనుగులకీ ఊరి పొలిమేరలలో పెద్ద పెద్ద సాలలు కట్టబడ్డాయి. శిష్యులందరికీ ఇంద్రభవనం లాంటి విడిది ఏర్పాటు చెయ్యబడింది. స్వామివారు మాత్రం ఆలయంలోనే కల్యాణ మండపం దగ్గర విశ్రమించారు. ఆయనకి ఎండ దెబ్బ తగలకుండా మండపానికి చుట్టూ వట్టివేళ్ళ చాపలు వేల్లాడగట్టేరు, భక్తులంతా కలసి. వాటిని ఆరారా తడపడానికి మునసబు గారి పెద్దకొడుకు వీరాస్వామి ప్రత్యేకంగా అక్కడ ఉండిపోయాడు.

గ్రామస్తులు వేసుకున్న వంతు ప్రకారం ఆ రోజ స్వామివారు కరణంగారింట్లో భిక్ష చెయ్యాలి. సీతారామయ్య స్నానం చేసి, ముఖానికీ చేతులకీ విభూతి పూసుకుని, పీతాంబరధారుడై, శుచిగా వచ్చి స్వామివారి ఎదుట నమ్రతతో నిల్చున్నాడు. ఇంతలో బుచ్చిరెడ్డి కూడా వచ్చి ఎర్రగా కాచి, కలకండతో శుద్ధి చేసిన గోక్షీరాన్ని స్వామివారి ముందుంచి వెనక్కి తొలగేడు. స్వామివారు ఒకసారి ఈశ్వరుణ్ణి ధ్యానించి గోక్షీరాన్ని పుచ్చుకుని బరువుగా త్రేంచేరు. ధన్యుడైనట్లు సంతోషించేడు బుచ్చిరెడ్డి.

స్వామివారు పాత్రని కింద పెట్టి కరణం వైపు సాభిప్రాయంగా చూస్తూ మందహాసం చేశారు, 'ఏమిటి విశేషం?' అన్నట్లు.

సీతారామయ్య చేతులు రెండూ జోడించి నమ్రత ఉట్టిపడేటట్లుగా విన్నవించుకున్నాడు, "తమరికి ఈ రోజు మా ఇంట్లో భిక్షకి ఏర్పాట్లు చేస్తున్నాము. అనుగ్రహించాలి."

"మీ ఊరివారు మాయందు చూపే భక్తికి చాలా సంతోషిస్తున్నామురా!" మళ్ళా స్వామివారి ముఖం మీద మందహాసం మెరిసింది. ఆయన అందరినీ 'ఒరే' అనే సంబోధిస్తారు.

వంట ప్రయత్నాలు చేయించడానికి సీతారామయ్య అక్కడనుండి కదలి వెళ్ళిపోయాడు. స్వామివారే కాకుండా గ్రామస్తులలో భక్తులందరూ కూడా తన ఆతిథ్యాన్ని స్వీకరించి తనను తరింపజెయ్యాలని వేడుకున్నారు, కరణంగారు.

ఎంత తొందరగా ముగించాలని ప్రయత్నించినా అందరి భోజనాలూ పూర్తి అయేసరికి అపరాహ్ణం తిరిగింది.

భక్తులు ఒక్కరొక్కరే ఆలయంలో కల్యాణ మండపం దగ్గరకి చేరుకుని స్వామివారిని పరివేష్టించి కూర్చున్నారు. తమకారోజు భుక్తాయాసంగా ఉండడం వల్ల ఉపన్యాసమేదీ ఇవ్వలేమనీ, మర్నాటినుండి కార్యక్రమం యధావిధిగా కొనసాగిస్తామనీ చెప్పేరు, స్వామివారు. 'కాదూ మరి!' అన్నట్లు భక్తుల తలలన్నీ ఒకసారి ఊగాయి.

"మేము విశ్రమిస్తాం." అన్నారు స్వామివారు తమ సహజమైన ఠీవీతో.

"అల్లాగే! తప్పకుండాను!" అన్నాయి కొన్ని భక్తుల కంఠాలు. స్వామివారి సాన్నిధ్యం నుండి దూరమవడం ఇష్టం లేక కాబోలు, భక్తులెవరూ తమ స్థానాల్లోంచి కదలలేదు.

అంతమందీ అక్కడే ఉంటే నిర్విరామానందుల వారికి చిరాగ్గా ఉంది. "మీరంతా ఇక్కడనుండి వెళ్ళండి." ఈ సారి సూటిగా చెప్పేరు, భక్తులకి అర్థమయే భాషలో.

ఈ మాటతో అర్థమయినవాళ్ళు అక్కడ నుండి  లేచి వెళ్ళడానికి ఉపక్రమించేరు. ఇంతలో ఆలయ ద్వారం దగ్గర పెద్ద కోలాహలం వినిపించింది. సభికుల నేత్రాలు అటువైపు తిరిగాయి. మునసబు గారి వెట్టి వాడు పదకొండేళ్ళ కొడుకు శరీరాన్ని భుజం మీద వేసుకుని ఆలయ ద్వారం ప్రవేశించి లోపలికొచ్చాడు. వాడి బట్టలన్నీ రక్తంతో తడిసి ఉన్నాయి. వాడి స్వరూపం భయంకరంగా ఉంది.

“ఏం జరిగిందిరా, వెంకా?” అన్నాడు మునసబు వెట్టివాణ్ణి ఉద్దేశించి. వెంకడు ఏం జరిగిందో చెప్పలేదు. వాడు చెప్పే పరిస్థితిలో లేడు. సమాధానంగా కొడుకు శవాన్ని నేలమీద పడుక్కోబెట్టేడు, స్వామివారికి కనబడేలా.  ముఖం పోలిక దొరక్కుండా తల చితికిపోయిందా శవానికి! వెంకడి కళ్ళల్లో నీళ్ళన్నీ ఇంకిపోయాయి. ఇంకా ఏడిస్తే రక్తం కారుతుందేమోనన్నంతగా ఆ కళ్ళు ఎర్రబడిపోయాయి. వాడూరికే జుట్టు పీక్కుంటున్నాడు. ఎవ్వరికీ సమాధానం చెప్పే పరిస్థిలో లేడు.

“ఏం జరిగిందిరా?” మళ్ళా ప్రశ్నించేరు మునసబు గారు.

వెంకడితో వచ్చిన పిల్లలో ఒకడు ముందుకొచ్చాడు. “అది కాదండీ. ఏనుగులు నీళ్ళు తాగడానికి వెళుతూ ఉంటే మేమంతా చూస్తున్నామండీ. ఎవ్వళ్ళం ఏమీ చెయ్యలేదండీ. ఏనుగుల్ని చూస్తూ ఉంటేనండీ, మరండీ, పెద్ద ఏనుగు వెనకనుంచి వచ్చి వీణ్ణి పడదోసి, బుర్ర మీద కాలేసి తొక్కేసిందండీ.” ఒగురుస్తూ ఆ కుర్రాడు చెప్పి, వెక్కి వెక్కి ఏడవడం మొదలెట్టేడు.

అంతవరకు మౌనంగా కూర్చున్న స్వామివారు, “ఆ డింభకుడు చాలా ధన్యుడు,” అన్నారు, ఆయనకు సహజమైన మందహాసంతో.

వెంకడు వెర్రిగా చూశాడు.

వాడెందుకు ధన్యుడో సుగ్రాహ్యంగా బోధపరచేరాయన. “ఎంతో పుణ్యాత్ములకి మాత్రమే కపాలం పగిలి చావు వస్తుంది. కపాల మోక్షం అందరికీ లభిస్తుందా?”

వెంకడు స్వామివారి కాళ్ళమీద పడ్డాడు. ‘తవఁరు తలుసుకుంటే ఈ బొట్టెగాణ్ణి బతికించగలరు.”

“నిజమే!” అన్నారు స్వామివారు నిర్వికారంగా. సభికులందరూ విస్తుపోయి చూస్తున్నారాయనను. ఆయనకంత శక్తి ఉండే ఉంటుందని వారి అంచనా.

వెంకడి కళ్ళు మెరిశాయి. “ఈడికి ఎలాగైనా పేణం పొయ్యండి బాబూ.  మా ఇంట్లో తవఁరి బొమ్మెట్టి పూజ సేసుకుంటాను.”

“ఏనుగంటే సాక్షాత్తూ ఇంద్రుడి వాహనం…”  చెప్పుకు పోతున్నారు స్వాములోరు.

అయే ఉండొచ్చు. ఎవరి వాహనమైతే తనకెందుకు. తనకు తన కొడుకు ప్రాణం ముఖ్యం. తన కొడుకుని త్వరగా బ్రతికించకుండా ఈ పురాణం ఎందుకు చెబుతున్నారో వెంకడికి అర్థం కాలా.

“….అటువంటి పవిత్రమైన జంతువు వల్ల మరణం లభించడం చేత నీ కొడుకు సరాసరి స్వర్గానికే వెళతాడు.”

“ఒద్దు, బాబూ! ఒద్దు!!ఆణ్ణిక్కడే ఉణ్ణియ్యండి.”  వెంకడు లబో దిబోమని మొత్తుకోవడం మొదలెట్టేడు.

“శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. ఆయన ఆజ్ఞకు వ్యతిరేకంగా ప్రవర్తించడం బుద్ధిమంతుల లక్షణం కాదు.”

వెంకడికివేమీ వినపడ్డం లేదు. వాడి ఏడుపు మితిమీరిపోయింది. స్వామివారికి విసుగేసింది. కోపం కూడా వచ్చింది. “ఛీ! మూర్ఖుడు. చెప్పినా తెలుసుకోలేకుండా ఉన్నాడు.” అని చీదరించుకుంటూ లేచి అక్కడ నుండి వెళ్ళిపోయారు.

వెంకడు ఏడుస్తూ శవాన్ని భుజం మీద వేసుకుని స్మశానం వైపు దారి తీశాడు. ఆ తరువాత ఒక్కరొక్కరే ఆలయ ప్రాంగణం నుండి బయటపడ్డారు. పది నిమిషాలలో ఆలయం అంతా నిర్మానుష్యం అయిపోయింది.

సర్వసంగ పరిత్యాగి శ్రీ నిర్విరామానంద స్వామివారు ఊరిలోకి వచ్చిన తర్వాత మొదటి దినం గడచిపోయింది.

మర్నాడు మధ్యాహ్నం నిర్ణీత సమయానికి ఆలయంలో స్వామివారు  ఉపన్యాసం ప్రారంభించేరు. ఆయన భగవద్గీతలోని అంతరార్థాన్ని తెలియజేస్తున్నారు. పందిట్లో కూర్చున్న భక్తులు జాగర్దావస్థలో ఉండి ఉపన్యాస సారాన్ని ఆస్వాదిస్తూన్నట్లు తెలియడానికి వాళ్ళ ఊగే బుర్రలే తార్కాణం. “పరిత్రాణాయ సాధూనం వినాశాయచ దుష్కృతాం” అని స్వామివారు చదివినప్పుడు సాక్షాత్తూ ఆ శ్రీకృష్ణ పరమాత్మ కల్యాణ మండపం మీద అవతరించినట్లు గోచరించి భక్తులు ఆనంద బాష్పాలు విడచేరు. స్వామివారికి ఉబ్బసం వ్యాధి ఉండడం వల్లకాబోలు, ఆయన ఒక గంట ఉపన్యాసం ఇచ్చేసరికి ఆయాసం వచ్చింది. అందుచేత అంతటితో సభ ముగించేసి, సభకు విచ్చేసిన పుణ్యాత్ములందరికీ స్వయంగా తులసి తీర్థం ఇచ్చేరు.

మూడు దినాలు నిరాఘాటంగా ఉపన్యాసాలతో గడచిపోయింది. ఆతి సులభంగా మోక్షాన్ని సాధించే కిటుకులెన్నో నేర్చుకున్నారు, భక్తులు.

నాలుగోరోజ శుక్రవారం. ఆ రోజ ప్రత్యేకంగా స్త్రీలు మాత్రమే స్వామివారి దగ్గర తులసి తీర్థం తీసుకుందుకి నిర్ణయింపబడింది. శిష్యులు పెద్ద కాగు నిండా నీళ్ళు తోడి, కల్యాణ మడపం మీద స్వామివారికి అందుకొచ్చేలా కుడి చేతి వైపు పెట్టేరు. స్వామివారు స్వయంగా నాలుగు తులసి మొక్కల్ని పీకి, కాగులో వేసి, ఆ నీటిని పవిత్రం చేసారు. స్త్రీలంతా ఒకరి తర్వాత ఒకరు ఉత్తర ద్వారం గుండా ప్రవేశించి, తులసి తీర్థం సేవించి, దక్షిణ ద్వారం గుండా బయటకి వెళ్ళిపోవాలి – అదీ ఏర్పాటు. ఉత్తర ద్వారం దగ్గర శిష్యులు ఒకొక్కరినే లోపలకి ప్రవేశ పెడుతున్నారు. రమారమి ఏభై మంది తీర్థం తీసుకుని వెళ్ళిపోయారు. తరువాత ఇరవై సంవత్సరాల అమ్మాయి స్వామివారి సన్నిధికి వచ్చి తులసి తీర్థం కోసం చెయ్యి చాపింది. స్వామివారు ఉద్ధరిణితో తీర్థం తీసి, ఆ అమ్మాయిని నఖశిఖ పర్యంతం ఒక సారి పరీక్షించి, చేతిలో ఉద్ధరిణిని జారవిడచేరు. ఆమె ముఖంలోకి నిదానంగా చూసి, కన్ను మడచి ఒక చిరునవ్వు నవ్వారు. ఆ అమ్మాయికి ఒంటి నిండా తేళ్ళూ, జెర్రిలూ ప్రాకినట్లయింది. ముఖం చిట్లించి, కంగారుగా వెనక్కి తిరిగి ఉత్తర ద్వారం గుండా  పరుగెత్తుకుని బయటికి వచ్చేసింది. అక్కడ తీర్థం కోసం నిరీక్షిస్తున్న వాళ్ళంతా, “ఏమిటి? ఏమిటి జరిగిందేమిటి?” అన్నారు, ఆ అమ్మాయి గాభరా చూసి. బెక్కుతూ, బెక్కుతూ ఆ అమ్మాయి జరిగిన విషయాన్నంతా వెళ్ళగక్కింది.

స్వామివారు ఆ అమ్మాయిని అవమాన పరచేడన్న సంగతి సాయంత్రానికల్లా ఆ ఊరంతా అల్లుకు పోయింది. “అలా చేస్తాడా!” అనుకున్నారు కొంత మంది పెద్ద మనుష్యులు. “వాడి పని పట్టించాలి” అనుకున్నారు కొంతమంది రౌడీలు. ఏమైనా నిలకడ మీద ఈ విషయం అంతు తేల్చుకోవాలనుకున్నారు అంతా కలసి. ముహూర్తం మర్నాటికి వాయిదా వెయ్యబడింది.

శనివారం మధ్యాహ్నం స్వామివారు ఉపన్యాస వేదిక ఎక్కేసరికి సభలో చాలా మార్పు కనిపించింది. సభ ప్రతిరోజ కన్నా కిటకిటలాడుతూంది. ఒకొక్క పందిరి రాట దగ్గర ముగ్గురేసి ముష్కరులు చేత్తో కర్రలు పుచ్చుకుని నించున్నారు. ప్రతిరోజూ ఉండే నిశ్శబ్దం లేదు సభలో. స్వామివారు ఎక్కువ లోకజ్ఞానం కలవారు కనుకనూ, ఎన్నో ఢక్కామక్కీలు తిన్నవాడు కనుకనున్నూ విషయాన్ని అవలీలగా పసిగట్టగలిగేరు. సావకాశంగా కూర్చుని సహజమైన గంభీర స్వరంతో అడిగేరు, సభికులనుద్దేశించి. "మీరంతా నన్ను శిక్షించాలనుకుంటున్నారు కదూ?"

సభలో కోలాహలం అంతరించింది. కాని ఎవ్వరూ ఆ ప్రశ్నకి జవాబు చెప్పలేదు.

స్వామివారు మళ్ళా చెప్పడం మొదలు పెట్టేరు. "నాకు తెలుసు, అంతా తెలుసు. నిన్న ఒక యువతిని చూసి నవ్వినందుకు మీరంతా నా మీద పగ పట్టేరు. అలా నవ్వినందుకు తగినంత కారణం ఉంది. ఆ అమ్మాయి ఈ సభలో ఉంటే నేనేమీ చెప్పదలుచుకోలేదు."

"కారణం చెప్పండి. ఆ అమ్మాయి ఈ సభలో లేదు" అని అన్ని మూలలనుంచీ అందరూ అరిచేరు.

స్వామివారు ప్రసన్నతతో బదులు చెప్పేరు. "అతి త్వరలో వైధవ్యం ప్రాప్తించే సూచనలు కనిపించేయి, ఆ అమ్మాయి ముఖంలో. ఎంతో అందమైన అమ్మాయికి అతి త్వరలో అంతటి ఆపద వస్తుందంటే చాలా విచారించవలసిన విషయం.  సన్యాసం స్వీకరించిన వారు విచారించ కూడదు.  కనుక ఆ విధి విలాసాన్ని తలుచుకుని నవ్వేను." ఆయన ఆరోజ మరేమీ మాట్లాడ లేదు. ఉపన్యాసం ఇవ్వలేదు. అక్కడ నుండి లేచి వెళ్ళిపోయారు.

ప్రజా సమూహంలో తర్జనభర్జనలు ఎక్కువయ్యాయి. స్వామి చెప్పిన విషయం ఎంతవరకూ నిజమో కనుక్కోవాలనుకున్నారు. విషయం తెలుసుకు రావడానికి ఒకణ్ణి రాత్రికి రాత్రే ప్రయాణం కట్టి పంపేరు, ఆ అమ్మాయి భర్త నివశిస్తూన్న కైకరానికి. చెన్నూరుకి కైకరం దగ్గరలొనే ఉంది.
ప్రయాణమై వెళ్ళినవాడు తెల్లారేసరికి తిరిగొచ్చాడు. తను వెళ్ళేసరికి ఆ అమ్మాయి భర్త మరణావస్థలో ఉన్నాడనీ, మరో గంటలో ప్రాణాలు పోయాయనీ చెప్పేడు. ఈ వార్త వినేసరికి స్వామివారి ఘనత

పూర్తిగా అర్థం అయింది, గ్రామస్తులకు. ఎలా ఉన్నవాళ్ళలాగే స్వామివారి కాళ్ల మీద పడిపోయారు. తమ తొందరపాటుతనాన్ని క్షమించమన్నారు. తమ అపరాధాన్ని మన్నించమన్నారు.

శాంతంగా మందలించి స్వామివారు వారందరినీ మన్నించారు. కాని ఆ ఊరినుండి మాత్రం వెంటనే ప్రయాణం కట్టేరు. ప్రయాణమవుతూన్న స్వామివారిని తొమ్మిది రోజులూ ఉండి వెళ్ళమని ఊరివారంతా కాళ్ళా వేళ్ళా పడి బ్రతిమాలేరు. ఆయన వారికి చెప్పిన సమాధానం ఒక్కటే. “మీ వంటి అనుమానాలు గల వాళ్ళున్న ఊళ్ళో ఒక్క క్షణం కూడా ఉండలేను.”

తక్షణమే స్వామివారు తమ శిష్య గణంతోటీ, జంతు సముదాయంతోటీ, పరిచారకులతోటీ ముందు మజిలీకి తరలి పోయారు.

4

స్వామివారు వెళ్ళిన రెండు రోజులకి ఆ ఊళ్ళో ఒక విషయం తెలిసింది. అది విన్న వాళ్ళంతా ఆశ్చర్యంతో స్థబ్దులైపోయారు. ఆ ఊరు వచ్చే ముందు స్వామి కైకరంలోనే మజిలీ చేశారుట! అప్పటికే ఆ అమ్మాయి భర్త చావుబ్రతుకుల్లో ఉన్నాట్ట! ఈ విషయాన్ని పెయ్యేరు నుండి వచ్చిన చౌదరిగారొకాయన తెలియబరచేరు. చౌదరిగారు మరో విషయం చెప్పేరు. “మా ఊళ్ళో ఉన్న కాపులమ్మాయిని ఇలాగే అవమానపరచేడండీ. ఆ అమ్మాయి సిగ్గుతో ఆ విషయం నిన్నటివరకూ ఎవ్వరితోటీ చెప్పలేదు. మా ఊరి కాపులంతా స్వామివారి సంగతి అటో, ఇటో తేల్చుకు రాడానికి నిన్న రాత్రే కర్రలు పుచ్చుకుని బయలుదేరారు. ఆయన మజిలీ చేస్తూన్న కైకరం గ్రామానికి.”

మరో గంటకల్లా పెయ్యేరు నుండి బయలుదేరిన కాపులంతా కైకరం నుండి చెన్నూరు చక్కా వచ్చారు. అందరి చేతుల్లోనూ దుడ్డు కర్రలున్నాయి!

“ఏం జరిగిందర్రా?” అన్నాడు చౌదరి వాళ్ళని చూసి.

“ఏం జరుగుద్ది? సాములోరికి కపాలమోక్షం జరిగిపోయింది.” అన్నారు వాళ్ళంతా ఏక కంఠంతో.

“ఎంత పున్నెం సేసుకున్నడో” అన్న మాటలు వెట్టి వెంకన్న నోటంట అప్రయత్నంగా వెలువడ్డాయి.

# ఏకోదరులు

## (ఆంధ్రపత్రిక. 3 సెప్టెంబరు 1958)

1

“అరగంట నుండి చెబుతున్నా. పుస్తకం తియ్యకుండా అలా ముడిచిపెట్టుకు పడుకుంటావేమిరా?”

రంగారావుకు అన్న మాటలు వినబడుతున్నా, తనని కానట్లే ముసుగు మరింత బిగించి పడుక్కున్నాడు.

“వెధవ, చదవకుండా ఎన్నాళ్ళిలా  ఈ క్లాసులో కూర్చుంటాడు?” అనుకుంటూ జగన్నాధం తను చదువుతూన్న పుస్తకాన్ని అక్కడ పెట్టి, లేచి తమ్ముడు పడుక్కున్న మంచం దగ్గరకి వెళ్ళేడు. కప్పుకున్న దుప్పటిని తొలగించి, రంగారావుని లేవదీసి మంచం మీద కూర్చోబెట్టేడు.  తన సుఖమయమైన సుషుప్తికి భంగం కలిగినందుకు రంగారావు కొంచెం గొణుక్కున్నాడు.

“మొహం కడుక్కుని కూర్చోరా. నిద్ర మత్తు వదిలి పోతుంది,” అంటూ గ్లాసులో మంచినీళ్ళు పోసి తమ్ముడికందించేడు, జగన్నాధం.

ఇంక తప్పదనుకుంటూ రంగారావు మంచం మీద నుండి లేచి బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ వాకిట్లోకి వెళ్ళి ముఖం కడుక్కుని తిరిగి వచ్చి కూర్చున్నాడు దీపం ముందు.

ఇద్దరికీ మధ్యనున్న హరికేన్ లాంతరు జ్వాజ్వల్యమానంగా వెలుగుతూంది. జగన్నాధం దీక్షగా చదువుతున్నాడు. రంగారావుకి మాత్రం చదవ బుద్ధి వెయ్యడం లేదు. చేతులో పుస్తకం ఉంది, కాని బద్ధకంగా జోగుతున్నాడు. ఒక సారి తల పైకెత్తి చూసిన జగన్నాధానికి, తమ్ముడు బద్ధకంగా జోగుతూ ఉండడం కనిపించింది.

రంగారావు తెలివైన వాడే. ఎంత తెలివైనవాడైతే మాత్రం ఒక్క సారైనా పుస్తకం ముట్టుకోకపోతే – ఆ చదువు అబ్బుతుందా?  అతని కంటె శుంఠలు ‘నా బొందో’ అని ఇరవై నాలుగు గంటలూ పుస్తకాలు ముందు పడేసుకుని రంగారావు కంటే తెలివైన వాళ్ళల్లా ఉపాధ్యయుల ముందు చెలామణీ

అవుతున్నారు. అలాటిది రంగారావేమాత్రం ఒళ్ళు ఒంచి చదివినా పరిక్షల్లో మంచి మార్కులు రావడానికి అవకాశం ఉంది – కాని, పరమ బద్ధకిష్టి.

జగన్నాధానికి తమ్ముడి బద్ధకం చూస్తూ ఉంటే అమితమైన కోపమూ, నిష్కారణంగా పాడైపోతాడేమోననే ఉక్రోషమూ మనసులో పెనవేసుకున్నాయి. తనంటే వాడికి ఎంతో అభిమానమూ, గౌరవమూ ఉన్నాయి. కాని భయం లేదు. కొంచెం భయం కలిగించి లొంగదీసుకోవాలనే ఉద్దేశ్యంతో జగన్నాధం తమ్ముణ్ణి చాచి ఒక లెంపకాయ కొట్టేడు.

నిద్ర మత్తుతో జోగుతూన్న రంగారావు ఆ ఊపుకి వెలిగి వెలిగి వేడెక్కి ఉన్న లాంతరు మీద పడ్డాడు. ఒళ్ళు చురికిన బాధతో మత్తు పూర్తిగా ఒదిలిపోయిన రంగారావు, “అమ్మో!” అని కేక వేసేడు. ఈ హఠాత్సంఘటనకి జగన్నాధం రిచ్చపోయి, గబగబా దీపం తీసి దూరంగా పెట్టి, తమ్ముణ్ణి కూర్చోబెట్టి, కొబ్బరినూనె, సున్నపు నీరూ కలిపి కాలిన చోట పట్టించాడు.

చాలాసేపటి నుండి వెలుగుతూ తీవ్రంగా వేడెక్కిపోయిన లాంతరు మీద జబ్బ బలంగా మొయ్యడం వల్ల రూపాయి కాసంత మేర కాలి పోయి చర్మం ఊడిపోయింది. తమ్ముడి చేతి మీద ఆ గాయం చూడగానే జగన్నాధానికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. దీనంగా తమ్ముడి కళ్ళల్లోకి చూస్తూ , “తమ్ముడూ! ఇలా అవుతుందనుకోలేదురా. నువ్వు చదువుకోవడం లేదనే బాధ కొద్దీ, నీ క్లాసులో ఒట్టి చవటలంతా నీ కంటె తెలివయిన వాళ్ళల్లా చెలామణీ అయిపోతున్నారనే ఈర్ష్య కొద్దీ , నీలోని పౌరుషాన్ని మేల్కొలుపుదామనే ఆశతో నిన్ను కొట్టేను. అంతేకాని, ఇలా అవుతుందనుకోలేదు,” అన్నాడు చిన్నబోయిన ముఖంతో.

రంగారావు అన్న ముఖంలోకి ఆప్యాయంగా చూశాడు. తన అన్న తనను గురించి మనస్సులో పడే క్షోభ ముందు తన చేతి మీద కాలిన గాయం వల్ల కలిగే బాధ ఏమాత్రం? కేవలం విస్మరింపదగినదే. అసలే తన అన్నది బేల మనసు. అందుకే ఈ చిన్న సంఘటనకు అలా బాధ పడుతున్నాడు. ఆ క్షణంలో అన్న పై నుండే ప్రేమానురాగాలూ, భక్తిభావమూ ద్విగుణీకృతంగా అతని హృదయంలో విజృంభించాయి, “అన్నయ్యా!” అంటూ జగన్నాధం మీద వాలిపోయాడు. “ఇక ముందు జాగ్రత్తగా చదువుంటానన్నయ్యా! నీ మనసును కష్టపెట్టనన్నయ్యా!” అన్నాడు. జగన్నాధం ప్రేమతోఈ రంగారావు శిరస్సును హృదయానికి చేర్చుకున్నాడు.

జగన్నాథం రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో బి. ఎ. పరిక్షకు చదువుతున్నాడు. రంగారావు వీరేశలింగం హైస్కూలులో స్కూల్ ఫైనల్ చదువుతున్నాడు. ఇద్దరూ ఇన్నీస్ పేటలో ఒక గది అద్దెకి తీసుకొని ఉంటున్నారు. జగన్నాథం తన స్వశక్తి వల్ల రెండు, మూడు స్కాలర్‌షిప్పులు సంపాదించుకున్నాడు. వాటి మీద వచ్చే ఆదాయం వల్లనే అన్నదమ్ములిద్దరి చదువూ సాగుతూంది. లేక పోతే పల్లెటూళ్ళో చేరెడు భూమిని సేద్యం చేసుకుని బతుకుతూన్న తల్లిదండ్రులు వాళ్ళకి ఎలాగూ ఉన్నత విద్య చెప్పించలేరు.

స్వతహాగా జగన్నాథం తెలివైనవాడు. తన తెలివితేటలకు తోడు నిరంతరమయిన కృషి వల్ల విద్యారంగంలో అతను సాన పట్టిన వజ్రంలా తయారయేడు. తల్లిదండ్రులు తప్పితే తననూ తమ్ముడినీ స్వచ్ఛమైన మనస్సుతో ఆదరించేవాళ్ళే లేరు. ఆ తల్లిదండ్రులు ఆర్థికంగా ఉన్నతులు కాకపోవడం వలన తాము జీవితంలో పురోగమించడానికి ఏ విధంగానూ వాళ్ళ ఆదరణ చేయూతనివ్వలేదు.  అందుకే జగన్నాథానికి చిన్నతనంలోనే బాధ్యతల బరువు తెలిసి వచ్చింది. తాముండే పరిస్థితులని అర్థం చేసుకోకుండా, తమ్ముడు తన కనీసపు బాధ్యతలను కూడా విస్మరించి ప్రవర్తించడం జగన్నాథానికి ఉక్రోషం కలిగించింది. కాని కొద్ది రోజుల క్రిందట జరిగిన సంఘటనతో రంగారావు కొద్దిగా మారినట్లే కనిపించాడు. అతను అప్పుడప్పుడు ఏ పనిలోనైనా బద్ధకించినా, చేతి మీద శాశ్వతంగా ఏర్పడిన రూపాయి కాసంత మచ్చ తన బాధ్యతలను  జ్ఞాపకం చేసి హెచ్చరిస్తూన్నట్లు అనుభూతి పొందేవాడు.

2

జీవితంలో ఒకొక్క సారి ఎదురు పడే సంఘటనలు ఆయా వ్యక్తుల జీవిత పథాలనే పూర్తిగా మార్చేస్తూ ఉంటాయి. అటువంటి సంఘటనే ఒకటి అకస్మాత్తుగా జరిగి పోయింది.

పరిక్షలింక కొద్ది రోజులు మాత్రమే ఉన్నాయి. రంగారావూ, జగన్నాథమూ – ఇద్దరూ పెద్ద పరిక్షలకి హాజరు కావలసిన వాళ్ళే. అందుచేత మామూలు కంటె ఎక్కువ కాలాన్ని చదువు క్రింద వినియోగిస్తున్నారు. ప్రతి రోజూ తెల్లవారుజామునే లేచి ప్రశాంత వాతావరణంలో చదవడం మొదలుపెట్టేవారు. ఒకనాడు మామూలుగానే లేచి వసారాలో కూర్చుని ఇద్దరూ చదువుకుంటున్నారు. హరికేన్ లాంతరు విరజిమ్మే వెలుగు వసారా అంతటా పరచుకొంది. ఒకటి రెండు కాంతి రేఖలు వీధి మెట్లమీదకి ప్రసరిస్తున్నాయి. వీధి మెట్ల దిగువ మిగిలిన భాగం అంతా అంధకారంగానే ఉంది. ఇద్దరూ దీక్షగా చదువుతున్నారు.

ఇంతలో వీధి మెట్ల మీద ఏదో సవ్వడి అయింది. జగన్నాధం అటు తిరిగి చూసాడు. తను ధరించిన దళసరి కళ్ళద్దాల లోంచి అక్కడ వెలుగు నీడల మధ్య ఏదో ఆకారం కదుల్తూన్నట్లు కనబడింది.

"వెధవ కుక్కలు! ఎప్పుడూ మన గుమ్మంలోనే పడి ఏడుస్తాయి!" అన్నాడు రంగారావు యధాలాపంగా – అటువైపేనా చూడకుండా. జగన్నాధం పక్కనున్న రూళ్ళ కర్రని తీసి కుక్కను తరిమి కొట్టే ఉద్దేశంతో కదుల్తూన్న ఆకారం మీదకి బలంగా విసిరేడు. హృదయాలను పట్టి కుదిపే దీనమైన ఆర్తనాదం, మనిషి నేల మీద పడ్డట్లు 'దుబ్బు' మన్న శబ్దం ఒకదాని వెంబడి మరొకటి వినిపించాయి.

అన్నదమ్ములిద్దరూ గాభరాగా లేచి దీపం చేత పట్టుకొని గడప దగ్గరకి వెళ్ళారు. అక్కడ కనిపించిన దృశ్యానికి వాళ్ళు భయంతో కంపించి పోయారు. సుమారు ఏభై ఏళ్ళ వ్యక్తి మెట్ల మీద ఏటవాలుగా పడున్నాడు. చిరిగిన బట్టలూ, చంకని జోలె, వీపుకంటుకుపోయిన పొట్టా – అన్నీ అతనొక బిచ్చగాడని చెబుతున్నాయి. జగన్నాధం విసిరిన రూళ్ళ కర్ర ఆయువుపట్టు మీద తగిలిందో ఏమో, ఆ వ్యక్తి వెంటనే ప్రాణాలు ఒదిలేసినట్టున్నాడు. ఈ దృశ్యాన్ని చూసిన జగన్నాధం ఆపాద మస్తకమూ కంపించి పోయాడు. శరీరం అంతా కమ్మిన చెమటకి అతని దుస్తులు పూర్తిగా తడిసి ముద్దయి పోయాయి. నిర్లిప్తంగా, వెర్రిగా, భయం భయంగా చూస్తున్నాడే కాని అతనిలో నిజానికి చైతన్యం లేదు.

రంగారావు జగన్నాధం కంటె ధైర్యశాలి. చెదిరిన మనస్సుని కొద్ది క్షణాల్లోనే కూడదీసుకున్నాడు. తరుణోపాయం కోసం అతని మెదడు విద్యుద్వేగంతో పని చేస్తూంది. తటాలున జగన్నాధం చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళాడు. "గత్యంతరం ఆలోచించాను," అన్నాడు రహస్యంగా.

జగన్నధం వెర్రిగా చూశాడు.

"నేనిక్కడినుండి పరారీ అయిపోతాను. నేరం దానంతటదే నా మీదకు తోసుకు పోతుంది." రంగారావు నిశ్చలంగా చెప్పేడు.

'నువ్వా?" అన్నాడు జగన్నాధం బలవంతంగా తేరుకుని.

"అవును. నేనే. మనం ఉన్న పరిస్థితులలో నేను పారిపోవడమే ఉత్తమం. నువ్వు నా కంటె ఎక్కువ చదువుకున్న వాడివీ, తెలివైన వాడివీ. పైగా నీకు ఉచిత వేతనాల సదుపాయం ఉంది. కాబట్టి నీ చదువు సులువుగా కొనసాగిపోతుంది. సంఘంలో ఉన్నత స్థానానికి చేరుకోడానికి అవకాశాలు

నీకున్నట్లుగా నాకు లేవు. త్వరగా చదువు పూర్తి చేసి మన తల్లి దండ్రులని ఆదుకునే అవకాశం నీకు ఎక్కువగా ఉంది. కనుక ఈ పరిస్థితుల్లో నా కంటె నీకు ఎక్కువ రక్షణ కావలసి ఉంది. ఏమీ తెలియనట్లే నువ్వు రోజులని గడిపెయ్. కొన్నాళ్ళకి పరిస్థితులు వాటంతట అవే సర్దుకుంటాయి. ఈ తరుణంలో నీ భవిష్యత్తుకి గండి పడడం మన కుటుంబానికి క్షేమం కాదు. మరి నేను వెళుతున్నాను. బహుశా ఇదే మనకి ఆఖరి చూపేమో!"

"తమ్ముడూ! వద్దు. నేరం నీమీద మోపుకొని నువ్వు పారిపోడానికి వీలు లేదు. నేరం నాది, శిక్ష నీదినా? ఒద్దు, తమ్ముడూ!" అంటూ జగన్నాధం తమ్ముణ్ణి గట్టిగా కౌగలించుకొన్నాడు.

రంగారావు మృదువుగా అన్న కౌగిలి నుండి తప్పించుకుని, "నిన్ను బ్రతిమాలుకుంటున్నాను. నన్ను వెళ్ళనీ, అన్నయ్యా! నిదానంగా ఆలోచిస్తే నేను చెప్పిన మాటలో సత్యాసత్యాలు నీకే అర్థమవుతాయి. మనం ఇప్పుడు ఈ సమస్యని తర్కిస్తూ కాలయాపన చెయ్యడానికి వేళ లేదు. నేనింకా మైనర్ని గనుక పట్టుబడినా పెద్ద శిక్ష పడదు. నువ్వు మాత్రం ధైర్యంగా ఉండు. ఏ పరిస్థితులలోనూ నిజాన్ని వెల్లడి చెయ్యకు," అంటూ తలుపు తెరుచుకుని చీకట్లోకి లీనమైపోయాడు.

"తమ్ముడూ!" అంటూ అస్పష్టంగా జగన్నాధం పిలచిన పిలుపు అక్కడికక్కడే గాలిలో కలిసిపోయింది.

రంగారావు వెళ్ళిపోయిన తరువాత నిదానంగా ఆలోచిస్తే తమ్ముడు చెప్పిన మాటల్లో పరిస్థితులని ఆకళింపు చేసుకొన్న పచ్చి నిజం ఉన్నట్లు కనిపించింది.

తెల్లవారేసరికి ఆ ఇంటి ముందు పోలిసు ఉద్యోగులూ, తమాషా చూడ్డానికి వచ్చినట్లు జనమూ పోగయారు. శవాన్ని పంచాయతీ చేసిన పెద్దలు అది 'హత్య' అని నిర్ణయించేరు.

పోలీసులు జగన్నాధాన్ని తమ ప్రశ్నలతో గంటలకొద్దీ వేధించేరు. ప్రతి ప్రశ్నకూ "నాకు తెలియదు" అంటూ ఓపిగ్గా జవాబులిచ్చేడు జగన్నాధం.

అతని జవాబులతో ఏ కొలిక్కీ రాకుండా విసిగిపోయిన పోలీసు అధికారి మరొక కోణం నుండి నరుక్కు రావడం మొదలుపెట్టేడు.

“ఈ ఇంట్లో ఎవరెవరు ఉంటున్నారు?”

“నేనూ, నా తమ్ముడూ.”

“మీ తమ్ముడెక్కడ?”

“తెలియదు. రాత్రి నుండి కనబడడం లేదు.”

ఆ పత్తేదారు మనస్సులో ఒక ఆలోచన తళుక్కున మెరిసింది. “ఇంకేం! ఆ తమ్ముడే హత్య చేసి పరారీ అయాడన్న మాట!” అని తనలో తను అనుకున్నట్లు అన్నాడు.

జగన్నాథం స్పందించ లేదు. అంతటితో వారంతా జగన్నాథాన్ని వదలిపెట్టి వెళ్ళిపోయారు. ఇక తన తమ్ముణ్ణి వేటాడుతారు కాబోలు అనుకున్నాడు, జగన్నాథం. వాడెటు పోయాడో? ఎక్కడున్నాడో?

ఇది జరిగిన నాలుగైదు రోజుల తర్వాత ధవళేశ్వరం ఆనకట్ట దగ్గర ఒక కుర్రాడి శవం గోదావరిలో తేలింది. నీటిలో బాగా నానిపోవడం వల్ల శరీరమంతా ఉబ్బిపోయి, చేప కొరుకుళ్ళకి ముఖం పోల్తి లేకుండా పోయింది. అక్కడకి చేరిన పోలీసులు ఆ కుర్రాడికి పదహారు, పదిహేడేళ్ళ కంటె ఎక్కువ ఉండవని అంచనా వేసారు.

ఈ వార్త విని జగన్నాథం గాభరాగా ఆనకట్ట దగ్గరకి పరిగెత్తుకుని వెళ్ళేడు. పరిక్షగా శవాన్ని చూసాడు. మనస్సు కొద్దిగా కుదుట పడింది. తరువాత చుట్టూ చూశాడు. నాలుగు రోజుల క్రితం తనని ప్రశ్నలతో వేధించిన ఇనస్పెక్టరు కూడ అక్కడే ఉన్నాడు. ఆ సమయంలో జగన్నాథం మెదడులో తళుక్కున ఒక ఆలోచన మెరిసింది. మళ్ళా మరొక సారి శవం వైపు చూసి భోరున ఏడవడం మొదలు పెట్టేడు. ఆ ఏడుపుకి చుట్టుపక్కల ప్రజ దగ్గరకొచ్చింది. దూరాన్న ఉన్న ఇనస్పెక్టరు కూడ వచ్చేడు.

దూరాన్న ఉన్న శవాన్ని చూపెడుతూ, “మా తమ్ముడండీ!” అంటూ వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టేడు, జగన్నాథం.

“నువ్వు ఎలా పోల్చగలిగేవు?” ఇనస్పెక్టరు అడిగేడు.

“వాడు తొడుక్కున్న లాగు, చొక్కా నాకు గుర్తేనండి.”  తర్వాత  “ఆ మచ్చ చూశారా? అది మా తమ్ముడేనండి.”

“అయితే మీ తమ్ముడే నంటావు?” విషయం త్వరగా పరిష్కారం అయిపోతే కేసు మూసేయచ్చని సంతోషిస్తూ.

“వాడేనండి.” ఏడుస్తూనే సమాధానం చెప్పేడు.

పోలీసులు చెయ్య వలసిన తంతు ముగించుకొని, శవాన్ని జగన్నాధానికి అప్పగించేసి ఎవరి ఇళ్ళకు వారు వెళ్ళిపోయారు.

“అనాధ ప్రేత సంస్కారం పుణ్యమే” అనుకుంటూ జగన్నాధం ఇంటి ముఖం పట్టేడు. పోలీసులు కేసు మూసేసేరు.

3.

ఇరవై అయిదు సంవత్సరాలని కాలం కబళించేసింది.  ఈ కాలం లో ఒడలు బళ్ళయాయి, బళ్ళు ఒడలయాయి. ఊళ్ళు మారాయి. మనుషులు మారారు. పిల్లలు పెద్దలయారు. పెద్దలు వృద్ధులయారు. వృద్ధులు బూడిద అయారు.

బూడిద పట్టిన శరీరంతో సోమయ్య రిక్షాని నీడలోకి మళ్ళించి ఒక చెట్టు కింద సేద తీర్చుకుంటున్నాడు. బజారులో కోటయ్య కొట్లో కొనుక్కున్న పకోడీల పొట్లం విప్పి రిక్షాలో కూర్చుని ఒకటీ ఒకటీ తినేసి పొట్లం కట్టిన కాగితాన్ని యధాలాపంగా చదవటం మొదలుపెట్టేడు. అది ఒక దిన పత్రిక లోని కాగితం. సోమయ్య దృష్టి ‘ఉద్యోగులు, బదిలీలు’ అన్న శీర్షిక మీద పడింది. కాగితాన్ని సాపు చేసి ఆ వార్తని మరొక సారి చదివేడు. తర్వాత దానిని జాగ్రత్తగా మడత పెట్టి తన తలపాగాలో దాచుకొన్నాడు. వెంటనే రిక్షాని తీసుకెళ్ళి యజమానికి అప్పగించి ఇంటికి చేరుకున్నాడు.

సోమయ్య ఇంటికొస్తూనే “నాగులూ!” అని పిలిచేడు.

“ఏం, నాన్నా!” అంటూ నాగులు ఎదురొచ్చాడు.

“లే! బట్టలు సర్దుకో. మనం బందరు వెళ్ళిపోతున్నాం,” అన్నాడు సోమయ్య.

నాగులు ఎందుకు అని ప్రశ్నించలేదు. తండ్రి నోట ఏ మాట వచ్చినా అలా ప్రశ్నించే అలవాటు లేదు వాడికి. వాడికి తల్లీ, తండ్రీ సోమయ్యే. సోమయ్య భార్య ఇరవై ఏళ్ళ క్రితమే కొడుకుని కని పురిట్లోనే కన్ను మూసింది.

నాగులు వెంటనే బట్టలు సర్దుకున్నాడు. వాళ్ళకి బట్టలనగా ఎన్నని? బట్టల సంచీ చేత్తో పట్టుకుని నాగులు తండ్రిని అనుసరించాడు.

బందరులో తండ్రీ, కొడుకూ వీధులన్నీ తిరిగి విసిగి వేసారి పోయారు. సర్కిల్ పేట, బచ్చు పేట, బుట్టయ్య పేట, పరాసుపాలెం, నక్కల తోట.. ఇలా ఊరంతా గాలిస్తున్నాడు. తండ్రి ఏమిటి వెతుకుతున్నాడో నాగులుకి అర్థం కాకపోయినా, యాంత్రికంగా తండ్రిని అనుసరించి నడుస్తున్నాడు. ముందు నడుస్తూన్న సోమయ్య హఠాత్తుగా ఒక బంగళా ముందు ఆగాడు.  అధునాతనంగా ఉన్న ఆ బంగళా చుట్టూ ఖాళీ స్థలం, దాని చుట్టూ ప్రహరీ గోడ, ఆ గోడ మీద గేటు పక్కగా ఉన్న ఒక బల్ల చెక్క మీద - ‘జె. జగన్నాథం, బి. ఎ., ఎం. ఎల్. డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి’ - అని ఉంది. సోమయ్య ఆ గేటు ముందు చతికిలబడి తన శరీరం వైపు ఒకసారి చూసుకున్నాడు. చిరిగి పోయి, దుమ్ము కొట్టుకుపోయిన బట్టలు. పెరిగిన గెడ్డం. రూపు ముష్టివాడిలా ఉంది.

పది గంటలు కావస్తూంది. మబ్బు విడచిన ఎండ చుర్రు మంటోంది. కారులో జడ్జీ గారు కోర్టుకి బయలు దేరారు. డ్రైవరు కారుని జోరుగా బయటకు తోలుకొచ్చి అకస్మాత్తుగా ఎదురుపడ్డ సోమయ్యని చూసి తొందరగా బ్రేకు వేసి కారుని ఆపాడు. కిటికీ తలుపు తెరచి, తల బైటకి పెట్టి, “ఏయ్! కారొస్తా ఉంటే కళ్ళు కనబడ్డం లేదూ?” అంటూ సోమయ్యని అదలించి ముందుకి సాగి పోయాడు.

“డ్రైవర్! ఏమిటా దురుసుతనం. మర్యాదగా చెప్పలేవూ?” అంటూ జడ్జీ గారు డ్రైవరుని మందలించేరు.

ముష్టి వాళ్ళని చూసినప్పుడల్లా ఆయనకి చదువుకునే రోజులలో సంఘటన జ్ఞాపకం వచ్చి మనస్సు అల్లకల్లోలం అవుతూ ఉంటుంది. మరొకరికి మనసు విప్పి చెప్పుకోలేని పరిస్థితి అది.

సాయంత్రం కోర్టు నుండి తిరిగి వచ్చేటప్పుడు కూడ అదే బిచ్చ గాడు తన గేటు ముందు ఉండడం గమనించేరు జడ్జీ గారు. లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని బయటకు వచ్చి వాలు కుర్చీలో కూర్చుని పత్రిక చదువుకుంటూ, బయట ఉన్న ముష్టి వాళ్ళిద్దరినీ లోపలకి తీసుకు రమ్మని డ్రైవరుతో చెప్పేరు.

డ్రైవరు వాళ్ళిద్దరినీ వెంట పెట్టుకుని వచ్చాడు.

సోమయ్య లోపలికి వస్తూనే జడ్జీ గారికి వినమ్ర భావంతో నమస్కరించి తన గోడు చెప్పుకోవడం మొదలు పెట్టేడు. ఆ లోగిట్లో ఏదైనా నౌకరీ చూపిస్తే అక్కడే పడుంటానన్నాడు. రెండు పూట్లా ఇంత తిండి పడేస్తే చాలు, జీతమే అవసరం లేదన్నాడు.

జడ్జీగారు సాంతం విని శాంతంగా చెప్పేరు. "నాకు నౌకర్లు అవసరం లేదు. మరెక్కడికైనా వెళ్ళి నౌకరీ చూసుకో... ఇదిగో.. ఇంద.. ఇది తీసుకో" అంటూ ఒక రూపాయి కాసు ఇవ్వబోయారు.

సోమయ్య తీసుకో లేదు. "ఒద్దు, బాబూ. మీ దయ ఉండాలి కాని, నాకు డబ్బులెందుకు బాబయ్యా?"

ఇంతలో ఎవరో పెద్దమనిషి రావడం వల్ల జడ్జీగారు ఆయనతో మాట్లాడ్డంలో నిమగ్నమైపోయారు. సోమయ్య చిన్నబోయిన ముఖంతో అక్కడ నుండి కదిలాడు.

విశేషమేమంటే సోమయ్య కదలకుండా తన ఇంటి గేటు ముందే ఉండడాన్ని జడ్జీ గారు రెండు రోజుల బట్టి గమనిస్తున్నారు. మూడోనాడు తన దగ్గర బంట్రోత్తుగా నియమించమని డ్రైవరుకి చెప్పేరు. ఆ రోజు నుండీ సోమయ్య జడ్జీ గారి ఇంటిని కనిపెట్టుకుని ఉండేవాడు. నాగులు ఊళ్ళో కూలీ, నాలీ చేసుకునేవాడు.

కొద్ది రోజులలో సోమయ్య జడ్జీ గారి అభిమాన పాత్రుడు అయాడు. ఆయనకి కావలసిన ప్రతిపని భక్తి శ్రద్ధలతో చేసేవాడు. ఇరవై నాలుగు గంటలూ ఆయననే కనిపెట్టుకుని ఉండేవాడు.

జడ్జీ గారు సోమయ్య గురించి అప్పుడప్పుడు ఆలోచించేవారు. ఎంత మంచి వాడతను. తనంటే ఎంత అభిమానం చూపుతున్నాడు. మనిషిని చూడగానే నౌకరనే భావమే రాదు మనస్సులోకి. మొదట్లో అతన్ని చూసి ఏదో బిచ్చగాడని భ్రమపడి చులకన చేసేడు, కాని పరిశీలిస్తే అతనెవరో బ్రతికి చెడ్డ వాడిలా ఉన్నాడు. అందుకే కాబోలు తను రూపాయి ఇస్తే తీసుకోలేదు సరికదా ముఖం

చిన్నపుచ్చుకున్నాడు. అతనిలో గతించిన ఆభిజాత్యపు వాసనలు ఇంకా ఆత్మాభిమానాన్ని కాపాడుతున్నాయి కాబోలు.

ఒక నాడు జడ్జీ గారు క్లబ్బు నుండి ఇంటికి వస్తున్నారు. ఆనాడు క్లబ్బు వార్షికోత్సవం కనుక అక్కడ బయలుదేరేసరికే సుమారు పదకొండు గంటలు అయింది. డ్రైవరు సాయంత్రమే ఇంటికి వెళ్ళిపోవటం వలన ఆయనే కారు నడుపుతున్నారు. సోమయ్య వెనక సీటులో, బెంచీ కొసని ఆనీఆననట్లు కూర్చున్నాడు. బందరులో రాత్రి ఎనిమిది దాటిందంటే వీధులన్నీ నిర్మానుష్యంగా తయారవుతాయి. పదకొండు గంటలనగానే మరీ శూన్యం గా ఉన్నాయి. అక్కడక్కడ ఉన్న విద్యుద్దీపాలతో రోడ్డు మీద పొడుగాటి నీడలు పడుతున్నాయి తప్ప, మరీ చీకటిగా లేదు. కారు నల్లటి తారు రోడ్డు మీద ముందుకి సాగిపోతోంది.

కారు మళుపు తిరుగుతోంది. దూరం నుండి ఒక పెడబొబ్బ, ఒక మానవాకారం దుబ్బున నేల మీద పడ్డట్టు ఆ నిశీధిలోని నిశ్శబ్దాన్ని చీల్చుతూ ఒక శబ్దం వినిపించాయి. మరుక్షణంలో మరో వ్యక్తి మసక చీకట్లోని వెలుగు నీడల్లోకి మాయమయిపోవడం క్షణంలో జరిగిపోయాయి. బలిష్టమైన వ్యక్తి మసగ్గ చీకట్లోకి మాయమైపోవడం జడ్జీగారికీ, సోమయ్యకీ స్పష్టంగా కనిపించింది.

జడ్జీ గారు కారు ఆపి, “సోమయ్యా! అక్కడేదో గలాటా జరుగుతూన్నట్లు ఉంది. అలా వెళ్ళి ఎవ్వరైనా బీటు జవాను కనిపిస్తే ఈ స్థలానికి పంపించి నువ్వు ఇంటికి నడచి వచ్చెయ్” అని ఆయన సోమయ్యని అక్కడ దింపి, కారు తీసుకుని వెళ్ళిపోయారు.

హత్యా నేరం మీద మరునాడు నాగులుని పోలీసులు అరెస్టు చేశారు. ఆ వార్త తెలిశాక సోమయ్య జడ్జీగారి ముందు వాపోయాడు, “వాడికేం తెలియదు, బాబూ!” అని. జడ్జీగారు నిర్లిప్తంగా సోమయ్య గోడుని ఆలకించి, మరేమీ స్పందించకుండా ఊరుకున్నారు.

నాగులు మీద మోపబడ్డ హత్యా నేరం సెషన్స్ కోర్టుకి పంపబడింది. జస్టిస్ జగన్నాధం గారి ఎదుట మూడు వాయిదాల్లో కేసు కూలంకషంగా చర్చించబడింది. ప్రాసిక్యూషన్ వారు బలవత్తరమైన సాక్ష్యాధారాలు ప్రవేశ పెట్టేరు.

“నేనేమీ ఎరగను బాబయ్యా! నన్ను అన్యాయంగా పట్టుకుని కటకటాల వెనుక తోసేశారు,” అంటూ బోనులో నుండి నాగులు హృదయ విదారకంగా ఏడ్చేడు. వాడి తరఫున వాదించడానికి ఎవరుంటారు? వాడి ఏడుపు వాడు ఏడవ్వలసిందే.

కోర్టులో అంతా నాగులు మీద నేరం రుజువైపోయినట్లూ, వాడికి శిక్ష పడక తప్పదని రూఢి చేసుకుని, ఆ పడే శిక్ష ఏమిటై ఉంటుందా అని ఊహాగానాలు చేస్తున్నారు. కోర్టు హాలులో ఒక మూలగా నిలబడ్డ సోమయ్య బలవంతంగా కన్నీటిని ఆపుకొంటున్నాడు.

కేసు యొక్క అంతిమ పరిష్కారం మరునాటికి వాయిదా వేయబడింది.

ఆ రాత్రి జగన్నాధం గారు తన గదిలో ఒంటరిగా కూర్చుని కోర్టు కాగితాలు చూసుకుంటున్నారు. సోమయ్య అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వచ్చి ఆయన ముందు నిలబడ్డాడు. అతని కళ్ళ నుండి ధారాపాతంగా అశ్రుజలం స్రవిస్తోంది.  అవనిత వదనుడై వ్రాసుకుంటూన్న జడ్జీగారు తలెత్తి సోమయ్య ముఖంలోకి జాలిగా చూశారు. నిస్తేజమైన అతనిముఖంలో అంతులేని వ్యధ గోచరించింది.

“బాబూ! నాగులు నేరం చేశాడని మీరూ అనుకుంటున్నారా?” అన్నాడు సోమయ్య పెల్లుబుకుతూన్న దుఃఖాన్ని ఆపుకుంటూ.

జడ్జీ గారు మాట్లాడ లేదు. ఆయన ముఖంలో భావ శూన్యత గోచరించింది. అవును. గురుతర బాధ్యతలు కలిగిన న్యాయాధికారిగా ఆయన అభియోగం పరిష్కారం అయేవరకూ  తన నిర్ణయాలను ఏ విధం గానూ బయల్పరచ కూడదు.

మనో వ్యగ్రతతో కృంగిపోతూన్న సోమయ్యకు ఇదంతా ఎందుకు? తన కొడుకు నిర్దోషి అని చెప్పుకుందుకే అతను ప్రయత్నిస్తున్నాడు.

“ఏం జరిగిందో చెబుతాను, వినండి, బాబూ! ఖూనీ చెయ్యబడ్డ వ్యక్తి మా నాగులికి స్నేహితుడే. మా ఇల్లు కూడా హత్య జరిగిన స్థలానికి దగ్గరగానే ఉంది. అప్పుడే పడుక్కోటానికి సిద్ధ పడుతూన్న నాగులు చావు కేక విని హడావుడిగా ఆ ప్రదేశానికి పరిగెత్తేడుట. తీరా చూస్తే దెబ్బ తిని పడిపోయినవాడు తన స్నేహితుడే! ఇంకా ప్రాణం ఉందేమోనని ఆశగా పరీక్షిస్తున్నాడుట. ఈ లోగా

పోలీసులు వాణ్ణి పట్టుకున్నారు.... వాడలాటి వాడుకాదు, బాబూ! పుణ్యానికి పోతే పాపం ఎదురయింది." సోమయ్య ఆగి జడ్జీ గారి ముఖంలోకి చూసేడు.  తను చెప్పే కథనాన్ని ఆయన నిశ్చలంగా వింటున్నారు. ఆయన ముఖ కళవళికలలో ఏ మార్పులేదు; ఏ అర్థమూ లేదు.

సోమయ్య ఉద్వేగం పెరిగిపోయింది. ఆఖరి ప్రయత్నంగా జడ్జీగారికి సమీపంగా వెళ్ళేడు. కుడి చేతి మీద ఉన్న బట్టని తొలగిస్తూ  ఆయన కళ్ళ ముందు ఆ చేతిని నిటారుగా చాపేడు. బిచ్చగాణ్ణి మొదలు మహరాజ వరకూ శాసించగలిగే అధికారం కలిగిన జడ్జీగారిని ఆయన నౌకరు, సోమయ్య, గంభీరంగా ప్రశ్నించేడు, "ఈ మచ్చ జ్ఞాపకం ఉందా?"

ఆ చేతి మీద రూపాయ కాసంత మచ్చ కనిపించింది జడ్జీ గారికి. ఆయన కళ్ళ ముందు  తన గత చరిత్రకు సంబంధించిన విషయాలు గబగబా తిరిగి పాతిక సంవత్సరాల వెనుక ఆగాయి. ఆ సంఘటన ఆయనకి ఇంకా నిన్న మొన్ననే జరిగినంత వివరంగా జ్ఞాపకం ఉంది. తను తమ్ముణ్ణి లెంపకాయ కొట్టడమూ, వాడు వెలుగుతూన్న దీపం మీద పడటమూ, వాడి చెయ్యి  కాలి మచ్చ కట్టడమూ, ఆ తర్వాత దుర్విధి తమని వేరు చెయ్యటం, తను ఎంత వెతికినా తమ్ముడి జాడ దొరకక పోవటం, వరుసగా ఆయన కళ్ళ ముందు ప్రస్ఫుటీకరించేయి. ఆయన తన జీవితంలో మరచిపోలేని విషయం అది. ఇలా ఊహించుకుంటూ, ఆయన సోమయ్య ముఖం లోకి  తీక్షణంగా చూశారు. "తమ్ముడూ! నువ్వేనా తమ్ముడూ, అంటూ హృదయానికి గాఢంగా హత్తుకున్నారు. సోమయ్య – అహఁ, సోమయ్య కాదు, రంగారావు, "అన్నయ్యా!" అంటూ ఆయన హృదయం మీద వాలిపోయాడు. పాతిక సంవత్సరాల దీర్ఘ వియోగానంతరం కలుసుకున్న ఏకోదరుల వక్షస్థలాలు ఒండొరుల ఆనందాశ్రువులతో తడసి పోయాయి. ఆ స్థితిలో వారిద్దరూ ప్రపంచాన్నే మరచారు.

రంగారావు పారిపోయిన తర్వాత గోదావరిలో ఒక కుర్రవాని శవం తేలడమూ, ఆ శవం రంగారావుదేనని తను అధికారులని మభ్యపెట్టటమూ, ఎలా జరిగిందో జగన్నాధం తమ్ముడికి చెప్పేరు.

"అందుకే నన్ను పట్టుకుందుకి ఎవ్వరూ ప్రయత్నించినట్లు కనబడదు" అంటూ రంగారావు, తను దేశం విడచి హరిద్వారం వరకూ ఎలా పారిపోయాడో, ఉద్యోగాలలో చేరితే ఎవ్వరో ఒకరు ఎక్కడో అక్కడ పట్టుకుంటారనే భయంతో ఇంతవరకూ కూలీ, నాలీ చేసుకుంటూ ఎలా బ్రతికేడో, అన్నీ చెప్పుకొచ్చాడు.

ఆఖరికి పకోడీల పొట్లాం కొనుక్కున్నప్పుడే తన అన్న పెద్ద జడ్జీ పదవిలో ఉన్నట్లు తెలిసిందనీ, వెంటనే బయలు దేరి వచ్చాననీ చెప్పుకొచ్చేడు.

జగన్నాథం తమ్ముణ్ణి గుర్తుపట్టలేక పోవడానికి మందగించిన ఆయన దృష్టి కొంతవరకు కారణం అయుండొచ్చు. సరైన పోషణ లేక రంగారావులో వచ్చిన భౌతికమైన మార్పులు కూడ కొంతవరకు కారణం కావచ్చు. పెద్ద పదవిలో ఉన్న తన అన్న తనని చేరదీస్తాడో లేదో అన్న భయంతో రంగారావు తనెవరో అన్నకి చెప్పడానికి జంకి ఉండవచ్చు. కారణం ఏదైతేనేమి అన్నదమ్ములిద్దరూ మనస్సులు విప్పి కబుర్లు చెప్పుకున్నారు. తెల్లవారేవరకు గడచిన కాలం వారికి తెలియనేలేదు.

నాగులు కేసులో తీర్పు చెప్పవలసిన రోజు వచ్చింది. జడ్జీగారు న్యాయ పీఠాన్ని అధిరోహించేరు. ఎసెసర్ సభ్యులు జడ్జీగారి వెనక వైపు వేదిక మీద ఉపవిష్టులయారు. ముద్దాయి నాగులు రక్షక భటుల అధీనంలో ఒక వైపు నిల్చున్నాడు. కోర్టు గది అంతా ఆత్రుతతో నిశ్శబ్దంగా ఉంది.

మందంగా ఉన్న కళ్ళద్దాల జోడుని ఒక సారి బయటకి తీసి, రుమాలుతో తుడిచి, మళ్ళా ధరించి, గంభీరంగా ఎసెసర్ సభ్యులని ఉద్దేసించి –

“జెంటిల్‌మన్! మీరు ముద్దాయి మీద మోపిన అభియోగాన్ని, సాక్ష్యాధారలని, వాటి మీద ఆక్షేపణలనీ విన్నారు. ఈ అంతిమ నిర్ణయాలను రూపొందించుకునేందుకు అవసరమైన విషయ పరీక్ష ముగిసింది. మీ న్యాయ నిర్ణయంలో మీకేవిధమైన అనుమానం ఉన్నా ఆ అనుమానాలని ముద్దాయికి అనుకూలంగా అన్వయించాలి. గివ్ ద బెనిఫిట్ అఫ్ డౌట్ టు ద  డిఫెండెంట్! ముద్దాయి దోషి అని మీరు తీర్పు చెప్పదలుచుకున్న పక్షంలో మీరంతా ఏకగ్రీవంగా మీ సమ్మతి తెలియజేయాలి. మీ అంతిమ నిర్ణయం ఏమిటో తేల్చుకున్న తర్వాత తెలియజెయ్యండి.”

ఎసెసర్ సభ్యులు పరస్పరం చర్చించుకునేందుకు వేదిక దిగి అభ్యంతర మందిరంలోకి వెళ్ళేరు.

జడ్జీ గారి మనస్సులో జంఝామారుతం వీస్తోంది. ఆయన గంభీరంగా ఆలోచిస్తున్నారు. ఆయన మనోనేత్రాల  ముందొక తులాయంత్రం కనిపిస్తోంది. దానికి రెండు తూనిక చిప్పలున్నాయి. ఒక దానిలో సత్యం, మరొక దానిలో సాక్ష్యం ఉన్నాయి. మొగ్గు ఏ వైపున ఉందోనని మీద నున్న ముల్లువైపు చూశారు. ముల్లు సాక్ష్యం వైపు మొగ్గుతోంది. సత్యానికి ఈ బూటకపు ప్రపంచంలో తావు లేదని తెలియజేస్తూన్నట్లు ముల్లు సాక్ష్యం వైపు మొగ్గుతోందా?

ఆ రాత్రి జరిగిన సంఘటన అంతా తన మస్తిష్కంలో మెదులుతూనే ఉంది. హత్య చేసి పారిపోతూన్న వ్యక్తిని తను కళ్ళారా చూడడం జరిగింది. వాడు మెలితిరిగిన కండలతో భీకరంగా కనబడ్డాడు. వాడి రూపు రేఖలు తన మనో ఫలకం మీద స్పష్టంగా ముద్రింపబడి ఇంకా చెరిగిపోలేదు. కాని ఈ నాడు తన ఎదురుగా నిల్చున్న ముద్దాయి? ఇరవై ఏళ్ళయినా నిండని అర్భకుడు. సంస్కారమూ, సరైన పోషణా లేక బడుగు జీవనం కొనసాగిస్తూన్న నిర్భాగ్యుడు. రూపురేఖల్లో వీరిద్దరికీ హస్తిమశకాంతరం తేడా ఉంది. అసలు తను నేరస్తుడిని ఆ రాత్రి కళ్ళారా చూసి ఉండకపోతే, సాక్ష్యాన్ని బట్టి ఈ ముద్దాయే నేరస్తుడని నమ్మేవాడేమో. అయినా న్యాయానికి కళ్ళు లేవు; చెవులు మాత్రమే ఉన్నాయి. తీర్పుకి సాక్ష్యమే కదా ముఖ్యాధారం?

అయితే నేరం ఒకరిదీ, శిక్ష మరొకరిదీనా? ఆయన అంతరాంతరాల్లోని అంతర్వాణి “అంతేకదా మరి?” అని అస్పష్టంగా గొణిగింది. నేరం చేసినది ఒకరైతే దానికి శిక్ష అనుభవించేది మరొకరన్న చేదు నిజం తన జీవిత సత్యాలలోనే ఇమిడి ఉంది కదా? ఇలా ద్వియీభావంతో ఆయన మనస్సు అతలాకుతలమయింది.

ఎసెసర్ సభ్యులు తిరిగి వచ్చి వారి వారి స్థానాల్లో కూర్చున్నారు. జడ్జీగారు ప్రశ్నార్థకంగా వారి వైపు చూసి, “మీరొక నిర్ణయానికి వచ్చారా?” అని అడిగేరు.

“ముద్దాయి హంతకుడనే మేమంతా నమ్ముతున్నాం. ఇది మా ఏకగ్రీవ తీర్మానం” అని వారు చెప్పేరు.

వారి నిర్ణయం ఇలా ఉంటుందని జడ్జీగారు ముందుగానే ఊహించారు. అందుచేత ఆయనకేమీ ఆశ్చర్యం వెయ్యలేదు. నిదానంగా, గంభీరంగా జడ్జీగారు ఆయన తీర్పుని వినబర్చారు.

“ఎసెసర్ సభ్యులతో నేను ఏకీభవించలేను. ముద్దాయిని నిర్దోషిగా పరిగణించి అతనిని విడుదల చేస్తున్నాను!”

ఈ తీర్పు విన్న ప్రేక్షకులంతా ఆశ్చర్యపోయారు. జనంలో గుసగుసలు మొదలయాయి. ఈ తీర్పు వాళ్ళ అంచనాలకి అందడం లేదు.

జడ్జీ గారు వేదిక దిగి తన ప్రయివేటు గదిలోకి వెళ్ళేరు. ఒక తెల్ల కాగితం తీసుకుని దాని మీద తన రాజీనామా వ్రాశారు.

ఆయనకి ఒక్కటే తృప్తి. తన తీర్పు ప్రజల దృష్టిలో పాక్షికంగా కనిపించినా, నిజానికది నిష్పాక్షికం. అయినా తన తృప్తి కోసమే ఈ రాజీనామా!

# కార్యశూరుడు

(ఆంధ్రపత్రిక, 11 మార్చి 1959)

ఆయన రైలు దిగాడు. ప్లేట్‌ఫారం ఆ చివర నుండి ఈ చివరి వరకు దృష్టి సారించాడు. సంతృప్తిగా తల విదిలించి ముందుకు కదిలాడు. స్టేషన్ లో మెర్క్యురీ దీపాల వెలుగులో ఆయన వేసుకున్న షార్క్‌స్కిన్ సూటు నిగనిగలాడుతూంది. తల మీద ఉన్న ఫెల్ట్ హేట్ నీడ  ముఖం మీద పడుతూంది. ఒక సారి చెయ్యి విదిల్చి రిస్టు వాచీ చూసుకున్నాడు. ‘పదిన్నరయిందే’ అనుకుని గేటు దాటి రోడ్డు మీదకొచ్చి చకచకా నడక ప్రారంభించేడు. ఇంతలో వెనక నుండి ఆయన పెర్సనల్ అసిస్టెంటు చందు త్వరత్వరగా వచ్చి ఆయన్ని కలుసుకున్నాడు. ఇద్దరూ నిశ్శబ్దంగా నడుస్తున్నారు. ఆజానుబాహుడూ, ఆరడుగుల పొడవైన భారీ శరీరం కలవాడూ అయిన మొదటి వ్యక్తి వేసే అడుగులలో అడుగు కలపలేక, చందు ఉండుండి, కనపడీ కనపడనట్లు, నడకలోనే పరుగు కలిపి నడకా, పరుగూ కాని వేగంతో మొదటి వ్యక్తి నడకను అనుసరిస్తున్నాడు.  స్టేషన్ ఆవరణ దాటి ఇద్దరూ చాలా ముందుకొచ్చారు. అప్పుడే దగ్గర దగ్గర పదకొండు అవుతూండడం వల్ల ఊరంతా నిద్ర పోతూన్నట్లుంది.

ఆ ఊళ్ళో భీమసేనరావు గారిని తెలియని వాళ్ళు చాలా తక్కువ. ఆ ఊరేనన్న మాటేమిటి, ఆ జిల్లా మొత్తం మీదే ఆయనకంత పేరుంది. సర్కారు ఉద్యోగస్తుల్లో ఈ మధ్య ఆయన పేరు మరీ మ్రోగిపోతూంది. వాళ్ళందరికీ ఆయనంటే ఎంత భయం? ఎంత యిది?  క్రిందటిసారి ఆయన ఖజానాని తనిఖీ చేసినప్పుడు ఆ డిప్యూటీ కలెక్టరు ఉద్యోగం ఏమైపోతుందోనని అందరూ అల్లల్లాడిపోయారు కదూ? కలెక్టరు దగ్గర నుండి బిళ్ళ బంట్రోతు వరకూ, డి. ఎస్. పి. దగ్గర నుండి బీటు కనిస్టీపు వరకూ, లక్షాధి కారులైన వర్తకుల దగ్గర నుండి బిచ్చమెత్తుకొనే ముష్టి వాడి వరకూ ఆయన పేరు తెలియని వాళ్ళు లేరు, ఆయన పరపతి తెలియని వాళ్ళూ లేరు. అలాంటప్పుడు తను ఈ ఊరొచ్చినట్లు తెలుస్తే తనని కదలనిస్తారనే మాట శుద్ధ కల్ల! ఈ గవర్నమెంటు ఉద్యోగస్తులు మరీను. తను వాళ్ళ కళ్ళ పడ్డాడో తను వాళ్ళిచ్చే ఆతిథ్యం స్వీకరించవలసిందే!  అయితే ఇప్పుడు ఈ ఊళ్ళో పూర్తి చేసుకోవలసిన చిన్న పని ఉండడం వల్ల ఈ ఊరు రావలసిన అవసరం ఏర్పడింది. రాత్రికి రాత్రే పని పూర్తి చేసుకొని ఎవ్వరి కళ్ళా పడకుండా మళ్ళా తెల్లారే లోపున వెళ్ళిపోదామని ఆయన ఉద్దేశ్యం. అసలు నిజం చెప్పాల్సొస్తే వీళ్ళ తాకిడికి తట్టుకోలేక పోయే ఉపద్రవం  రావచ్చుననే జంకే ఆయన పగలు రాకుండా రాత్రిపూట ఊళ్ళోకి దిగడానికి కారణం.

“చందూ!” గంభీరంగా పిలిచేరాయన, నడుస్తూన్న వేగాన్ని మందగింపజేస్తూ.

అప్పటికే ఆరు గజాలు వెనక పడిపోయిన చందు గబగబా ముందుకొచ్చి 'సార్!' అన్నాడు.

"ఎవరూ, ఇన్‌కం టేక్సు ఎగ్గొట్టడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పేవు?"

"రంగస్వామి చెట్టియారండి."

"మనం ఎక్కడికి వెళ్ళాలి?"

ఇల్లూ, షాపూ ఒక ఇంట్లోనే. అక్కడికే వెళ్ళాలి."

"పద."

ఇద్దరూ ముందుకి నడిచేరు. రెండు వీధులు దాటారు. ఆయిదు నిమిషాలలో ఒక పెద్ద మేడ ముందుకి వచ్చేరు.

చెట్టియార్ చేసేది బంగారం వ్యాపారం. ఆ మేడలో ఒక వైపు షాపు పెట్టుకొని మరొక వైపు నివాసానికి ఏర్పాటు చేసుకున్నాడు. ఇద్దరూ మెట్లెక్కి మూసిన తలుపు ముందు నిలబడ్డారు. చందు తలుపు తట్టిన రెండు నిమిషాలకి రంగస్వామి చెట్టియార్ 'ఎవరూ?' అనుకుంటూ వచ్చి తలుపు తీశాడు. చందు వెనకనే భీమసేనరావు గారు కూడా లోపలకి అడుగు పెట్టి తలుపు మూశారు.

"ఎవరు బాబూ? ఏమిటి కావాలీ?" చెట్టియార్ ఆశ్చర్య పోతూ అడిగేడు.

"ఎవరో తెలియదేం? ఆయన భీమసేనరావు గారు," అన్నాడు చందు.

భీమసేనరావు గారు నవ్వుతో బుర్ర మీది ఫెల్టు హేటు ని విలాసంగా తొలగించి చేత్తో పట్టుకున్నారు. దీపం వెలుగులో ఆయన ముఖం స్పష్టంగా కనిపించింది, చెట్టియార్ కి.

ఆయన్ని చూసేసరికి చెట్టియార్ కి ఆపాదమస్తకమూ కంపించడం మొదలెట్టింది. “తమరా, బాబూ!పోల్చుకోలేకపోయాను, క్షమించండి,” అన్నాడు. కాస్సేపాగి, “లోపలికి దయచెయ్యండి బాబూ” అన్నాడు.

చెట్టియార్ వెనక భీమసేనరావు గారూ, చందు లోపలికి వెళ్ళేరు.

“దాహం పుచ్చుకుంటారా బాబూ!” చెట్టియార్ మర్యాద ఉట్టిపడే కంఠంతో అడిగేడు.

“దాహం లేదు, గీహం లేదు. నీ నక్క వినయాలు కట్టిపెట్టు. దొంగ లెక్కలు రాస్తున్నావా? లేదా? చెప్పు!!” భీమసేనరావు గారి ఖంగు మనే కంఠానికి గదిలో ఉన్న కంచు చెంబులు మారు మ్రోగాయి. చెట్టియార్ భీమసేనరావు గారి పేరు వినడమే కాకుండా ఆయనతో ఇంతకు ముందొక సారి అనుభవం చెందిన వ్యక్తి!  చేతులు నులుపుకుంటూ చెప్పడం మొదలుపెట్టేడు. “ఇందులో తవ(రికి తెలియనిదేముంది! నా నోట వినాలని అలా అడుగుతున్నారు కాని.”

భీమసేననరావు గారు విసుక్కున్నారు. “నీ సోది వినడానికి నాకు తీరుబడి లేదు. తియ్యి, నీ చిఠ్ఠా పుస్తకం తియ్యి.”

చెట్టియార్ కదలలేదు. మెదలలేదు. స్థాణువులా అలా ఉండిపోయేడు.

చందు కల్పించుకుని, “ఏం! వారు చెప్పిన మాట వినబడ్డం లేదూ? ఏదీ, చిఠ్ఠా పుస్తకం?” అన్నాడు.

చెట్టియార్ మెల్లగా కదిలి వెళ్ళి చిఠ్ఠా పుస్తకం తెచ్చి వారి ముందుంచాడు. రావు గారు సిగరెట్టు తీసి, సుతారంగా రెండు వేళ్ళతోనూ పట్టుకుని, సిగరెట్టు కేసు మీద రెండు మూడు సార్లు నెమ్మదిగా తాటించేరు. అనుభవజ్ఞుడైన అసిస్టెంటు చందు వెంటనే అగ్గిపుల్ల వెలిగించి అందించాడు. భీమసేనరావు గారు తృప్తిగా ఒక గుక్క పట్టించి, రెండు సార్లు గాలి లోకి పొగ వదలి ఠీవీగా చిఠ్ఠా పుస్తకం పేజీలు తిరగెయ్యడం మొదలు పెట్టేరు.  పుస్తకం చూస్తూన్న మనిషి ఒక పేజీ దగ్గర ఠక్కున ఆగిపోయి, నగదు నిల్వ ఎంతుంది? ఏదీ, ఇనప్పెట్టె  తాళాలు తియ్యి!” అని ఆజ్ఞాపించేరు.

చెట్టియార్ బొడ్డు లోంచి తాళంగుత్తి తీసి ఇనప్పెట్టె తెరచాడు. చందు ముందుకు వెళ్ళి అందులో ఉన్న డబ్బంతా పట్టుకు వచ్చాడు. లెక్కపెట్టి ఇరవై వేల రూపాయాలుందని చెప్పేడు.

భీమసేనరావు గారి కళ్ళు క్రోధంతో రక్త వర్ణాన్ని దాల్చాయి. "ఏమిటీ మోసం? చిత్తాలో నిల్వ ఏభై వేల రూపాయల వర్క్కు కనిస్తోంది. తక్కిన ముప్పై వేలూ ఏమి చేశావు? కదలవేం! వెళ్ళి తీసుకురా, ఆ సొమ్ము!"

చెట్టియార్ కి శరీరమంతా చెమటలు పోసాయి. అలాగే లోపలి గది వైపు నడిచాడు. అతన్ని చందు అనుసరించాడు. మిగతా సొమ్ము పట్టుకుని ఇద్దరూ వెనక్కి వచ్చారు. చందు లెక్క పెట్టేడు. "ఇంకా ఐదు వేలు తక్కువ ఉంది," అన్నాడు భీమసేనరావు గారి వైపు తిరిగి.

"ఏమిటి నీ సంజాయిషీ?" అన్నట్లు ప్రశ్నార్థకంగా చూసారు భీమసేనరావు గారు. చెట్టియార్ బిక్క మొహం వేశాడు. చందూ కరెన్సీ నోట్లను కట్టలు కట్టలుగా సూట్ కేసు లో పేర్చుతున్నాడు.

భీమసేనరావు గారు తగ్గిపోతూన్న సహనాన్ని కూడదీసుకుంటూ మళ్ళా ప్రశ్నించారు, "చెట్టియార్! మాట్లాడవేం?"

చెట్టియార్ ఇంకా నీళ్ళు నములుతూనే ఉన్నాడు. రావు గారి కోపం అవధులు దాటింది. "చందూ!" అని పిలిచారు. అది పిలుపు కాదు. సింహ గర్జన. "చందూ, ఇహ లాభం లేదు. ఈ కేసు బుక్ చెయ్యవలసిందే. ఈ డబ్బుని 'సీజ్' చేస్తున్నాను. నువ్వు స్టేషన్ కి వెళ్ళు. ఇతని దగ్గర నేనుంటాను," అన్నారు.

చందు వెళ్ళిపోయాడు. ఎదురుగా హుందాగా కుర్చీలో కూర్చున్న భీమసేనరావు గారి ముందు చెట్టియార్ ఇంకా చేతులు కట్టుకుని నిలబడే ఉన్నాడు. పట్టు పరుపుల్నీ ఆనుకుని, కడుపులో చల్ల కదలకుండా, బొజ్జ నిమురుకోడానికి అలవాటు పడిపోయిన చెట్టియార్ అరగంట నుండి అలా నిలబడే వున్నాడు.

అతనికి కాళ్ళు లాగుతున్నాయి. కళ్ళు తిరుగుతున్నాయి. ఒళ్ళు జోగుతోంది. నీరసం ఒళ్ళంతా ఆవహించేస్తోంది. గత్యంతరం లేక అలా నిలబడే ఉన్నాడు చెట్టియార్.

చందు వెళ్ళి అరగంట దాటింది. భీమసేనరావుగారికి అలా కుర్చీలో కూర్చుందుకి విసుగేస్తోంది. ఆ ఊరు ఎలాగూ వచ్చేరు కనుక మరొక పని కూడా చక్కబెట్టుకు పోతే బాగుంటుందనుకున్నారాయన.

కాని తను అక్కడ నుండి వెళ్ళిపోతే మరి చెట్టియార్ సంగతి? ఒక్క క్షణం ఆలోచించేరు. తళుక్కున మెరపులా ఒక ఆలోచన వచ్చింది. వెంటనే ఆయన చెట్టియార్ ని పక్కనున్న గదిలోకి నడిపించి తీసుకెళ్ళి, కొద్ది క్షణాలలో బయటకి వచ్చి, గది తలుపులు మూసి, గొళ్ళెం పెట్టి, తాళం వేసి, ఆ తాళంచెవి తన జేబులో వేసుకొన్నారు. వీధిలోకి వచ్చి రోడ్డుని ఆ చివర నుండి ఈ చివర వరకూ ఒక్క సారి తీక్షణంగా పరీక్షించి, తర్వాత చకచకా ముందుకు సాగిపోయారు.

2

భీమసేనరావు గారు ఊళ్ళోకొచ్చేరన్న వార్త ఒక గంటలో ఊరంతా అల్లుకు పోయింది. ఈ విషయం అర్ధరాత్రి దాకా క్లబ్బులో డబ్బేసి పేకాటాడుతూన్న డిప్యూటీ కలెక్టరూ, డి. ఎం. ఓ. వగైరా వగైరా జిల్లా అధికారుల వరకూ పాకిపోయింది. ఈ వార్త వినేసరికి మేజస్ట్రేటు గారు చేతిలో ఉన్న పేకముక్కలని అలా పడేసి, బల్ల మీద ఉన్న చిల్లర డబ్బులు జేబులో వేసుకొని, గబుక్కున లేచి నిల్చున్నారు.

“పెర్సనల్ అసిస్టెంటు చందు కూడ వచ్చాట్ట!” అన్నారు పోలీసు డిప్యూటీ సూపర్నెంటు గారు.

“ఇంతవరకూ మనకి తెలిసింది కాదే!” అని డిప్యూటీ కలెక్టరు గారు తమ అజాగ్రత్తకి కించపడ్డారు.

“కనుక్కోలేకపోయాం.” జిల్లా పోలీసు సూపర్నెంటు గారు చిన్నబోయినట్లు కనిపించారు.

“నిర్మలాదేవి ఇంటి దగ్గర మనం కలుసుకోడానికి అవకాశం వుండొచ్చు.” తన ఊహా మాత్రమైన అభిప్రాయాన్ని వెల్లడి చేశారు స్పెషల్ వర్క్సు ఎక్జిక్యూటివ్ ఇంజనీరు గారు. ఆయన ఉద్దేశాన్ని ఇంటెలిజెన్సు ఇనస్పెక్టర్ ధృవపరచారు.

“ఒక్క నిమిషం ఆగండి” అని పోలీసు సూపర్నెంటు గారు కుర్చీలోంచి లేచి టెలిఫోను గది వైపు విస విస నడచి వెళ్ళేరు. ఎవరికో డయల్ చేసి మళ్ళా అయిదు నిమిషాల్లో తిరిగి వచ్చారు. “మనం ఇక్కడ కూర్చుండిపోతే ఎలాగ? పదండి వెళదాం” అన్నారు.

క్లబ్బు ఆవరణలో బయలుదేరిన కార్లు వరుసగా రోడ్డు మీద ప్రవేశించి గొలుసుకట్టుగా ముందుకు సాగిపోతున్నాయ్! మరో పది నిమిషాల్లో నిర్మలా దేవి ఇంటి ముందు ఆగాయి. ఆగిన కార్లలోనుండి జిల్లాపరిపాలనా వ్యవస్థనంతటినీ తమ అరచేతుల్లో ఉంచుకొన్న వివిధ శాఖలకు చెందిన

అధికారులంతా బిలబిల్లాడుతూ దిగారు. అప్పటికే సినిమా రెండవ ఆట నుండి వస్తూన్న జన సమూహం భీమసేనరావు గారి దర్శనం కోసమా అన్నట్లు ఆ వీధిలోకి రావడానికి సతమౌతున్నారు. వాళ్ళ కోలాహలాన్ని ఆపు చెయ్యలేకనూ, వాళ్ళని ఆ వీధి పరిసరాల్లోకి రాకుండా చెయ్యలేకనూ  పోలీసు జవాన్లు మహ ఇబ్బంది పడుతున్నారు. అంతలో రంగంలోకి వచ్చిన అధికార వర్గాన్ని చూసి ప్రజలు ఎవరిమట్టుకు వారు ప్రక్కకి తప్పుకున్నారు.

సూపర్నెంటు గారు తన క్రింది ఉద్యోగస్తులకు ఏవేవో ఆజ్ఞలు జారీ చేశారు. తరువాత ఆయన ఆదేశానుసారం నిర్మలా దేవి ఇంటి సింహద్వారం ముందు తుపాకులు మూడు సార్లు గాలిలోకి పేల్చబడ్డాయి.

“సాధారణంగా ఇటువంటి ‘గార్డ్ అఫ్ ఆనర్’ ఎవరో ప్రసిద్ధ వ్యక్తులకీ, మహరాజులకీ, చక్రవర్తి హోదాలో ఉన్న వారికి మాత్రమే దక్కుతుంది” అని అక్కడ ఉన్న జనసమూహం గుసగుసలాడుకోవడం మొదలెట్టింది.

లోపల ఉన్న భీమసేనరావు గారికి మూడుసార్లు తుపాకి గుళ్ళ శబ్దం వినబదింది.  తనెంత రహశ్యంగా వచ్చినా వీళ్ళు వదలిపెట్టేలా లేరు. ఆయన ఒక సారి కిటికీకి దూరంగా ఉండే రోడ్డు వైపు దృష్టి సారించారు. తన కోసం జిల్లా అధికారులంతా వచ్చేరన్న మాట! వాళ్ళంతా, పైన, రోడ్డు మీద కనిపెట్టుకునే ఉన్నారు. ఈ సమయంలో తను వాళ్ళకి కనిపిస్తే తనను కదలనివ్వరనే మాట మాత్రం వాస్తవం. ఇంకా మర్నాడు తను హాజరు కావలసిన అత్యవసరమైన పనులున్నాయి. అంచేత వాళ్ళ కంట పడి వాళ్ళ మధ్య చిక్కడిపోకూడదు.

భీమసేనరావు గారు ఒక్క క్షణం ఆలోచించారు. తల పంకించి, మేడ దిగి, తలుపు తెరుచుకొని, పెరటి ద్వారం సమీపించారు. మెల్లగా తలుపు గడియ తీసి గుమ్మం దాటి అవతల అడుగు పెట్టేరు. ఆయన వెర్రి కానీ అక్కడ మాత్రం ఎవ్వరో కొందరైనా ఉండరా? అక్కడే ఉన్న పోలీసు డిప్టీ సూపర్నెంటూ, సర్కిల్ ఇనస్పెక్టరూ భీమసేనరావు గారి రెండు చేతులూ పట్టుకున్నారు, కరచాలనం చేస్తూన్నట్లు. భీమసేనరావు గారు విస్తు పోయారు!

ఒక్క సారి పోలీసు విజిళ్ళు ప్రతిధ్వనించేయి. ఆ ధ్వనికి అంతా అటు పక్క చేరుకున్నారు. బాధ్యతాయుతులైన ఇద్దరు పోలీసు అధికారులు తనకి అండదండగా చెరో పక్కా నడుస్తూ ఉంటే భీమసేనరావు గారు ఠీవీగా, గాంభీర్యానికి రూపాంతరమా అన్నట్లు నడుస్తూ వచ్చి పోలీసు వ్యానులో

అడుగుపెట్టారు. చందు కూడ సబ్ ఇనస్పెక్టర్  సరసన కూర్చున్నాడు. నలభై అయిదు వేల రూపాయల కరెన్సీ నోట్లతో నిండి,  బరువుగా ఉన్న  సూట్‌కేసు చందు చేతి నుండి సబ్ ఇనస్పెక్టర్ చేతికి ఎప్పుడో బదిలీ అయిపోయింది. రావు గారెక్కిన వ్యాను లోనే మిగిలిన పోలీసు అధికారులు ఎక్కిన వెంటనే  కారు చీకటిలోకి పోలీసు ఠాణా వైపు దూసుకు పోయింది.

రంగస్వామి చెట్టియార్ ముఖం మీదికి మత్తును కలిగించే వాయువుని వదలినప్పుడు అతను ఊపిరి బిగించి తనకు మత్తు కలగకుండా జాగ్రత్త పడ్డాడనీ, అయన తెలివి తప్పిపోతూన్నట్లు జోగుతూ నటించాడనిన్నీ, అతన్ని బంధించిన గదిలో టెలిఫోను ఉందనిన్నీ, అతనే తన పరిస్థితిని పోలీసులకి తెలియజేశాడనిన్నీ, పాపం భీమసేనరావు గారికేమి తెలుసు?  డబ్బుతో వెళ్ళిన చందు రైలు స్టేషన్ కి వెళ్ళే లోగానే ఈ పోలీసు వాళ్ళ కళ్ళ పడిపోతాడని మాత్రం ఆయన కలగన్నారా?

* * *